

'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 303

బుధవారం 24-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నిఫ్టీ @ 11,000

- 36 వేల పాయింట్ల పైకి సెన్సెక్స్
- ఐదో రోజూ పరుగే... మార్కెట్‌కు ఐఎంఎఫ్ జోష్..
- అంచనాలు మించుతున్న క్యూ3 ఫలితాలు.. సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు

- వివరాలు 14లో



సాక్షి స్పోర్ట్స్
బుధవారం 24-1-2018



కార్ల్‌సన్‌తో ఆనంద్ గేమ్ 'డ్రా'

ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఆరో 'డ్రా' నమోదు చేశాడు. ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో నెదర్లాండ్స్‌లో మంగళవారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ఆనంద్ 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. 14 మంది గ్రాండ్‌మాస్టర్లు తలపడుతున్న ఈ టోర్నీలో తొమ్మిదో రౌండ్ తర్వాత ఆనంద్ ఐదు పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు.

సైనా ఆడనంటోంది... 'బాయ్' ఆడాలంటోంది!

- ఆల్ ఇంగ్లండ్‌పై నెహ్వాల్ దృష్టి
- ప్రపంచ గ్రూప్ ప్రతిష్ట కోసం 'బాయ్'



న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ నుంచి తప్పుకోవాలని భావిస్తోంది. చీలమండ గాయం నుంచి కోలుకున్న ఆమె ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో ఉంది. దీంతో వచ్చే నెలలో జరిగే ఆసియా టీమ్ ఈవెంట్‌కు దూరం కావాలనుకుంటోంది. అయితే భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) మాత్రం సైనాలాంటి మేటి క్రీడాకారిణి ఆ టీమ్ ఈవెంట్‌లో ఆడాలని పట్టుబడుతోంది. ఉబెర్ కప్‌కు అర్హత టోర్నీ అయిన ఆసియా ఈవెంట్‌లో ఆమె ఆడితేనే భారత్‌కు అవకాశాలు మెరుగవుతాయని 'బాయ్' ఆశిస్తోంది. 'థామస్ కప్, ఉబెర్ కప్‌కు ఆసియా టోర్నీ క్వాలిఫయింగ్ ఈవెంట్ కావడంతో ఇప్పుడు ఈ టోర్నీ కీలకమైంది. ఒకవేళ ఉబెర్ కప్‌కు అర్హత సాధించలేకపోతే ప్రపంచ గ్రూప్‌లో ఆడే అవకాశాన్ని కోల్పోతాం. అందువల్లే మేటి జట్టును ఆసియా టోర్నీకి పంపాలనుకుంటున్నాం' అని 'బాయ్' కార్యదర్శి అనూప్ నారంగ్ తెలిపారు. ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ మలేసియాలో వచ్చే నెల 6 నుంచి 11 వరకు జరుగనుంది. ఆల్ ఇంగ్లండ్ టోర్నీ మార్చి 14–18 మధ్య జరుగనుంది.

శ్రీకృష్ణప్రియ ఓటమి

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు అమ్మాయి కుదరవల్లి శ్రీకృష్ణప్రియ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయింది. మంగళవారం జరిగిన మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకృష్ణప్రియ 7–21, 9–21తో గో జిన్ వె (మలేసియా) చేతిలో ఓడిపోయింది. బుధవారం మొదలయ్యే మెయిన్ 'డ్రా' మ్యాచ్‌ల్లో భారత తరఫున మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, పీవీ సింధు పోటీపడనున్నారు. ఈ సీజన్‌లో వారిద్దరికిదే తొలి టోర్నీ. తొలి రౌండ్‌లో ఏడో సీడ్ చెన్ యుఫె (చైనా)తో సైనా; హనా రమాదిని (ఇండోనేసియా)తో పీవీ సింధు ఆడనున్నారు.

పరువు కోసం...

నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత్ మూడో టెస్టు
క్లీన్ స్వీప్ తప్పించుకునే ప్రయత్నంలో కోహ్లి సేన
జోరు మీదున్న సఫారీ జట్టు • మ్యాచ్‌కు వర్షం ముప్పు



కోహ్లి, రవిశాస్త్రి

గతంలో దక్షిణాఫ్రికాలో పర్యటించిన ఏ భారత జట్టుకూ సాధ్యం కాని రికార్డును ప్రస్తుత టీమ్ సృష్టిస్తుందని ఈ టూర్‌కు బయల్దేరే ముందు కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యానించారు. అయితే... ఇప్పుడు అది నిజంగానే నిజం కాకూడదని సగటు భారత క్రికెట్ అభిమాని బలంగా కోరుకుంటున్నాడు. ఎందుకంటే 1992 నుంచి ఆరు సార్లు దక్షిణాఫ్రికాకు వెళ్లిన ఏ భారత జట్టు కూడా క్లీన్‌స్వీప్‌కు గురి కాలేదు. కనీసం ఒక మ్యాచ్ గెలవడం లేదా ఒకటైనా డ్రా చేసుకోగలిగింది. ఇప్పుడు సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఓడే ప్రమాదం ముందు నిలిచింది. తొలి రెండు టెస్టుల్లో ఓడి ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన టీమిండియా మూడో టెస్టులో కోలుకోగలుగుతుందా... ప్రత్యర్థికి పోటీనిచ్చి పరువు కాపాడుకుంటుందా అనేది చూడాలి.

జొహన్నెస్‌బర్గ్: ప్రతిష్టాత్మక వాండరర్స్ మైదానంలో ఇప్పటి వరకు నాలుగు టెస్టులు ఆడిన భారత్ ఒకటి గెలిచి మూడు 'డ్రా' చేసుకోగా ఒక్కటి కూడా ఓడలేదు. టి20 ప్రపంచ కప్ గెలిచింది కూడా ఈ మైదానంలోనే. ఇలా అచ్చొచ్చిన వేదికపై తమ అదృష్టాన్ని మార్చుకునేందుకు కోహ్లి సేన సన్నద్ధమైంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మూడు టెస్టుల సిరీస్‌లో చివరి మ్యాచ్ నేడు ప్రారంభం కానుంది. ఇప్పటికే 2–0తో సిరీస్ గెలుచుకొని దక్షిణాఫ్రికా అమిత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతుండగా, నంబర్‌వన్ టీమ్ హోదాలో పరువు కాపాడుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. అయితే పేస్, బౌన్స్ కలగలిసిన పచ్చిక వికెట్ భారత్ కోసం ఎదురు చూస్తోంది. సిరీస్ ఫలితం తేలిపోయినా సరే ఇరు జట్లు ఈ మ్యాచ్‌ను కీలకంగానే భావిస్తుండటం ఆసక్తికరం.

రహానే ఖాయం...

తొలి రెండు టెస్టుల్లో పరాజయం తర్వాత తుది జట్టు కూర్పు గురించి తగిన రీతిలో వివరణ ఇచ్చుకోలేక భారత కెప్టెన్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రి ఇప్పటికే తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మిడిలార్డర్‌లో అజింక్య రహానేను తీసుకోవడం ఖరారైనట్లే. మరోవైపు పేసర్ భువనేశ్వర్ కూడా తిరిగి జట్టులోకి రానున్నాడు. అయితే ఎవరి స్థానంలో వీరిని ఎంచుకోవాలనేది కూడా భారత్‌కు సమస్యగా మారింది. రోహిత్ శర్మను తప్పించేటట్లు కనిపిస్తున్నా... అతనికి మరో అవకాశం ఇవ్వాలనే ఆలోచన కూడా టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉంది. భువీని ఎవరి స్థానంలో ఎంచుకోవాలో కూడా సందిగ్ధత కనిపిస్తోంది. షమీ, బుమ్రా గత మ్యాచ్‌లో బాగా ఆడగా... ఇక్కడి బౌన్సీ పిచ్‌పై ఇషాంత్ అవసరమూ ఉంది. మీడియా సమావేశంలో కోహ్లి చూచాయగా చెప్పినట్లు ఐదుగురు పేసర్ల వ్యూహాన్ని కూడా అనుసరించవచ్చు. కెప్టెన్ చివరి వరకు దానికి కట్టుబడి ఉంటే ఏకైక స్పిన్నర్ అశ్విన్‌ను పక్కన పెట్టాల్సి వస్తుంది. అయితే తుది జట్టులోకి ఎవరు వచ్చినా ఈ మ్యాచ్‌లో పరువు నిలవాలంటే భారత బ్యాటింగ్‌పైనే భారం ఉంది. పిచ్ బౌలింగ్‌కు బాగా అనుకూలించే అవకాశం ఉండగా...దానిని తాము కూడా వాడుకోగలగమని మన బౌలర్లు ఇప్పటికే నిరూపించారు. కాబట్టి బ్యాట్స్‌మెన్ శ్రమిస్తే మన రాత మారుతుంది. సిరీస్‌లో కోహ్లి సెంచరీ తప్ప ప్రధాన బ్యాట్స్‌మెన్ కనీసం అర్ధసెంచరీ కూడా చేయలేదు. ఆ 153ని పక్కన పెడితే రెండు టెస్టుల్లో కలిపి భారత టాప్–6 బ్యాట్స్‌మెన్ సగటు 14.08 మాత్రమే కావడం పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో చూపిస్తుంది. కాబట్టి బ్యాటింగ్‌లో సమష్టితత్వమే వాండరర్స్‌లో మనకు విజయావకాశం కల్పించవచ్చు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కనిపిస్తున్న పచ్చిక మరో మాటకు తావు లేకుండా ఇది పేస్, బౌన్సీ వికెట్ అని చెబుతోంది. బ్యాట్స్‌మెన్‌కు కూడా ఈ వికెట్ పరీక్ష పెట్టనుంది. కొద్ది సేపు కుదురుకోగలిగితే ఆ తర్వాత పరుగులు రాబట్టవచ్చు. టాస్ కూడా కీలకం. మ్యాచ్ జరిగే ఐదు రోజులూ వర్ష సూచన ఉంది. ఈ వాతావరణం కూడా పిచ్‌పై ప్రభావం చూపించవచ్చు.

మార్పులు లేకుండానే...

దక్షిణాఫ్రికా జట్టు కూడా పేస్ బౌలర్ల ప్రదర్శనతోనే ఇప్పటికే సిరీస్ గెలుచుకోగలిగింది తప్ప టీమ్ బ్యాటింగ్ ఇంకా నాసిరకంగానే ఉంది. రెండు మ్యాచుల్లోనూ డివిలియర్స్ కీలక ఇన్నింగ్స్‌లలో ఆ జట్టు కోలుకోగలిగింది. మిగతావారి బ్యాటింగ్ మొత్తం వైఫల్యం కిందే లెక్క. భారత్‌ను పేస్ ఉచ్చులో బిగించే ప్రయత్నంలో ఆ జట్టు ఆటగాళ్లు కూడా దానిని సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. ఓపెనర్లలో నిలకడ లేకపోగా, ఆమ్లా కూడా స్థాయికి తగినట్లుగా ఆడలేకపోతున్నాడు. కెప్టెన్ డు ప్లెసిస్ ఆట కూడా అంతంత మాత్రమే. ఇలాంటి స్థితిలో ఆ జట్టు కూడా క్లీన్‌స్వీప్ చేయాలంటే బ్యాట్స్‌మెన్ మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. ఇక బౌలింగ్ విభాగంలో మాత్రం తిరుగులేకుండా నలుగురు పేసర్లు జట్టు భారం మోస్తున్నారు. పిచ్‌ను బట్టి చివరి నిమిషంలో ఏదైనా మార్పు జరిగితే స్పిన్నర్ మహరాజ్ స్థానంలో పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఫెలుక్‌వాయో రావచ్చు. 2015లో భారత గడ్డపై 0–3తో ఓడిన దక్షిణాఫ్రికా... సరిగ్గా లెక్క సరి చేయాలని పట్టుదలగా ఉన్న నేపథ్యంలో ఈ పోరులో కూడా హోరాహోరీ తప్పదు.

తుది జట్లు (అంచనా)

భారత్: విజయ్, రాహుల్/ ధావన్, పుజారా, కోహ్లి, రహానే, పాండ్యా/రోహిత్, పార్థివ్, ఇషాంత్, భువనేశ్వర్, షమీ, బుమ్రా.
దక్షిణాఫ్రికా: డు ప్లెసిస్ (కెప్టెన్), ఎల్గర్, మార్‌క్రమ్, ఆమ్లా, డివిలియర్స్, డి కాక్, మహరాజ్/ ఫెలుక్‌వాయో, ఫిలాండర్, రబడ, మోర్కెల్, ఇన్‌గిడి.

నాదల్ నిష్క్రమించె...

గాయంతో చివరి సెట్‌లో తప్పుకున్న స్పెయిన్ స్టార్
దిమిత్రోవ్‌కు ఎడ్మండ్ షాక్ • ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ

పోరాట పటిమకు మారుపేరైన స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ ఆట అర్ధంతరంగా ముగిసింది. కెరీర్‌లో రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ దిశగా అడుగులేస్తున్న దశలో అతడిని గాయం ఓడించింది. మారిన్ సిలిచ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ చివరి సెట్‌లో 0–2తో వెనుకబడిన దశలో కుడి కాలిలో నొప్పి కారణంగా ఇక ఆడలేనంటూ నాదల్ తప్పుకున్నాడు. మరోవైపు బ్రిటన్ ఆశాకిరణం కైల్ ఎడ్మండ్ తన అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ మూడో సీడ్ దిమిత్రోవ్‌ను బోల్తా కొట్టించి సెమీస్‌లో సిలిచ్‌తో పోరుకు సిద్ధమయ్యాడు.



సిలిచ్, నాదల్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలన ఫలితాలు కొనసాగుతూనే ఉన్నాయి. టోర్నీ తొమ్మిదో రోజు పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ రాఫెల్ నాదల్ (స్పెయిన్)... మూడో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా)... మహిళల సింగిల్స్‌లో నాలుగో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ సిలిచ్ 3–6, 6–3, 6–7 (5/7), 6–2, 2–0తో ఆధిక్యంలో ఉన్నపుడు అతని ప్రత్యర్థి నాదల్ గాయం కారణంగా వైదొలిగాడు. దాంతో సిలిచ్‌ను విజేతగా ప్రకటించారు. 3 గంటల 47 నిమిషాలపాటు సాగిన ఈ పోరులో ఇద్దరూ పోటాపోటీగా తలపడ్డారు. నాలుగో సెట్‌లో 1–4తో వెనుకబడిన దశలో, ఆ తర్వాత సెట్ ముగిశాక నాదల్ కుడి కాలిలో నొప్పిని భరించలేక ఫిజియోను రప్పించుకొని కోర్టులోనే చికిత్స చేయించుకున్నాడు. ఐదో సెట్‌లో రెండు గేమ్‌లు కోల్పోయాక నాదల్ ఇక తన వల్ల కాదంటూ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. మరో క్వార్టర్ ఫైనల్లో అన్‌సీడెడ్, ప్రపంచ 49వ ర్యాంకర్ కైల్ ఎడ్మండ్ (బ్రిటన్) 6–4, 3–6, 6–3, 6–3తో దిమిత్రోవ్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాడు.

మెర్‌టెన్స్ మెరిసె..

మహిళల సింగిల్స్ విభాగంలో అన్‌సీడెడ్ ఎలీస్ మెర్‌టెన్స్ (బెల్జియం) తన జైత్రయాత్ర కొనసాగిస్తూ నాలుగో సీడ్ స్వితోలినాను మట్టికరిపించింది. 73 నిమిషాలపాటు సాగిన క్వార్టర్ ఫైనల్లో మెర్‌టెన్స్ 6–4, 6–0తో స్వితోలినాను చిత్తుగా ఓడించింది. తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్న మెర్‌టెన్స్ ఈ టోర్నీలో ఇప్పటిదాకా ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. మరోవైపు రెండో సీడ్ కరోలైన్ వొజ్నియాకి (డెన్మార్క్) సెమీఫైనల్ బెర్త్ సంపాదించేందుకు చెమటోడ్చింది. అన్‌సీడెడ్ కార్లా సురెజ్ నవారో (స్పెయిన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో వొజ్నియాకి 6–0, 6–7 (3/7), 6–2తో గెలుపొంది 2011 తర్వాత ఈ టోర్నీలో రెండోసారి సెమీఫైనల్ చేరింది. గురువారం జరిగే సెమీఫైనల్లో మెర్‌టెన్స్‌తో వొజ్నియాకి తలపడనుంది.

నేటి క్వార్టర్ ఫైనల్స్

మహిళల సింగిల్స్
కెర్బర్ X మాడిసన్ కీస్
హలెప్ X ప్లిస్కోవా

పురుషుల సింగిల్స్
హైన్ చుంగ్ X సాండ్‌గ్రెన్
రోజర్ ఫెడరర్ X బెర్డిచ్

క్వార్టర్స్‌లో బోపన్న జంట

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–తిమియా బాబోస్ (హంగేరి) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రెండో రౌండ్‌లో బోపన్న-బాబోస్ జంట 6-4, 6-4తో వానియా కింగ్ (అమెరికా)-ఫ్రాంకో స్కుగోర్ (క్రొయేషియా) జోడీపై గెలిచింది.

బ్యాట్స్‌మెన్ బాగా ఆడాలి

సునీల్ గావస్కర్

ఇప్పుడిక మూడో టెస్టు వంతు. వాండరర్స్ దక్షిణాఫ్రికాలోనే వేగవంతమైన, బౌన్స్ అధికంగా ఉండే పిచ్. విదేశీ జట్లకు ప్రేక్షకుల నుంచి కనీస మద్దతు కూడా లభించదు. గత మ్యాచ్‌లో కోహ్లి సెంచరీ స్ఫూర్తితోనైనా భారత బ్యాటింగ్ బలపడాలి. ఈ మ్యాచ్‌లోనైనా బ్యాట్స్‌మెన్ బాధ్యతగా ఆడి భారీగా పరుగులు సాధించాలి. ఈ సిరీస్‌లో అయిదుగురు బ్యాట్స్‌మెన్ సిద్ధాంతం నడవదని తేలిపోయింది. ఆతిథ్య జట్టు తమ ఏకైక స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను తప్పించి అయిదుగురు పేసర్లను ఆడించే యోచన చేస్తే... భారత్ కూడా అశ్విన్‌ను పక్కన పెట్టాలి. అప్పుడు హార్దిక్ సహా అయిదుగురు పేసర్లు తుది జట్టులో ఉంటారు. కష్టమే అయినా... రహానేను తీసుకుని కేఎల్ రాహుల్‌కు కీపింగ్ బాధ్యతలు అప్పగించాలి. సెంచూరియన్‌లో మాదిరిగా ఇక్కడా టర్న్ కనిపిస్తే అది కొంతైనా ప్రభావం చూపుతుంది. నైపుణ్యానికి కొదవలేని ఈ జట్టు దేశం కోసం ఆడుతున్న సందర్భంలో మైదానంలో దానిని పూర్తిగా ప్రదర్శించింది. ఫీల్డింగ్ ప్రమాణాలు ఏమంత బాగోలేకున్నా బౌలర్లు విశేషంగా రాణించి అవకాశాలు కల్పించారు. రెండు టెస్టుల్లోనూ ప్రొటీస్ చివరి వరుస బ్యాట్స్‌మెన్ జోడించిన పరుగులు అంతిమంగా తేడా చూపించాయి. ఏదేమైనా పరువు దక్కించుకునేందుకు భారత్‌కు ఇది చివరి అవకాశం.

పోప్ మాయాజాలం

- 35 పరుగులిచ్చి 8 వికెట్లు తీసిన ఆసీస్ స్పిన్నర్
- అండర్–19 ప్రపంచకప్ క్వార్టర్స్‌లో ఇంగ్లండ్‌పై విజయం



క్వీన్స్‌టౌన్: ఇంగ్లండ్‌తో కీలకమైన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 127 పరుగులే చేసింది. అయినా 31 పరుగుల తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. ఒకే ఒక్కడు లాయిడ్ పోప్ (9.4–2–35–8) తన స్పిన్‌తో ఆసీస్‌ను గెలుపు మలుపు తిప్పాడు. ఇంగ్లండ్ మాత్రం 128 పరుగుల సునాయాస లక్ష్యాన్ని ఛేదించలేక 96 పరుగులకే కుప్పకూలి అండర్–19 ప్రపంచకప్‌లో క్వార్టర్స్‌తోనే సరిపెట్టుకుంది. మొదట ఆసీస్ 33.3 ఓవర్లలో 127 పరుగులు చేసి ఆలౌటైంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ ఒక దశలో 47 పరుగుల దాకా వికెట్ కోల్పోకుండా పటిష్టస్థితిలో కనిపించింది. కానీ అక్కడ్నించే లెగ్ స్పిన్నర్ పోప్ మ్యాజిక్ మొదలవడంతో ఇంగ్లండ్ వెంటవెంటనే వికెట్లు కోల్పోయి ఓటమి ఖాయం చేసుకుంది. అండర్–19 ప్రపంచకప్‌లో 8 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా పోప్ రికార్డులకెక్కాడు.

బంగ్లాదేశ్‌కు మూడో విజయం

ఢాకా: సొంతగడ్డపై జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో బంగ్లాదేశ్ అజేయంగా దూసుకెళుతోంది. జింబాబ్వేతో లీగ్ మ్యాచ్‌లో బంగ్లా 91 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 216 పరుగులు చేసింది. తమీమ్ (76; 6 ఫోర్లు), షకీబుల్ హసన్ (51; 6 ఫోర్లు) రాణించారు. తర్వాత జింబాబ్వే 36.3 ఓవర్లలో 125 పరుగుల వద్ద ఆలౌటైంది. షకీబుల్ 3 వికెట్లు పడగొట్టగా, మొర్తజ, సుంజాముల్ ఇస్లామ్, ముస్తఫిజుర్ తలా 2 వికెట్లు తీశారు.

సంతోషి, శిరీషలకు స్వర్ణాలు



సంతోషి

మంగళూరు: జాతీయ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్‌ఎస్‌పీబీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లు మత్స సంతోషి (మహిళల 53 కేజీలు), కె.శిరీష (మహిళల 58 కేజీలు), కోరాడ రమణ (పురుషుల 56 కేజీలు), రాగాల వెంకట రాహుల్ (పురుషుల 85 కేజీలు) స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. మరోవైపు మహిళల 63 కేజీల విభాగంలో జి.లలిత, పురుషుల 77 కేజీల విభాగంలో ఎం.రామకృష్ణ రజతాలు సాధించారు. మహిళల 69 కేజీల విభాగంలో ఎస్‌కే అలీమా బేగం నాలుగు పతకాలు గెలిచింది. క్లీన్ అండ్ జర్క్, ఇంటర్ స్టేట్ అంశాల్లో రజతాలు, జర్క్, టోటల్‌లలో కాంస్యాలు దక్కించుకుంది.

తమిళనాడును గెలిపించిన సుందర్

కోల్‌కతా: వాషింగ్టన్ సుందర్ (2/32, 33 పరుగులు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తమిళనాడు 5 వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలిచింది. సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ సూపర్ లీగ్‌లో మంగళవారం జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ (యూపీ) 20 ఓవర్లలో 4 వికెట్లకు 162 పరుగులు చేసింది. కెప్టెన్ సురేశ్ రైనా (41 బంతుల్లో 61; 7 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ జోరు కొనసాగించాడు. ఈ ఇన్నింగ్స్‌తో కోహ్లి (7,068)ను వెనక్కి నెట్టి రైనా టి20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు (7,114) చేసిన భారత క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. తర్వాత తమిళనాడు 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసి గెలిచింది. సంజయ్ యాదవ్ (52; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీ సాధించగా, భరత్ శంకర్ 30 పరుగులు చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో బెంగాల్ 3 పరుగుల తేడాతో ఢిల్లీపై, జార్ఖండ్ 4 వికెట్ల తేడాతో పంజాబ్‌పై, రాజస్తాన్ 22 పరుగుల తేడాతో కర్ణాటకపై గెలుపొందాయి.

'ముందుగా వెళ్లడం మంచిదే'



మిథాలీ

ముంబై: 'ప్రపంచకప్ సందర్భంగా ముందుగానే ఇంగ్లండ్ వెళ్లాం. అది జట్టుకు ఎంతో మేలు చేసింది. ఇప్పుడు దక్షిణాఫ్రికాకు త్వరగా వెళ్లడం కూడా ఉపయోగపడుతుంది' అని భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ అభిప్రాయపడింది. మూడు వన్డేలు, ఐదు టి20లు ఆడేందుకు మిథాలీ సేన బుధవారం దక్షిణాఫ్రికా బయల్దేరనుంది. ఈ నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడింది. 'పిచ్‌లను అర్థం చేసుకుని, బౌన్స్‌ను ఎదుర్కొనేందుకు రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు పనికొస్తాయి. ఈ తరహా పిచ్‌లు ఉపఖండంలో ఉండవు. తొలిసారిగా రెండు కొత్త బంతులతో ఆడబోతున్నందున ఇది ముఖ్యమైన సిరీస్' అని మిథాలీ వివరించింది. బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో సంభాషించడం చాలా ప్రయోజనకరం కానుందని విశ్లేషించింది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 303

బుధవారం 24-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మార్చి 8 నుంచి ఏవియేషన్ షో
బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో 150 దేశ, విదేశీ కంపెనీలతో ప్రదర్శన.. - 14లో



పద్మావత్ చూడ్డానికి బాగుంది
- ఫ్యామిలీలో

ఈ మూడూ ప్రమాదకరం!

ఉగ్రవాదం

వాతావరణ మార్పులు

రక్షణాత్మక వ్యాపార ధోరణి



- వాతావరణ మార్పులపై ధనిక దేశాలది కపట ధోరణి
- పెట్టుబడులకు రెడ్ కార్పెట్ తీసుకొచ్చాం!
- రిఫామ్.. పెర్‌ఫామ్.. ట్రాన్స్‌ఫామ్.. ఇదే మా మార్గం
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ప్రధాని మోదీ

అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ మరోసారి మెరిశారు! దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో 'భారత'వాణిని వినిపించారు. ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, వాణిజ్యం, టెక్నాలజీ మొదలు భారత్ సాధిస్తున్న అభివృద్ధి వరకు అన్ని అంశాలను స్పృశిస్తూ కీలక ప్రసంగం చేశారు. వాతావరణ మార్పులపై ధనిక దేశాల ద్వంద్వ విధానాన్ని నిరసిస్తూనే.. ఈ విషయంలో అగ్రరాజ్యాలు చిన్న దేశాలకు దన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇక ఉగ్రవాదంలో మంచీచెడూ ఉండదని, మంచి ఉగ్రవాదులంటూ కొందరు చేస్తున్న తప్పుడు విభజన కూడా ఉగ్రవాదమేనని ఉద్ఘాటించారు. డబ్ల్యూఈఎఫ్ ప్రారంభ ప్లీనరీని ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ నిలవడం విశేషం. 17లో

ఔషధ నగరికి మరొక్క అడుగే!

పర్యావరణ అనుమతులపై నేడు కేంద్రం నిర్ణయం

- ఢిల్లీలో నిపుణుల కమిటీ కీలక భేటీ
- ప్రాజెక్టుపై ప్రజెంటేషన్ ఇవ్వనున్న రాష్ట్ర అధికారులు
- రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లో ఏర్పాటు

19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ..

64,000 కోట్ల పెట్టుబడులు

58,000 కోట్ల ఎగుమతులు

5,56,000 ఉద్యోగాలు



ఔషధ రంగ పరిశ్రమలకు కేంద్రంగా ఖ్యాతి గడించిన హైదరాబాద్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులకు రంగం సిద్ధమైంది. బుధవారం ఢిల్లీలో జరిగే సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం వెలువడనుంది. రూ.64 వేల కోట్ల పెట్టుబడులు, 5.56 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా తలపెట్టిన ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో నూతన అధ్యాయానికి తెరతీయనుంది. ఔషధ పరిశోధనల నుంచి అభివృద్ధి, ఉత్పత్తి, మార్కెటింగ్ దాకా అన్ని వసతులతో దేశానికి మకుటంగా మారనుంది.

- వివరాలు 2లో

ఆర్టీసీలో టెన్షన్!

రూ. పది నాణేలతో నానా హైరానా

- టికెట్ కొనేందుకు కండక్టర్లకు ఇస్తున్న ప్రయాణికులు.. చిల్లరిచ్చేటప్పుడు తీసుకోరు
- చెల్లవన్న తప్పుడు ప్రచారమే కారణం
- రోజుకు 'రూ.వేయి నిబంధన'తో బ్యాంకుల తిరస్కారం
- బ్యాంకులు, ఆర్టీసీ వద్ద కుప్పలుగా నాణేలు
- ఆర్బీఐ, స్టేట్ బ్యాంకు ఉన్నతాధికారులకు ఆర్టీసీ మొర

6లో



స్కూళ్లకు కాల్ సెంటర్

- ప్రభుత్వ స్కూళ్ల హాస్టళ్లలో త్వరలో ప్రత్యేక ఫోన్ సదుపాయం
- విద్యార్థులు సమస్యలు తెలియజేసేందుకు కాల్ సెంటర్
- 706 విద్యా సంస్థల్లో ఏర్పాటుకు విద్యాశాఖ చర్యలు



సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేవా..? వాటిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు అవస్థలు పడుతున్నారా? ఇకపై వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఒక్క ఫోన్ చేస్తే చాలు.. సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులు విద్యార్థులకు అండగా నిలవనున్నారు. ముఖ్యంగా విద్యాశాఖ హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న బాలికలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలోని బాలికల హాస్టళ్లతోపాటు విద్యాశాఖ గురుకులాల్లోని విద్యార్థుల

మిగతా 6వ పేజీలో ▶

కువైట్ కార్మికులకు క్షమాభిక్ష
- జరిమానా లేకుండానే స్వదేశానికి వెళ్లే అవకాశం - 17లో

'పెట్టుబడి'కి చెక్కుల చిక్కులు!

- రైతులకు ఇచ్చే చెక్కులను ప్రత్యేకంగా ముద్రించుకోవాల్సిందే
- ఒకేసారి 70 లక్షల చెక్కులు ఇవ్వలేమంటున్న బ్యాంకులు
- దీనిపై త్వరలో కేంద్రానికి లేఖ రాయనున్న సర్కారు

12లో

ఒంటరిగానే ఎన్నికలకు

- బీజేపీతో పొత్తు తెంచుకోవాలని శివసేన తీర్మానం
- మోదీ అధికారం కోసం అబద్ధాలు ఆడుతున్నారు: ఉద్ధవ్ ఠాక్రే ధ్వజం

- వివరాలు 17లో



అమెరికా 'షట్‌డౌన్'కు తెర

స్వల్పకాలిక నిధుల బిల్లుపై ట్రంప్ సంతకం

- బిల్లుకు డెమొక్రాట్ల మద్దతుతో సమసిన సంక్షోభం
- సాధారణ స్థితికి కార్యకలాపాలు

- వివరాలు 17లో



ఏకకాల ఎన్నికలకు సమయం పడుతుంది!

కొత్త సీఈసీ ఓపీ రావత్

-వివరాలు 17లో

అపరాధ రుసుము ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రిజిస్టర్ చేసుకున్న కాంపొజిట్ డీలర్ల (రూ.1.5 కోట్ల కన్నా తక్కువ వార్షిక టర్నోవర్ ఉన్న వ్యాపారులు) నుంచి వసూలు చేస్తున్న అపరాధ రుసుమును ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం నేపథ్యంలో ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. కాంపోజిట్ డీలర్లు మూడు నెలలకోసారి పన్ను రిటర్నులు (జీఎస్టీఆర్-4) దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆలస్యమైతే రోజుకు రూ.25 చొప్పున అపరాధ రుసుము వసూలు చేసేవారు. ఒకవేళ సదరు వ్యాపారి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోయినా నిల్ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. రిటర్నులు ఆలస్యమైనా రోజుకు రూ.10 చొప్పున జరిమానా విధించేవారు. గతంలోనే ప్రభుత్వం దీనిని ఎత్తివేసినా తిరిగి కొనసాగించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కంచర్ల పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో విచారణలో ఉన్న పిటిషన్‌కు సంబంధించి అనుబంధ వ్యాజ్యాన్ని అనుమతించాలంటూ కంచర్ల భూపాల్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం వ్యాజ్యాన్ని విచారించింది. ఈ కేసుకు సంబంధించి ఇటీవల భూపాల్‌రెడ్డి హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. వ్యాజ్యాన్ని హైకోర్టు తిరస్కరించటంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

‘గజల్’ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, హైదరాబాద్: సేవ్ టెంపుల్ ఉద్యోగినిని లైంగికంగా వేధించారన్న ఆరోపణల కేసులో ప్రముఖ గజల్ గాయకుడు కె.శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు ముగిశాయి. ఇప్పటికే ఆయన బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు డిస్మిస్ చేసింది. మరోసారి బెయిల్ కోసం చేసుకున్న పిటిషన్‌పై కోర్టు తన నిర్ణయాన్ని బుధవారం వెలువరించనుంది. ఇదే కేసులో రెండో నిందితురాలు పార్వతి పరారీలో ఉంటూనే బెయిల్ కోసం నాంపల్లి కోర్టును ఆశ్రయించింది. కాగా, కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కె.శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించారు.

మీకు గుడ్ మార్నింగ్.. ఫోన్‌కు బ్యాడ్ మార్నింగ్!

గుడ్‌మార్నింగ్.. శుభోదయం.. సుప్రభాత్.. కాలే వణక్కం..

ఏ భాషలో చెబితేనేం..ఉదయాన్నే ఫోన్లలో పలకరించే ఈ గుడ్‌మార్నింగ్ మెసేజ్‌లే.. మన ఫోన్‌కు బ్యాడ్‌మార్నింగ్‌గా మారుతున్నాయట. ఎలాగంటే.. లో స్టోరేజ్ స్పేస్'.. మనం ఎన్నిసార్లు ఈ మెసేజ్ చూసుంటాం. దీనికంతటికీ కారణం.. ఆ గుడ్‌మార్నింగే!! మన దేశంలోని ప్రతి మూడు స్మార్ట్‌ఫోన్లలో ఒక ఫోన్ ఈ పరిస్థితి ఎదుర్కొంటోందని డేటా స్టోరేజీ సంస్థ వెస్టన్ డిజిటల్ కార్పొరేషన్ తేల్చింది. అదే అమెరికాలో ప్రతి పది ఫోన్లలో ఒకదాని పరిస్థితి ఇలా ఉంది. పైగా.. ఈ శుభోదయం సందేశాన్ని మామూలుగా కాకుండా.. ఒక మంచి ఫొటో, పెయింటింగ్, ఒక ప్రముఖుడి కొటేషన్, మరికొన్ని కొత్త పద్ధతులను అనుసరిస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని గూగుల్ పరిశోధనలోనూ వెల్లడైంది.



తెల్లారింది మొదలు..

ఈ మెసేజ్‌లు సూర్యోదయానికి ముందు మొదలై పొద్దున 8 గంటలకు పీక్‌కు చేరుకుంటున్నాయి. ఫేస్‌బుక్ సంస్థకు చెందిన వాట్సాప్ మెసేజింగ్ సర్వీస్‌ను దేశంలో 20 కోట్ల మంది ఉపయోగిస్తున్నారు. తమ కాంటాక్ట్ లిస్ట్ లోని వారందరికీ ఒకేసారి గుడ్‌మార్నింగ్ మెసేజ్‌ను పంపించేందుకు వీలు గా ఈ సంస్థ ఒక కొత్త స్టేటస్ మెసేజ్‌ను జోడించింది. అంతే.. ఒకేసారి వం దల మందికి మెసేజ్‌లు వెళ్లిపోతున్నాయి. మొన్నటికి మొన్న.. ఇంటర్నెట్ జామ్ అయిపోతుందా అన్న స్థాయిలో పీక్‌కు చేరింది. న్యూఇయర్ సందర్భంగా 2 వేల కోట్లకు పైగా నూతన సంవత్సర సందేశాలు పంపించారంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదో రికార్డుగా భావిస్తున్నారు.

పరిష్కారం ఇదిగో..


ఈ మెసేజింగ్ సమస్యకు పరిష్కారాన్ని కూడా గూగుల్ కనుక్కుంది. ‘ఫైల్స్‌గో’ అనే కొత్త యాప్ ద్వారా ఆయా ఫైల్స్‌ను తొలగించేందుకు, గుడ్‌మార్నింగ్ సందేశాలను డిలీట్ చేసేందుకు ఒక ప్రత్యేక ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఈ మెసేజ్‌లను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గత డిసెంబర్‌లో ఢిల్లీలో ఈ యాప్‌ను గూగుల్ ఆవిష్కరించింది.
- సాక్షి, హైదరాబాద్

ఔషధ నగరికి మరొక్క అడుగే!

పర్యావరణ అనుమతులపై నేడు కేంద్ర నిర్ణయం ● ఢిల్లీలో నిపుణుల కమిటీ కీలక సమావేశం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఔషధ పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీకి పర్యావరణ అనుమతుల జారీపై బుధవారం నిర్ణయం వెలువడే అవకాశముంది. దీనిపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ (ఎంఓఈఎఫ్)ల నేతృత్వంలో ని నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఢిల్లీలో సమావేశమవుతోంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందం ఈ సమావేశానికి హాజరై.. ఫార్మాసిటీ ప్రాజెక్టుపై ప్రజెంటేషన్ ఇవ్వనుంది. ఈ భేటీలోనే పర్యావరణ అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ వస్తే.. త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. ఒకవేళ ఈఏసీ అదనపు సమాచారం కోరితే.. తదుపరి నిర్వహించే ఒకటి, రెండు సమావేశాల్లో పర్యావరణ అనుమతులు లభించే అవకాశాలున్నాయి. ఫార్మాసిటీ ప్రాజెక్టుకు గతేడాది డిసెంబర్ 9న తొలిదశ పర్యావరణ అనుమతులుగా భావించే ‘టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)’ జారీ అయ్యాయి.



ఫార్మాసిటీ ప్రతిపాదిత ప్రాంతం..

19,333.2 ఎకరాల్లో..

రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని 19,333.2 ఎకరాల విస్తీర్ణంలో, రూ.16,784 కోట్ల అంచనా వ్యయంతో ఫార్మాసిటీని చేపట్టారు. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) ఆధ్వర్యంలో... ‘నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)’గా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఔషధ ఆవిష్కరణలు, అభివృద్ధి, తయారీ, సరఫరా, మార్కెటింగ్‌కు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించనున్నారు. ప్రాజెక్టుకు రూ.64 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని.. 5.56 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఏటా రూ.1.4 లక్షల కోట్ల విలువైన ఔషధాల ఉత్పత్తి, అందులో రూ.58 వేల కోట్ల విలువైన ఔషధాలను విదేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫార్మాసిటీకి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహిస్తోంది. ప్రాజెక్టుకు 985 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా.

వేగంగా భూసేకరణ

ఫార్మా సిటీ ప్రాజెక్టుతో యాచారం మండలం మేడిపల్లి, కుర్మిడ్డ, నానక్‌నగర్, తాడిపర్తి, కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల, పంజగూడ, కడ్తాల్ మండలం ముద్విన్, కార్కడల్ పహాడ్, కడ్తాల్ గ్రామాల్లో 3,747 కుటుంబాలు భూములు కోల్పోతున్నాయి. గతేడాది అక్టోబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. ఇప్పటివరకు 2,020 నిర్వాసిత కుటుంబాలకు రూ.273.36 కోట్ల పరిహారాన్ని అందజేసింది. దీంతో 6,812 ఎకరాల భూసేకరణ పూర్తయింది. మిగతా 1,727 కుటుంబాలకు పరిహారం చెల్లించి.. 12,233 ఎకరాలను సేకరించాల్సి ఉంది. కేంద్ర భూసేకరణ చట్టం-2013కి ప్రత్యామ్నాయం గా.. రాష్ట్ర ప్రభు త్వం తెచ్చిన భూసేకరణ, పునరావాస చట్టం-2017 కింద ఫార్మా సిటీ ప్రాజెక్టుకు భూసేకరణ జరుగుతోంది.

ఔషధ ఎగుమతులకు ఊతం

దేశంలో ఉత్పత్తవుతున్న ఔషధాలు ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మన ఔషధ ఉత్పత్తులకు అమెరికా అతి పెద్ద మార్కెట్. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న జనరిక్ ఔషధాల ఎగుమతుల్లో 20 శాతం వాటా మన దేశానిదే. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీతో ఔషధ ఎగుమతులు మరింతగా వృద్ధి చెందనున్నాయి. ఏటా ఫార్మాసిటీ నుంచి రూ.58 వేల కోట్ల విలువైన ఔషధాలు ఎగుమతి అవుతాయని అంచనా వేస్తున్నారు.

ఔషధ మిశ్రమాలు ఉత్పత్తి

ఔషధ ఉత్పత్తి పరిశ్రమలకు హైదరాబాద్ ఖ్యాతి గడించినా.. ఔషధాల తయారీలో వినియోగించే రసాయన మిశ్రమాల (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడి యంట్స్- ఏపీఐ)ను మాత్రం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటు న్నారు. ముఖ్యంగా 60-70 శాతం ఏపీఐలు చైనా నుంచే వస్తున్నాయి. ఒకవేళ ఆ దేశంతో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నా, ఇతర కారణాలతో సరఫరా ఆగినా.. ఫార్మా పరిశ్రమలకు ఇబ్బందులు తప్పవు. బీజింగ్ ఒలింపిక్స్‌కు ముందు పర్యావరణ కారణాలతో చైనా ప్రభుత్వం పెన్సిలిన్ ఉత్పత్తి ప్లాంట్లను మూసివేసింది. దాంతో ‘పెన్-జీ’ఔషధ మిశ్రమం సరఫరా నిలిచిపోయి హైదరాబాద్‌లోని ఫార్మా పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే ఫార్మాసిటీ ఏర్పాటుతో ఇలాంటి సమస్యలకు చెక్ పడనుంది. స్థానిక పరిశ్రమలకు అవసరమైన ఏపీఐలను ఫార్మాసిటీలోనే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం ప్రాజెక్టు ప్రణాళికల్లో చేర్చింది. ఈ రంగంలో సైతం భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

కాలుష్య పరిశ్రమలు నగరం బయటికి..

పలు ఔషధ పరిశ్రమల నుంచి హానికర రసాయన వ్యర్థాలు విడుదలవుతుంటాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలుచోట్ల జనావాసాలకు సమీపంలో అలాంటి పరిశ్రమలు ఉన్నాయి. ఇలాంటి సుమారు 81 ఔషధ పరిశ్రమలను నగరం అవతలకు తరలించాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఇప్పుడా పరిశ్రమలన్నీ ఫార్మాసిటీకి తరలనున్నాయి. ఇక కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనల మేరకు.. జల, వాయు, శబ్ద, భూ కాలుష్యాలను నివారించేందుకు ఫార్మాసిటీ నిర్మాణం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయనుంది. రసాయన వ్యర్థాలను శుద్ధి చేసేందుకు అత్యాధునిక ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది.

ఫార్మా సిటీలో ఉత్పత్తయ్యే ఔషధాలివీ

ఫార్మా సిటీలో పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్, టెట్రాసైక్లిన్స్ వంటి యాంటీ బయాటిక్ ఔషధాలు ఉత్పత్తికానున్నాయి. వివిధ రకాల సింథటిక్ డ్రగ్స్, సల్ఫర్ డ్రగ్స్, యాంటీ ట్యూబర్క్యులోసిస్, యాంటీ లెప్రోటిక్ డ్రగ్స్, అనాలజిస్టిక్స్, అనెస్థిటిక్స్, యాంటీ మలేరియా ఔషధాలు, పారాసెటమాల్, మెటాఫార్మిన్, ఇబుప్రోఫిన్, విటమిన్స్, వెజిటబుల్ ఆరిజిన్ డ్రగ్స్, వ్యాక్సిన్లతోపాటు ఆయుర్వేద ఔషధాలు కూడా ఉత్పత్తి కానున్నాయి.



ఫార్మాసిటీని మొత్తంగా 19,333 ఎకరాల్లో ఏర్పాటు చేస్తుండగా.. అందులో 9,535 ఎకరాల్లో పరిశ్రమల కోసం కేటాయించారు. ఇందులో 4,517 ఎకరాల్లో తీవ్ర కాలుష్య కారక (రెడ్), 2,480 ఎకరాల్లో కాలుష్య కారక (హైబ్రిడ్), 1,933 ఎకరాల్లో స్వల్ప కాలుష్య కారక (ఆరెంజ్), 605 ఎకరాల్లో కాలుష్య రహిత (గ్రీన్) పరిశ్రమలు ఏర్పాటు చేస్తారు. ఇక ఫార్మా సిటీ ఉద్యోగుల కోసం 1,507 ఎకరాల్లో రెసిడెన్షియల్ టౌన్‌షిప్, 322 ఎకరాల్లో ఫార్మా విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తారు. అదే విధంగా పబ్లిక్, సెమీ పబ్లిక్ అవసరాలకు 1,111 ఎకరాలు, కార్యాలయాలకు 544 ఎకరాలు, పరిశోధనలకు 827 ఎకరాలు, గ్రీన్ బెల్ట్‌కు 3,205 ఎకరాలు, రోడ్ల నిర్మాణానికి 1,779 ఎకరాలు, లాజిస్టిక్ (రవాణా) హబ్‌కు 203 ఎకరాలు, ఆస్పత్రికి 104 ఎకరాలు, హోటల్‌కు 141 ఎకరాలను కేటాయించారు.

ఫార్మా విశ్వవిద్యాలయం కూడా..


‘కళారత్న’ రవిశంకర్ కన్నుమూత



హైదరాబాద్: కళారత్న బిరుదు గ్రహీత కూచిపూడి నాట్య కళాకారుడు వెంపటి రవిశంకర్ (49) మంగళవారం తెల్లవారుజామున మణికొండలోని తన నివాసంలో అస్వస్థతతో కన్నుమూశారు. తండ్రి వెంపటి చినసత్యం వారసునిగా ఈ రంగంలో ప్రవేశించిన ఆయన తండ్రి అడుగుజాడలనే అనుసరించారు. పెదనాన్న పెద్దసత్యం బాణీని కళకు చేర్చి కూచిపూడి నాట్యంలో శిల్పప్రావీణ్యానికి శోభను చేకూర్చారు. దాదాపు 80కి పైగా నృత్యరీతులను దేశవిదేశాల్లో శిష్యులకు నేర్పించారు. 200లకు పైగా స్వీయ రచనలకు సంగీతాన్ని సమకూర్చారు. రవిశంకర్ అంత్యక్రియలు నేడు రాయదుర్గం మహాప్రస్థానంలో జరుగనున్నాయి.

పిల్లలపై మనమే ఒత్తిడి పెంచుతున్నాం

- మన లక్ష్యాలను వాళ్లతో సాధించాలనుకుంటున్నాం
- విద్యార్థుల ఆత్మహత్యలపై హైకోర్టు ఆవేదన
- నారాయణ, శ్రీచైతన్య కాలేజీలకు నోటీసులు
- నివారణ చర్యలు తెలపాలని తెలుగు రాష్ట్రాలకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: చదువుల విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు ఎంతో ఒత్తిడి పెంచుతున్నారని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. తమ లక్ష్యాలను పిల్లల ద్వారా సాధించుకునేందుకు మోయలేనంత భారాన్ని మోపుతున్నారని పేర్కొంది. ఇంత ఒత్తిడిని తట్టుకునే శక్తి పిల్లలకు ఉండటం లేదంది. విద్యార్థులు ఇలా ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించి రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, హోంశాఖ, విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, నిమ్స్, స్విమ్స్ డైరెక్టర్లతో పాటు కార్పొరేట్ కాలేజీలైన నారాయణ, శ్రీచైతన్యలకు హైకోర్టు నోటీసులిచ్చింది. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఇరు ప్రభుత్వాలను ఆదేశిస్తూ తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారామ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ కాలేజీలు, ఐఐటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణతోపాటు యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశించా లని కోరుతూ ప్రకాశం జిల్లాకు చెందిన లోక్‌సత్తా అజిటేషన్ సొసైటీ జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ రాసిన లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా హైకోర్టు విచారణకు స్వీకరించింది.

మంత్రి నిర్వహిస్తున్న కాలేజీల్లో ఆత్మహత్యలు...

కార్పొరేట్ కాలేజీల్లో ఇటీవల పది మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారిని చూసేందుకు తల్లిదండ్రులను సైతం యాజమాన్యాలు అనుమతించలేదని ఇమ్మాన్యుయేల్ తన లేఖలో పేర్కొన్నారు. ఆత్మహత్యలు జరుగుతున్న కాలేజీల్లో ఒకటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రికి చెందినదని వివరించారు. ఆయన నడుపుతున్న కాలేజీలు, హాస్టళ్లకు అనుమతులు లేవని, దీనిపై పత్రికల్లో సైతం కథనాలు వచ్చాయని నివేదించారు. మంత్రి కావడంతో కాలేజీల్లో ఆత్మహత్యలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. నారాయణ, శ్రీచైతన్య ఎలాంటి అనుమతులు లేకుండా కాలేజీలు నడుపుతున్నట్లు ఇంటర్ బోర్డు సైతం ఇప్పటికే నివేదిక సమర్పించిందని తెలిపారు. ఆ కాలేజీల్లో జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించడంతోపాటు యాజమాన్యాలపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించాలని అభ్యర్థించారు. కనీస సదుపాయాలు లేని కాలేజీలపై చర్యలకు ఆదేశించాలని కోరారు.

చూచిరాతలతో విద్యావ్యవస్థ నాశనం

- తల్లిదండ్రులంతా 90 శాతం మార్కులు కోరుకుంటున్నారు
- పిల్లలు చూసి రాసినా పర్వాలేదనుకుంటున్నారు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పరీక్షల్లో చూచిరాతల వల్ల విద్యావ్యవస్థ నాశనమవుతోందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు 90% మార్కులు రావాలని కోరుకుంటున్నారని, అవి ఎలా వచ్చినా ఫర్వాలేదనే ధోరణితో ఉన్నారని పేర్కొంది. కాపీ కొట్టి రాశారా? చదివి రాశారా? అనేది పట్టించుకోవడం లేదని, ఇది ఎంత మాత్రం హర్షణీయం కాదంది. ‘జ్ఞానంతో పనిలేకుండా మార్కులు వస్తే చాలనుకుంటున్నారు. తల్లిదండ్రులుగా బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నామా? పిల్లలు చూసి రాస్తే టీచర్లపై (ఇన్విజిలేటర్లు) క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. అప్పుడే పరిస్థితిలో మార్పు వస్తుంది. ఎక్కడో ఓచోట కఠిన చర్యలు ప్రారంభించాలి. మాస్ కాపీయింగ్‌కు జిల్లా విద్యాశాఖ అధికారులు, ముఖ్య కార్యదర్శులను వ్యక్తిగతంగా బాధ్యులుగా చేస్తే సరైన ఫలితం ఉంటుంది’ అని హైకోర్టు స్పష్టం చేసింది. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, బాధ్యులైన అధికారులపై తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో మాస్ కాపీయింగ్, పుస్తకాలు చూసి రాయటాన్ని నిరోధించటంలో విద్యాశాఖ విఫలమైందని ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ గుంటుపల్లి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పదో తరగతి పరీక్షల సందర్భంగా 405 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ తెలిపారు.

మున్నాభాయ్‌లు తయారవుతున్నారు...

ఈ సమయంలో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ మాస్ కాపీయింగ్‌ను ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవడం లేదని, సీసీ కెమెరాలున్నా వాటికి చిక్కకుండా కొన్ని పాఠశాలలు ఉత్తీర్ణత శాతం పెంచుకోవడానికి విద్యార్థులకు జవాబులు చెబుతున్నాయన్నారు. వీటిని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, తద్వారా మున్నాభాయ్‌లు తయారవుతున్నారని చెప్పారు. బాధ్యులను ప్రాసిక్యూషన్ చేసిన సందర్భాలు లేవన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... టీచర్లు, విద్యార్థులు కుమ్మక్కవుతుంటే ప్రభుత్వాలు ఎంత వరకు కట్టడి చేయగలుగుతాయని ప్రశ్నించింది. సీసీ కెమెరాల ఏర్పాటే పరిష్కారం కాదని, అంతకు మించి ఏదైనా జరగాల్సి ఉందని తెలిపింది. చూచిరాతలు మన విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నాయని, దీనికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని పేర్కొంది.

ఇన్విజిలేటర్లకు సర్క్యులర్లు ఇస్తాం...

మాస్ కాపీయింగ్ జరిగితే క్రిమినల్ కేసులతో పాటు ప్రాసిక్యూషన్ చేస్తామని ఇన్విజిలేటర్లందరికీ సర్కులర్లు ఇస్తామని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజయ్‌కుమార్ తెలిపారు. తదుపరి విచారణ నాటికి సర్కులర్‌ను కోర్టుకు సమర్పిస్తామని నివేదించారు.

ఇదండీ సంగతి



ఆ పెయింటింగ్ ఆఫీసులో పెట్టాలట.. లేకుంటే రాజీనామా చేస్తారట!

Dwaraka

సలాడ్ కొంటే.. బ్యాక్టీరియా ఫ్రీ!



పండ్లు, కూరగాయల సలాడ్లపై ప్రమాదకర బ్యాక్టీరియా

- ‘ఫుడ్ డ్రగ్ టాక్సికాలజీ రీసెర్చ్ సెంటర్’ పరిశోధనలో వెల్లడి
- అపరిశుభ్ర పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత లోపమే కారణం
- గ్రేటర్ హైదరాబాద్‌లో 200 నమూనాలు సేకరించి పరీక్షలు
- 60 శాతం సలాడ్లపై సూక్ష్మజీవుల ఆనవాళ్లు
- 98 శాతం సరిగా కడగకుండానే కోసేస్తున్నట్లు వెల్లడి
- జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు

సాక్షి, హైదరాబాద్

పండ్లు, కూరగాయలు ఆరోగ్యకరం.. రోడ్డు పక్కన ఏవో తినుబండారాలు, చిరుతిళ్ల కన్నా వీటితో చేసిన సలాడ్‌లు ఎంతో మేలు. కానీ ఈ సలాడ్‌లు బ్యాక్టీరియాకు అడ్డాగా మారిపోతున్నాయి. అపరిశుభ్ర పరిస్థితుల్లో నిల్వ ఉంచడం, కడగకుండానే కోయడం వల్ల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. క్యారెట్, దోస, క్యాబేజీ, ఉల్లితోపాటు వివిధ రకాల పండ్లను ముక్కలుగా చేసి నిల్వ ఉంచడం వల్ల ప్రమాదకర స్థాయిలో బ్యాక్టీరియా ఎదుగుతోంది. అసలు రోడ్ల పక్కన విక్రయించేవాటిలో దాదాపు 60 శాతం సలాడ్‌లపై బ్యాక్టీరియా ఉన్నట్లు హైదరాబాద్‌లోని ‘ఫుడ్ అండ్ డ్రగ్ టాక్సికాలజీ రీసెర్చ్ సెంటర్’ పరిశోధనలో వెల్లడైంది. అపరిశుభ్ర పరిసరాలు, దుమ్ము, ధూళి దీనికి కారణమవుతున్నట్లు తేలింది. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 200 నమూనాలను సేకరించి.. ‘నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్)’ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షించారు.

కడగకుండానే కోసేస్తున్నారు..!

సాధారణంగా వివిధ ఆహార పదార్థాలతోపాటు అందించే క్యారెట్, కీరా, క్యాబేజీ, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, పుదీనా వంటివాటిని 98 శాతం మంది వ్యాపారులు కడగకుండానే కోస్తున్నారని గుర్తించారు. దీనికితోడు అపరిశుభ్ర పరిసరాల కారణంగా వాటిపై స్టెఫెలోకోకస్, ఎర్సినియా, సాల్మోనెల్లా, ఈకోలీ వంటి బ్యాక్టీరియా చేరుతోందని తేల్చారు. దీంతో సలాడ్లు తీసుకున్నవారికి జీర్ణకోశ వ్యాధులు, ఫుడ్ పాయిజన్, టైఫాయిడ్, న్యూమోనియా, చర్మవ్యాధుల వంటివి వస్తున్నట్లు గుర్తించారు. రోడ్డు పక్కన సలాడ్లు విక్రయించేవారిలో 56% మంది.. కొన్ని రోజులకు సరిపడా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారని అధ్యయనంలో తేలింది. మిగతా 44% మంది కూడా వీధుల్లో ఉండే తమ దుకాణాల్లోనే అపరిశుభ్ర పరిసరాల్లో నిల్వ చేస్తున్నట్లు వెల్లడైంది.

అధ్యయనంలో తేలిన మరిన్ని అంశాలు..

- సలాడ్లు విక్రయించే వ్యాపారాల్లో సుమారు 54 శాతం ఫుట్‌పాత్‌లు, కాలనీలు, బస్తీల కూడళ్లలోనే ఉన్నాయి. దాంతో దుమ్ము, ధూళి చేరుతోందని, దోమలు, ఈగలు వాలుతున్నట్లు గుర్తించారు.
- కూరగాయలు, పండ్లను కోసే కత్తులు, చెక్క మొద్దులను సరిగా శుభ్రం చేయడం లేదు.
- పండ్లను, క్యారెట్, దోస, క్యాబేజీ వంటివాటిని కడగకుండానే కోస్తుండడంతో.. వాటిపై ఉన్న పురుగు మందుల అవశేషాలు, బాక్టీరియా వంటి సూక్ష్మజీవులు సలాడ్లలో చేరుతున్నాయి.
- సలాడ్లు విక్రయించేవారు 60 శాతం మంది తమ చేతులను శుభ్రం చేసుకోవడం లేదని, దానితో బ్యాక్టీరియా పెరుగుతోందని అధ్యయనంలో గుర్తించారు.
- సాధారణంగా రోడ్లపై విక్రయించే వాటిలో అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉడికించే, కాల్చే ఆహారపదార్థాలను తీసుకోవడం వల్ల ఇబ్బందులు తక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- అయితే కూరగాయలు, పండ్లను కేవలం ముక్కలుగా చేసి విక్రయించే సలాడ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదకరమేనని హెచ్చరిస్తున్నారు.

చక్రవర్తిరాజుకు 3 రోజుల సీబీఐ కస్టడీ

హైదరాబాద్: నకిలీ డాక్యుమెంట్లతో పలు బ్యాంకులను మోసం చేసి రూ.650 కోట్లు రుణాలు తీసుకున్న కేసులో లియోనియా రిసార్ట్స్ ఎండీ చక్రవర్తిరాజుకి కోర్టు 3 రోజుల సీబీఐ కస్టడీ విధించింది. కోర్టు ఆదేశాలతో సీబీఐ అధికారులు మంగళవారం చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రూ.లక్ష చెల్లించిన ఉల్లం‘ఘనుడు’

పెండింగ్ ట్రాఫిక్ జరిమానా ఒకేసారి చెల్లింపు



సాక్షి, హైదరాబాద్: అదో బీఎండబ్ల్యూ కారు.. ఏపీ28డీఎక్స్6363 నంబర్‌తో కూడిన ఆ వాహనం ట్రాఫిక్ ఉల్లంఘనలకు కేరాఫ్ అడ్రస్.. ఇప్పటి వరకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు దీనిపై విధించిన రూ.1,00,450 జరిమానా పెండింగ్‌లో ఉండిపోయింది. హఠాత్తుగా శనివారం ఈ మొత్తం క్లియర్ అయింది. ఆన్‌లైన్‌లో సింగిల్ పేమెంట్‌తో జరిమానా మొత్తం చెల్లించేశారు దాని యజమాని. గతేడాది నవంబర్ వరకు రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో టాప్–20 ఉల్లంఘనలు చేసిన వాహనాలపై పెండింగ్‌లో ఉన్న జరిమానా రూ.4.8 లక్షలుగా తేలింది. దీని ప్రకారం చూస్తే ఈ వాహనానిదే టాప్ అయి ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆ వాహన యజమాని హఠాత్తుగా ఈ మొత్తం చెల్లించడం వెనుక దాన్ని అమ్మాలని భావించడమో, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నోటీసుల ద్వారా ఒత్తిడి చేయడమో కారణమై ఉండవచ్చని నగర పోలీసులు భావిస్తున్నారు.

‘సైబరాబాద్’ పరిధిలోనే అధికం: ఒకప్పుడు ట్రాఫిక్ పోలీసులు స్పాట్ చలాన్లు మాత్రమే విధించేవారు. ఈ కారణంగానే అప్పట్లో చలాన్ల పెండెన్సీ అన్నది అరుదుగా ఉండేది. ప్రస్తుతం రాజధానిలో అత్యధికంగా ఈ–చలాన్లు పంపిస్తున్నారు. దీన్ని సదరు వాహన చోదకుడు ఆన్‌లైన్‌లోనో, ఈ–సేవ, మీ–సేవ కేంద్రాల్లోనో చెల్లించాల్సి ఉంది. ఈ–చలాన్లను అనేక మంది బేఖాతరు చేస్తుండటంతో పెండెన్సీ పెరిగిపోతోంది. సైబరాబాద్, రాచకొండల్లో కొరత కారణంగా సరాసరిన ఓ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు ఒక పీడీఏ మిషన్ మాత్రమే అందుబాటులో ఉంది. ఈ కారణంగానే ఓ వాహనంపై ఎన్ని పెండింగ్ చలాన్లు ఉన్నాయన్నది ఇక్కడ తెలుసుకోవడం సాధ్యం కావట్లేదు. ఈ కారణంగానే పెండింగ్ ఈ–చలాన్లలో అత్యధికం సైబరాబాద్, ఆ తర్వాత రాచకొండ పోలీసు కమిషనరేట్లకు సంబంధించినవే ఉంటున్నాయి.

రంగంలోకి కోర్టు అధికారి..

ఫుట్‌పాత్ ఆక్రమణలపై హైకోర్టు నిర్ణయం

- న్యాయాధికారిని నియమించాలని ఎంఎస్‌జేకు ఆదేశం
- పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఫుట్‌పాత్‌లపై వెలుస్తున్న ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తమ అధికారులనే హైకోర్టు రంగంలోకి దిగింది. హైదరాబాద్ సిద్ది అంబర్‌బజార్, మహబూబ్‌గంజ్‌లలో ఆక్రమణల పరిశీలనకు న్యాయాధికారిని నియమించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఎంఎస్‌జే)ను ఆదేశించింది. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని న్యాయాధికారికి స్పష్టం చేసింది. న్యాయాధికారికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాలని పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారావుల ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్ది అంబర్ బజార్‌లో ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలు జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ హైకోర్టులో లక్ష్మీనివాస్ అగర్వాల్ అనే వ్యక్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. వ్యాజ్యంపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం.. మంగళవారం మరోసారి విచారించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేశామని, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను కమిటీ తొలగించిందని తెలిపారు.

కంటితుడుపుగా వ్యవహరిస్తున్నారు...: పిటిషనర్

అధికారులు కంటితుడుపుగా వ్యవహరిస్తున్నారని, ఆక్రమణలు అలాగే కొనసాగుతున్నాయని పిటిషనర్ లక్ష్మీనివాస్ కోర్టుకు ఫొటోలు చూపించారు. ఆక్రమణలు చేయబోమని కోర్టుకు హామీ ఇచ్చిన షాపుల యాజమానులు ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారని నివేదించారు. కొంత మంది దుకాణదారులు, స్థానిక పోలీసులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తనను బెదిరిస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్న 4 షాపుల యజమానులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని అధికారులను ఆదేశించింది.

హైకోర్టులో జీపీగా ఎ.సంతోష్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా ఎ.సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి వి.నిరంజన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంతోష్‌కుమార్ హైకోర్టులో అడ్వొకేట్ జనరల్(ఏజీ) దేశాయ్ ప్రకాశ్‌రెడ్డికి సహకరిస్తారని ఆ జీవోలో పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్లు లేదా అతని తొలగింపు ఈ రెండింటిలో ఏది ముందైతే అప్పటి వరకు ఆయన ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతారు. ఆయనకు రూ.లక్ష గౌరవ వేతనం అందుతుంది.

డీడీ యాదగిరి వార్తా విభాగం హెడ్‌గా కె.సుధాకర్‌రావు



హైదరాబాద్: దూరదర్శన్ యాదగిరి చానల్ ప్రాంతీయ వార్తా విభాగం హెడ్‌గా డాక్టర్ కె.సుధాకర్‌రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2012లో దూరదర్శన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ఉన్నారు. ప్రసారాల్లో నూతన మార్పులు తీసుకురావటంతో పాటు వార్తల సమయాన్ని పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పేద కుటుంబాలకు ఆసరా

మృతదేహాల తరలింపునకు మరో 45 వాహనాలు ● నెలాఖరులో అందుబాటులోకి కొత్త వాహనాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రతి నెలా సగటున రెండు వేల మరణాలు నమోదవుతున్నాయి. మృతుల్లో అధిక శాతం పేదలే ఉంటున్నారు. మృతదేహాలను సొంత ఖర్చులతో ఇళ్లకు తీసుకెళ్లలేని స్థితిలో వీరు ఉంటున్నారు. ప్రైవేటు వాహనాల యాజమానులు చెప్పిందే ధరగా ఉంటోంది. దూరాన్ని బట్టి కనీసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతోంది. మృతదేహాల తరలింపు ప్రస్తుతం పెద్ద ఖర్చుగా మారుతోంది. దీంతో పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఆస్పత్రులలో చనిపోయిన వారిని ఉచితంగా ఇళ్ల వద్దకు చేర్చాలని నిర్ణయించింది. ప్రస్తుతం 18 జిల్లాల్లో 50 వాహనాలతో ఈ సేవలను అందిస్తున్నారు. రెండో దశలో మరో 45 వాహనాలను అందుబాటులోకి తెచ్చేందుకు



ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేసింది. జనవరి చివరి వారంలో కొత్త వాహనాల సేవలను ప్రారంభించనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

ఇప్పటివరకు 16,552 మృతదేహాల తరలింపు..

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మృతదేహాల తరలింపు కార్యక్రమాన్ని 2016 నవంబర్ 18న ప్రారంభించింది. దీని కోసం రూ.50 కోట్లను విడుదల చేసింది. మొదటి దశలో 50 వాహనాలను ఏర్పాటు చేసింది. ఉచిత మార్చురీ సేవల కార్యక్రమంతో 2018 జనవరి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 16,552 మృతదేహాలను ఇళ్ల వద్దకు చేర్చారు. ఒకేసారి రెండు మృతదేహాలను తరలించేలా ఈ వాహనాలను తయారు చేయించారు. మృతదేహాలు చెడిపోకుండా ఉండేందుకు బాడీ ఫ్రీజర్లను అమర్చారు. మృతుల బంధువులు అదే వాహనంలో వెళ్లేలా సీట్లను అమర్చారు. ప్రతి వాహనానికి ఒక సహాయకుడిని నియమించారు. ఉచిత మార్చురీ వాహనాల నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం జీవీకే–ఈఎంఆర్ఐకి అప్పగించింది. ప్రతి వాహనానికి నెలకు రూ.60 వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆయా ఆస్పత్రులలోని ప్రాంతీయ వైద్యాధికారి గానీ, సూపరింటెండెంట్ గానీ ధ్రువీకరించిన తర్వాతే ఉచిత వాహనాల సేవలను కేటాయిస్తున్నారు.

‘ఫార్మసీ కౌన్సెల్‌ను ఏర్పాటు చేయాలి’

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రత్యేక ఫార్మసీ కౌన్సెల్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఫార్మసీ సొసైటీ అధ్యక్షుడు సంజయ్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంజయ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం మంత్రి లక్ష్మారెడ్డితో భేటీ అయ్యింది. ఫార్మసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్‌కు ఇంకా ఏపీలోని గుంటూరు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష 27న

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ తొలి ఏడాది విద్యార్థులకు 27న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను, 29న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. ఈ పరీక్షలకు హాజరుకాకుంటే ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేయబోమని పేర్కొంది. గతంలో ఈ పరీక్షలు రాసి ఫెయిలైన వారు ఈ పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొంది. సంబంధిత కాలేజీలో హాల్‌టికెట్ తీసుకొని హాజరు కావాలని తెలిపింది. ఇందుకు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. 2017 నుంచి ఈ పరీక్షలకు హాజరయ్యేవారి మార్కులను ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటోందని, ప్రిన్సిపాళ్లు వాటిని అప్‌లోడ్ చేయాలని పేర్కొంది. జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు కాలేజీ లాగిన్/బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

మార్చి 6 నుంచి డిగ్రీ పరీక్షలు

హైదరాబాద్: ఓయూ పరిధిలో మార్చి 6 నుంచి డిగ్రీ మూడో ఏడాది వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారులు మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 14 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభంకానున్నాయని, డిగ్రీ బ్యాక్‌లాగ్ నాన్‌సెమిస్టర్ పరీక్షలు సైతం మార్చి 6 నుంచే జరగనున్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల కాగానే మొదటి, రెండో సంవత్సరం పరీక్షల నిర్వహణ తేదీలను ప్రకటిస్తామన్నారు.

కింది కోర్టు ఉత్తర్వులు అమలు చేయాల్సిందే

భూ సేకరణ పరిహారంపై తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో హైకోర్టు

- 500 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది
- అయినా భూ సేకరణ ఎలా చేస్తున్నారు?
- తీరు ఇలాగే కొనసాగితే సేకరణ ఆపేస్తాం
- తెలంగాణ సర్కార్‌ను హెచ్చరించిన కోర్టు
- నివేదిక ఇవ్వని ఏపీ సర్కార్‌పై మండిపాటు
- విచారణ సమయంలో గడువు అడగటమేంటని ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: భూ సేకరణ పరిహారం పెంపుపై కింది కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు తేల్చి చెప్పింది. తెలంగాణ ప్రభుత్వ నివేదిక ప్రకారం అమలు చేయాల్సిన ఎగ్జిక్యూషన్ పిటిషన్ల విలువ రూ.500 కోట్లు ఉంటుందని.. ఇంత పరిహారం చెల్లించాల్సి ఉండగా భూ సేకరణ ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించింది. పరిహారం చెల్లింపులో తీరు ఇలాగే కొనసాగితే మొత్తం ప్రక్రియను ఆపేస్తామని హెచ్చరించింది. కింది కోర్టులు పరిహారం చెల్లింపుపై ఎన్ని ఉత్తర్వులిచ్చాయి.. వాటిలో ఎన్ని అమలు చేశారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఎంత పరిహారం చెల్లించాల్సి ఉంది.. ఎప్పటిలోపు చెల్లిస్తారు.. తదితర వివరాలతో నివేదికలు సమర్పించాలన్న తమ ఆదేశాలపై ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడంపై మండిపడింది. తెలంగాణ ప్రభుత్వం మొక్కుబడిగా నివేదిక ఇచ్చిందని అసహనం వ్యక్తం చేసిన కోర్టు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసలు నివేదిక ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ నాటికి పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని, లేదంటే స్వయంగా కోర్టు ముందు హాజరు కావాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ మంతోజ్ గంగారావుల ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈపీలను వెంటనే అమలు చేయాలి

భూ సేకరణ పరిహారం విషయంలో తమ ఉత్తర్వులను కలెక్టర్ అమలు చేయడం లేదని, దీంతో ఉత్తర్వుల కోసం బాధితులు దాఖలు చేస్తున్న ఎగ్జిక్యూషన్ పిటిషన్లు (ఈపీ) ఏళ్ల తరబడి అపరిష్కృతంగా పేరుకుపోతున్నాయని హైకోర్టుకు మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి వెంకటకృష్ణయ్య లేఖ రాశారు. లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా పరిగణించిన కోర్టు.. మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది ఓ నివేదికను ధర్మాసనం ముందుంచగా.. పరిశీలించిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసింది. తాము కోరిన వివరాలన్నీ లేవని, ఏదో మొక్కుబడిగా నివేదిక దాఖలు చేసినట్లు అర్థమవుతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. నివేదిక సమర్పణకు మరింత గడువు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది కోరగా ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఏదో ఓ నివేదిక ఇచ్చిందని.. ఇప్పటి వరకు మౌనంగా ఉండి, ఇప్పుడు యాంత్రికంగా మరింత గడువు కావాలని కోరుతున్నారంటూ తీవ్రంగా స్పందించింది. కోర్టు ఉత్తర్వులను అధికారులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారని, గడువు పెంపు కోసం పిటిషన్ దాఖలు చేయకుండా, కేసు విచారణకు వచ్చినప్పుడు గడువివ్వాలని కోరడంలో ఔచిత్యం ఏంటని ప్రశ్నించింది. ఎగ్జిక్యూషన్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం వల్ల కింది కోర్టులపై మోయలేని భారం పడుతోందని.. కేసుల ప్రాముఖ్యత దృష్ట్యా ఈపీలను వెంటనే అమలు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు ఆదేశించింది.

సాక్షి
బుధవారం, జనవరి, 24

'దావోస్' దారి మార్చుకోవాలి

జనావళిపై ప్రపంచీకరణను రుద్ది, దానిద్వారా దేశదేశాల్లోని సహజ వనరులను అపరిమితంగా కొల్లగొట్టిన అగ్రరాజ్యాలు స్వరం మార్చి ఇప్పుడు రక్షణాత్మక విధానాలకు తిరోగమిస్తున్న వేళ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశాలు ప్రారంభమయ్యాయి. 'ప్రపంచాన్ని బాగా కలవర పెడుతున్న అంశాలపై చర్చించడానికి'ంటూ డబ్ల్యూఈఎఫ్ 1971లో ఈ వార్షిక సమావేశాలకు అంకురార్పణ చేసింది. వర్తమాన ప్రపంచ ధోరణులపైనా, పర్యవసానంగా పుట్టుకొచ్చిన సమస్యలపైనా, వాటివల్ల కలిగే ప్రమాదాలపైనా మేధో మథనం చేయడం, పరిష్కారాలను సూచించడం ఈ సమావేశాల ఉద్దేశం. ఎప్పటిలాగే ఈసారి కూడా దావోస్‌కు దాదాపు వంద దేశాల నుంచి ప్రపంచ కుబేరులు, రాజకీయ నాయకులు, వివిధ దేశాల అధినేతలు, ఆర్థికమంత్రులు, బ్యాంకర్లు, కార్పొరేట్ అధిపతులు, మేధావులు, పాత్రికేయులు 3,000మంది హాజరయ్యారు. డబ్ల్యూఈఎఫ్ తో సమస్యేమంటే ప్రపంచంలో పెరిగిపోతున్న అసమానతల గురించి అక్కడ అందరూ కూర్చుని మాట్లాడుకోవడమే తప్ప కార్యాచరణ శూన్యం. పేద, గొప్ప తారతమ్యాలు అంతకంతకూ పెరగడమే తప్ప తగ్గుతున్న దాఖలాలు లేవు. ఇందుకు ఏటా విడుదలవుతున్న ఆక్స్‌ఫామ్ నివేదికలే సాక్ష్యం.

ఈ సదస్సునుద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ భారత్ సాధించిన ప్రగతి గురించి చెబుతూ వెల్లడించిన గణాంకాలు సదస్సులో పాల్గొన్నవారిని సహజంగానే ఆకట్టుకుని ఉంటాయి. 1997లో అప్పటి ప్రధాని దేవెగౌడ ఈ సదస్సులో పాల్గొన్నప్పుడు భారత్ జీడీపీ దాదాపు రూ. 26 లక్షల కోట్లుంటే ఇప్పుడది ఆరు రెట్లు పెరిగిందని చెప్పారు. అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసి, ఆ ఫలాలు అందరికీ దక్కేటందుకు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కానీ ఆయన ప్రసంగానికి ముందురోజే ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదిక ఈ అభివృద్ధి తీరుతెన్నులను ఎత్తిచూపింది. కేవలం 1 శాతంగా ఉన్న సంపన్నుల వద్ద 73 శాతం సంపద చిక్కుకున్నదని తెలిపింది. ఆదాయాల్లో వ్యత్యాసాలు, సంపద పంపిణీలో అసమతుల్యత అంతిమంగా సామాజిక అశాంతికే దారితీస్తాయి. ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన నివేదిక ఈ వ్యత్యాసాల గురించి మరింత లోతుగా పరిశీలించింది. ప్రభుత్వాలు ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యమిచ్చినంతగా సామాజిక సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వక పోవడాన్ని ప్రస్తావించింది. సమ్మిళిత వృద్ధిలో మన పొరుగునున్న పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్ కన్నా దిగువనున్నామని ఆ నివేదిక చెప్పడాన్నిబట్టి మోదీ ప్రస్తావించిన ఆర్థిక ప్రగతంతా ఎవరి గుప్పిట చిక్కుకున్నదో ఇట్టే అర్థమవుతుంది. ఎంతసేపూ వృద్ధి రేటు చుట్టూ తిరుగుతూ దాన్నే నిజమైన వృద్ధిగా పరిగణించడంతో సామాజికార్థిక నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఒక దేశ నిజమైన అభివృద్ధి అక్కడి పౌరుల ఆర్థిక భద్రతలో, వారి సామాజిక అభివృద్ధిలో, అక్కడి ఉద్యోగితలో, జీవనప్రమాణాల్లో ఉంటుంది తప్ప జీడీపీలో కాదు. అసమానతలను పారదోలేందుకు, సంపద పంపిణీ సక్రమంగా ఉండేందుకు ఎలాంటి చర్యలూ లేకపోవడం వల్ల గణాంకాలు ఘనంగా కనబడుతున్నా సగటు పౌరుల జీవనం మెరుగుపడటం లేదు. ఏడెనిమిదేళ్లుగా మన దేశం ఆర్థికంగా నిలదొక్కుకున్నదంటే దానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో క్షీణించిన చమురు ధర పర్యవసానమని మరువకూడదు. గత కొన్ని వారాలుగా అవి మళ్లీ పైపైకి పోతున్నాయి. ఇంధన వినియోగం దేశంలో నిరుటితో పోల్చినా రెట్టింపయింది. నిరుడు చమురు డిమాండు రోజుకు 93 వేల బ్యారెళ్లు ఉంటే ఇప్పుడది 1,90,000 బ్యారెళ్లు అయింది. మనకు కావలసిన చమురులో 80 శాతం దిగుమతుల ద్వారానే లభిస్తుంది. కనుక చమురు ధర పైపైకి ఎగిసేకొద్దీ ఆ మేరకు విదేశీ మారకద్రవ్య నిల్వలు హరించుకుపోతాయి. అందువల్ల తాజా పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మన ఆర్థిక వ్యవస్థను కట్టుదిట్టం చేసుకోవడం అవసరం.

నిరుడు సదస్సుకు చైనా ప్రధాని షీ జిన్‌పింగ్ హాజరై హడావుడి చేయడం వల్ల కావొచ్చు ఈసారి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, జర్మనీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే తదితరులు వస్తున్నారు. మన ప్రధాని ఒకరు దావోస్ సదస్సుకు వెళ్లడం రెండు దశాబ్దాల తర్వాత ఇదే ప్రథమం. 2000 సంవత్సరంలో బిల్ క్లింటన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దావోస్ వచ్చారు. మళ్లీ ఇన్నేళ్లకు ఆ దేశాధినేత అడుగుపెడుతున్నారు. అయితే తాను వెళ్లేది 'అమెరికాకే అగ్ర ప్రాధాన్యం' అన్న తన నినాదాన్ని నొక్కి చెప్పడానికేనని ట్రంప్ ప్రకటించారు. అగ్రరాజ్యాల ప్రయోజనాలను నెరవేర్చే స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలను ఇన్నేళ్లుగా బడుగు దేశాలకు అంటగట్టి వాటిని ప్రపంచీకరణలో భాగస్వాములను చేయడంలో ప్రపంచ ఆర్థిక వేదిక పాత్ర తక్కువేమీ కాదు. ఆ వేదిక పైనుంచే ప్రపంచీకరణ స్ఫూర్తికి విరుద్ధమైన అభిప్రాయాలు ఆయన వ్యక్తం చేస్తే అది ఆసక్తిదాయకమే.

ఆక్స్‌ఫామ్ 2010నాటి నివేదిక ప్రపంచ జనాభాలోని సగంమంది ఆస్తికి సమానమైన సంపద కేవలం 388మంది కుబేరుల వద్ద కేంద్రీకృతమైందని తెలిపింది. మరో ఆరేళ్లకు... అంటే 2016లో విడుదలైన సంస్థ నివేదిక ప్రకారం ఆ సగం సంపదా మొత్తం 62మంది కుబేరుల వద్దకు చేరిందని వెల్లడించింది. తాజా నివేదిక ఇప్పుడా సంపద కేవలం 8మంది వద్ద ఉన్నదంటున్నది. ఆ కుబేరులు పన్నుల బెడదలేని మారుమూల దేశాల్లో 7.6 లక్షల కోట్ల డాలర్ల సంపద దాచి పెట్టారని చెబుతోంది. ప్రపంచ ఆర్థిక ప్రగతి దేనికి దారితీస్తున్నదో, చివరికెలాంటి ఫలితాలిస్తున్నదో ఈ నివేదిక అద్దం పడుతోంది. దీన్ని గురించి దావోస్‌లో ఆత్మ పరిశీలన చేసుకుంటేనే... సరైన పరిష్కారానికి ప్రయత్నిస్తేనే ఈ సదస్సుకొక అర్థం, పరమార్థం ఉంటుంది. లేనట్టయితే ఎప్పటిలా ఊకదంపుడు ఉపన్యాసాల వేదికగా మిగిలిపోతుంది.



అవధులు మీరిన అసమానత్వం అభివృద్ధికి ప్రమాదకరం. ఎందుకంటే ఇది సమాజ చలనాన్నే కుదింపజేస్తుంది.


– థామస్ పికెట్టీ
ఫ్రెంచ్ ఆర్థికవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.సప్తమి ఉ.11.53 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం అశ్వని తె.4.24 వరకు (తెల్లవారితే గురువారం), వర్జ్యం రా.12.28 నుంచి 2.01 వరకు, దుర్ముహూర్తం ప.11.48 నుంచి 12.33 వరకు అమృతఘడియలు రా.9.20 నుంచి 10.54 వరకు, రథసప్తమి.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.46
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

నమాజ్ వేళలు



ఫజర్	5.34	మగ్రీబ్	6.07
జొహర్	12.28	ఇషా	7.22
అసర్	4.31		

సీపీఎం అడుగులు ఎటు?



టీఎస్ సుధీర్

పార్టీలో కాంగ్రెస్ పట్ల ప్రతికూల పవనాలు వీస్తున్న సంగతిని యేచూరి అప్పుడే గుర్తించి ఉండవలసింది. కాబట్టి కలకత్తా సమావేశాలలో జరిగిన పరిణామం రెండోసారి ఆయనకు ఎదురైన ఓటమి. ఒక సంవత్సరంలో సాధారణ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో భారత రాజకీయాలలో సంభవించిన ఈ పరిణామం అర్థం ఏమిటి? బీజేపీని ఎదుర్కొనడానికి సిద్ధపడుతున్న కాంగ్రెస్‌కు సీపీఎం లేదా వామపక్షం అండగా నిలబడగలదన్న భ్రమలలో మనం మిగిలిపోకూడదు. ఆ వాతావరణం లేదు.

భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) గురించి ఏదైనా చెప్పడానికి ఉన్నదీ అంటే, అది– ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం మిగిలి ఉంది అని చెప్పడమే. ఆ అంతర్గత ప్రజాస్వామ్యం పనిచేస్తోందని కూడా చెప్పవచ్చు. ఎందుకంటే, సీపీఎం కలకత్తా సభలలో జరిగిన పరిణామం దేశంలోని మరే ఇతర రాజకీయ పార్టీలో అయినా చోటు చేసుకుకోగలదంటే నమ్మడం సాధ్యం కాదు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, లేదంటే కె. చంద్రశేఖరరావు ఏదైనా ఒక రాజకీయ ప్రతిపాదన చేస్తే వారి నాయకత్వంలోని పార్టీల సభ్యులు దానిని ఓడిస్తారని మనం కలలో అయినా ఊహించగలమా?



కలకత్తాలో జరిగిన సీపీఎం కేంద్ర కమిటీ సమావేశానికి చాలా ప్రాముఖ్యం ఉంది. ఎందుకంటే వచ్చే ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరగబోయే సమావేశానికి అజెండాను తయారు చేసి పెట్టిన సమావేశం ఇది. 2019 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీతో వ్యూహాత్మక అవగాహన కుదుర్చుకోవాలని ఆ పార్టీలో ఒక ప్రతిపాదన ఉంది. ఈ ఆలోచనకు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి మద్దతు ఉంది. కానీ ఇలాంటి ఆలోచనకు సీతారాం యేచూరి కంటే ముందు ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్న ప్రకాశ్ కారత్‌తో పాటు, పార్టీ కేరళ శాఖ కూడా ప్రతిఘటించడం జరిగింది. దీని మీదే తీవ్ర స్థాయి చర్చ జరిగినట్టు వార్తలు వచ్చాయి. ఓటింగ్ పెట్టడంతో 31 ఓట్లతో సీతారాం యేచూరి ప్రతిపాదన వీగిపోయింది. ఆయన చేసిన ప్రతిపాదనకు వ్యతిరేకంగా 55 ఓట్లు వచ్చాయి. దీని అర్థం కాంగ్రెస్ చేయి, సీపీఎంకు అండగా ఉండదు.

హైదరాబాద్ సభల నిర్ణయమే కీలకమా?

అయితే హైదరాబాద్ సభలో తీసుకునే నిర్ణయమే అంతిమ నిర్ణయమవుతుందని యేచూరి వర్గీయులు మాత్రం లోపాయికారీగా ఇప్పటికీ వాదిస్తున్నారు. ఈ వర్గంలో ఎక్కువగా బెంగాల్ శాఖ సభ్యులే ఉన్నారు. అలాగే ఫిబ్రవరిలో జరగబోయే త్రిపుర ఎన్నికల తరువాత పరిస్థితులు మారతాయని కూడా ఆశాజనకంగా చెబుతున్నారు. ఎందుకంటే ఆ ఎన్నికలలో బీజేపీ నాయకత్వంలోని కూటమి నుంచి సీపీఎం నాయకత్వంలోని కూటమి గట్టి పోటీని ఎదుర్కొంటున్నది. కానీ కేరళ పార్టీ శాఖ తన విధానాన్ని మార్చుకోదు. ఆ రాష్ట్ర పరిస్థితి అనే పట్టకం నుంచి చూసుకుని ప్రస్తుత విధానాన్నే కొనసాగిస్తుంది కూడా. ఆ రాష్ట్ర రాజకీయాలలో సీపీఎం నాయకత్వంలోని కూటమి, కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమితో తలపడుతుంది. కాబట్టి జాతీయ స్థాయి ఒప్పందం యోచనకు అంగీకరించదు. దీని వల్ల బీజేపీకి ప్రతిపక్ష స్థానం లభిస్తుందని సీపీఎం భయపడుతోంది. నిజానికి బీజేపీ కూడా అలాంటి అవకాశం కోసమే అక్కడ ఎదురుచూస్తున్నది.

యేచూరి ప్రతిపాదనను ఓడించడానికి కారత్ శిబిరం 2016 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మందుగుండులా ఉపయోగించుకుంది. ఆ ఎన్నికలలో బెంగాల్‌లో సీపీఎం, కాంగ్రెస్ ఎన్నికల అవగాహన కుదుర్చుకున్నాయి. అయితే సీపీఎం కంటే కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ స్థానాలు లభించాయి. కారత్ చెప్పినది వాస్తవమని రుజువయిందని చెప్పడానికి ఆ ఎన్నికల ఫలితాలే ఉపయోగపడినట్టు కనిపిస్తున్నది. అప్పుడు కూడా కాంగ్రెస్‌తో పొత్తుకు కారత్ వర్గం వ్యతిరేకించింది. 'నేను ముందే చెప్పలేదూ!' అన్న భావాన్ని గొంతు నిండా నింపుకుని ప్రకాశ్ కారత్ కలకత్తా సభలకు వచ్చారు.

కాగా, పార్టీలో జరిగిన అత్యున్నత స్థాయి ఎన్నికలలో తన ప్రతిపాదన వీగిపోవడమంటే, పార్టీలో తన స్థానం ఎక్కడో యేచూరికి అవగతమయ్యేటట్టు చేసినట్టే. ఇంకా చెప్పాలంటే కేంద్ర కమిటీలోని 91 మంది సభ్యులలో మూడింట ఒక వంతు మంది మద్దతును మాత్రమే యేచూరి కూడగట్టగలరని కూడా వెల్లడయింది. ఇది సహజంగానే ఆయనను నిరాశకు గురి చేసి, రాజీనామాకు సిద్ధపడేటట్టు చేసింది. అయితే ఆయనను ఆ పదవి నుంచి తప్పుకోవడానికి అంగీకరించడం లేదు. ఎందుకంటే పార్టీలోని ఆయన వ్యతిరేకులు ఆయన నిష్క్రమణకు వీర మరణం స్థాయి దక్కకూడదని భావిస్తున్నారు. కాబట్టి హైదరాబాద్ సమావేశాల కంటే ముందే సీపీఎంలో చీలిక అవకాశాలను తోసిపుచ్చలేం. నిజానికి ఈ ఎన్నిక పార్టీలోని దోషాన్ని కూడా ఎత్తి చూపింది. కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తుకు కూడా అంగీకరించకుండా కేరళ శాఖ ఓటు వేసింది. ఇక బెంగాల్ శాఖలో అయితే ముగ్గురు సభ్యులు మినహా మిగిలిన వారంతా యేచూరి ప్రతిపాదనకు మద్దతు పలికారు. దేశ రాజకీయ వ్యవస్థలో వేగంగా ప్రాధాన్యం కోల్పోతున్న పార్టీకి ఇది మంచిది కాదు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనడం యేచూరికి ఇదే మొదటిసారి కాదు కూడా. రాజ్యసభ బరిలోకి యేచూరి దిగితే సీపీఎంకు తమ మద్దతు ఉంటుందని జూలై , 2017లో కాంగ్రెస్ ప్రకటించింది. కానీ ఆయనను మూడోసారి కూడా ఎగువ సభకు పంపించడానికి సీపీఎం కేంద్ర కమిటీ నిరాకరించింది. ఎందుకంటే ఆ పార్టీలో ఎవరికీ రెండు పర్యాయాలకు మించి ఆ అవకాశం ఇవ్వరు. పార్టీ నిర్మాణం పని మీద యేచూరి మరింత సమయం కేటాయించవలసి ఉంది. చివరిగా కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపడం సీపీఎంకు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఇందులో చివరి కారణమే రాజకీయంగా చాలా ప్రాధాన్యం కలిగినది. పార్టీలో కాంగ్రెస్ పట్ల ప్రతికూల పవనాలు వీస్తున్న సంగతిని యేచూరి అప్పుడే గుర్తించి ఉండవలసింది. కాబట్టి కలకత్తా సమావేశాలలో జరిగిన పరిణామం రెండోసారి ఆయనకు ఎదురైన ఓటమి. ఒక సంవత్సరంలో సాధారణ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో భారత రాజకీయాలలో సంభవించిన ఈ పరిణామం అర్థం ఏమిటి?

వామపక్షాల ప్రభావం నిజంగా ఎంత?

బీజేపీని ఎదుర్కొనడానికి సిద్ధపడుతున్న కాంగ్రెస్‌కు సీపీఎం లేదా వామపక్షం అండగా నిలబడగలదన్న భ్రమలలో మనం మిగిలిపోకూడదు. ఆ వాతావరణం లేదు. నిజం చెప్పాలంటే వామపక్షం ప్రస్తుతం చాలా రాష్ట్రాలలో కేవలం లెటర్‌హెడ్ పార్టీ స్థాయికి కుంచించుకుపోయింది. ఎన్నికలలో వరస అపజయాలు, వివిధ రాష్ట్రాలలోని ప్రధాన స్రవంతి పార్టీలకు తోక పార్టీలుగా వ్యవహరించడం కూడా ఆ పరిస్థితిని తెచ్చి పెట్టింది. తనకు సిద్ధాంతపరమైన గౌరవం ఉందని ఆ పార్టీ అభిప్రాయం. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ – ఈ జాబితా ఇలా పెరిగిపోతూనే ఉంటుంది. ఈ అన్ని రాష్ట్రాలలోను వామపక్షం రాజకీయ పక్షంగా ప్రాధాన్యం కోల్పోయింది.

వీటితో పాటు తనను తాను ఆత్మ పరిశీలన చేసుకునే స్థితిలో కూడా వామపక్షం లేదు. ఇది కూడా ఒక వాస్తవమే. అమెరికాకు వ్యతిరేకంగా వారు ఇచ్చే సామ్రాజ్య వ్యతిరేక నినాదాలు 21వ శతాబ్దపు భారతదేశంలో చర్విత చర్వణంగా మాత్రమే ఉన్నాయి. అయితే కేంద్రంలోను, రాష్ట్రాలలోను బీజేపీ నుంచి ఎంతటి ప్రతికూలత ఎదురవుతున్నప్పటికీ వామపక్ష విద్యార్థి సంఘాలు మాత్రం విశ్వవిద్యాలయాలలో, కళాశాలల్లో చురుకుగానే ఉన్నాయి. విశ్వవిద్యాలయాల స్థాయి రాజకీయాలకీ; కేంద్ర రాష్ట్ర స్థాయి రాజకీయాలకూ మధ్య వచ్చిన శూన్యాన్ని నింపడం ఎలాగో కూడా సీపీఎం ఆలోచించాలి. విశ్వవిద్యాలయాల స్థాయిలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నవారిని సాధారణ ఎన్నికలలో తమ బలంగా ఎందుకు మలుచుకోలేకపోతున్నారు? ఇందుకు కారణం కొన్ని భ్రమలలో ఆ పార్టీ చిక్కుకుని ఉండడమే. బీజేపీని తన ప్రధాన శత్రువని సీపీఎం పేర్కొంటున్నది. అయినప్పటికీ, బీజేపీ కంటే తక్కువ శత్రువైన కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడానికి అది సుముఖంగా లేదు. ప్రజా ప్రయోజనం కంటే అహంభావానిదే పై చేయి అయ్యేటట్టు చేస్తోందనడానికి ఇదే నిదర్శనం. వామపక్షం గళం బొత్తిగా కరవైపోతున్న కాలమిది. సాపేక్షంగా చూసినప్పుడు యేచూరి వంటి యువ నాయకుడి అవసరం ఇప్పుడు రాజ్యసభలో ఉందన్న వాస్తవాన్ని పార్టీ గుర్తించడం లేదు. పైగా నిబంధనలంటూ మంకు పట్టుకు పరిమితమైంది.

కాంగ్రెస్‌తో కలసి నడిచేందుకు వామపక్షాలు తిరస్కరించడం అంటే అది విపక్ష కూటమి ఏర్పాటు మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది క్షేత్రస్థాయిలో కాకపోవచ్చు. కానీ అవగాహనకు సంబంధించి ఎక్కువ ప్రభావం చూపుతుంది. కలకత్తా సభ తరువాత సీపీఎం నిర్ణయం మీద కొన్ని చతురోక్తులు ఇప్పటికే జనంలోకి వచ్చాయి కూడా. అక్కడ జరిగిన నిర్ణయం సీపీఎంలో బీజేపీ విజయమని ఆ చతురోక్తులు పేర్కొంటున్నాయి. ఇంకా పలువురు ఇది సీపీఎం పార్టీ చేసిన రెండవ చారిత్రక తప్పిదమని వ్యాఖ్యానిస్తున్నారు. 1996లో జ్యోతిబసు ప్రధాని కావడానికి వచ్చిన అవకాశాన్ని కాలదన్నడం మొదటి చారిత్రక తప్పిదమని చెబుతూ ఉంటారు.

ఆ రెండుచోట్ల మినహాయించినా...

సీపీఎం నిర్ణయాన్ని గుడ్డిలో మెల్లగా భావించాలి. ముఖ్యంగా బెంగాల్ రాజకీయాల విషయంలో అయితే అదే నిజం. అక్కడ కాంగ్రెస్, వామపక్షాలు ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. అక్కడ తృణమూల్ కాంగ్రెస్ పార్టీయే బీజేపీకి దీటుగా నిలబడగలిగిన ప్రధాన వ్యతిరేక శక్తి. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ వినియోగించుకోవాలి. 2019 ఎన్నికలలో కలసి పోటీ చేయడానికి సోనియాగాంధీ, మమతా బెనర్జీల మధ్య ఉన్న స్నేహాన్ని ఉపయోగించాలి. సీట్ల సర్దుబాటు విషయంలో మమత కొన్ని చిక్కులు సృష్టించవచ్చు. కానీ రాహుల్ మాత్రం సీపీఎం చేసిన తప్పిదాన్ని పునరావృతం చేయరాదు. రాహుల్ ఢిల్లీలో ఉంటూ కలకత్తా పట్టకం నుంచి చూసి పరిస్థితులను అంచనా వేయరాదు. కేరళకు సంబంధించి ఢిల్లీలో దోస్తీ, కేరళలో కుస్తీ వంటి మాటలతో బీజేపీ ఎద్దేవా చేసే పరిస్థితిని కాంగ్రెస్ తెచ్చుకోకూడదు. మరొక విపక్షంగానే భావిస్తూ అక్కడ కాంగ్రెస్ కూటమి పినరాయ్ విజయన్ నాయకత్వంలోని ఎల్‌డీఎఫ్‌తో పోరాడగలదు. సీపీఎం, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోటీ జరిగినా అక్కడ మూడో పక్షానికి స్థానానికి దొరకడమనేది అరుదని గతాన్ని చూస్తే తెలుస్తుంది. బీజేపీ పరిస్థితి అక్కడ అదే. తన ప్రతిపాదన గురించి సభ్యులకు అవగాహన కల్పించడానికి సీతారాం యేచూరికి ఇంకా రెండు మాసాల గడువు ఉంది. కేరళ, బెంగాల్‌లను మినహాయించి మిగిలిన చోట్ల కాంగ్రెస్‌తో కలసి పనిచేయడానికి సీపీఎంకు కొంత అవకాశం ఉంది. కానీ దీనితో ప్రయోజనం తక్కువే. ఇలాంటి ప్రయత్నం మూడోసారి కూడా విఫలమైతే యేచూరికి రాజీనామా చేయడం తప్ప మరో దారి లేదు. ఎందుకంటే ఇలాంటి వాతావరణం పార్టీలో బలం లేని వాస్తవాన్ని ఏ నాయకుడికైనా అర్థమయ్యేటట్టు చేస్తుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

అమ్ముడుపోతే ఏం చేయగలం?

కొమ్మినేని శ్రీనివాసరావుతో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి

పాలకుల దిగజారుడుతనం, ప్యాకేజీలకు, ప్రలోభాలకు లోబడి అమ్ముడు పోవడానికి సిద్ధమయ్యే వారి క్షీణ రాజకీయాలే ఫిరాయింపులకు ముఖ్యకారణమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆధారాలు చూపలేం కాని పార్టీలు మారిన వారిలో ఏ ఎంపీకి, ఏ ఎమ్మెల్యేకి ఏం ప్యాకేజి ఇచ్చారో బయట ఎవరినడిగినా చెబుతారని.. ఏ పార్టీ తరపున, ఏ ఐడియాలజీతో గెలుస్తున్నామో కూడా అర్థం లేకుండా పోయిందన్నారు. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే వారికి అమ్ముడుపోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, ఫిరాయింపుల నిరోధక చట్టం ఇంత నిర్వీర్యమైపోతే భవిష్యత్తులో ఏం జరుగుతుంది అని భయమేస్తుందని చెప్పారు. ప్రజలు దేన్నయినా సహిస్తారు కానీ పాలకుల అహంకారాన్ని, అమానవీయ దృక్పథాన్ని సహించరంటున్న ఉత్తమ్ కుమార్ అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...



రాజకీయాల్లోకి రాకముందు మీ హోదాల గురించి చెబుతారా?

నేను 16 సంవత్సరాల వయస్సులోనే పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో సైనిక శిక్షణ పొందాను. భారతీయ వాయుసేనలో పైలట్ ఆఫీసర్‌గా క్లాస్ వన్ గెజిటెడ్ ఆఫీసర్‌గా చేరాను. అధునాతన టెక్నాలజీ కలిగిన విమాన పైలట్‌గా పనిచేయడంతో పూర్తి సంతృప్తి పొందాను. బోర్డర్ సమీపంలో ఫ్లైయింగ్ చేస్తున్నప్పుడు విమానం గాల్లోనే పేలిపోయింది. అది సింగిల్ పైలట్ విమానం. విమానంలో నేను కూర్చుని ఉండగానే పేలిపోయింది. అయితే యుద్ధవిమానంలో ఎజెక్షన్ అనే బటన్ ఉంటుంది. దాన్ని నొక్కితే విమానం నుంచి సీట్‌తో సహా పైలట్‌ను బయటకు షూట్ చేస్తుంది. దాంతో పారాచూట్ సాయంతో సమీపంలోని అడవుల్లో పడ్డాను. తర్వాత రష్యన్ వైమానిక నిపుణులు వచ్చి చూశారు. ఇలాంటి ప్రమాద ఘటనల్లో పది లక్షల్లో ఒకరు కూడా బతికి బయటపడటం కష్టం. నీకు ఇది బోనస్ జీవితం అనుకో అన్నారు వారు. ఆ ప్రమాదంలో నా వెన్నెముక విరిగింది. మోకాలు ఫ్రాక్చర్ అయింది. ఆసుపత్రిలో ఉండి కోలుకోవడానికి 6 నెలలు పట్టింది. ఆ తర్వాత కూడా కొంత కాలం పైలట్ గానే పనిచేశాను. అయితే మళ్లీ ఇలాంటి ప్రమాదంలో చిక్కుకుంటే వెన్నెముక పూర్తిగా డామేజ్ అవుతుంది కాబట్టి, పైలట్ బాధ్యతల నుంచి కొంతకాలం రెస్ట్ తీసుకోవాలని రష్యన్ నిపుణులు సూచించారు. దాంతో ఎయిర్ చీఫ్ మార్షల్ నాటి భారత రాష్ట్రపతి వెంకట్రామన్‌ను సంప్రదించి పీస్ పోస్టింగ్ –రిస్క్ లేని ఉద్యోగం–లో భాగంగా ఆయన వద్ద ఉద్యోగం ఇప్పించారు. తర్వాత నా మిలిటరీ హోదాను ఐఏఎస్ హోదాకు మార్చి రాష్ట్రపతి వద్ద శాశ్వత ఉద్యోగిగా మార్చారు.

మనసులో మాట

ఎంపీలు కూడా ఫిరాయించడానికి ప్రాతిపదిక ఏంటి?

ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సర్పంచ్ ఎవరైనా కావచ్చు మరోపార్టీకి అమ్ముడుపోతే, అమ్ముడు పోదల్చుకుంటే మనం ఏం చేయగలం? సుఖేందర్ గుప్తా ఎందుకు అమ్ముడు పోయారు అంటే ఏం చెప్తాం. ఒకటి మాత్రం నిజం. తెలంగాణలో రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించింది కేసీఆరే. కొత్త రాష్ట్రంలో రాజకీయాలు ఇంతగా దిగజారుతాయని మేం ఊహించలేదు. ఏ ఎంపీకి, ఏ ఎమ్మెల్యేకి ఏం ప్యాకేజి ఇచ్చారో బయట ఎవరినడిగినా చెబుతారు. గుప్తాకు, ఆయన కుటుంబానికి కూడా ప్యాకేజీలు వచ్చాయి. కావాలంటే ఆ టెండర్ కాపీలు మీకు పంపుతాను. ఇంత స్థాయిలో పార్టీ మార్పిడి కార్యక్రమం జరగడానికి రెండే రెండు కారణాలు. కేసీఆర్ దిగజారుడు రాజకీయాలు, అమ్ముడుపోవడానికి సిద్ధమైన వారి రాజకీయాలు. కానీ అన్నిపరిణామాలను ప్రజలు చూస్తున్నారు. తగిన సమయంలో తగిన బుద్ధి చెప్తారని నా నమ్మకం.

పార్టీ మారితే రాజీనామా చేస్తే బాగుండేది కదా?

ఫిరాయింపుల నిరోధక చట్టం ఈ దేశంలో అమలే కాకుంటే, భవిష్యత్తులో ఏం జరుగబోతుంది అనేది భయపెడుతోంది. తెలంగాణా టీడీపీ 15 ఎమ్మెల్యే స్థానాల్లో గెలిస్తే, వారిలో 12 మంది పార్టీనుంచి ఫిరాయిస్తే ఇక ప్రజాస్వామ్యానికి ఏమి అర్థమున్నట్లు? పార్టీ సింబల్‌కి ఏమి అర్థం? ఏ పార్టీ తరపున, ఏ ఐడియాలజీతో గెలుస్తున్నామో కూడా అర్థం లేకుండా పోయింది. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే దానికి అమ్ముడుపోతున్నారు.

24 గంటల విద్యుత్ క్రెడిట్ కేసీఆర్‌దా లేక కాంగ్రెస్‌దా?

రెండో ప్రపంచయుద్ధ కాలంలో గోబెల్స్ అనే మంత్రి.. జర్మనీ గెలవబోతోంది అంటూ ఎప్పుడూ ఒకే ప్రచారం చేసేవాడు. ఆ ప్రచారాన్ని హిట్లర్ అంతటివాడు కూడా చచ్చేంతవరకు నమ్మాడు. అలాగే కేసీఆర్ తప్పుడు ప్రచారంతో, మీడియాలో వందలకోట్లు ప్రకటనలకు తగిలేసి వాస్తవాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో 27 రాష్ట్రాల్లో విద్యుత్ మిగులు ఉంది కాబట్టి 24 గంటలేమిటి ఇంకా ఎక్కువే ఇవ్వవచ్చు.

ఎరువుల కోసం రూ. 4 వేలు ఇస్తే, రైతులంతా సంతృప్తి చెందుతారా?

స్వాంతంత్ర్యానంతరం ఒక రాష్ట్రంలో ఎక్కువమంది రైతుల ఆత్మహత్యలు జరిగింది కేసీఆర్ పాలిస్తున్న తెలంగాణలోనే అని గుర్తుంచుకోవాలి. మిర్చిపంటకు మంచి ధర కావాలని ఖమ్మం రైతులు వీధుల్లో కొస్తే వాళ్ల కాళ్ల చేతులకు సంకెళ్లు వేసి మరీ జైల్లో కుక్కించిన దుర్మార్గ పాలన కేసీఆర్‌ది. రైతులను సంకెళ్లతో రోడ్డు మీద నడిపించారు. కేసులు పెట్టారు. రైతులను నాలుగేళ్లుగా నిర్లక్ష్యం చేసి వాళ్ల వాతపెట్టడానికి సిద్ధపడుతున్నారని తెలిసి ఇప్పుడు రైతులను ఉద్ధరిస్తున్నట్లు జిమ్మిక్కులకు సిద్ధమవుతున్నాడు కేసీఆర్.

మిషన్ భగీరథ పూర్తి చేసి నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగనని కేసీఆర్ చెప్పారు. ఇప్పుడు నీళ్లు ఇస్తున్నారు కదా?

మిషన్ భగీరథలో ఆరు శాతం కమీషన్ గ్యారంటీ. అందుకే అది కమీషన్ భగీరథ. నీళ్లివ్వకపోతే ఓట్లు అడగనన్నారు కదా. అయితే దళితులకు మూడెకరాలు భూమి ఇస్తానన్నారు. ఇవ్వలేదు. గిరిజనులకు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ అన్నారు. చేయలేదు. ఇంటికో ఉద్యోగం అన్నారు. ఇవ్వలేదు. మరి వీళ్లెవరినీ ఓట్లడగొద్దు. తెలంగాణ ప్రభుత్వంపై ఒక నిశ్శబ్ద విప్లవం జరగనుంది చూస్తూ ఉండండి. ప్రజలు సహించని విషయం ఏమిటంటే అహంకారం. తెలంగాణను పాలిస్తున్న వాళ్ల కళ్లు నెత్తికెక్కి, చిన్నా, పెద్దా, మంచీ చెడూ, డిగ్నిటీ ఏమీ లేకుండా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి కొడుకు నియోజకవర్గంలో దళితులను తీసుకుపోయి పోలీస్ టార్చర్ చేస్తే కనీసం దానిమీద చర్యలుండవు. అంటే ఇంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. జగ్జీవన్ రాం బిడ్డ మీరా కుమార్ తెలంగాణకు వచ్చి వారిని చూసి కంట తడిపెడితే వీళ్లు హేళన చేస్తూ మాట్లాడతారు. ఉస్మానియాలో బీసీ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే కనీస పరామర్శ కూడా ఉండదు. కామారెడ్డిలో బీసీకి చెందిన వీఆర్ఏను ఇసుక ట్రాక్టర్ కింద తొక్కించి చంపితే వీళ్లు పట్టించుకోరు. ఇదా వీరి పాలన. ఇంత అమానవీయం, ఇంత అహంకారం ఎన్నడైనా చూశామా.. వీళ్లను ప్రజలు తరిమి తరిమి కొడతారు చూస్తూ ఉండండి.

ఏపీ విపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్రపై మీ అభిప్రాయం?

ఆయన చాలా కష్టపడి పనిచేస్తున్నారు. పాదయాత్ర చేస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడిగా ఆయనకు మా శుభాకాంక్షలు.

(ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకుల్లో..)
https://goo.gl/2TePF2 / https://goo.gl/txpr5i

నిలిచిపోయిన 'నర్తనం'

ఒక మువ్వ రాలిపోయింది...
నిన్నటి దాకా నేలపై నర్తించిన పాదం...
శివునితో నాట్యం చేయడానికి కైలాసం చేరుకుంది...
కూచిపూడి వెంపటి వారసత్వం లయమైపోయింది...



నివాళి

ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు పద్మవిభూషణ్ వెంపటి చినసత్యం రెండవ కుమారుడు నాట్యాచార్యులు వెంపటి రవి శంకర్ ఈ ఉదయం గుండె పోటుతో చెన్నైలో కన్నుమూశారు.

"1969 అక్టోబర్‌లో జన్మించిన రవి శంకర్ తండ్రి దగ్గర నాట్యాభ్యాసం చేయలేదు. వెంపటి చినసత్యంగారి ప్రథమ శిష్యురాలు బాల కొండలరావు దగ్గర వెంపటి నాట్యం ఆరంభించారు. 'శ్రీనివాస కల్యాణం'లో కల్పతరువుగా నటించి, తండ్రి దృష్టిలో పడ్డారు. కుమారుడిని చూసి తండ్రి మురిసిపోయారు. 'ఇంతింతై వటుడింతయై' అన్నట్లుగా తండ్రికి దీటుగా నాట్యకారుడిగా అవతరించాడు. చినసత్యం రూపొందించిన అంశాలను 1994 – 2004 మధ్యకాలంలో ప్రదర్శించారు. అర్ధనారీశ్వరుడిగా నటించి అందరినీ అలరించారు. 'హరవిలాసం'లో శివుడు, 'శకుంతలదుష్యంతులు'లో దుష్యంతుడు, 'కిరాతార్జునీయం'లో అర్జునుడిగా నటించారు. బాల్యంలోనే 'క్షీరసాగర మథనం'లో అప్సరసగా కూచిపూడి సంప్రదాయ రీతుల్లో ఆడ వేషం వేశారు.

1994లో 'వందే ఉమాసుతం' అనే స్వీయరచన చేసి 2007లో నృత్య రూపకల్పన చేశారు. ఈ రూపకాన్ని ఐదు గతుల్లో నడిపించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఎవ్వరూ స్పృశించని అనేక అన్నమయ్య కీర్తనలకు నృత్యాభినయం సమకూర్చి పిల్లల చేత ప్రదర్శనలు ఇప్పించారు. 'అతడిని మించినవాడు లేడు' అనిపించుకున్నాడు" అంటున్నారు ప్రముఖ నాట్యాచార్యులు కూచిపూడి గ్రామానికి చెందిన పశుమర్తి కేశవప్రసాద్.

"మాస్టారుగారి అబ్బాయికి నేర్పడం నాకు గర్వంగా ఉంది. నా శిష్యుడు నన్ను అధిగమించాడు. తండ్రితో సమానంగా, తండ్రికి ధీటుగా ప్రతి విషయాన్ని చక్కగా కూచిపూడి శైలిలో మలిచాడు" అంటారు వెంపటి రవిశంకర్ నాట్యగురువులు శ్రీమతి బాల కొండలరావు.

"పద్మభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ దగ్గర సంగీతం అభ్యసించి, కచేరీలు చేశాడు. ఆయన మంచి నాట్యాచార్యుడు, నర్తకుడు. ఆయనకు జ్ఞాత, అజ్ఞాత శిష్యులు దేశవిదేశాలలో ఉన్నారు. ఆయన అస్తమయం కూచిపూడి కళారంగానికి తీరనిలోటు. అన్ని వాద్యాల మీద అపరిమితమైన పరిజ్ఞానం ఉంది. ఎవరిని ఎలా ఉపయోగించు కోవాలో, ఏ వాద్యాన్ని ఏ సందర్భానికి ఉపయోగించాలో బాగా తెలుసు. లఘువు బిగువులు తెలిసిన మహావ్యక్తి. కుర్రవాళ్లలో ఇటువంటి వ్యక్తిని చూడలేదు. తీర్చిదిద్దడం, అంశాన్ని డ్రమెటైజ్ చేయడం ఆయనకి బాగా తెలుసు. మాకు బాలా త్రిపుర సుందరి మీద కీర్తనలు పాడి ఇచ్చారు. అందరి మనసులలో స్థానం ఏర్పరుచుకున్నారు.

సంగీతం, నృత్యం నేర్చుకోవడమే కాదు, అందులో నిష్ణాతులు. చినసత్యం అంతటి వారవ్వగలిగిన జ్ఞాని ఆయన. కాని అనారోగ్యం కారణంగా కాలేకపోయారు. దక్షయజ్ఞంలో శివుడు వేషం వేసి మెప్పించారు. విద్వత్సభలలో సంగీత కచేరీలు చేశారు. నట్టువాంగం రావాలంటే సంగీతం వచ్చి తీరాలి. చినసత్యం గారు రూపకల్పన చేసిన వాటిని యథాతథం ప్రదర్శించేవారు. ఆనందతాండవం, జయముజయము... వంటివి. చినసత్యంగారి వారసుడుగా నిలబడలేకపోవడం కూచిపూడికి తీరనిలోటు.. అంటున్నారు విజయవాడకు చెందిన ప్రసిద్ధ కూచిపూడి నాట్యాచార్యులు భాగవతుల వెంకటరామశర్మ.

2008లో మొట్టమొదటి కూచిపూడి నాట్య సమ్మేళనం అమెరికాలో జరిగినప్పుడు తండ్రితో పాటు సిలికానాంధ్రకు విచ్చేసి 'కూచిపూడి వైజయంతిక' అనే బ్యాలేలో సిద్ధేంద్ర యోగి పాత్ర ధరించారు. అప్పటి నుంచి సిలికానాంధ్ర చేస్తున్న అన్ని కార్యక్రమాలకు తోడ్పడుతూ వచ్చారు. 2016లో విజయవాడలో జరిగిన అంతర్జాతీయ కూచిపూడి నాట్యసమ్మేళనానికి 'సాధన వీడియో' స్వయంగా తయారుచేసి అందించారు. అద్భుతమైన కళాకారుడు. మృదుస్వభావి. ఆయనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున 2015లో కళారత్న పురస్కారం అందచేశాం. ఎన్నో సాధించవలసిన వ్యక్తి, చినసత్యంగారి వారసుడు ఆయన. వారి కుటుంబానికి తగిన సహాయం సిలికానాంధ్ర తరఫు నుంచి అందచేయాలని సంకల్పించాం... అన్నారు సిలికానాంధ్ర వ్యవస్థాపకులు కూచిభొట్ల ఆనంద్.

– డాక్టర్ పురాణపండ వైజయంతి



HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
ఏం షైన్ ఇది!
CB Shine
₹5,999# డౌన్ పేమెంట్
0 ప్రాసెసింగ్ ఫీజు#
క్రోమ్ కార్బ్యురేటర్ కవర్
క్రోమ్ ఫినిష్ మఫ్లర్
ఈక్వలైజర్ సహితమైన కాంబి బ్రేక్ సిస్టమ్
BS-IV కంప్లయన్స్ గల HET
HDFC BANK
We understand your world
IndusInd Bank
L&T Financial Services
హోండా అంటే HONDA



దావోస్ సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబుతో మంత్రి కేటీఆర్

దావోస్ సదస్సులో పాల్గొన్న కేటీఆర్

25న పలు చర్చా కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి

సాక్షి, హైదరాబాద్: దావోస్‌లో మంగళవారం ప్రారంభమైన వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్లీనరీ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీతోపాటు వివిధ దేశాల అధినేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సీఈవోలు, చైర్మన్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 26 వరకు జరగనున్న ఈ సమావేశాల్లో మంత్రి కేటీఆర్ పలు సెషన్లలో ప్రసంగించనున్నారు. డిజిటల్ పరిజ్ఞానంపై 25న జరిగే చర్చా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడనున్నారు. 'భారతదేశంలో ఉత్పత్తుల నమూనాల తయారీకి ప్రోత్సాహం'అనే అంశంపై అదే రోజు జరగనున్న రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి సురేశ్ ప్రభుతో కలసి కేటీఆర్ పాల్గొననున్నారు. గత మూడున్నరేళ్లుగా రాష్ట్రానికి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు నుంచి ఆహ్వానం వస్తోందని, తొలిసారిగా రాష్ట్రం తరపున తాను హాజరవుతున్నానని కేటీఆర్ తెలిపారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలోని వ్యాపారానుకూల వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సదస్సులో భాగంగా పలు కంపెనీలతో సమావేశం కానున్నట్లు మంత్రి తెలిపారు.

పలువురితో కేటీఆర్ భేటీ

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్లీనరీ అనంతరం మంత్రి కేటీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎంపీ గల్లా జయదేవ్, పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీతో పాటు పలువురు పారిశ్రామిక వేత్తలను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు కంపెనీలతో సమావేశమయ్యారు. ప్రధానంగా ఇండోరమా వెంచర్స్ చైర్మన్ అలోక్ లోహియాతో సమావేశం అయ్యారు. థాయ్‌లాండ్ దేశానికి చెందిన ఈ గ్రూపు రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించింది. బ్యాంకాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీ టెక్స్‌టైల్స్ రంగ అనుబంధ ఉత్పత్తులకు ప్రసిద్ధి. వరంగల్ మెగా టెక్స్‌టైల్స్ పార్క్ దేశంలోనే పెద్దదని, ఫ్యాబ్రిక్ టూ ఫైబర్ పద్ధతిలో ఈ పార్కు ఉందని మంత్రి వివరించారు. కొరియా కంపెనీలు ఈ పార్కులో పెట్టుబడులు పెడుతున్నాయని, ఇండోరమా సైతం ముందుకు రావాలని కేటీఆర్ కోరారు.

✦ విద్యారంగాన్ని ధ్వంసంచేసిన కేసీఆర్

స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణలో ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం విద్యారంగాన్ని ధ్వంసం చేసిందని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం తెలంగాణ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌టీఎఫ్) డైరీని, కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ ఏర్పాటై నాలుగేళ్లు కావస్తున్నా విద్యారంగానికి ఒరిగిందేమీ లేదని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన ఉన్న ఉపాధ్యాయులు ఈరోజు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కేజీ టు పీజీదాకా ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీపై టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా కనీసం ప్రతిపాదన కూడా చేయలేకపోయిందన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తుంటే ఒక్క డీఎస్సీని కూడా వేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. సీపీఎస్ రద్దు విషయంలో ఉపాధ్యాయులు చేస్తున్న ఉద్యమానికి మద్దతిస్తామని, సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీని ఇచ్చారు. పండిట్ పోస్టులను ప్రభుత్వం వెంటనే అప్‌గ్రేడ్ చేయాలన్నారు.

✦ వాక్ విత్ జగన్ జయప్రదం చేయాలి

వైఎస్సార్‌సీపీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'వాక్ విత్ జగన్' కార్యక్రమాన్ని ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరగకుండా నిర్వహిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్ర ఈ నెల 29న నెల్లూరు జిల్లాలో 1,000 కి.మీ. మైలురాయి పూర్తి చేసుకుంటున్న సందర్భంగా.. పాదయాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా ప్రజా సంకల్ప యాత్ర విజయవంతం కావాలని కోరుతూ 29న పార్టీ నేతలు కొండా రాఘవ రెడ్డి యాదాద్రి జిల్లా యాదగిరి గుట్ట వద్ద, మతీన్ ముజాద్దీన్ నాంపల్లి దర్గా వద్ద, జి. రాంభూపాల్ రెడ్డి గద్వాల్ జిల్లా జోగుళాంబ దేవాలయం వద్ద, జి. మహేందర్ రెడ్డి వరంగల్ జిల్లా భద్రకాళి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తారని ఆయన తెలిపారు. కె.శివకుమార్ రంగారెడ్డి జిల్లాలో జరిగే కార్యక్రమాల్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు ముందుండి నడిపించాలని శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

నగరంలో లోటస్‌పాండ్ నుంచి: హైదరాబాద్‌లో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్ నుంచి పెద్దమ్మ గుడి వరకు నిర్వహించే వాక్ విత్ జగన్ కార్యక్రమాన్ని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బొడ్డు సాయినాథ్‌రెడ్డి చెప్పారు. ఈ పాదయాత్రలో గ్రేటర్ హైదరాబాద్ అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

✦ 'నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌ను, తెలంగాణ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌గా మార్చాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సూర్యపల్లి శ్రీనివాస్ కోరారు. దీనికి వెంటనే చైర్మన్, మెంబర్లను నియమించి, 2017- 18 బడ్జెట్‌లో కేటాయించిన రూ.250 కోట్లను మంజూరు చేయాలన్నారు. తెలంగాణ నాయీ బ్రాహ్మణ హక్కుల పోరాట సమితి ఆవిర్భావ సభ, జననాయక్ కర్పూరి ఠాకూర్ 94వ జయంతి వేడుకలు మంగళవారం రవీంద్రభారతిలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో అన్ని పార్టీలు నాయీ బ్రాహ్మణులకు 4 శాసనసభ, 2 మండలి, ఒక పార్లమెంట్ స్థానాలను కేటాయించాలన్నారు. తెలంగాణ నాయీ బ్రాహ్మణ హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి ఉప్పల బాల్ రాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ కులాన్ని ఓబీసీ – ఏ గ్రూప్‌లో చేర్చే విధంగా కేంద్రానికి సిఫారసు చేయాలన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ మెంబర్ వి.కృష్ణమోహన్‌రావులు మాట్లాడుతూ.. తెలంగాణ నాయీ బ్రాహ్మణ హక్కుల పోరాట సమితి డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాయీ బ్రాహ్మణ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మహతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

✦ ఆదర్శంగా గురుకుల విద్యా విధానం

పంజాబ్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల బృందం ప్రశంస

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అమలు చేస్తున్న గురుకుల విద్యా విధానం దేశంలోనే ఆదర్శ విధానమని పంజాబ్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల బృందం ప్రశంసించింది. గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఐఐటీ అకాడమీని రిపు దామన్ సింగ్ నేతృత్వంలో పంజాబ్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. అక్కడ అమలు చేస్తున్న విద్యా విధానం, పాఠ్య కార్యక్రమాల అమలును ప్రశంసించింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చర్యలు చేపడుతున్నారని పేర్కొంది. పంజాబ్ ప్రభుత్వం కూడా అక్కడ ఇలాంటి గురుకుల విద్యా విధానం తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోందని వివరించింది. అనంతరం అధికారుల బృందం సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రవీణ్‌కుమార్ వారికి వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో టెన్షన్!


పది రూపాయల బిళ్ల తెగ టెన్షన్ పెడుతోంది.. ఇటు ఆర్టీసీ, అటు బ్యాంకులు నానా హైరానా పడాల్సి వస్తోంది. రూ.పది నాణెం చలామణిలో లేదన్న తప్పుడు ప్రచారం జనాల్లోకి వెళ్లడమే ఇందుకు కారణం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు తమ వద్ద ఉన్న రూ.పది బిళ్లను టికెట్ కొనేప్పుడు కండక్టర్లకు ఇస్తున్నారు. కానీ కండక్టర్లు చిల్లర రూపంలో తిరిగిస్తే మాత్రం తీసుకోవటం లేదు. దీంతో ఆర్టీసీలో పెద్ద మొత్తంలో రూ.పది బిళ్లలు పేరుకుపోతున్నాయి. వాటిని బ్యాంకుల్లో జమ చేయబోతే, ఆర్బీఐ నిబంధన చూపి అంత చిల్లర తాము తీసుకోబోమంటూ బ్యాంకు సిబ్బంది తేల్చి చెబుతున్నారు. దీంతో ఆర్టీసీకి దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. చాలా డిపోల్లో ఆ బిళ్లల మూటలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు విషయాన్ని స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయం, ఆర్బీఐ, బ్యాంకు అంబుడ్స్‌మెన్‌లకు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది.

– సాక్షి, హైదరాబాద్

రూ.పది నాణేలతో నానా హైరానా



బ్యాంకులో తీసుకోకపోవటంతో ఓ డిపో కార్యాలయంలో పేరుకుపోయిన నాణేల మూటలు



స్టేట్ బ్యాంకుకు ఆర్టీసీ ఫిర్యాదు ప్రతి

తిరిగి ప్రయాణికులకే ఇబ్బంది

ప్రయాణికులు తీసుకోకపోతుండటం, బ్యాంకులు తిరస్కరిస్తుండటంతో డిపో అధికారులు కండక్టర్లను నియంత్రిస్తున్నారు. రూ.వేలల్లో నాణేలు వస్తున్న నేపథ్యంలో వాటిని వీలైనంత తక్కువకే పరిమితం చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో కండక్టర్లు ప్రయాణికుల నుంచి పది నాణేలు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. వెరసి హైదరాబాద్ నగరంలో గతంలో సగటున ఒక్కో డిపో పరిధిలో రోజుకు రూ.10 వేల విలువైన రూ. పది నాణేలు వచ్చిపడగా, ఇప్పుడా మొత్తం రూ.5-రూ.6 వేలకు పడిపోయింది. మరోవైపు రూ.10 నాణేలు తీసుకోవటం లేదంటూ ఉన్నతాధికారులకు ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు నేరుగా ఆర్బీఐ, స్టేట్‌బ్యాంకు, బ్యాంకు అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ ఖాతా స్టేట్ బ్యాంకులో ఉండటంతో ఓ ఉన్నతాధికారి స్వయంగా ఆ బ్యాంకు చీఫ్‌ను కలసి కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంకు ఉన్నతాధికారులు.. ఒక్కో బ్రాంచి వారీగా ఆరా తీసి పరిస్థితిని సరిదిద్దే పని ప్రారంభించినట్టు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

నిబంధన మార్చమన్నాం: ఆర్టీసీ

'రోజుకు రూ.వేయికి మించి రూ.10 నాణేలు బ్యాంకులో జమ చేయవద్దనే నిబంధన ఉందని స్టేట్ బ్యాంకు అధి కారులు చెబుతున్నారు. కానీ అది వ్యక్తిగత ఖాతాలకే అన్వయించాలి తప్ప.. నిత్యం లక్షల మంది ప్రయాణికుల తో వ్యవహారం నడిపే ఆర్టీసీకి వర్తింపజేస్తే ఎలా. ఇదే విషయాన్ని స్టేట్ బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిత్యం రూ.కోట్లలో మొత్తాన్ని బ్యాంకుల్లో జమ చేసే ఆర్టీసీని ఆ నిబంధన నుంచి మినహాయించాలని అడిగాం. సానుకూలంగా స్పందిస్తున్నారు'

ఒక్క నిబంధన.. నానా హైరానా!

పది రూపాయిల నాణేలు చాలాకాలంగా చలామణిలో ఉన్నాయి. అయితే పెద్ద నోట్ల రద్దు సమ యంలో ఆ బిళ్లలు చెల్లవంటూ ఓ వదంతి వ్యాపించింది. అప్పటికే నోట్ల టెన్షన్‌తో ఉన్న ప్రజలు ఆ నాణేలను తీసుకోవటం మానేశారు. వీలైనంత వరకు తమ వద్ద ఉన్న వాటిని బ్యాంకులకు జమ చేసేందుకు క్యూ కట్టారు. రూ.పది నాణేలు చెల్లుబాటవుతాయని, అవి చెల్లవనే వదంతి తప్పని స్వయంగా రిజర్వ్ బ్యాంకు ప్రకటించింది. అయినా వాటిని తీసుకునేం దుకు నిరాకరిస్తున్నారు. ఇప్పుడు ఇదే ఆర్టీసీకి పెద్ద సమస్యగా మారింది. డిపోలకు సగటున నిత్యం రూ.10 వేల విలువైన రూ.పది బిళ్లలు వస్తున్నాయి. కండక్టర్లు చిల్లర ఇచ్చే క్రమంలో వాటిని ఇస్తే ప్రయాణికులు తీసుకో వటం లేదు. వాటిని బ్యాంకుల్లో జమ చేసేందుకు వెళ్తే.. రూ.పది బిళ్లలను రోజుకు రూ.వేయి విలువకు మించి తీసుకోవద్దనే నిబంధన ఉందంటూ తీసుకోవటం లేదు. ఇతర ఖాతాదారుల ద్వారా పెద్ద సంఖ్యలో రూ.పది బిళ్లలు వస్తుండటంతో వాటిని నిల్వ చేయటం బ్యాంకులకూ సమస్యగా మారుతోంది. చెస్ట్ (డబ్బు నిల్వ చేసే ప్రత్యేక ఏర్పాటు) వసతి లేని బ్రాంచిలలో డబ్బు నిల్వ చేసే ప్రదేశం నాణేలతో నిండిపోవటంతో కొత్తగా నాణేలు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

ఎక్కడ నిల్వ చేయాలి

'రూ.10 నాణేలను జమ చేసుకోకుండా తిరస్కరించకూడదు. మేం కూడా తీసుకోవాల్సిందే. కానీ నిత్యం కుప్పలుతెప్పలుగా నాణేలు వచ్చిపడుతుంటే ఇబ్బందే కదా. ఇప్పటికే రూ.35 లక్షల విలువైన నాణేలు ఉన్నాయి. వాటిని ఎక్కడ నిల్వ చేయాలో తెలియటం లేదు. సాధారణ క్యాష్ ఉంచాల్సిన ప్రాంతమంతా ఈ బిళ్లలతోనే నిండిపోతున్నాయి'

– ఓ బ్యాంకు బ్రాంచి మేనేజర్

కొన్ని చోట్ల తీసుకోవడం లేదు...

'రాజేంద్రనగర్ ప్రాంతంలో ఉన్న స్టేట్ బ్యాంకు బ్రాంచీలో రూ.30 లక్షల విలువైన రూ.పది నాణేలు పేరుకు పోయాయని, స్థలం సరిపోక ఇబ్బందిగా ఉందని ఆ బ్రాంచి అధికారులంటున్నారు. కానీ మా పరిస్థితి గమనించి వారు నాణేలను స్వీకరించి సహకరిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం నిరాకరిస్తున్నారు'

– రాజేంద్రనగర్ డిపో మేనేజర్ వెంకటరెడ్డి

'అకినేపల్లి'పై మాతో చర్చించండి

ప్రత్యామ్నాయాలపై కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శికి స్పెషల్ సీఎస్ ఎస్కే జోషి లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానంపై చేసిన ప్రతిపాదనలను బేసిన్ పరిధిలోని రాష్ట్రాలతో చర్చించాలని తెలంగాణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రాలను సంప్రదించి వారు సూచించే ప్రత్యామ్నాయాలను పరిశీలించాకే అనుసంధానంపై తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఎస్కే జోషి ఇటీవల కేంద్ర జల వనరులశాఖ కార్యదర్శి ఉపేంద్ర ప్రసాద్ సింగ్‌కు లేఖ రాశారు. నదుల అనుసంధానాన్ని తెలంగాణ స్వాగతిస్తోందని.. అనుసంధానంపై ఖర్చు చేస్తున్న వ్యయంతో పాటు, సాగు, తాగు, పరిశ్రమలకు అవసరాలకు కలిగే ప్రయోజనంపై పూర్తి స్థాయిలో పరిశీలించాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు. ఇతర ప్రాజెక్టుల నీటి లభ్యతలను 40ఏళ్ల సిరీస్ ఆధారంగా లెక్కించి అకినేపల్లి వద్ద నీటి లభ్యత విషయంలో 110 ఏళ్ల సిరీస్ ఆధారంగా లెక్కించడాన్ని ప్రశ్నించారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే దిగువన ప్రాజెక్టులపై ప్రభావం పడుతుందన్నారు.

శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదలేదీ

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగార్జున సాగర్‌కు 16 టీఎంసీలు విడుదల చేయాలని, సాగర్ కనీస నీటి మట్టాలను 520 మీటర్లకు ఉంచాలని కోరుతున్నా నీటి విడుదల జరగలేదని కృష్ణా బోర్డు తెలిపింది. ఈ మేరకు మంగళవారం తెలుగు రాష్ట్రాలకు లేఖలు రాసింది.

కేసులు ఎత్తివేయాలి

వరవరరావు డిమాండ్

హైదరాబాద్: పౌర, ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తున్న ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఖండిస్తున్నామని విరసం నేత వరవరరావు అన్నారు. కళాకారులు, ఉద్యమకారులపై దాడి చేసిన వరంగల్ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వరంగల్ పోలీసులు 20 ఏళ్ల డిక్లరేషన్‌పై పెచ్చరిల్లిన రాజ్యహింసను చాటుకుంటున్నారని ఆరోపించారు. గత నెలలో టీపీఎఫ్ వరంగల్‌లో ర్యాలీ, బహిరంగసభ నిర్వహించేందుకు తీసుకున్న అనుమతులను పోలీసులు బలవంతంగా రద్దు చేయించారని మండిపడ్డారు.

9 మంది టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై వేటేయండి

ఎన్నికల సంఘానికి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్లమెంటు సెక్రటరీలుగా పనిచేసిన ఆరుగురు ఎమ్మెల్యేలతోపాటు లాభదాయక పదవుల్లో పనిచేస్తున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కొడంగల్ ఎమ్మెల్యే ఎ. రేవంత్‌రెడ్డి మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలు గతంలో పార్లమెంటు కార్యదర్శులుగా కొనసాగితే, వారిపై అనర్హత వేటు వేయడాన్ని గుర్తుచేశారు. ఈ మేరకు పూర్తి వివరాలతో ఈసీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. 'ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, జలగం వెంకట్రావు, వి. శ్రీనివాస్‌గౌడ్, వి. సతీశ్ కుమార్, గ్యాదరి కిశోర్ కుమార్, కోవా లక్ష్మిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2014 డిసెంబర్ 29న జీఓ ఎంఎస్ 173 జారీ చేసింది. రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యను హైకోర్టులో సవాల్ చేయగా 2015 మే 1న హైకోర్టు ఈ నియామకాలను రద్దు చేసింది. ప్రభుత్వం నియమించినప్పటి నుంచి కోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు ఆ ఆరుగురు ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా కొనసాగారు'అని రేవంత్‌రెడ్డి ఫిర్యాదులో వివరించారు. తెలంగాణ ప్రభుత్వం విధానంలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదా ఇచ్చి కొత్త పదవుల్లో నియమించిందన్నారు.

జనసేన కేసీఆర్ భజనసేన: జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జనసేన టీఆర్‌ఎస్ భజనసేనగా మారిందని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో ఎక్కడ సంక్షేమం, అభివృద్ధి కనబడుతున్నాయో చెప్పాలని పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ నచ్చితే జనసేనను అందులో విలీనం చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకున్న వారిని పరామర్శిస్తానంటే అనుమతులివ్వని ప్రభుత్వం.. పవన్‌కు ఎందుకిచ్చిందో అందరికీ అర్థమవుతోందన్నారు. అజ్ఞాతవాసి సినిమా 5షోలకు అనుమతినిచ్చి నందుకు కృతజ్ఞతగానే పవన్ సీఎం కేసీఆర్ భజన చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సమస్యలు, నిరుద్యోగుల గోస పవన్‌కు కనిపించట్లేదా అని ప్రశ్నించారు.

స్కూళ్లకు కాల్ సెంటర్

▶ మొదటి పేజీ తరువాయి

సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 706 హాస్టల్ వసతి గల విద్యా సంస్థల్లో ప్రత్యేక ఫోన్ సదుపాయాన్ని విద్యాశాఖ త్వరలోనే అందుబాటులోకి తేనుంది. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా విద్యా సంస్థల్లోని దాదాపు లక్ష మంది బాలికలకు భరోసా కల్పించనుంది.

వినడమే కాదు.. పరిష్కారంపైనా చర్యలు

రాష్ట్రంలోని 485 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), 192 మోడల్ స్కూళ్లు, మరో 29 గురుకుల పాఠశాలల్లో దాదాపు 1.3 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ముఖ్యంగా కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల హాస్టళ్లలోనే దాదాపు లక్ష మంది బాలికలు ఉన్నారు. వారంతా తమ హాస్టళ్లు, స్కూళ్లలో ఎదుర్కొనే ఎలాంటి సమస్యలైనా సరే ఫిర్యాదు చేసే అవకాశాన్ని విద్యాశాఖ త్వరలోనే అందుబాటులోకి తీసుకురానుంది. విద్యార్థులు చేసే ప్రతి ఫిర్యాదును రికార్డు చేసి అవి పరిష్కారమయ్యే వరకు నిరంతర సమీక్ష నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఆయా విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసే ఫోన్‌ను పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కాల్ సెంటర్‌కు అనుసంధానించనుంది. విద్యార్థి హాస్టల్‌లోని ఫోన్ రిసీవర్ తీసుకోగానే ఆ ఫోన్ నేరుగా కాల్ సెంటర్‌కు మాత్రమే వెళ్లేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తోంది. కాల్ సెంటర్ సిబ్బంది కాల్ రిసీవ్ చేసుకోవడమే కాదు.. దాన్ని సంబంధిత సెక్షన్ అధికారి, సంబంధిత విభాగం ఉన్నతాధికారికి, జిల్లా డీఈవోకు, పాఠశాల ప్రిన్సిపాల్‌కు, పాఠశాల విద్యా డైరెక్టర్‌కు మెసేజ్ రూపంలో పంపిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించనున్నారు. మెసేజ్ రూపంలో వచ్చిన సమస్య పరిష్కారమైందా లేదా అన్నది అందులో అప్‌డేట్ చేస్తారు. ఆ తరువాత కాల్ సెంటర్ సిబ్బంది సమస్యల పరిష్కారంపై ర్యాండమ్‌గా విద్యార్థులకు ఫోన్ చేసి తెలుసుకొని నివేదికను డైరెక్టర్‌కు అందజేస్తారు. మరోవైపు విద్యార్థులు చేసే ఫిర్యాదులు రికార్డు అయ్యేలా కసరత్తు చేస్తున్నారు.

కాల్ సెంటర్, ఎమర్జెన్సీ నంబర్లకే ఫోన్..

పాఠశాలల్లో ఏర్పాటు చేసే ఫోన్ నుంచి కాల్ సెంటర్‌కు, పోలీసు, ఆసుపత్రి, ఫైర్ వంటి ఎమర్జెన్సీ సర్వీసులకు మాత్రమే ఫోన్ వెళ్లే సదుపాయం అందుబాటులో ఉంచేలా ప్రోగ్రాం రూపొందిస్తున్నారు. దానివల్ల విద్యార్థులు ఫోన్‌ను తమ సమస్యలను తెలియజేసేందుకు మాత్రమే ఉపయోగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాల్‌సెంటర్ సదుపాయాన్ని జూన్ నుంచి అమల్లోకి తెచ్చేలా చర్యలు వేగవంతం చేసింది. పాఠశాలల వేళలు మినహా మిగతా సమయాల్లో కాల్ సెంటర్ పని చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాల్ సెంటర్ వేళలు ఉంటే బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

సామాజిక న్యాయం సాధిస్తాం

టీమాస్ ఫోరం చైర్మన్ ఐలయ్య

హైదరాబాద్: రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధనే ధ్యేయంగా పోరాటాలు సాగిస్తామని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ పెంచటంతో పాటు ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిషు మాధ్యమాన్ని అమలు చేయా లని, ఇంటర్ విద్యను ఎత్తివేయాలని ఆయ న డిమాండ్ చేశారు. తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీమాస్ ఫోరం) చైర్మన్‌గా ఐలయ్య, కన్వీ నర్‌గా జాన్‌వెస్లీ, కో–కన్వీనర్‌గా జ్వలితలు మంగళవారం ఎన్నికయ్యారు. సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ..టీమాస్ ఫోరం ఎన్నికల్లో పోటీ చేయదన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ..26న రాష్ట్రంలోని అన్ని అంబేడ్కర్ విగ్రహాల వద్ద రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవ రావు, గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పునర్జన్మ ఇచ్చింది

కార్యకర్తల సమావేశంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్

- రెండు రాష్ట్రాల్లో బాధ్యతాయుతమైన రాజకీయాలు చేస్తా
- మార్చి 14న పార్టీ పూర్తిస్థాయి ప్రణాళిక
- అమీతుమీకి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- ఆంజనేయస్వామికి జీవితాంతం రుణపడి ఉంటానని వెల్లడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'ఆంధ్ర నాకు జన్మనిస్తే, తెలంగాణ పునర్జన్మ ఇచ్చింది. రెండు రాష్ట్రాల్లో బాధ్యతాయుతమైన రాజకీయాలు చేస్తా'అని జనసేన పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తన ప్రాణాలు కాపాడిన కొండగట్టు ఆంజనేయ స్వామికి, తెలంగాణ నేల తల్లికి తుదిశ్వాస విడిచే దాకా రుణపడి ఉంటానని పేర్కొన్నారు. అందుకే తెలంగాణకు గుండెకాయ లాంటి కరీంనగర్ నుంచే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లోని శుభం గార్డెన్స్‌లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం మంగళవారం జరిగింది. జై తెలంగాణ నినాదం వింటే అణువణువూ పులకరిస్తుందని, అది వందేమాతరంలా గొప్పదని అన్నారు. జై తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ప్రతిభావంతులైన యువతకు జనసేన పార్టీ అవకాశం కల్పిస్తుందన్నారు. జనసేన పూర్తిస్థాయి ప్రణాళిక మార్చి 14న ప్రకటిస్తామన్నారు. 2019 ఎన్నికల్లో జనసేన సత్తా, శక్తి, బలం ఎంతో తేల్చుకునేందుకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'జనసేన యువత ఆకాంక్ష.. ఆడపడుచుల ఆకాంక్ష.. తెలంగాణ ప్రజల ఆశయాలను నిలబెడుతుంది.. మీరు నాకు అండగా నిలవండి.. నాకు పునర్జన్మనిచ్చిన తెలంగాణకు సేవ చేసే భాగ్యం కల్పించండి.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సుదీర్ఘ రాజకీయ పోరాటాలకు సిద్ధంకండి.. ఒక ఆలోచన పైకి ఎదగడానికి పాతికేళ్ల సమయం పడుతుంది. యుద్ధం చేసి తెలంగాణను ఎలా సాధించుకున్నారో అదే స్ఫూర్తితో అభివృద్ధి, అవినీతిలేని సమాజం, ఆశ్రిత పక్షపాతం లేని రాజకీయాల కోసం రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలి'అని పిలుపునిచ్చారు. 'మీతో పాటే పోరాటాలకు నేనూ సిద్ధం. మాట ఇచ్చాను. తప్పను. వెనకడుగు వేయను. వచ్చి పోయేవాడిని కాదు. ప్రజా సంక్షేమం కోసం అవసరాన్ని బట్టి దూకుడుగా. రాజీధోరణితో వ్యవహరిస్తా. నాకు డబ్బులు అవసరం లేదు. ఎన్ని వేల కోట్లు ఇస్తే మీ ప్రేమ దొరుకుతుంది' అంటూ ఉద్వేగపూరితంగా ప్రసంగించారు.



మంగళవారం కరీంనగర్ జిల్లాలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్

ఏడు సిద్ధాంతాలతో ముందుకు..

జనసేన పార్టీ 7 సిద్ధాంతాలతో ముందుకెళ్తుందని పవన్ ప్రకటించారు. కులాలను కలిపే ఆలోచనా విధానం, మతాల ప్రస్తావన లేని రాజకీయం, భాషలను గౌరవించే సంప్రదాయం, సంస్కృతులను కాపాడే సమాజం, ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం, అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం, పర్యావరణను పరిరక్షించే విధానాలపై ఎలా వెళ్లాలనే దానిపై ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. జై తెలంగాణ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించిన పవన్ జై తెలంగాణ.. జై హింద్‌తో ముగించారు.

కేసీఆర్ అంటే ఇష్టం..

సీఎం కేసీఆర్ అంటే ముందు నుంచే తనకు ఇష్టమని, ప్రజల కోసం నిరంతరం తపించే వ్యక్తిగా గౌరవిస్తానని పవన్ అన్నారు. 'కేసీఆర్ స్మార్ట్‌గా పనిచేస్తున్నారంటే కొంతమంది ఇబ్బంది పడ్డారు. ఏ పార్టీకీ నేను వ్యతిరేకం కాదు. మా అన్నయ్య చిరంజీవి కూడా కాంగ్రెస్ నాయకుడేనన్న విషయాన్ని మరవొద్దు. ఆంధ్రా, తెలంగాణ నాకు వేరు కాదు. దేశం కోసమే నా గుండె కొట్టుకుంటుంది. తెలంగాణ కోసం రక్తమైనా ఇస్తా. తెలంగాణ నాలుగేళ్ల పసిబిడ్డ. ఆ పసిబిడ్డను అన్ని పార్టీలు కలసి కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది'అన్నారు. తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే రోడ్డెక్కుతానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తెలంగాణ యాస, భాష, సంస్కృతిని గౌరవించాలని కోరారు. బతుకమ్మ, సమ్మక్క సారలమ్మ, సదర్ ఉత్సవాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 24-1-2018

వ్యాక్సిన్ కిట్

చంటిబిడ్డల కోసం కొండాకోనల్లోకి!



వ్యాక్సిన్ వేసేందుకు బైక్‌పై కొండలు ఎక్కుతున్న గీతావర్మ

హిమాచల్‌ప్రదేశ్... హిమాలయ పర్వతాల కుదురు! పీఠభూమి అంతమై పర్వత సానువులు మొదలయ్యే ప్రదేశం. ఇంకా చెప్పాలంటే పర్వత సానువుల్లో విస్తరించిన చిన్న చిన్న నివాస ప్రదేశాల సమూహం. పర్యటనకు ఎంత ఆహ్లాదంగా ఉంటుందో దైనందిన జీవితానికి అంత కఠినమైన ప్రదేశం. రాష్ట్రంలో సగానికి పైగా గ్రామాలకు వేరే గ్రామాలను కలుపుతూ రోడ్లు ఉండవు. కొండల బారుల మధ్య కాలిబాటలోనే చేరుకోవాలి. మొబైల్ కనెక్షన్ ఉన్నా సిగ్నల్ ఉండదు, ఆ రెండూ కలిసినా ఫోన్ చార్జింగ్‌కు కరెంటు ఉండదు. ఇదీ గ్రామీణ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం. ఒకే రాష్ట్రంలో ఉంటారు, కానీ పేరుకైనా ఒకరి జిల్లాలు మరొకరికి తెలియని పరిస్థితులే ఎక్కువ. అలాంటి రాష్ట్రంలో ఓ అమ్మాయి గీతావర్మ. కమ్యూనిటీ హెల్త్‌వర్కర్‌గా ఆమె అక్కడ ఉద్యోగం చేస్తోంది. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన క్యాలెండర్‌లో గీతావర్మకు కూడా పేజీ ఉంది. అంటే విశేషం ఏదో ఉండాలి కదా! ఏమిటా విశేషం?

పట్టు వదలని హెల్త్ వర్కర్

పిల్లలకు మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ వేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థతో మనదేశం ఒక ఒప్పందం కుదుర్చుకుంది. గత ఏడాది ఫిబ్రవరిలో ప్రచార ఉద్యమం మొదలైంది. అందులో భాగంగా దేశంలో అన్ని ఆరోగ్య కేంద్రాలకూ మందుల సరఫరా జరిగింది. చిన్న పిల్లలందరికీ హెల్త్ వర్కర్లు వ్యాక్సిన్‌లు వేయడమూ జరుగుతోంది. అయితే అంతమందిలో గీతావర్మ ఒక్కరే ప్రత్యేకం అయ్యారు! ఆమె తన పరిధిలో ఉన్న ప్రతి గ్రామానికీ వెళ్లి, ఇంటింటికీ తిరిగి చంటిబిడ్డల జాబితా నమోదు చేసుకుని వ్యాక్సిన్లు వేసింది. రోడ్డు ఉన్న చోట్ల టూ వీలర్ మీద వెళ్లింది. రోడ్డు లేని గ్రామాలకు సైతం వ్యాక్సిన్ మెటీరియల్ కిట్ మోసుకుంటూ మంచు నిండి, పట్టుజారిపోతున్న రాళ్ల బాటల్లో నడిచి వెళ్లింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశం 'మండి'లో ఉన్న రిమోట్ సెటిల్‌మెంట్‌లనూ వదల్లేదామె. రాయగర్ వంటి మారుమూల గ్రామాల శివార్లలో గుడారాలు వేసుకుని నివసిస్తున్న గొర్రెల కాపర్ల కుటుంబాలను కూడా వెతికి పట్టుకుని వ్యాక్సిన్ వేసింది.

ముఖ్యమంత్రి ప్రశంసలు

''రాష్ట్రానికి గౌరవం తెచ్చావు తల్లీ'' అంటూ సంతోషపడిపోయారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్. నూటికి నూరు శాతం వ్యాక్సిన్ వేసిన రికార్డు తన రాష్ట్రానికి అందడం ఒక సంతోషం, ఆ గొప్పతనాన్ని సాధించింది ఒక మహిళ కావడం మరొక సంతోషం. ఒక ప్రభుత్వ ఉద్యోగి అంతటి అంకితభావంతో విధులు నిర్వహించడం మరింత సంతోషం.


గీతావర్మ సేవలు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టడం మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా మనదేశానికి చోటు కల్పించినందుకు గర్వంగా భావిస్తున్నారు ఆ రాష్ట్రంలోని ప్రముఖులు. ప్రతిష్ఠాత్మకమైన 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' గుర్తింపు తెచ్చినందుకు ఇతర రాష్ట్రాలు కూడా గీతావర్మను అభినందిస్తున్నాయి. ఇలాంటి అమ్మాయి రాష్ట్రానికి ఒక్కరుంటే చాలన్నంతగా గీతావర్మకు ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయి.

- మను

డబ్ల్యు.హెచ్.వో.

గీతావర్మది హిమాచల్‌ప్రదేశ్ మండి జిల్లా, కర్సోగ్ తెహసిల్‌లోని సాప్నోత్ గ్రామం. అదే జిల్లాలోని శంకర్‌దెహ్రా హెల్త్ సబ్ సెంటర్‌లో డ్యూటీ. ఆమె అక్కడికి దగ్గర్లోని సెరాజ్ వ్యాలీలోని ఎగుడుదిగుడు రోడ్ల మీద టూవీలర్‌లో ప్రయాణించడం ఫేస్‌బుక్‌లో వైరల్ అయింది. ట్విటర్, వాట్సాప్‌లలోనూ శరవేగంతో తిరిగింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కూడా ఆమె సర్వీస్‌ను గుర్తించింది. ఈ ఏడాదికి విడుదల చేసిన క్యాలెండర్‌లో గీతావర్మ మంచుకొండల మధ్య వ్యాక్సిన్ కిట్ మోసుకుంటూ నడుస్తున్న ఫొటోను, క్లుప్తంగా వివరాలనూ ప్రచురించింది.





పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్

పద్మావత్ సినిమా
ఒక మహిళ వీరత్వానికి,
చతురత్వానికి, ఔన్నత్యానికి
దివిటీ అవుతుందనుకుంటే...
'ఇది చరిత్ర కాదు. కల్పనే' అని
నొక్కి వక్కాణించిన భన్సాలీ... చివరికి
పోరాడలేక
నిస్సహాయురాలై
నిశ్చేష్టురాలై
సంక్షోభాన్ని గట్టెక్కలేక
తనతో పాటు వందల మంది మహిళల్ని
(గర్భిణులు, పిల్లలకు కూడా ఉన్నారు)
పద్మావతి బూడిద చేస్తుందని
చూపించాడు!
సినిమా చూడ్డానికి బాగుంది.
నిమగ్నం అవడానికి
స్ఫూర్తి పొందడానికి
కీర్తించుకోడానికి కూడా
బాగుండాల్సింది.

చూడ్డానికి బాగుంది

రూపమా? గుణమా?

ఏది ముఖ్యమన్న ప్రశ్న ఎదురైనప్పుడు, గుణం అంటుంది రాణి పద్మావతి. ఆ గుణాన్ని నిరూపించుకోవడం కోసం తన రూపాన్ని కూడా ఆహుతి చేస్తుంది. ఇదీ ఒక్క మాటలో సంజయ్ లీలా భన్సాలీ నిర్మించి, దర్శకత్వం వహించిన 'పద్మావత్' సినిమా.

అది ఎలాంటి గుణం? శత్రువు దగ్గర తలవంచని గుణం. శత్రువు తన గౌరవాన్ని మట్టుబెట్టడానికి వచ్చినప్పుడు ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడే గుణం. రాజపుత్రిక ఖడ్గంలో ఎంత శక్తివుందో రాజపుత్రిక గాజుల్లో కూడా అంతే శక్తి వుందని నమ్మే గుణం.

ఒక స్త్రీ గౌరవం స్త్రీ శీలంతో బలంగా ముడిపడిన 13వ శతాబ్దపు నాటి కథ ఇది. చారిత్రక కల్పన.

భార్య కోసం ముత్యాలు కొనడానికి సింహళ్ వెళ్లిన మహారావల్ రతన్ సింగ్ 'ప్రమోదవశాత్తూ' పద్మావతి వేటాడుతుండగా ఆమె బాణపు వేటుకు గాయపడుతాడు. పద్మావతి! ఎలాంటి అపురూప సౌందర్యవతి? 'ఆమె నీడ కూడా మోహం కలిగించేంత అందం'! అంతటి దివ్యవిగ్రహం కాబట్టే, ఆమెను వివాహం చేసుకుని చిత్తోడ్‌కు తెచ్చిన తర్వాత, రతన్‌సింగ్ రాజగురువు కూడా తన వ్యక్తిత్వాన్నీ, తనకు రాజ్యం తరపున అందుతున్న గౌరవాన్ని కూడా పక్కనపెట్టి పద్మావతిని దొంగచాటుగా చూడటానికి ప్రయత్నిస్తాడు. దాంతో రతన్‌సింగ్ ఆయనకు దేశబహిష్కార శిక్ష విధిస్తాడు.

అల్లాహ్ సృష్టించిన ప్రతి అందమైన దానిమీదా అల్లావుద్దీన్ ఖిల్జీకి హక్కు ఉంటుంది అనుకునేంత వాంఛాపరుడు ఖిల్జీ. పెళ్లి రోజుకూడా పరస్త్రీని కోరుకునేంత విచ్చలవిడితనం ఉన్నవాడు. పిల్లనిచ్చిన మామను సింహాసనం కోసం చంపేసినవాడు. కిరీటం ఎంత చెడ్డది, అది తలల్నే మార్చేస్తుంది అని చమత్కరిస్తాడు కూడా. ఇంకా బైసెక్సువల్ కూడా. మాలిక్ కాపుర్ 'ఆయనకు పెళ్లాంలాంటివాడు' అనిపిస్తాడు దర్శకుడు ఒక పాత్రతో. అలాంటి ఖిల్జీకి తన పన్నాగంతో పద్మావతిని పొందని జన్మ జన్మే కాదనీ, ఆమె వుంటే స్వర్గం నేలమీదే వున్నట్టనీ ఊరిస్తాడు రాజగురువు. అలా విపరీతమైన లాలసను పెంచుకున్న ఖిల్జీ చిత్తోడ్ మీద యుద్ధం ప్రకటిస్తాడు. రతన్‌సింగ్‌ను సంధి పేరుతో కుయుక్తిగా బంధించి ఢిల్లీకి పట్టుకెళ్లడమూ, అంతే యుక్తిగా పద్మావతి మళ్లీ రతన్‌సింగ్‌ను విడిపించుకు రావడమూ, దీనికి ఖిల్జీ భార్య మల్లికయే సాయం చేయడమూ, దాన్ని అవమానంగా భావించిన ఖిల్జీ భార్యను బంధించి తిరిగి చిత్తోడ్‌కు భారీ ఫిరంగులతో వెళ్లడమూ (ఆ ఫిరంగి సామర్థ్యం చిత్తోడ్‌కు లేదు), రతన్‌సింగ్ యుద్ధంలో మరణించడమూ(ఇక్కడా కుయుక్తిగానే), భర్త మరణించాడని తెలిసిన పద్మావతి సహా ఏడువందలమంది రాజపుత్రికలు సతీసహగమనానికి పాల్పడటమూ గగుర్పొడిచే ఘట్టం! ఖిల్జీ కనీసం పద్మావతి కొనగోటిని కాదుగదా, కనీసం కొనచూపుతో కూడా చూడకుండానే ఆమె బూడిదైపోతుంది.



అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్రలో రణ్‌వీర్ సింగ్

టాప్‌క్లాస్ విజువల్స్

- రాజ్‌పుత్ రతన్‌సింగ్‌కు తాను పంపిన వర్తమానానికి సమాధానం కోసం ఎదురుచూస్తుంటాడు అల్లావుద్దిన్ ఖిల్జీ. ఆ వర్తమానంలో ఏం పంపాడో చూసిన పద్మావతి దాన్ని కాల్చేస్తుంది. అల్లావుద్దీన్ ఎదురుచూస్తూనే ఉంటాడు. ఈ సన్నివేశాల్లో షాట్ కంపోజిషన్స్ ఒక చిన్న ఉదాహరణ మేకింగ్ పరంగా 'పద్మావత్' టాప్‌క్లాస్ అని చెప్పడానికి. యుద్ధం మొదలైందని తెలిశాక, పద్మావతి పరిగెత్తుకుంటూ కోట గుమ్మం వరకూ వెళ్లే సన్నివేశంతో పాటు చాలా చోట్ల కొన్ని అన్‌కట్ లాంగ్ టేక్స్ చూడొచ్చు. ఇలాంటివి సంజయ్ లీలా భన్సాలీ లాంటి మాస్టర్స్‌కే సాధ్యమనిపించే షాట్స్. సుదీప్ చటర్జీ సినిమాటోగ్రఫీలో అన్నీ మెరుపులే!
- కాస్ట్యూమ్స్ ఈ సినిమాకు మేజర్ హైలైట్స్‌లో ఒకటి. భన్సాలీ సినిమాల్లో కాస్ట్యూమ్స్ వేరే లెవెల్ అనేలా ఉంటాయి. ఇందులోనూ అది కనిపిస్తుంది. అదేదో మెయిన్ క్యారెక్టర్స్‌కి మాత్రమే కాకుండా ప్రతీ క్యారెక్టర్‌కూ కాస్ట్యూమ్స్ టాప్‌క్లాస్ ఉండేలా చూసుకున్నారు. కాస్ట్యూమ్ కలర్స్ కూడా కథ మూడ్‌కు తగ్గట్టుగా ఉన్నాయి.
- టెక్నికల్ అంశాల్లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గురించి ఎక్కువ చెప్పుకోవాలి. క్లైమాక్స్ ఎలివేట్ అయ్యేదంతా స్కోర్‌తోనే! పాటలు కూడా బాగున్నాయి. ఎడిటింగ్ బాగుంది.
- రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్, షాహిద్ కపూర్, అదితిరావు హైదరి లాంటి స్టార్స్ ఉన్నారు ఈ సినిమాలో. వాళ్లను చూస్తేనే ఏదో మ్యాజిక్ చెయ్యగలరన్న నమ్మకం కలిగించే స్టార్స్ అంతా. ఆ నమ్మకాన్ని ఎవ్వరూ వమ్ము చెయ్యలేదు. ప్రతీ ఒక్కరిదీ టాప్‌క్లాస్ పర్‌ఫార్మెన్స్. రణ్‌వీర్ సింగ్ వరుసగా తాను నెక్స్ట్ జనరేషన్ సూపర్‌స్టార్ అనిపించుకునేలానే నటించేశాడు.



దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ

ఎన్నో జీవిత కాలాలు వెనక్కి

''ఈ చిత్రం సతీసహగమనాన్ని ఏవిధంగానూ సమర్థించడం లేదు.'' అనే కార్డ్‌తో మొదలవుతుందీ సినిమా. అది సమర్థించాల్సిన విషయం కాదన్నది అందరూ ఒప్పుకోవాల్సిందే! మరి సినిమా ఏం చెప్తోంది? సమర్థించాల్సిన విషయం కాదన్న రోజు ఈకథ చెప్పాల్సిన అవసరం కూడా లేదు కదా? ఈ ప్రశ్నలు రాకుంటే సినిమా ఎలాగూ మెప్పించడానికి చాలా సెల్లింగ్ పాయింట్స్‌నే పెట్టుకుంది. వస్తేనే.. ఎన్నో జీవిత కాలాలు వెనక్కి వెళ్లిన, ఇప్పుడు చెప్పాల్సిన అవసరమే లేదన్న సినిమాగా కనిపిస్తుంది. మరోరకంగా ఆలోచిస్తే హిస్టారికల్ ఫిక్షన్‌లో ఇదిలా ఉండాలని కోరలేని అవసరంగా కూడా కనిపించొచ్చు!

రాజపుత్ర ఔన్నత్యాన్ని నిలబెట్టడానికి పూర్తి కంకణం కట్టుకుని తీసిన సినిమాలా అనిపిస్తుంది. దీన్ని బట్టి రాజపుత్ర కర్ణిసేన చేసిన నిరసన ప్రదర్శనలు ఎంత అర్థరహితమో అనిపిస్తుంది. ఏ వ్యక్తుల, కులాల, మతాల, జాతుల విశ్వాసాలను కించపరచడానికి ఈ సినిమా తీయలేదు అని ముందుగానే జాగ్రత్తగా ప్రకటించిన ఈ సినిమాలో నిజానికి గాయపడటానికి అవకాశం ఉన్న పాత్ర ఖిల్జీది మాత్రమే. ఒక దృశ్యంలో తన పేరులేని చరిత్ర పుటల్ని ఖిల్జీ చించేస్తాడు. ఖిల్జీ కోణంలోంచి చూస్తే గనుక ఈ సినిమా కూడా చిరిగిన పుటే. ఖిల్జీ పాత్రకు ఎక్కడా కూడా ఒక సానుకూల కోణాన్ని ఇవ్వలేదు. కొన్నిసార్లు కవిత్వాన్ని ఆస్వాదించినట్టూ, తానే స్వయంగా కవితలు అల్లినట్టూ చూపినప్పటికీ ఆ కవిత చెప్పగలగడానికి కారణమైన సున్నితత్వాన్ని ఏ దృశ్యంలోనూ చూపలేదు. అతడు మొదటినుంచీ లాలసుడే. రతన్‌సింగ్ మొదటి భార్య వ్యక్తిత్వంగానీ, రతన్‌సింగ్–పద్మావతి మధ్య అద్భుతమైన ప్రేమ పండినట్టుగానీ ఆవిష్కరణ జరగదు. దాంతో ఏ పాత్ర ఉద్వేగంతోనూ నడవడానికి ఆధారం దొరకదు. కానీ భన్సాలీ అన్ని సినిమాల్లాగే సాంకేతికంగా గ్రాండ్‌గా ఉంది. విజువల్లీ రిచ్. ఇది బాగా తీయబడిన సినిమాయేకానీ బాగా రాయబడిన సినిమా కాదు అనిపిస్తుంది. చివరి అరగంట సతీసహగమన ఘట్టంలో మాత్రం రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆ భారంతోనే సినిమాకు తెర పడుతుంది కాబట్టి సినిమా బాగుంది అనేలా చేస్తుంది. ●



రతన్ సింగ్ పాత్రలో షాహిద్ కపూర్

చెట్టు నీడ

అందరిలా ఎందుకు?

హోమీ జహంగీర్ బాబా ప్రసిద్ధ అణు భౌతిక శాస్త్రవేత్త. చిన్నప్పుడు సరిగ్గా నిద్ర పోయేవాడు కాదు. చదువులో పడి నిద్రపోకపోవడం కాదు... ఆలోచనల్లో పడి నిద్ర పోకపోయేవాడు! 'ఇక పడుకోరా..' అంటే నిద్ర రావడం లేదనేవాడు! డాక్టర్లు సమస్యేం లేదనేవాళ్లు. చివరికి స్పెషలిస్టు ఒకాయన కనిపెట్టి చెప్పాడు.. ''మీవాడి బ్రెయిన్ సూపర్ యాక్టివ్'గా పనిచేస్తోంది అని! అందుకే అదెప్పుడూ మేల్కొనే ఉంటోందనీ!

హోమీకి సైన్స్ అంటే ఇష్టం. అతడివన్నీ సైన్స్ చుట్టూ తిరిగే ఆలోచనలే. పిల్లవాడి ఇష్టాన్ని గ్రహించి, ఏకంగా ఇంట్లోనే ఒక గ్రంథాలయం ఏర్పాటు చేశారు పేరెంట్స్! పిల్లల్ని మనం ఎప్పుడూ మిగతా పిల్లల్తో పోల్చుకుంటూ ఉంటాం. అందరు పిల్లలూ ఉన్నట్లు వీడెందుకు ఉండడు? అని మథన పడుతుంటాం. అందరు పిల్లలూ ఎలా ఉంటారు? ఎలాగైనా ఉంటారు. ఒకేలా మాత్రం ఉండరు. అయితే.. మనం ఒకేలా ఉండే పిల్లల్ని మాత్రమే చూస్తాం. చక్కగా చదువుకునే పిల్లలు; వేళకు చదువుకుని వేళకు నిద్రపోయే పిల్లలు, పెట్టింది వద్దనకుండా, వదిలిపెట్టకుండా తినే పిల్లలు.. వీళ్లతో మనవాళ్లను పోల్చి చూసుకుంటాం. అప్పుడు మన పిల్లవాడేదో వెనకబడిపోతున్నాడనీ, ఆరోగ్యంగా లేడనీ, వీడి భవిష్యత్తు ఏమిటోనని కలత చెందుతాం. అంతే తప్ప తక్కిన పిల్లలకీ, మన వాడికీ మధ్య ఉన్న తేడాలను మాత్రం గమనించం. తేడాలను గమనించకుండా, పోలికలను మాత్రమే చూసుకుంటే కలిగే ఇబ్బందే ఇది.

పిల్లల్తో రోజూ కాసేపు కలసి కూర్చుంటే, కలసి మాట్లాడితే.. వాళ్లెంత భిన్నమైనవారో అర్థమౌతుంది.

హోమీ బాబా తల్లిదండ్రులు కూడా మొదట హోమీని ఇలాగే పోల్చి చూసుకున్నారు. డాక్టర్ చెప్పాక తేడాను గమనించి, పిల్లవాడిలోని ఆసక్తిని గమనించి అతడిని కావలసిన సదుపాయాలను అందించారు. హోమీ గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగాడు.

పిల్లలు ఎదక్కుండా పోరు. మన ఇష్టాలకు తగ్గట్లు వాళ్లను ఎదిగేలా చేయాలన్న తపనే మన బాధకు, పిల్లవాడి కష్టానికి కారణం అవుతుంటుంది. పిల్లల్తో రోజూ కాసేపు కలసి కూర్చుంటే, కలసి మాట్లాడితే.. వాళ్లెంత భిన్నమైనవారో అర్థమౌతుంది. ఆ భిన్నత్వానికి భిన్నంగా మనమెలా ఆలోచించి వాళ్లపై ఒత్తిడి తెస్తున్నామో తెలుస్తుంది.

('భారత అణు కార్యక్రమ పితామహుడు' హోమీ బాబా వర్ధంతి నేడు)

అవునా!

పని పెరిగితే జలుబు చేస్తుంది!

వానలో తడవడం, చల్లని వాతావరణంలో ఎక్కువగా గడపడం వంటి కారణాల వల్ల జలుబు చేసే అవకాశాలు ఉంటాయని అందరికీ తెలిసిందే. అయితే, పని ఒత్తిడి పెరిగినప్పుడు కూడా జలుబు చేస్తుందని తాజా పరిశోధనలో తేలింది. పని ఒత్తిడి మితిమీరినప్పుడు ముఖానికి చేరాల్సిన రక్తప్రసరణ దారిమళ్లి మెదడులోని న్యూరాన్లకు చేరుతుందని, దీని వల్ల ముక్కు చల్లబడి జలుబు చేస్తుందని ఇంగ్లాండ్‌లోని నాటింగ్‌హామ్ వర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు కొనుగొన్నారు. కొంతమంది వలంటీర్లను ఎంపిక చేసి, రకరకాల ఒత్తిడి స్థాయి గల కంప్యూటర్ గేమ్స్ వారితో ఆడించి, థెర్మల్ ఇమేజింగ్ కెమెరాల సాయంతో వారి శరీర ఉష్ణోగ్రతలలో మార్పులను వారు గుర్తించారు. ఎక్కువ ఒత్తిడి గల గేమ్స్ ఆడిన వారిలో ముఖం, ముక్కు భాగాల్లో ఉష్ణోగ్రత తగ్గిందని వారు వివరించారు. ముఖంలోని అవయవాలకు చేరాల్సిన రక్తప్రసరణ దారిమళ్లడం వల్లనే ఇలా జరుగుతుందని, ఇదే పరిస్థితి గంటల తరబడి కొనసాగితే ముక్కు చల్లబడి జలుబు చేస్తుందని తెలిపారు.



ఫ్రెష్ ఫుడ్

పచ్చగా... తాజాగా...



సాధారణంగా ఆకుకూరలు తెచ్చిన గంటకే వాడిపోతుంటాయి. అలా వాడిపోకుండా, తాజాగా ఉండేందుకు అనువుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ సంస్థ ఒక బాక్సుని కనిపెట్టింది. ఈ బాక్సులో 98 శాతం దాకా తేమ ఉంటుంది. అందువల్ల ఆకుకూరలు రెండు రోజుల పాటు సాధారణ గదిలో కూడా పాడవకుండా నిల్వ ఉంటాయి. ఈ బాక్సులోని సాంకేతికత ఆకుకూరలలోని పోషకాలు పోకుండా భద్రపరుస్తుంది. ఆకు కూరలను అప్పటికప్పుడు కోసినప్పుడు ఎంత తాజాగా ఉంటాయో, రెండు రోజుల తర్వాత కూడా అంతే తాజాగా ఉంటాయి. సుమారు 12– 15 కిలోల ఆకుకూరలు నిల్వ ఉంచుకోవచ్చు. బాక్సు ధర ఆన్‌లైన్‌లో 10 వేల రూపాయల వరకు ఉంది. వీటి తయారీలో మంచి నాణ్యత కలిగిన పాలిమర్‌ను ఉపయోగిస్తారు. అందువల్ల మామూలు ప్లాస్టిక్‌ల నుంచి వచ్చే వాసన వీటి నుంచి రాదు. ప్రాంతాలను బట్టి, ఎక్కువ వేడిమి ఉన్న ప్రాంతాలలో జెల్ ప్యాక్‌లను ఉపయోగించి 6 – 8 డిగ్రీల వరకు వేడిని తగ్గించవచ్చు. బావుంది కదూ.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
బుధవారం
24-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! మీరు లవర్స్‌కి ఇచ్చే సలహాలు చాలా బాగుంటాయి. నేను ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆమె కూడా నన్ను ఇష్టపడుతోంది. లైఫ్‌లో సెటిల్ అయ్యాక ఇంట్లో ఒప్పించి, పెళ్లి చేసుకుందాం అనుకున్నాం. బట్ నాకు తను రోజూ గుర్తుకొస్తోంది. చదువు మీద ధ్యాస పెట్టలేకపోతున్నా. ఏ పనీ సరిగ్గా చెయ్యలేక పోతున్నా. తను కూడా అదే ప్రాబ్లమ్‌ని ఫేస్ చేస్తోందట. ఏం చెయ్యాలో అర్థంకావడం లేదు. మీ సలహా కోసం ఎదురు చూస్తున్నా.

- ప్రకాశ్

మీది చాలా అందమైన ప్రాబ్లమ్..

'ప్రాబ్లమ్ కూడా అందంగా ఉంటుందా సార్..???'

ప్రేమ అందంగా ఉంటే, ప్రేమ ప్రాబ్లమ్ కూడా అందంగానే ఉంటుంది నీలాంబరీ..!

'ప్రేమ ఎప్పుడూ అందంగానే ఉంటుంది సార్.. కానీ, మీకు అబ్బాయిల ప్రేమే అసహ్యంగా అనిపిస్తూ ఉంటుంది. ఎందుకో అంత వివక్ష మీకు... అర్థం కాదు సార్!'

అబ్బాయి ప్రేమ దొరకకపోయినా బతకడం నేర్చుకున్నాడు...

చాలా ఈజీగా డిస్ట్రాక్ట్ అయిపోతాడు..

'డిస్ట్రాక్ట్ అంటే ఏంటి సార్??'

ఆంక్షలు తక్కువ ఉంటాయి కాబట్టి, ఏదో ఒకటి చేస్తూ ప్రేమ లేని లోటు..

ఆ లోటు కలిగించే విపరీతమైన బాధను కొద్దిగా తప్పించుకోగలుగుతాడు.

కానీ, అమ్మాయికి ప్రేమే ప్రపంచం అయిపోతుంది.

ఇంటా బయటా ఆంక్షలు కూడా ఎక్కువ అవడంతో...

ఒక ట్రాప్‌లో ఉండిపోతుంది. కుమిలిపోతుంది. కృంగిపోతుంది. అందుకే, అమ్మాయిల పక్షం తీసుకుంటాను. అబ్బాయిలు చెడ్డవారని కాదు.

'చాలా తెలివిగా తప్పించుకుంటారు సార్ మీరు... ప్రకాశ్‌కి సమాధానం చెప్పండి.'

ప్రేమను గుర్తు చేసుకోవడం కంటే...

'కంటే...?'

ప్రేమను గురిగా మార్చుకుని...

రాబోయే రోజుల్లో కలిసి ఉండే అందమైన జీవితాన్ని తలుచుకుంటూ..

గొప్ప వాళ్లు అవ్వండి ప్రకాశ్..! గాడ్ బ్లెస్ యు..!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాయుకో సుడోకు

5		3		7				
	9			6		1	7	
		2			1	8	9	5
1		4	8					
8	7						4	1
					4	7		8
2	4	5	7			3		
	8	1		5			2	
				4		5		9

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	4	5	8	1	9	2	3	6
6	8	1	3	4	2	7	9	5
2	3	9	5	7	6	1	4	8
1	7	8	4	9	5	3	6	2
4	9	2	6	3	8	5	7	1
5	6	3	7	2	1	4	8	9
8	1	7	9	5	4	6	2	3
9	2	4	1	6	3	8	5	7
3	5	6	2	8	7	9	1	4

ఇల్లే ఇండియా.. దిల్లే ఇండియా.. నీ తల్లే ఇండియా


అల్లు అర్జున్

"ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకునేలా 'సైనిక' సాంగ్ ఉంటుంది. రచయిత రామజోగయ్యశాస్త్రిగారు రాసిన సాంగ్ లిరిక్స్ విన్నప్పుడు ఒళ్లు పులకరించింది. రిపబ్లిక్ డే రోజున సైనికులకు నివాళిలా ఈ పాటను రిలీజ్ చేయనున్నాం. ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా 'నా పేరు సూర్య... నా ఇల్లు ఇండియా' సినిమా ఉంటుంది'' అన్నారు నిర్మాత లగడపాటి శ్రీధర్. అల్లు అర్జున్ హీరోగా రచయిత వక్కంతం వంశీ తొలిసారి దర్శకునిగా మారి రూపొందిస్తున్న సినిమా 'నా పేరు సూర్య... నా ఇల్లు ఇండియా'. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై కె. నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్నారు. 'బన్నీ' వాసు సహనిర్మాత. ఈ సినిమాలోని 'సైనిక' సాంగ్‌ను రిపబ్లిక్ డే సందర్భంగా రిలీజ్ చేయనున్నారు.


బన్నీ వాసు, లగడపాటి శ్రీధర్, రామజోగయ్య శాస్త్రి

"ఇల్లే ఇండియా.. దిల్లే ఇండియా.. నీ తల్లే ఇండియా'' అనే లిరిక్స్‌తో ఈ పాట ఉంటుందని హీరో అల్లు అర్జున్ పేర్కొన్నారు. నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ– "బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్–శేఖర్ మంచి సంగీతం ఇస్తున్నారు. ఈ సినిమాలో బన్నీ బాడీ లాంగ్వేజ్ సూపర్‌గా ఉంటుంది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఓ రొమాంటిక్ సాంగ్‌ను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం పీటర్ హెయిన్ సారథ్యంలో ఫైట్ సీన్స్‌ను తెరకెక్కిస్తున్నాం. ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను చూస్తుంటే సాంగ్ టీజర్‌లా.. ఫైట్ టీజర్‌లను రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందా? అని ఆలోచిస్తున్నాను. సినిమాలో ఫైట్స్ హైలైట్‌గా ఉంటాయి. ప్రస్తుతం తీస్తున్న ఇంటర్‌వెల్ బ్యాంగ్ ఫైట్ తర్వాత మరో నెలరోజుల పాటు షూటింగ్ జరిపితే సినిమా కంప్లీట్ అవుతుంది. ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ– "భరతమాతకు సైనికులు వందనం చేస్తారు. కానీ సైనికులకు వందనం చేసేలా ఈ సినిమాలోని 'సైనిక' సాంగ్ ఉంటుంది. వారి త్యాగాలు, కష్టనష్టాలను తెలియజేసేలా ఉంటుంది. టైటిల్ పవర్‌ఫుల్‌గా ఉంది. వక్కంతం వంశీ కథలు అందించిన సినిమాలు బ్లాక్ బస్టర్స్‌గా నిలిచాయి. వంశీకి దర్శకునిగా ఇది ఫస్ట్ సినిమా అయినప్పటికీ ఎంతో అనుభవం ఉన్నవారిలా తెరకెక్కిస్తున్నాడు. ఈ చిత్రానికి నాలుగు పాటలు రాశాను. సాంగ్స్ సందర్భానుసారంగానే ఉంటాయి'' అన్నారు.

ఆ ప్రశ్న ప్రభాస్‌నే అడగండి!


ప్రభాస్

"మ్యాచ్‌లు కచ్చితంగా ఆడతాను. కానీ ఎప్పుడన్నది చెప్పలేను'' అంటున్నారు శ్రద్ధా కపూర్. బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ బయోపిక్‌లో శ్రద్ధా కపూర్ నటించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లడం లేదన్న ఊహాగానాలు ఈ మధ్య ఊపందుకున్నాయి. "ప్రస్తుతం 'సాహో' సినిమాతో బిజీగా ఉన్నాను. నేను నటిస్తోన్న హిందీ సినిమా 'స్త్రీ' షూటింగ్ చందేరిలో జరుగుతోంది. నా కెరీర్‌లో ఫస్ట్ టైమ్ చేస్తోన్న హారర్ సినిమా ఇది. సైనా నెహ్వాల్ బయోపిక్ తప్పకుండా సెట్స్‌పైకి వెళుతుంది. కానీ ఎప్పుడన్నది ఎగ్జాట్‌గా చెప్పలేను'' అని శ్రద్ధా కపూర్ చెప్పారని బీటౌన్ సమాచారం. 'సాహో' చిత్రంలో తన కో–స్టార్ ప్రభాస్ గురించి మాట్లాడుతూ –"ప్రభాస్ సూపర్ యాక్టర్ మాత్రమే కాదు.. మంచి హ్యూమన్ బీయింగ్ కూడా'' అన్నారు. మరి.. ప్రభాస్ పెళ్లి గురించి మీకేమైనా తెలుసా? అని బీ టౌన్ మీడియావారు అడగ్గా.. "నాకు తెలీదు. ఈ ప్రశ్న ప్రభాస్‌నే అడగండి'' అని నవ్వుతూ అన్నారట.

ప్రభాస్ సరసన అర్షిఖాన్?

అర్షిఖాన్... హిందీ బిగ్‌బాస్ లెవెన్త్ ఎడిషన్ షోలో పాల్గొనడం ద్వారా పాపులర్ అయ్యారు. అంతేకాదు ఓ ప్రముఖ చానెల్‌లో ఓ ప్రోగ్రామ్‌కి ఆమె గెస్ట్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పుడు అర్షిఖాన్ గురించి ఇంతగా ఎందుకు అంటే.. ప్రభాస్ సినిమాలో చాన్స్ కొట్టేశానని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. "ప్రభాస్ నటించనున్న సినిమాకు సైన్ చేశాను. చాలా హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు అర్షిఖాన్. అది ఏ సినిమా అని మాత్రం ఆమె చెప్పలేదు. ప్రభాస్ బాలీవుడ్‌లో చేయబోయే నెక్ట్స్ సినిమాకా? లేక ఆల్రెడీ చేస్తున్న 'సాహో'లో కీలక పాత్రకా? అనేది తెలియాల్సి ఉంది. ఇంకో ఇంట్రెస్టింగ్ మేటర్ ఏంటంటే.. ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో గతేడాది గూగుల్ సెర్చ్‌లో సన్నీ లియోన్ తర్వాత మోస్ట్ సెర్చింగ్ పర్సన్ అర్షిఖాన్‌నే కావడం విశేషం.


అర్షి ఖాన్


శ్రద్ధాకపూర్

టీమ్ ఇండియా కెప్టెన్‌గా...


దుల్కర్

... మీరు చదివింది నిజమే.. దుల్కర్ సల్మాన్ టీమ్ ఇండియా కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నారు. హీరో క్రికెట్ జట్టు కెప్టెన్ అవడమేంటి? అనుకుంటున్నారా? దుల్కర్ భారత జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనుంది రీల్ లైఫ్‌లో. ఆకాశ్ ఖురానా దర్శకత్వంలో దుల్కర్ నటిస్తోన్న తొలి బాలీవుడ్ చిత్రం 'కర్వాన్'. ఈ సినిమా తర్వాత అభిషేక్ శర్మ దర్శకత్వంలో మరో హిందీ సినిమాలో నటించే అవకాశం దక్కించుకున్నారు దుల్కర్. 1983లో ఇండియా అందుకున్న తొలి ప్రపంచకప్ నేపథ్యంలో 2008లో అనూజా చౌహాన్ రచించిన 'ది జోయా ఫ్యాక్టర్' అనే నవల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించనున్నారు. ఈ సినిమాలో టీమ్ ఇండియా కెప్టెన్‌గా నటించే అవకాశం దుల్కర్‌కి దక్కింది. సోనమ్ కపూర్ దుల్కర్‌కి జోడీగా నటించనున్నారని బీ టౌన్ టాక్. 'ఓకే బంగారం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన దుల్కర్ సల్మాన్ తాజాగా 'మహానటి' చిత్రంలో దివంగత జెమినీ గణేశన్ పాత్రలో నటించిన విషయం తెలిసిందే.

ప్రేమకథ షురూ

యస్... హల్‌చల్ చేసిన వార్తలు నిజమయ్యాయి. జీవితారాజశేఖర్ దంపతుల ముద్దుల తనయ శివానీ తొలి సినిమా గురించి అధికారిక ప్రకటన వచ్చేసింది. హిందీలో ఘనవిజయం సాధించిన '2 స్టేట్స్' రీమేక్ ద్వారా శివానీ కథానాయికగా పరిచయం కానుంది. అడవి శేష్, శివానీ జంటగా నటించనున్నారు. వెంకట్ రెడ్డి దర్శకత్వంలో లక్ష్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎం.ఎల్.వి.సత్యనారాయణ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది."శివానీ తొలి చిత్రం కోసం ఎన్నో కథలు విన్నప్పటికీ నటనకు మంచి ఆస్కారం ఉండటంతో '2 స్టేట్స్'ని సెలెక్ట్ చేసుకున్నారు. బ్యూటిఫుల్ లవ్ అండ్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రముఖ దర్శకుడు వినాయక్ దగ్గర వెంకట్ రెడ్డి అసోసియేట్‌గా చాలా చిత్రాలకు పనిచేశారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు చిత్రబృందం. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎం.ఎస్.కుమార్.

వెంకీలా ఉండాలని అప్పుడే అనుకున్నా

- విక్రమ్

"విక్రమ్ నాకు మంచి స్నేహితుడు. చిన్న స్థాయి నుంచి పెద్ద స్టార్‌గా ఎదిగారు. 25 ఏళ్ల క్రితం తనని కలిసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. ఇండస్ట్రీకి మంచి సినిమాలు అవసరం. మంచి చిత్రాలు రాకుంటే ప్రేక్షకులు థియేటర్స్‌కు రారు. 'స్కెచ్' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అన్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. విక్రమ్, తమన్నా జంటగా విజయ్ చందర్ దర్శకత్వంలో కలైపులి ఎస్. థాను నిర్మించిన చిత్రం 'స్కెచ్'. తమిళంలో హిట్ టాక్‌తో దూసుకెళుతున్న ఈ చిత్రాన్ని అదే పేరుతో సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై డి.సురేశ్‌బాబు తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సినిమా ప్రచార చిత్రాలు రిలీజ్ చేశారు. విక్రమ్ మాట్లాడుతూ –"బంగారు కుటుంబం' షూటింగ్‌లో నేను ఓ పక్కన నిలబడి ఉంటే, వెంకటేశ్‌గారు పిలిచి మరీ నాతో బాగా మాట్లాడారు. నేను పెద్ద హీరో అయినా ఆయనలా ఉండాలని ఆ రోజే అనుకున్నా. ఇక 'స్కెచ్' విషయానికొస్తే.. కథ వినగానే థ్రిల్ అయ్యాను. కమర్షియల్ టైప్‌లో సాగే థ్రిల్లర్ మూవీ ఇది. చిన్న మెసేజ్ కూడా ఉంటుంది. వరుసగా విభిన్నమైన సినిమాలు చేస్తున్న నేను దాదాపు పదిహేనేళ్ల తర్వాత కమర్షియల్ మూవీ చేశా. ఇందులో పాత విక్రమ్‌ని చూస్తారు'' అన్నారు. "విక్రమ్ నుంచి చాలా విషయాలను నేర్చుకున్నా '' అన్నారు తమన్నా. "తమిళంలోలానే తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు విజయ్‌చందర్.


తమన్నా, విక్రమ్



అడవి శేష్

శివాని

ఆస్కార్ బరిలో ఎవరెవరో తెలుసా?







90వ ఆస్కార్ అవార్డ్స్ బరిలో పోటీపడే సినిమాలు, నటీనటులు, టెక్నీషియన్లు ఎవరో మంగళవారం తెలిసిపోయింది. ఆస్కార్ అవార్డ్స్ అందించే అకాడమీ అవార్డ్స్ సంస్థ అధికారికంగా నామినేషన్స్‌ని ప్రకటించింది. 'ది షేప్ ఆఫ్ వాటర్' 13 నామినేషన్లు దక్కించుకోగా, 'డంకర్క్' ఎనిమిది విభాగాల్లో, 'త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి' ఏడు విభాగాల్లోనూ నామినేషన్ దక్కించుకున్నాయి. ఈసారి 'సినిమాటోగ్రఫీ' విభాగంలో ఛాయాగ్రాహకురాలు రేచెల్ మారిసన్‌కి నామినేషన్ దక్కడం విశేషం. ఈ విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి మహిళ ఆవిడే. ఇక.. నామినేషన్ జాబితా చూద్దాం.


రేచెల్

ఉత్తమ చిత్రం

కాల్ మీ బై యువర్ నేమ్, డార్కెస్ట్ అవర్, డంకర్క్, గెట్ అవుట్, లేడీ బర్డ్, ఫాంథమ్ థ్రెడ్, ది పోస్ట్, ది షేప్ ఆఫ్ వాటర్, త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి. ఉత్తమ చిత్రం విభాగంలో ఈ తొమ్మిదీ నామినేషన్ దక్కించుకున్నాయి.

ఉత్తమ నటుడు

టిమోథ్ చలామెట్ (కాల్ మీ బై యువర్ నేమ్), డానియెల్ డూ–లెవిస్ (ఫాంథమ్ థ్రెడ్), డానియెల్ కలూయా, (గెట్ అవుట్,) గ్యారీ ఓల్డ్‌మేన్ (డార్కెస్ట్ అవర్), డెంజెల్ వాషింగ్టన్, (రోమన్ జో ఇజ్రాయెల్ ఎస్క్యూ).

ఉత్తమ నటి

సాలీ హాకిన్స్ (ది షేప్ ఆఫ్ వాటర్), ఫ్రాన్సెస్ మెక్ డోర్‌మాండ్, (త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి), మార్కెట్ రాబీ (ఐ, టోన్యా), సాయోర్స్ రోనన్ (లేడీ బర్డ్), మెరిల్ స్ట్రీప్ (ది పోస్ట్).

ఉత్తమ దర్శకుడు

పాల్ థామస్ అండర్‌సన్ (ఫాంథమ్ థ్రెడ్), గిలియర్మో దెల్‌తొరొ (ది షేప్ ఆఫ్ వాటర్), గ్రెటా గెర్‌విగ్ (లేడీ బర్డ్), క్రిస్టోఫర్ నోలన్ (డంకర్క్), జోర్డాన్ పీలే (గెట్ అవుట్).

ఇంకా ఇతర విభాగాల్లో నామినేషన్స్‌ను ప్రకటించారు. మార్చి 4న ఆస్కార్ అవార్డు వేడుక జరగనుంది. మరి.. అవార్డులు అందుకునేదెవరో వేచి చూద్దాం.

ఇలా కనిపించి అలా మాయం!


ప్రియాంకా చోప్రా

ఆస్కార్ అవార్డ్స్ నామినేషన్స్‌ని హాలీవుడ్ ప్రముఖులతో పాటు మన ప్రియాంకా చోప్రా కూడా ప్రకటించాల్సి ఉండగా అది జరగలేదు. నటుడు–దర్శకుడు ఆండీ సెర్కిస్, నటి టిఫ్ఫనీ హ్యాడిష్ నామినేషన్స్ ప్రకటించారు. ప్రియాంకా చోప్రా ఒక వీడియో ద్వారా ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగంలో నామినేషన్ దక్కించుకున్న వారి గురించి పేర్కొన్నారు. అంతే.. అదే వీడియోలో సల్మా హయక్, మిచెల్లీ రోడ్రిగ్యూజ్, రెబెల్ విల్సన్ వంటి హాలీవుడ్ స్టార్స్ ఉన్నారు. కాగా, ప్రియాంకా చోప్రా సన్ డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో బిజీగా ఉన్నారు. 'బేవాచ్' తర్వాత ఆమె హాలీవుడ్‌లో మరో చిత్రం చేస్తున్నారు. 'ఎ కిడ్ లైక్ జేక్' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని ప్రమోట్ చేయడానికే ఆమె అక్కడికి వెళ్లారు. ఈ ఫెస్టివల్ యూఎస్‌లో జరుగుతోంది. నామినేషన్స్ ప్రకటించింది కూడా యూఎస్‌లోని లాస్ ఏంజిల్స్‌లోనే. కాకపోతే సన్ డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతున్నది న్యూయార్క్‌లో. అక్కణ్నుంచి లాస్ ఏంజిల్స్‌కి ఫ్లైట్‌లో వెళ్లినా కనీసం ఐదు గంటలు పడుతుందట. ఆ టైమ్ కేటాయించలేక నామినేషన్ అనౌన్స్‌మెంట్‌కి ప్రియాంక వెళ్లలేకపోయారని తెలుస్తోంది. అందుకే, వీడియోను విడుదల చేశారని సమాచారం. ఆ వీడియోలో ఇలా కనిపించి అలా మాయమయ్యారు ప్రియాంక.

తగ్గారు.. పెంచారు!

మోహన్‌లాల్ ఏజ్ ఇప్పుడు ఫిఫ్టీ ప్లస్ అంటే నమ్మలేమేమో. అంతలా న్యూ లుక్‌లోకి మారారాయన. సినిమాల పట్ల మా సూపర్ స్టార్‌కి అంత డెడికేషన్ అని మోహన్‌లాల్ అభిమానులు అంటున్నారు. 'ఒడియమ్' సినిమా కోసం ఆయన తగ్గిన విషయం తెలిసిందే. ఈ లుక్ షూటింగ్ పూర్తయ్యే వరకూ మోహన్‌లాల్ వేరే సినిమా ఒప్పుకోరేమో అని కొంతమంది ఊహించారు. అలాంటిదేం లేదు. ఓ కొత్త సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. బాలీవుడ్ దర్శకుడు అజయ్ వర్మ దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించనున్న తాజా సినిమా షూటింగ్ మంగళవారం ముంబైలో మొదలైంది. "అజయ్ వర్మ డైరెక్షన్‌లో రూపొందుతున్న నా కొత్త సినిమా షూటింగ్ కోసం ముంబైలో ఉన్నాను. ఈ యాక్షన్ అండ్ అడ్వెంచర్ ఫిల్మ్‌లో సెంట్రల్ క్యారెక్టర్‌లో నటించబోతున్నందుకు థ్రిల్లింగ్‌గా ఉంది'' అని పేర్కొన్నారు మోహన్‌లాల్. ఈ సినిమా, 'ఒడియన్' కాకుండా ఆల్రెడీ 'కయ్యాకులమ్ కొచ్చిన్' చిత్రంలో మోహన్‌లాల్ నటిస్తున్నారు. ఏదేమైనా బరువు తగ్గిన మోహన్‌లాల్ వరుసగా సినిమాలు కమిట్ అవుతూ జోరు పెంచారనిపిస్తోంది కదూ!


మోహన్‌లాల్

పరి పరిశోధన

బంగారు రేణువులను
ముద్దలు చేస్తుంది...


సూక్ష్మ ప్రపంచం.. అదేనండీ... బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లతో కూడినది ఓ వింతల లోకం. అదెలా అనే ప్రశ్నకి క్వీన్స్‌ల్యాండ్ శాస్త్రవేత్తలు సమాధానం చెబుతున్నారు. బంగారు రేణువులను హరాయించుకుని ముద్దలుగా మార్చేసే సరికొత్త బ్యాక్టీరియాను వీరు గుర్తించారు మరి! అయితే ఏంటి? అన్న ప్రశ్నకు సమాధానం కావాలంటే మీ స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ల వైపు ఒక్క చూపు చూసేయండి.



దాంట్లో ఉండే అతితక్కువ మోతాదు బంగారం, ఇతర విలువైన ఖనిజాల కోసం అనేక మంది రోగాలబారిన పడుతున్నారు. అంతే కాదు.. బంగారు గనుల్లో టన్నులకొద్దీ మట్టి తవ్వి తీస్తే వచ్చే బంగారం గ్రాముల్లోనే! ఈ కొత్త బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందనుకోండి. ఈ రెండు అంశాల్లోనూ గణనీయమైన మార్పు వస్తుంది. పాత, వాడి పడేసిన సర్క్యూట్ బోర్డుల నుంచి ఇవే ఎంచక్కా సువర్ణాన్ని వెలికితీసి ఇస్తాయి. గనుల విషయంలోనూ అధిక లాభాలు పొందేందుకు అవకాశమేర్పడుతుంది. ఈ మధ్యే కనుక్కొన్న ఈ బ్యాక్టీరియా ప్రస్తుతానికి కొంచెం నెమ్మదిగానే పనిచేస్తోంది గానీ.. కొన్ని మార్పులు చేర్పులు చేయడం ద్వారా వేగం పెంచడం కష్టం కాకపోవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు. 2016 నాటి లెక్క ప్రకారం.. కంప్యూటర్లు, టెలివిజన్లు, స్మార్ట్‌ఫోన్లలో దాగి ఉన్న మొత్తం బంగారం విలువ లక్ష కోట్ల రూపాయల పైమాటే కావడం కొసమెరుపు!

కార్బన్‌తో
కాలుష్యం లేని విద్యుత్తు...

భూమి పొరల్లో దాగిన బొగ్గుతో పాటు.. అన్నిరకాల సేంద్రియ పదార్థాలతో కాలుష్యం ప్రమాదం లేకుండానే బోలెడంత విద్యుత్తును తయారుచేసేందుకు ఇడాహో నేషనల్ లేబొరేటరీ (అమెరికా) శాస్త్రవేత్తలు వినూత్నమైన ఫ్యూయల్‌సెల్‌ను ఆవిష్కరించారు. గతంలోనూ ఇలాంటి డైరెక్ట్ కార్బన్ ఫ్యూయల్ సెల్స్ ఉన్నప్పటికీ వాటితో పోలిస్తే తాము అభివృద్ధి చేసిన కొత్త ఫ్యూయల్ సెల్ ఎంతో సమర్థవంతమైందని డాంగ్ డింగ్ అనే శాస్త్రవేత్త తెలిపారు.



అతితక్కువ ఉష్ణోగ్రతలోనే ఎక్కువ మోతాదులో శక్తిని విడుదల చేయడం దీనికున్న ప్రత్యేకతల్లో రెండు మాత్రమేనని, బొగ్గుతోపాటు సేంద్రియ వ్యర్థాలన్నింటితోనూ విద్యుత్తును ఉత్పత్తి చేయగలగడం ఇంకో విశేషమని వివరించారు. సీరియం ఆక్సైడ్‌తో పాటు పింగాణీ పదార్థంతో తయారైన ఐనోడ్‌లు ఇందుకు కారణమని చెప్పారు. ఈ ఫ్యూయల్ సెల్ ద్వారా స్వచ్ఛమైన బొగ్గుపులుసు వాయువు మాత్రమే విడుదలవుతుంది కాబట్టి దాన్ని కూడా వాతావరణంలోకి చేరకుండా అక్కడికక్కడే నిల్వ చేసుకునేందుకు లేదంటే వాణిజ్యస్థాయిలో వాడుకునేందుకు అవకాశముంటుందని డింగ్ తెలిపారు. ఒక్కమాటలో చెప్పాలంటే... బొగ్గును వాడుకున్నా ఏమాత్రం కాలుష్యం లేకుండా అధిక విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ఈ ఫ్యూయల్‌సెల్ ఉపయోగపడుతుందన్నమాట. కార్బన్‌డయాక్సైడ్‌ను నిల్వ చేసుకునే అవకాశం ఉండటం అదనపు లాభం.

అడవి వరి..
తీరుస్తుందా ప్రపంచం ఆకలి?

ఆస్ట్రేలియాలో ఇటీవల గుర్తించిన పురాతన వరి వంగడాలకు అద్భుతమైన లక్షణాలు ఉన్నాయని, పెరుగుతున్న అవసరాలను తీర్చేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయని అంటున్నారు క్వీన్స్‌ల్యాండ్ అలయన్స్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ఇన్నోవేషన్‌కు చెందిన శాస్త్రవేత్త రాబర్ట్ హెన్రీ.



వాతావరణ మార్పుల ప్రభావంతో పంట దిగుబడులు తగ్గిపోతాయన్న ఆందోళనలు వినిపిస్తున్న తరుణంలో... కరువు కాటకాలను తట్టుకోవడమే కాకుండా.. ఎక్కువ దిగుబడులు ఇవ్వగల లక్షణాలున్న వరి వంగడాలు ఎంతో ఉపయోగపడతాయన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో హెన్రీ ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తల బృందం ఉత్తర ఆస్ట్రేలియా ప్రాంతంలోని కొన్ని అడవి వరి మొక్కలను పరిశీలించింది. వీటిల్లో కనీసం రెండింటికి మంచి లక్షణాలు ఉన్నట్లు గుర్తించింది. ఇవి సంప్రదాయ వరి వంగడాలతో సంకరం చేసేందుకు అనువుగా ఉన్నాయని, అగ్గితెగులుతోపాటు, బ్యాక్టీరియల్ లీఫ్ స్పాట్ తెగులును కూడా తట్టుకోగలవని హెన్రీ తెలిపారు. అడవి వంగడాలు మంచి పోషక గుణాలు కలిగి ఉన్నాయని, అమైలోజ్ ఎక్కువగా ఉండటం వల్ల తేలికగా జీర్ణం కావడంతోపాటు కడుపు/పేగుల్లో ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియా పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు.

సంప్రదాయం - సైన్స్

తాంబూలం గొప్పతనం ఏమిటి?



మన సంస్కృతిలో తాంబూలానికి (తమలపాకు)కు ఎంతో ప్రాధాన్యం ఉంది. దేవుళ్లకి తమలపాకులు తప్పకుండా అర్పిస్తాము. వివిధ శుభ కార్యాలు, నోములు, వ్రతాలు, జరిగినప్పుడు తాంబూలం ఇవ్వడం తప్పనిసరి . తమలపాకులను ఇలా ఇవ్వడం వలన శుభం చేకూరుతుంది.

ఆధ్యాత్మిక విషయాలను పక్కన పెడితే, తమలపాకు మన ఆరోగ్యానికి చాలా మేలుచేస్తుంది. ఎముకలకు మేలు చేసే ''ఎ'' , ''సి'' విటమిన్ లు, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ తమలపాకులో పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా తాంబూలంలో రోగ నిరోధక శక్తిని పెంచే అద్భుత శక్తి ఉంది. తమలపాకులో వుండే పీచు పదార్థం జీర్ణ వ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ● షడ్రసోపేతమైన భోజనం చేశాక పచ్చ కర్పూరం, లవంగాలు, యాలకులు, సోంపు కలసిన తాంబూలం వేసుకుంటే, తిన్న ఆహారం తొందరగా వంటికి పడుతుంది. ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. ● పాము విషంతో సహా అనేకరకాలయిన విషాలను హరించగల ఔషధ గుణాలు తమలపాకుకి ఉన్నాయట. చిన్న పిల్లలకి జలుబు చేసినపుడు తమలపాకు రసం ఒకటి రెండు చుక్కలు పాలతో రంగరించి ఇస్తే జలుబు, దగ్గు దూరమవుతాయి. తమలపాకుతో సున్నం కలిపి వేసుకొంటే శరీరంలో కాల్షియం సమపాళ్ళలో ఉండేలా చూస్తుంది. ఎముకలు అరిగిపోకుండా చూస్తుంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం
24-1-2018

నేను నా దైవం



డా.బి.వి.పట్టాభిరామ్

మెజీషియన్, సైకాలజిస్ట్ డా.బి.వి.పట్టాభిరామ్ క్లినిక్‌కి వెళ్లినప్పుడు ఎదురుగా బోర్డుమీద 'యు ఆర్ ది డిజైనర్ ఆఫ్ యువర్ డెస్టినీ' (నీ తలరాతకి నువ్వే సృష్టికర్తవు) అనే అక్షరాలు ఆకట్టుకున్నాయి. ఈ మధ్య అతి చిన్న చిన్న సమస్యలే పెద్దవి అయిపోయాయి. మనుషులు మనస్తత్వాలు మరీ సున్నితమైపోయాయంటూ సబ్జెక్ట్‌లోకి వెళ్లిపోయారు పట్టాభిరామ్. సైకాలజీలో ఇటీవల రెండో పీహెచ్‌డీ వచ్చిందని ఆనందంగా వివరించిన ఆయన 'నా వృత్తే నాకు దైవం' అంటూ చెప్పుకొచ్చారు...

మనుషులకు మంచి విషయాలు చెప్పడానికి
పట్టాభిరామ్ ఇంద్రజాలాన్ని వాడుతారు
అలా సమాజంలో అనుబంధాలను, ఆప్యాయతలను,
అనురాగాలను పెంపొందించే కృషి చేశారు.
మంచి చెప్పడానికి ఇంద్రజాలాన్ని వాడినప్పుడు
దైవత్వాన్ని అనుభూతి చెందడానికి
దేవజాలమే కరెక్ట్ మేజిక్ ఏమో కదా!

దేవ జాలం

◆ దేవుడి గొప్పతనం మీకు మొదటిసారిగా ఎప్పుడు అర్థమైంది?

(చిన్నగా నవ్వుతూ) నాకు దేవుడి గొప్పతనం కంటే ముందు మనిషి గొప్పతనం అర్థమైంది.

◆ వివరంగా చెబుతారా?

నా చిన్నప్పుడు ఓసారి మా ఇంట్లో అంతా జాతకం చూపించుకుంటూ నా జాతకమూ చూపించారు. జ్యోతిష్యుడు నా జాతకం చూసి 'వీడికి అక్షరమ్ముక్క అబ్బదు. ఈ కుటుంబంలో వీడు మహాదరిద్రుడు అవుతాడు. పైగా 16 ఏళ్ళకు మించి బతకడు' అని చెప్పాడు. భయపడిపోయాను. మా అమ్మ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాను. ఆవిడ ఆ మాటను కొట్టి పడేస్తూ 'ఒరే... మా నాన్న 80 ఏళ్లు బతికాడు. నువ్వూ అన్నేళ్లు బతుకుతావు. నీకు ఆయన గుణాలే వచ్చాయి. దిగులు పడకు' అంది. ఇప్పుడు నా వయసు 66 ఏళ్లు. అమ్మ ఆ రోజు నన్ను అలా 'మోటివేట్' చేయకపోతే ఆ దిగులు నాలో అలాగే పడిపోయేదేమో. మనిషి గొప్పతనం మనిషి చేయగల మేజిక్ అప్పుడే నాకు అర్థమైంది.

◆ మరి దేవుడెప్పుడు తెలిశాడు?

నేను టెన్త్ పాసయ్యాక మా అమ్మ తిరుపతి తీసుకెళ్లింది. గుండు చేయించుకోమంది. నేను చేయించుకోనన్నాను. 'తప్పు, నేను దేవుడికి మొక్కుకున్నాను. మొక్కు తీర్చుకోవాల్సిందే. మొక్కు తీర్చుకోకపోతే దేవుడు శిక్షిస్తాడు' అంది. నిజమే అనుకొని 'టోపీ కొనిస్తే గుండు చేయించుకుంటా'నని చెప్పాను. గుండు చేయించుకున్నాను. టోపీ పెట్టుకున్నాను. తిరిగి వస్తుండగా మా నాన్న నన్నే చూస్తూ 'టోపీ ఎందుకు పెట్టుకున్నావురా.' అన్నాడు. 'అంతా నన్నే చూస్తున్నారు సిగ్గుగా ఉంది' అన్నాను. 'అంటే నీ మీద నీకు విశ్వాసం లేదన్నమాట. అమ్మ చెప్పింది కదా అని చేయించుకున్నావు. పైగా దేవుడు శిక్షిస్తాడు అంది కదా. శిక్షించేవాడు దేవుడెలా అవుతాడురా. గుండు చేయించుకోవడం అంటే ఆకర్షణ కారణంగా వచ్చిన అహాన్ని దూరం చేసుకున్నానని చెప్పడానికి సూచిక. అదేదో తప్పు అయినట్టు దాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నావు. ఇదెందుకు సిగ్గుపడే పని అయింది చెప్పు' అన్నాడు. వాస్తవం అనిపించింది. టోపీ తీసి రోడ్డు మీదకు విసిరేశాను. మూఢంగా నమ్మడం అప్పటి నుంచే మానేశాను. లాజికల్‌గా ఆలోచించడం మొదలుపెట్టాను. అమ్మా నాన్నలు బిడ్డకు జన్మనివ్వడమే కాదు మంచి చెడులను చెప్పి జీవితంలో ఎదిగేందుకు చేయూతనిచ్చే దేవతలు. అమ్మనాన్నలను మించిన దేవతలు లేరు నాకు. ఆ తర్వాత నన్ను నిలబెట్టిన ఈ వృత్తి నాకు దైవం కన్నా ఎక్కువ.

◆ ఇంటి కన్నా గుడి పదిలం అన్నారు పెద్దలు. మీరు చెబుతున్నది చూస్తే గుడి కన్నా ఇల్లు పదిలం అన్నట్టుంది?

మా అమ్మనాన్నలకు 15 మంది సంతానం. 11 మంది అన్నదమ్ములం. నలుగురు అక్కచెల్లెళ్లు. వాళ్లు అంతమందిని ఎలా పెంచారో తలుచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యమే. మా నాన్న తిట్టడం, కొట్టడం చూళ్లేదు నేను. కొన్ని నియమాలు మాత్రం కఠినంగా ఉండేవి. అందరం ఒకేసారి కూర్చొని భోజనం చేయాలి, రాత్రి 9కి అందరూ పడుకోవాలి. కలిసి పంచుకొని తినడంలో ఆనందం, కంటి నిండా నిద్రపోవడంలో ఆరోగ్యం ఆయన నుంచి మేం నేర్చుకున్నాం. మా ఇంట్లో అందరూ కళాకారులే. నాకు మేజిక్ కళ అబ్బినట్టే అందరికీ ఒక్కో కళలో ప్రవేశం, ప్రావీణ్యం ఉన్నాయి. ఇప్పటికీ ప్రతి రెండవ శనివారం అందరం ఒకచోట కలుస్తుంటాం. ఆ రోజు మాకు పెద్ద పండగ. ఏ ఒక్కరు మిస్ అయినా వాళ్లేదో పోగొట్టుకున్నట్టు ఫీల్ అవుతుంటారు. ఈ రోజుల్లో ఇంట్లో ఉండేది ఇద్దరో, ముగ్గురో.. అయినా ఒకరినొకరు మాట్లాడుకోరు. ఫోన్లలో చాట్ చేస్తూనో, టీవీ చూస్తూనో గడిపేస్తారు. మాట్లాడుకోవాలి, ఏది మాట్లాడకూడదో తెలుసుకొని ఆచరించాలి, కలిసి భోజనం చేయాలి, కుటుంబంలో అందరి మధ్య స్పర్థ ఉండాలి, ప్రశంస ఉండాలి, నవ్వు ఉండాలి.. ఇవి లేకనే బయటివారితో తమ ఆనందాలను వెతుక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ఇళ్లను వదిలి గుళ్లు, గోపురాలలో కాలక్షేపం చేస్తున్నారు.

◆ మిమ్మల్ని మీరు హిప్నటైజ్ చేసుకుంటారా?

ప్రతి రోజూ హిప్నటైజ్ చేసుకుంటాను. మనల్ని మనం తెలుసుకోవడం అవసరం. పాజిటివ్ ఆలోచనలు ఎంత పెంచుకుంటే అంత ప్రశాంతమైన జీవితం మనదవుతుంది. చెడు నన్ను పట్టుకుందా దాన్ని శుభ్రం చేసుకుంటాను. మంచి ఎక్కడైనా ఉందా అది తీసుకుంటాను. ఈ విధానంలో గొప్ప ప్రశాంతత చేకూరుతుంది.

> **◆ దేవుడి సైకాలజీ ఏమిటి?**
>
> ప్రశాంతంగా ఉండటమే దేవుడి సైకాలజీ అనిపిస్తుంది. ప్రశాంతంగా ఉండే స్థలంలోనే కదా దేవుడు ఉంటాడు. మరి ఆ దేవుడిని పూజించే మనం ప్రశాంతంగా ఉంటున్నామా? చాలా మంది ఫ్యామిలీ ఇష్యూస్‌తో మా వద్దకు వస్తుంటారు. చెప్పిన మాట పిల్లలు వినడం లేదనో, భార్యాభర్తల బంధం సరిగా లేదనో.. అన్నీ కంప్లైంట్సే. చాలా చిన్న చిన్న విషయాలు పెద్ద పెద్ద మనస్పర్థలుగా మారి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. అశాంతికి విరుగుడు ప్రశాంతత అని అర్థం చేసుకోవాలి.
>
> **◆ దేవుడికి కష్టం చెప్పుకోవచ్చా?**
>
> దేవుడికి కష్టం చెప్పుకుంటారు బానే ఉంది. వింటున్నాడనే నమ్మకం ఉందా. అలా అని నమ్ముతున్నారా? మరి మా దగ్గరకు వచ్చే జనం రోజు రోజుకూ పెరుగుతున్నారు ఎందుకు? అందుకే, మనం మనుషులతోనే మాట్లాడాలి. మనవాళ్లతో మనం మాట్లాడాలి. మన చుట్టూ ఉన్నవాళ్లతో మాట్లాడాలి. మాట కత్తికన్నా పదునైనది. నువ్వు మంచిగా మాట్లాడకపోయినా ఫర్వాలేదు. ఎదుటివారిని నొప్పించేవిధంగా మాత్రం మాట్లాడకూడదు. అది నీ ఆప్తులైనా సరే. అప్పుడే మనుషుల మధ్య బాంధవ్యాలు బాగుంటాయి. బాంధవ్యాలు బాగుంటే బతుకు బాగున్నట్టే.

◆ మీ దగ్గరకు వచ్చే కేసులలో ఈ కేసు దేవుడే డీల్ చేయాలని చేతులెత్తేసిన సందర్భం?

అలాంటిదెప్పుడూ లేదు. పరిష్కారం చేయలేని కేసులంటూ ఏమీ ఉండవు. దాన్ని డీల్ చేసే విధానాలే వేరు వేరుగా ఉంటాయి. మనం చెప్పే విధానంలో ఆ క్లారిటీ ఉండాలి. నాకీ పని చేయడం రాదు, నేను ఇలాగే ఉంటాను అంటుంటారు కొందరు. అదొట్టి మూర్ఖత్వం. ముందు ఆచరణలో పెడితే తర్వాత అదే అలవాటవుతుంది.

◆ దేవుడి మహిమ వల్లే ఈ కేసు పరిష్కారం అయిందనుకున్న సందర్భం ఉందా?

మీరు వచ్చే ముందే ఈ ('సత్య నాదెళ్ల' పుస్తకం చూపిస్తూ) పుస్తకం చదువుతున్నాను. ఈయనకి ఐఐటీలో సీటు రాలేదు. బిట్స్ పిలానీలో సీటు రాలేదు. డొనేషన్ కట్టి చదివాడు. కంప్యూటర్ ఇంజనీర్ కావాలన్నది ఆశయం. అతను ఇందులో చెప్పుకున్నాడు.. 'నా గదిలో మా అమ్మ లక్ష్మీదేవి బొమ్మ పెట్టేది.. మా నాన్న కార్ల్‌మార్క్స్ బొమ్మ పెట్టేవాడు... నేను క్రికెటర్ జయసింహ ఫొటో పెట్టుకునేవాణ్ణి' అని. ఆయన తన కలను నెరవేర్చుకోవడం కోసం కృషి చేశాడు. ఇప్పుడు మహామహా మేధావులు సైతం ఆయన ముందు చేతులు కట్టుకొని నిలబడతారు. 'యు ఆర్ ది డిజైనర్ ఆఫ్ యువర్ డెస్టినీ'. నీ నుదుటి రాత దేవుడు రాయడు. పెన్ను, పేపర్ నీ చేతిలోనే ఉంది. నువ్వేది రాసుకుంటే అదే నీ జీవితం. నువ్వు కృషి చేయి. నీకు నేచర్ సపోర్ట్ చేస్తుంది. అంతేకానీ, దేవుడి మహిమలు అంటూ ఏమీ లేవు.

◆ మేజిక్ అంటే మాయ కదా! డబ్బు మాయ, పదవి మాయ, మోహం మాయ.. మనిషి ఏ మాయ నుంచి జాగ్రత్తగా ఉండాలి.

డబ్బు గొప్పది. దీని కోసమేగా అందరం పనిచేసేది. మనిషి తనకు సరిపడా ఉన్నా ఇంకా ఇంకా సంపాదిస్తూనే ఉంటాడు. తరతరాలకు. ఆ డబ్బే అతన్ని సుఖపెడుతుంది. ఆ డబ్బే దుఃఖపెడుతుంది. డబ్బు మాయను అర్థం చేసుకొని ఆనందంగా బతికితే చాలు.

◆ మీ భార్యను మాయ చేసిన సందర్భం ఉందా?

(నవ్వుతూ) మాయ అని చెప్పలేను. కానీ, వాస్తవంగా ఆలోచించినది ఆచరణలో పెట్టడానికి పెళ్లయ్యాక నాకు ఐదేళ్లు పట్టింది. మా ఆవిడకు గుళ్లకు వెళ్లడం, సంప్రదాయాలను పాటించడం చాలా ఇష్టం. అవి నన్నూ పాటించమంటే కష్టంగా ఉండేది. నా వృత్తికవి అడ్డంకి కూడా. ఇలా చెప్పి ఆమె మనసును నొప్పించకూడదు. అందుకని ఓ ప్లాన్ వేశాను.

'ఏడాదిలో రెండుసార్లు అంటే, జనవరి 1న షిరిడీ వెళ్దాం. పెళ్లిరోజున తిరుపతిలో ఉందాం' ఇలా ప్లాన్ చేసుకున్నాం. ఈ ప్లాన్ ఇంకో పదేళ్లయినా అలాగే కంటిన్యూ అవుతుంది. సంప్రదాయాలను మూఢంగా కాకుండా లాజికల్‌గా ఆలోచించి చేయమని చెబుతుంటాను. ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులు వేస్తే లక్ష్మీదేవి ఇంటికి వస్తుందండీ అంటుంది. అలా అయితే బిల్‌గేట్స్ ఇంటి ముందు ఎంత పెద్ద పెద్ద ముగ్గులు వేయాలి చెప్పు అంటాను నవ్వేస్తూ.. ఆలోచనల్లో పడుతుంది.

◆ ముక్కోటి దేవతలు ఉండగా జనాలు మీతో మొరపెట్టుకోవడానికి వస్తారెందుకు?

ఇక్కడే అర్థం అవుతుందిగా. దేవతలు సమస్యలు సాల్వ్ చేయరని. సైకాలజిస్ట్‌లు అంటే ఎవరు..? ఒకప్పటి తాతయ్యలు, నానమ్మలు. అప్పట్లో వాళ్లు అన్‌పెయిడ్ కౌన్సిలర్లు. ఇప్పుడు ఇళ్లలో వాళ్లు లేరు. అందుకే మా అవసరం వచ్చింది. మంచి, చెడులు చెప్పి బాంధవ్యాలు చక్కగా ఉండేలా చేసే పెద్దదిక్కులను ఆశ్రమాలకు పంపిస్తున్నాం. కనపడని దేవతలకు మొక్కుకుంటే ఎవరు వింటారు. ఆ ప్రాబ్లమ్‌ని ఎవరు సాల్వ్ చేస్తారు.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి

ఫ్యామిలీ డాక్టర్

రెండు నెలల నుంచి ఎడతెరిపి లేకుండా దగ్గు!

మా అబ్బాయి వయసు 13 ఏళ్లు. అతడు ఎప్పుడూ పొడి దగ్గుతో బాధపడుతున్నాడు. గత రెండు నెలలుగా కొద్దిపాటి జ్వరంతో ఉంటోంది. శ్వాస కూడా సరిగా తీసుకోలేకపోతున్నాడు. మాకు దగ్గర్లోని డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడినా సమస్య తగ్గడం లేదు. మావాడి సమస్యకు పరిష్కారం సూచించండి.

– ఎమ్. కృష్ణమూర్తి, మేదరమెట్ల



మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీ అబ్బాయి కాఫ్ వేరియంట్ ఆస్తమాతో బాధపడుతున్నట్లు అనిపిస్తోంది. ఇది ఆస్తమాలోనే ఒక రకం. ఇది వచ్చిన వారిలో తెమడ పడదు. పొడిదగ్గు ఉంటుంది. పిల్లికూతలు కూడా మొదట్లో ఉండవు. దీన్నే 'క్రానిక్ కాఫ్' అని కూడా అంటారు. రాత్రీ పగలూ తేడా లేకుండా దగ్గుతుంటారు. ఆ దగ్గు వల్ల రాత్రుళ్లు నిద్ర కూడా పట్టదు. ఈ రోగులు తమకు సరిపడని ఘాటైన వాసనలు, దుమ్ము, ధూళి వంటి వాటికి ఎక్స్‌పోజ్ అయితే ఆ అలర్జెన్స్ ఆస్తమాను మరింతగా ప్రేరేపిస్తాయి. కాఫ్ వేరియెంట్ ఆస్తమా సమస్య ఎవరికైనా, ఏ వయసు వారిలోనైనా కనిపించినప్పటికీ చిన్న పిల్లల్లో ఇది ఎక్కువ. ఇది ఆ తర్వాత సాధారణ ఆస్తమాకు దారితీస్తుంది. అంటే శ్వాస అందకపోవడం, పిల్లికూతలు వంటి లక్షణాలు తర్వాతి దశలో కనిపిస్తాయి. సాధారణ ఆస్తమా లాగే కాఫ్ వేరియెంట్ ఆస్తమాకూ కారణాలు అంతగా తెలియవు. తమకు సరిపడని పదార్థాలు, చల్లగాలి దీనికి కారణాలుగా భావిస్తుంటారు. కొందరిలో అధిక రక్తపోటు, గుండెజబ్బులు, హార్ట్‌ఫెయిల్యూర్, మైగ్రేన్, గుండెదడ (పాల్పిటేషన్స్) వంటి జబ్బులకు వాడే మందులైన బీటా–బ్లాకర్స్ తీసుకున్న తర్వాత 'కాఫ్ వేరియెంట్ ఆస్తమా' మొదలు కావచ్చు. కొందరిలో గ్లకోమా వంటి కంటిజబ్బులకు వాడే చుక్కల మందులోనూ బీటా బ్లాకర్స్ ఉండి, అవి కూడా ఆస్తమాను ప్రేరేపిస్తాయని కూడా అధ్యయనాలు చెబుతున్నాయి. కొందరిలో ఆస్పిరిన్ సరిపడకపోవడం వల్ల కూడా దగ్గుతో కూడిన ఆస్తమా రావచ్చు. కాఫ్ వేరియెంట్ ఆస్తమాలో కేవలం దగ్గు తప్ప ఇతర లక్షణాలేమీ కనిపించకపోవడం వల్ల దీని నిర్ధారణ ఒకింత కష్టమే. ఎందుకంటే కాఫ్ వేరియెంట్ ఆస్తమా విషయంలో సాధారణ పరీక్షలైన ఛాతీఎక్స్‌రే, స్పైరోమెట్రీ వంటి పరీక్షలూ నార్మల్‌గానే ఉంటాయి. మీరు వెంటనే మీకు దగ్గర్లో ఉన్న ఛాతీ నిపుణుడిని కలవండి. కొన్ని వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ తర్వాత నిపుణులు తగిన చికిత్స అందిస్తారు.

పల్మునాలజీ కౌన్సెలింగ్

వ్యాయామం మొదలుపెట్టగానే ఆయాసం

నా వయసు 37. డస్ట్ అలర్జీ ఉంది. ఇటీవల వ్యాయామం మొదలుపెట్టాను. కానీ ఇలా మొదలుపెట్టగానే ఆయాసం వస్తోంది. దాంతో వ్యాయామం సాగడం లేదు. నాకు తగిన సలహా ఇవ్వండి.

– గోపాలకృష్ణ, ఖమ్మం

వ్యాయామం కొన్నిసార్లు ఆస్తమాను ప్రేరేపించి, ఆయాసం వచ్చేలా చేసే అవకాశం ఉంది. దీన్నే ఎక్సర్‌సైజ్ ఇండ్యూస్‌డ్ ఆస్తమా అని కూడా అంటారు. సాధారణంగా మనం శ్వాస తీసుకునే సమయంలోనే ముక్కురంధ్రాల్లోకి ప్రవేశించాక, ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి అనుకూలమైన ఉష్ణోగ్రతను సంతరించుకుంటుంది. కానీ వ్యాయామం చేసే సమయంలో గాలి ఎక్కువగా తీసుకోవడం కోసం నోటితోనూ గాలిపీలుస్తుంటారు. అంటే వారు తేమలేని పొడిగాలినీ, చల్లగాలినీ నోటితో పీలుస్తుంటారన్నమాట. ఆ చలిగాలిలో లోనికి ప్రవేశించగానే... ఆ గాలిని తీసుకెళ్లే మార్గాలు ముడుచుకుపోతాయి. ఫలితంగా గాలిని ఊపిరితిత్తుల్లోకి తీసుకెళ్లే దారులు సన్నబడతాయి. దాంతో కొన్ని లక్షణాలు కనబడతాయి. అవి...

● పొడి దగ్గు వస్తుండటం ● ఛాతీ పట్టేసినట్లుగా ఉండటం ● పిల్లికూతలు వినిపించడం ● వ్యాయామం తర్వాత తీవ్రమైన అలసట (మామూలుగా వ్యాయామం చేసేవారిలో ఇంత అలసట ఉండదు) ● వ్యాయామ సమయంలో గాలి తీసుకోవడంలో ఇబ్బంది / ఆయాసం. సాధారణంగా వ్యాయామం మొదలుపెట్టిన 5 నుంచి 20 నిమిషాల్లో ఈ లక్షణాలు కనిపించడం లేదా కొద్దిగా వ్యాయామం చేసి ఆపేశాక 5 – 10 నిమిషాల తర్వాత ఈ లక్షణాలు కనిపించడం మొదలవుతుంది. ఇలాంటి సమయాల్లో డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి. అయితే వ్యాయామంతో వచ్చే ఆయాసం (ఎక్సర్‌సైజ్ ఇండ్యూస్‌డ్ ఆస్తమా) కారణంగా వ్యాయామ ప్రక్రియను ఆపాల్సిన అవసరం లేదు. దీన్ని అధిగమించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. వ్యాయామం మొదలుపెట్టడానికి ముందుగా పీల్చే మందులైన బ్రాంకోడయలేటర్స్ వాడి, వ్యాయామాన్ని కొనసాగించవచ్చు. ఇక తక్షణం పనిచేసే లెవోసాల్‌బ్యుటమాల్ వంటి బీటా–2 ఔషధాలను వ్యాయామానికి 10 నిమిషాల ముందుగా వాడి, వ్యాయామ సమయంలో గాలిగొట్టాలు మూసుకుపోకుండా జాగ్రత్తపడవచ్చు. దీనితో పాటు వ్యాయామానికి ముందర వార్మింగ్ అప్, వ్యాయామం తర్వాత కూలింగ్ డౌన్ ప్రక్రియలను చేయడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. తొలుత చాలా కొద్ది సమయం పాటే వ్యాయామం చేస్తూ, ఆ వ్యవధిని పెంచుకుంటూ పోవడం వల్ల మీరు ఈ సమస్యను అధిగమించవచ్చు.



వ్యాధి నిర్ధారణ తర్వాతే మందులు!

నా వయసు 44 ఏళ్లు. నాకు ఎడతెరిపిలేకుండా దగ్గు వస్తోంది. నాకు టీబీ అయి ఉండవచ్చా? చాలామంది ఫ్రెండ్స్ నాకు టీబీ ఉందనీ, మందులు వాడమని సూచిస్తున్నారు. నాకు తగిన మందులు సూచించండి.

– ఫల్గుణరావు, కాకినాడ

టీబీ ఉన్నవారికి దగ్గు రావడం ఒక లక్షణమే అయినా... దగ్గు వచ్చిన వారందరికీ టీబీ ఉన్నట్లే అనుకోకూడదు. దగ్గు అనేది ప్రకృతి మనకు ఇచ్చిన ఒక స్వాభావిక రక్షణ ప్రక్రియ.

ఊపిరితిత్తుల్లోకి వెళ్లిన గాలి గ్లాటిస్ నుంచి అత్యధిక పీడనంతో బలంగా నోటి ద్వారా ఒక్కసారిగా బయటకు వెలువడటాన్ని దగ్గు అంటారు. మన ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన అనేక వ్యర్థాలను, ప్రమాదకరమైన ద్రవాలను బయటకు బయటకు పంపడానికి దగ్గు ఉపయోగపడుతుంది. ఇక దగ్గు అనేది కేవలం టీబీ లక్షణం మాత్రమే కాదు. సైనుసైటిస్, నిమోనియా, ఆస్తమా వంటి జబ్బుల నుంచి గుండెజబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వరకు అనేక వ్యాధుల్లో దగ్గు కనిపిస్తుంది. కాబట్టి వీలైనంత త్వరగా మీకు దగ్గర్లోని డాక్టర్‌ని కలవండి. ఆయన కొన్ని పరీక్షలతో మీ దగ్గుకు అసలు కారణాన్ని కనుగొంటారు. దాని ఆధారంగా మీకు తగిన చికిత్స అందిస్తారు. అంతేగానీ దగ్గు వచ్చిన ప్రతి వారూ సొంతంగానో లేదా తమ ఫ్రెండ్స్ చెప్పినదాన్ని బట్టి తమకు తామే ఏదో జబ్బును ఊహించుకోవడం సరికాదు.



డాక్టర్ రమణ ప్రసాద్
కన్సల్టెంట్ పల్మునాలజిస్ట్ అండ్
స్లీప్ స్పెషలిస్ట్, కిమ్స్, సికింద్రాబాద్

డబ్బింగ్ క్లాసిక్స్- 9



పసి ప్రేమకు తొలి అంకురం డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్

చిన్నప్పుడు అన్నీ బాగుంటాయి. ఆ అమ్మాయితో దాగుడుమూతలు బాగుంటాయి. ఆ అమ్మాయి వెనుక వెనుకే తిరగడం బాగుంటుంది. ఆ అమ్మాయి పక్కనే కూర్చుని క్లాసు వినడం బాగుంటుంది. స్కూలు వదిలాక పక్కనే నడుస్తూ ఇల్లు చేరడం బాగుంటుంది. అమ్మాయి చాలా బాగుంటుంది. ఎందుకో అమ్మాయి ఎక్కడ ఉంటే అక్కడ ఉండ బుద్ధేస్తుంది.

వయసు పెరుగుతుంది.

వయసుతో పాటు మనమూ పెరిగితే బాగుంటుంది.

కాదూ కూడదని ఆ చిన్నప్పుడు ఆ అమ్మాయి దగ్గరే ఉండిపోతే మాత్రం కథ 'డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్' అవుతుంది.

* * *

ఎట్రాక్షన్‌కి తిథి, ముహూర్తమూ ఉండవు. మీసం వచ్చిందా, ఎత్తు అయిదడుగులు దాటిందా, కాళ్లు కాలేజీ దారిలో ఉన్నాయా అన్నది చూడదు. ఎట్రాక్షన్‌కి ఎదురుగా ఉన్నది యజమాని కూతురా పాలేరు కూతురా అన్నది కూడా తెలియదు. ఊహ తెలిసిన క్షణం నుంచి ఆకర్షణ ఉంటుంది. ఎవరి కోసమో ఒకరి కోసం మనసు గాఢంగా కోరుకుంటూ ఉంటుంది. అది సేమ్‌సెక్స్ అయితే స్నేహం. ఆపోజిట్ సెక్స్ అయితే ఇష్టం.

ఈ సినిమాలో భాగ్యరాజ్ తన యజమాని కూతురైన పూర్ణిమా జయరామ్ పట్ల అలాంటి ఇష్టం పెంచుకుంటాడు. పెద్దయ్యాక కాదు. చిన్నప్పుడే. పదేళ్ల వయసులో. ఇద్దరూ ఊటీలో చదువుకుంటూ ఉంటారు. ఒకే క్లాసులో ఒకరిని ఒకరు విడవకుండా ఉంటారు. మ్యూజికల్ చైర్స్‌లో ఒక్క చైరే మిగిలితే ఇద్దరూ నిలబడిపోతారు తప్ప ఒకరి మీద మరొకరు గెలవడానికి కూర్చోరు. స్కూల్‌లో మార్చింగ్ జరిగి ఎదురూ బొదురూ వస్తే ఆగిపోయి ఉన్న చోటే మార్చ్ చేస్తారు తప్ప ముందుకు కదలరు. ఆటల్లో ఒకరు ఫస్ట్ వస్తే ఒకరు సెకండ్. పోటీల్లో ఒకరు సెకండ్ వస్తే మరొకరు ఫస్ట్. కాని ఊటీలో కూడా ఎండ కాస్తుంది. వాళ్ల జీవితంలో కూడా ఎండ వచ్చింది. ఆ అమ్మాయి తండ్రికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. ఆ అమ్మాయి పోతూ పోతూ 'నేను తిరిగి వచ్చే వరకూ నన్ను గుర్తు పెట్టుకుంటావ్‌గా' అని అడుగుతుంది. అంతేకాదు చనిపోయిన తన కుక్కపిల్ల సమాధి దగ్గర రోజూ పూలు పెడతావుగా అని కూడా అడుగుతుంది. ఆ అమ్మాయి ఎక్కిన రైలు వెళ్లిపోతుంది. దాని చక్రాల కింద ఆమె అంత వరకూ పెంచుకున్న జ్ఞాపకాలు కూడా జారిపోయాయి. కాని ఆ పిల్లవాడు మాత్రం ఆ క్షణం దగ్గరే ఫ్రీజ్ అయిపోయాడు. ఒకరోజు కాదు రెండు రోజులు కాదు ఏకంగా పదేళ్ల పాటు ఆ అమ్మాయిని ప్రేమిస్తూ ఉండిపోయాడు. అనుక్షణం ఆమె తలపులు. జ్ఞాపకాలు. కుక్కపిల్ల సమాధి మీద రోజూ పూలు పెట్టి ఎంతో గాఢంగా మౌనం పాటిస్తుంటాడు. ఇదంతా ఎవరి కోసం. తన కోసమే. ఏదో ఒక రోజు రాకపోదు తనని చూసి గుండెల్లో పొదువుకోకపోదు అని ఆశ.

అమ్మాయి వచ్చింది.

రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లి స్టైల్‌గా 'హాయ్... ఐయామ్ రాజా' అన్నాడు.

ఆ అమ్మాయి అతణ్ణి ఎగాదిగా చూసి 'అయితే లగేజ్ అందుకో' అంది.

ఒక ఆశల బుడగ సూది మొన తగలకనే టప్పున పేలింది.

* * *

ఆ అమ్మాయికి అసలు ఏమీ గుర్తు లేదు. చాలా జీవితం చూసింది. విదేశాల్లో చదువుకుంది. ఎంగేజ్‌మెంట్ కూడా చేసుకుంది. రేపోమాపో పెళ్లి. ఈలోపు సరదాగా ఊటీ చూద్దామని ఫ్రెండ్స్‌తో వచ్చింది. ఇక్కడ చూస్తే అమర ప్రేమికుడు భాగ్యరాజ్. కళ్ల నిండా మనసు నిండా ఆమెను చూసుకోవడమే. అడిగితే డీసెంట్‌గా ప్రాణమిచ్చేసేలా ఉంటాడు. మొదట ఇతని వాలకం ఏమీ అర్థం కాదు. కాని మెల్లమెల్లగా అతడి మనసులోని లోతు అర్థం చేసుకుంటుంది. మరో వైపు తాను నిశ్చితార్థం చేసుకున్న వరుడు సుమన్ తన కోసం ఊటీ వస్తే అక్కడ అతడి కుసంస్కారం గమనిస్తుంది. భాగ్యరాజ్ దగ్గర డబ్బు లేదు. అతడు వాచ్‌మెన్ కొడుకు నిజమే. కాని అతడి లాంటి మనసు ఎక్కడ ఉందని? అందుకే ఎంగేజ్‌మెంట్‌ను కాదని భాగ్యరాజ్‌నే పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుంటుంది. అయితే ఈలోపే ఆమె మీద కృతజ్ఞతాభారం పడుతుంది. వ్యాపారంలో నష్టపోయిన తండ్రిని స్నేహితుడైన సుమన్ తండ్రి ఆదుకున్నాడు కనుక ఈ క్షణంలో సుమన్‌ని కాదని భాగ్యరాజ్‌ని చేసుకోవడానికి ఆమెకు కృతజ్ఞత అడ్డు వస్తుంది. నలిగిపోతున్న ఆమెను సుమన్ తండ్రి గమనిస్తాడు. అసలు సంగతి గ్రహిస్తాడు. ఆయన పెద్దమనిషి. సంస్కారవంతుడు. అందుకే నిజమైన ప్రేమికునికే ఆమె చెందాలని నిర్ణయిస్తాడు.

పదేళ్ల సుదీర్ఘప్రేమ ఫలవంతమైంది. చిన్నప్పటి స్నేహితురాలు ప్రియురాలైంది. ఇప్పుడు ఇల్లాలైంది. కలలు నిజమవుతాయి. తపస్సులు కూడా వరాలిస్తాయి. కావలసిందల్లా సిసలైన తపస్సే.

* * *

ఈ సినిమాలో హాస్యం, ఆర్ద్రత సమపాళ్లలో ఉంటాయి. తన చిన్ననాటి స్నేహితురాలు తిరిగి వస్తుందన్న ఆనందంలో స్వాగతం చెప్పడానికి కొత్త బట్టలు కుట్టించుకుంటాడు భాగ్యరాజ్. కాని షూస్ కొనుక్కోవడానికి డబ్బులు ఉండవు. ఏదో పెళ్లికి పెద్దమనిషిగా వెళ్లి అక్కడ మంగళ వాయిద్యాలు మోగుతూ ఉండగా ఎవరివో కొత్త షూస్‌లో కాళ్లు దూర్చి చక్కా వచ్చేస్తాడు. నవ్వు వస్తుంది. దూరంగా కరాటే సాధన చేస్తున్న కుర్రాళ్లను కారులో ఉన్నామన్న ధైర్యంతో ఏడిపిస్తారు పూర్ణిమ జయరామ్ ఆమె స్నేహితులు. వాళ్లు వెంటపడతారు. వీళ్లు పారిపోతారు. కాని కారు ఆగిపోతుంది. పట్టుకుంటారు. మాతో ఫైట్ చేసి గెలుస్తారా అని ఛాలెంజ్ చేస్తారు. అప్పటి వరకూ డ్రైవర్‌గా ఉన్న భాగ్యరాజ్ కారులోని ఒక సంచీ వెతికి అందులోని ఎల్లో కలర్ కరాటే డ్రస్సు వేసుకొని చాలా ప్రొఫెషనల్‌గా ఫైట్ చేసి గెలుస్తాడు. మళ్లీ నవ్వు. ఇలా నవ్వించిన భాగ్యరాజే తాను పదేళ్లుగా దాచిపెట్టుకున్న ఫొటోలను పూర్ణిమకు ఇస్తే ఆమె వాటిని తీసుకుని అతని ముందే తన ముక్క వరకూ కట్ చేసి అతని ముక్కను చేతిలో పెడితే కంట తడి పెట్టిస్తాడు.

లోకంలో అందరూ వీరులూ శూరులూ ఉండరు. భాగ్యరాజ్ వంటి ఆర్డనరీ మనుషులే ఉంటారు. కాని వాళ్ల దగ్గర కూడా చాలా అట్రాక్షన్ ఉంటుంది. కోటాను కోట్ల సఫల ప్రేమలు ఈ ఆర్డనరీ ఫెలోల అట్రాక్షన్ నుంచి పుట్టినవే.

తెర మీద మాత్రం ఇది మొదటిది.

భాగ్యరాజా చేతిలో మెరిసిన భాగ్యరేఖ.

– కె


● భాగ్యరాజ్, పూర్ణిమ

డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్

కె.భాగ్యరాజ్ తమిళంలో హీరోగా నటించి నిర్మించి దర్శకత్వం వహించిన 1982నాటి సినిమా 'డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్'. తెలుగులో కూడా అదే పేరుతో విడుదలై భాగ్యరాజ్‌ని తెలుగువారికి అభిమాన దర్శకుడిగా మార్చింది. ఈ సినిమా హిట్‌తో భాగ్యరాజ్ చాలా సినిమాలు 'చిన్న ఇల్లు', 'అమ్మాయిలూ ప్రేమించండి', 'నేనూ మీవాడినే', 'చిన్నరాజా' వరుస విజయాలు సాధించాయి. 'డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్'... చిన్నప్పటి నుంచి రూపుదిద్దుకునే ప్రేమను మొదటిసారి చూపింది. దీని ఆధారంగా అనేక సినిమాలు వచ్చాయి. నిన్నమొన్నటి 'హలో' దగ్గరి నుంచి ఆ మొన్నటి 'మనసంతా నువ్వే' వరకు ఎన్నో సినిమాలు ఈ సినిమా మూల కథ నుంచే పుట్టాయి. తరుణ్ 'నువ్వు లేక నేను లేను'లో కూడా ఈ సినిమా లైన్ కనిపిస్తుంది. ఇక కరుణాకరన్ తీసిన 'తొలి ప్రేమ'కు ఈ సినిమా పూర్తిగా స్ఫూర్తి. సైట్ ఉన్నవాడు కూడా హీరో కావచ్చని, మామూలుగా కనిపించేవాడు కూడా ప్రేమలో గెలవచ్చని భాగ్యరాజ్ చాలామందికి ధైర్యం ఇచ్చాడు. అన్నట్టు ఈ సినిమాలో తనతో నటించిన పూర్ణిమా జయరామ్‌ను అతడు వివాహం చేసుకున్నాడు. మన దగ్గర పెద్ద హిట్టయిన 'మూడుముళ్లు', 'రాధా కల్యాణం', 'అబ్బాయి గారు' భాగ్యరాజ్ సినిమాలకు రీమేక్‌లే. భాగ్యరాజ్ స్కూల్‌లో తెలుగులో ఇటీవల వచ్చిన సినిమాలు 'మళ్లీ రావా' (సుమంత్), 'జయమ్ము నిశ్చయమ్మురా' (శ్రీనివాసరెడ్డి).

వినడానికి రెడీగా ఉండండి


● తిరు పోస్ట్ చేసిన ఫొటో


● మహేశ్‌బాబు

"**రి**పబ్లిక్ డే.. ఉదయం ఏడు గంటల సమయం. రెడీగా ఉండండి. ఆల్ ఆడియో ప్లాట్‌ఫామ్స్‌లో భరత్ ఫస్ట్ ఓత్ (ప్రమాణం) వినడానికి".. ఇదిగో ఇలాగే ఎనౌన్స్‌మెంట్ ఇచ్చారు మహేశ్ అండ్ టీమ్. ఈలోపు భరత్ ఏం చేస్తున్నాడు అంటే.. విలన్స్‌ను కుమ్మేస్తున్నాడట. కొరటాల శివ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా డీవీవీ దానయ్య నిర్మాణంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'భరత్ అనే నేను' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఇందులో కియారా అద్వాని కథానాయిక. ఈ సినిమాలో మహేశ్‌బాబు సీయం భరత్ పాత్రలో కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్ సీన్స్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. "ఫుల్ స్వింగ్‌తో క్లైమాక్స్ సీన్స్ హైదరాబాద్‌లో జరుగుతున్నాయి" అని కెమెరామేన్ తిరు ఇన్‌సెట్‌లో మీరు చూస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ముఖ్యంగా ఎడ్యుకేషన్ సిస్టమ్‌లోని లోపాలపై భరత్ టార్గెట్ చేస్తాడట. ఈ సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. అన్నట్లు.. మహేశ్‌బాబు ఫ్యాన్స్‌కి ఓ స్వీట్ న్యూస్.. అభిమానులకు సోషల్ మీడియాలో మరింత దగ్గరయ్యేందుకు మహేశ్‌బాబు ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్ ఓపెన్ చేశారు.

హ్యాండ్ ఇచ్చిన నిర్మాత.. ఆగేది లేదంటున్న నయన!


● నయనతార

సినిమా తీస్తానని మాటిచ్చిన నిర్మాత మధ్యలో హ్యాండ్ ఇస్తే? అసలు సెట్స్‌కి వెళ్లకముందే డ్రాప్ అయితే అప్పుడు ఆ సినిమా కమిట్ అయినవాళ్లు వేరే సినిమా చూసుకుంటారు. బాగా బిజీగా ఉన్నవాళ్లు 'పోతే పోయిందిలే' అనుకుంటారు. స్టోరీ బాగా నచ్చేసినవాళ్లు మాత్రం 'మంచి ప్రాజెక్ట్ పోయిందే' అని ఫీలవుతారు. ఓ సినిమా విషయంలో నయనతార అలానే బాధపడుతున్నారట. ఫైనల్లీ 'ఈ బాధ పడే బదులు ఆ సినిమాకి మనమే ప్రొడ్యూసర్‌ని సెట్ చేస్తే పోలా' అనుకున్నారట. ఫుల్ డీటైల్స్‌లోకి వెళితే.. 'ఈరమ్', 'కుట్రమ్ 23' చిత్రాల ద్వారా మంచి పేరు తెచ్చుకున్న దర్శకుడు అరివళగన్ దర్శకత్వంలో ఓ సినిమా ఒప్పుకున్నారు నయనతార. గతేడాది నవంబర్‌లో ఈ సినిమాని అనౌన్స్ చేశారు. డిసెంబర్‌లో సెట్స్‌కి వెళ్లాల్సింది. కానీ నిర్మాత నా వల్ల కాదంటూ సినిమా నుంచి తప్పుకున్నారని చెన్నై టాక్. సడన్‌గా నిర్మాత అలా హ్యాండ్ ఇవ్వడంతో ఇక ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే పరిస్థితి లేదని చాలామంది ఫిక్సయ్యారు. కానీ నయనతారకు కథ బాగా నచ్చిందట. దాంతో పాటు అరివళగన్ కూడా మంచి డైరెక్టరే. అందుకని సినిమా ఆగడం ఆమెకు ఇష్టం లేదు. అందుకే ఈ ప్రాజెక్ట్‌కు నిర్మాతను సెట్ చేయాలనుకుంటున్నారట. ఇటీవల నయనతార నటించిన 'అరమ్' చిత్రానికి కూడా ఈ విధంగానే జరిగింది. ఓ నిర్మాత తప్పుకోవడంతో మరో నిర్మాతతో మాట్లాడి, ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారామె. 'అరమ్' సూపర్ డూపర్ హిట్టయింది. సో.. నయనతార నమ్మిన కథ కాసుల వర్షం కురిపిస్తుందని ప్రూవ్ అయింది. ఆ సెంటిమెంట్‌తో, కథానాయికగా నయనతార మీద ఉన్న క్రేజ్ దృష్ట్యా అరివళగన్‌తో ఆమె చేయాలనుకున్న సినిమాను నిర్మించడానికి వేరే నిర్మాతలు ముందుకు రావచ్చనే ఊహాగానాలున్నాయి. ఏదేమైనా 'మనకెందుకులే' అనుకోకుండా నయన్ ఈ విధంగా చేయడం మాత్రం గొప్ప విషయమే.

ప్రతి పైసా తెరపై కనిపిస్తుంది


● రవీందర్

"'భాగమతి' పూర్తి స్థాయి హారర్ సినిమా కాదు. హారర్ కథాంశం కొంత మాత్రమే ఉంటుంది. ఇతర సినిమాలకీ దీనికీ పోలిక ఉండదు. 45 రోజుల పాటు బంగ్లా సెట్‌లో షూటింగ్ జరిపాం. అక్కడ చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయి" అన్నారు ఆర్ట్ డైరెక్టర్ రవీందర్. అనుష్క లీడ్ రోల్‌లో అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన 'భాగమతి' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆ సినిమా ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ మీడియాతో మాట్లాడారు.

● కథ పరంగా 300 ఏళ్ల క్రితంనాటి బంగ్లా కావాలి. దాని కోసం ఎంతో రీసెర్చ్ చేసి, కొత్త టెక్నాలజీ ఉపయోగించి 29 రోజుల్లో బంగ్లా సెట్ తీర్చిదిద్దాం. సెట్ చూసి యూనిట్ మొత్తం ఆశ్చర్యపోయారు. నిజం చెప్పాలంటే సెట్ భారీతనం యూనిట్ ఇంకాస్త ఎక్కువ కష్టపడి బెటర్ ఔట్‌పుట్ ఇచ్చేలా దోహదపడింది.

● టాలీవుడ్‌లో ఇదొక కాస్ట్లీ సెట్ అన్నది నిజమే. ఈ సెట్ కోసం చాలా ఖర్చు చేశాం. అయితే.. పెట్టిన ప్రతిపైసా తెరపై కనిపిస్తుంది. ఇప్పటివరకు నేను వేసిన సెట్స్‌లో ఇదే బెస్ట్ అని చెప్పగలను.

● ఏ సినిమాకైనా ముందు కథ వింటాను. అప్పుడే కథాంశం అర్థమై ఎలాంటి సెట్స్ కావాలో ఇవ్వగలం. అందరూ ఓ మంచి సినిమా చేశారని అంటున్నారు. మా వరకు మేం సిన్సియర్‌గా కష్టపడ్డాం. మా ప్రయత్నం ప్రేక్షకులను మెప్పిస్తుందని నా నమ్మకం.

● ప్రస్తుతం మారుతి–నాగ చైతన్య కాంబినేషన్‌లో ఓ చిత్రం, మోహన్‌కృష్ణ ఇంద్రగంటిగారి సినిమాతో పాటు ఒక తమిళ సినిమా చేస్తున్నాను. ఇటీవల దర్శకుడు సుధీర్ వర్మ సినిమా ఒప్పుకున్నాను.

క్లాస్‌కి వేళాయెరా



● హృతిక్ రోషన్

బుక్స్ ముందు పెట్టుకుని మ్యాథ్స్ థియరమ్స్‌తో కుస్తీ పడుతున్నాడు బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్. అంతలోనే బెల్ మోగింది. ఇంకేముంది? చేతికున్న గడియారంవైపు ఓ లుక్కేసి క్లాస్‌కి బయలుదేరాడు. బీహార్ గణిత శాస్త్రజ్ఞుడు ఆనంద్‌కుమార్ బయోపిక్ ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'సూపర్ 30'. విశాల్‌బాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో హృతిక్ రోషన్ టైటిల్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణను సోమవారం స్టార్ట్ చేశారు. "పవిత్రమైన వసంత పంచమి రోజున సరస్వతి పూజతో 'సూపర్ 30' సినిమా జర్నీని స్టార్ట్ చేశాం. మొదటిసారిగా టీచర్ పాత్ర చేస్తున్నాను. నేను చేస్తున్న ఈ ప్రయత్నానికి ఆ దేవత ఆశీర్వాదాలు ఉంటాయని ఆశిస్తున్నాను" అని హృతిక్ రోషన్ పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

డైరీ నిండుతోంది


● అనూ ఇమ్మాన్యుయేల్

అవును.. అనూ ఇమ్మాన్యుయేల్ డైరీ మెల్లిగా నిండుతోంది. ఇప్పటికే స్టార్ హీరోయిన్స్ లిస్ట్‌లోకి దగ్గరగా వచ్చేశారు. రానున్న సినిమాలతో ఓ ప్లేస్ కొట్టేస్తారు. 'మజ్ను' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైన ఈ మలయాళ బ్యూటీ 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త', 'ఆక్సిజన్', 'అజ్ఞాతవాసి'లోనూ మెరిసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా'లో నటిస్తున్నారామె. అలాగే, నాగచైతన్య హీరోగా మారుతి దర్శకత్వంలో ఇటీవల ఆరంభమైన సినిమాలోనూ అనూనే కథానాయిక. ఇప్పటికి రెండు చిత్రాలతో బిజీగా ఉన్న ఈ బబ్లీ బ్యూటీకి మరో సినిమా చేసే అవకాశం వచ్చిందట. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ హీరోగా నటించనున్న చిత్రానికి అనూని కథానాయికగా అడిగారట. ఇది కూడా సైన్ చేసేస్తే ఈ ఏడాది ఇప్పటికే 'అజ్ఞాతవాసి'లో కనిపించిన అనూ ఇమ్మాన్యుయేల్ మరో మూడు చిత్రాల్లో కనువిందు చేస్తారని ఊహించవచ్చు. ఏది ఏమైనా ఈ బ్యూటీ డైరీ మెల్లిగా నిండుతోంది. అన్నట్లు.. ఎన్టీఆర్–రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రాజమౌళి తెరకెక్కించనున్న సినిమాలో అనూని ఓ కథానాయికగా అనుకుంటున్నారట.



హలో మాస్టారూ.. మీకు బీపీ ఉందా?

నీకు బీపీ వస్తే.. నీ పీప వణుకుతాడేమో..
నాకు బీపీ వస్తే.. ఏపీ మొత్తం వణుకుద్ది..

ఇలా బీపీ మీద సినిమాల్లో బోలెడన్ని డైలాగులు.. ఈ బీపీ అన్నది మనలోనూ.. మన సినిమాల్లోనూ ఓ భాగమైపోయింది. ఎవడికైనా కోపం ఎక్కువైతే.. వాడికి బీపీ ఎక్కువరా అనేస్తాం.. ఇంతకీ ఇప్పుడీ బీపీ బాగోతం మనకెందుకంటే.. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2015–16లో దేశంలోని రక్తపోటు బాధితుల లెక్కలను తీశారు. తొలిసారిగా ఈ సర్వేలో వీరి సంఖ్యను గణించారు. పలురకాల కోణాల్లో దాన్ని విశ్లేషించారు కూడా.. దీని ప్రకారం సంపన్న వర్గాల్లో బీపీ ఎక్కువట.. ఇక్కడ మహిళల్లో 13 శాతం మందికి.. పురుషుల్లో 18 శాతం మందికి బీపీ ఉంది. దేశ సగటుతో పోలిస్తే.. ఇది ఎక్కువ. దేశంలోని పురుషుల్లో 15 శాతం మందికి బీపీ ఉండగా.. మహిళల్లో అది 11%. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని పురుషుల్లో 14 శాతం మంది రక్తపోటుతో బాధపడుతుండగా.. పట్టణాలకొచ్చేసరికి అది కాస్త పెరిగి 17 శాతంగా ఉంది. మహిళల్లో ఇది గ్రామాల్లో 10%, పట్టణాల్లో 12 శాతంగా ఉంది. రాష్ట్రాల పరంగా చూస్తే.. అత్యధికంగా సిక్కింలో 31 శాతం మంది మగవారు రక్తపోటుతో బాధపడుతున్నారు. అదే అతివల విషయానికొస్తే..సిక్కిం, అస్సాంలో 18 శాతం మంది బీపీ బాధితులేనట. తెలంగాణలో 20% , ఏపీలో 18 శాతం పురుషులకు బీపీ ఉంటే.. రెండు రాష్ట్రాల్లోని మహిళల్లో అది 13 శాతంగా ఉంది. వీటితోపాటు మతాలవారీగా కూడా రక్తపోటు బాధితుల లెక్కలేశారు. దీని ప్రకారం సిక్కుల్లో బీపీ ఎక్కువని తేల్చారు. గుండెపోటు వంటి హృదయ సంబంధిత మరణాల్లో 50 శాతం వాటికి కారణం ఈ రక్తపోటేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్న సంగతి తెలిసిందే. – సాక్షి, తెలంగాణ డెస్క్

బెడ్‌రూముల్లోంచి బ్యాంకుల్లోకి..

నోట్ల రద్దుపై ఉపరాష్ట్రపతి వెంకయ్య

- సంస్కరణల అమలులో స్వల్పకాలిక కష్టాలు తప్పవు
- జీఎస్టీతో అవినీతి, పన్ను ఎగవేత తగ్గుతుంది
- పన్ను కట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత
- ఆదాయం లేకపోతే పథకాల అమలు కష్టం
- వృద్ధి రేటులో మూడేళ్లలో చైనాను అధిగమిస్తాం
- జాతీయ సెమినార్‌లో ఉపరాష్ట్రపతి ప్రసంగం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య

సాక్షి, హైదరాబాద్: నోట్ల రద్దుపై విమర్శలొచ్చినా కీలకమైన ఈ సంస్కరణతో బెడ్‌రూంలు, బాత్‌రూంలు, మెత్తల (దిండ్లు) కింది డబ్బు బ్యాంకులకు చేరిందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఇందులో నల్లధనమెంతో, తెల్లధనమెంతో రిజర్వు బ్యాంకు విశ్లేషణ చేయాలన్నారు. సంస్కరణల అమలులో స్వల్పకాలిక కష్టాలు తప్పవన్న వెంకయ్య.. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలుతో దేశంలో అవినీతి, పన్ను ఎగవేత తగ్గుతాయని పేర్కొన్నారు. బిల్లులు లేకుండా, ఆన్‌లైన్‌లో లావాదేవీలు నమోదు చేయకుండా వ్యాపారం చేయడం ఇప్పుడు కుదరదని, జీఎస్టీతో పన్ను వసూలు పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సమాఖ్య వ్యవస్థ విజయానికి జీఎస్టీ అమలు నిదర్శనమని వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఫైనాన్స్, మార్కెటింగ్, పన్ను విధానం–సమకాలీన పరిస్థితులు, సవాళ్లు' అంశంపై నిర్వహించిన 2 రోజుల జాతీయ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య.. సెమినార్‌ను ప్రారంభించి ప్రసంగించారు. పన్ను చెల్లింపు ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వాలకు ఆదాయం రాకపోతే సంక్షేమ కార్యక్రమాల అమలు కష్టమవుతుందని చెప్పారు. పన్ను చెల్లింపు పరపతి పెరిగినపుడు, ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నపుడు ప్రజలపై పన్నులు, భారాలు తగ్గుతాయని వ్యాఖ్యానించారు. పేదరికం, నిరక్షరాస్యత, విధ్వంసం, వివక్ష, అవినీతి, హింస, తీవ్రవాదం నుంచి విముక్తి పొందినపుడే నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లని.. గతం నుంచి పాఠాలు నేర్చుకుని ఆ దిశలో మరింత వేగంగా ముందుకెళ్లాలని సూచించారు.

ప్రపంచమంతా భారత్‌వైపు..

ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ అంచనాల మేరకు 2018లో స్థూల జాతీయోత్పత్తి 7.3 శాతం నమోదవుతుందని, రానున్న 15 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందని చెప్పారు. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని, వచ్చే మూడేళ్లలో ఆర్థిక వృద్ధి రేటులో చైనాను భారత్ మించిపోతుందన్నారు. విద్యార్థులకు డిగ్రీలిస్తే సరిపోదని, జీవితంతో పాటు విద్యలోనూ నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిపూర్ణంగా తీర్చిదిద్దాలన్నారు. సిలబస్‌లో మార్పులు చేయాలని, సమకాలీన అంశాలపై బోధన జరగాలని అభిప్రాయపడ్డారు. సెమినార్‌కు కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి జస్టిస్ నర్సింహారెడ్డి అధ్యక్షత వహించగా.. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రామచంద్రం, యూజీసీ సభ్యుడు గోపాల్‌రెడ్డి, కేశవ్ సొసైటీ ఉపాధ్యక్షుడు నర్సింహారావు, శ్రీధర్‌రెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సెమినార్ కన్వీనర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

'ట్రిపుల్'పై కేకేతో ముస్లిం లా బోర్డు ప్రతినిధుల భేటీ



సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఎంపీ కె.కేశవరావును ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులు, ఎంఐఎం ఎమ్మెల్యే పాషాఖాద్రీ తదితరులు మంగళవారం కలిశారు. ఈ మేరకు కేకే నివాసంలో బిల్లుపై కాసేపు చర్చించారు. ఇప్పటికే లోక్‌సభలో నెగ్గిన ట్రిపుల్ తలాక్ బిల్లులోని పలు అంశాలపై తమకు వ్యతిరేకత ఉందని లా బోర్డు సభ్యులు వెల్లడించారు. తమ అభ్యంతరాలను కేకేకు వివరించారు. రాజ్యసభలో బిల్లు చర్చకు వచ్చినప్పుడు వీటిపై మాట్లాడాలని కోరారు. అయితే దీనిపై కేకే ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలిసింది. ఈ సమావేశంపై కేకే ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. అయితే లోక్‌సభలో అనుసరించినట్టుగానే ట్రిపుల్ తలాక్ బిల్లు చర్చకు వచ్చినప్పుడు వాకౌట్ చేయాలనే యోచనతో ఉన్నట్టుగా తెలిసింది.

రాత్రి 9 లోపు నిఖా పూర్తికావాలి

- నిబంధనలు పాటించని ఖాజీలకు నోటీసులు
- ఫంక్షన్ హాళ్లు రాత్రి 12 గంటలకు మూసేయాలి
- నిర్ణయించిన ముస్లిం వివాహ వేడుకల నియంత్రణ సదస్సు
- ఆడంబరాలకు దూరంగా పెళ్లి వేడుక



సాక్షి, హైదరాబాద్: ముస్లింల పెళ్లంటే ఆడంబరం.. హంగు.. ఆర్భాటం.. పెద్ద ఎత్తున డీజే సౌండ్‌లతో పెళ్లి కొడుకు బరాత్, నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా నిఖా (పెళ్లి) తంతు, విందులో 10 నుంచి 20 రకాల ఆహార పదార్థాలు, తెల్లవారుజాము వరకు విందు భోజనం ఆరగింపు. ఇక ఇలాంటి పెళ్లి వేడుకలకు ఫుల్‌స్టాప్ పడనుంది. సాదాసీదాగా పెళ్లి వేడుకలు జరుగనున్నాయి. ఆంక్షలతో కూడిన బరాత్.. రాత్రి తొమ్మిది గంటల్లోపు నిఖా (పెళ్లి) తంతు.. రాత్రి 11.30 గంటల్లోగా వివా హ విందు పూర్తి చేసి, అర్ధరాత్రి 12 గంటల్లోగా ఫంక్షన్ హాల్ మూతవేయాలి. ఈ మేరకు మంగళవారం వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో చైర్మన్ సలీం అధ్యక్షతన జరిగిన 'ముస్లిం వివాహ వేడుకల నియంత్రణ సదస్సు' నిర్ణయం తీసుకుంది. ఈ సదస్సులో ఇస్లామిక్ స్కాలర్స్, మతగురువులు, ముఫ్తీలు, ఉలేమాలు, మషాయిఖీన్లు, ఖాజీలు, పోలీసు ఉన్నతాధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

నిఖాపై సమయ పాలన

వివాహ వేడుకల్లో పెళ్లి (నిఖా) ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల లోపు మాత్రమే చేయాలని నిర్ణయించింది. రాత్రి తొమ్మిది తర్వాత నిఖా జరిపించవద్దని ఖాజీలకు సూచించింది. దీనిని ఉల్లంఘించే ఖాజీలకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని సదస్సు వక్ఫ్‌బోర్డుకు విజ్ఞప్తి చేసింది. మసీదుల్లో నిఖాను జరిపించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడింది. ఈ మేరకు ఖాజీలకు గైడ్‌లైన్స్ జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

సాదాసీదాగా విందు

పెళ్లి విందులో ఆడంబరాలకు వెళ్లకుండా సాదాసీదాగా ఒక బిర్యానీ, ఒక కర్రీ, ఒక స్వీట్ మాత్రమే పెట్టాలని సదస్సు సూచించింది. విందు భోజనాలు కూడా రాత్రి 11.30 గంటల్లోగా పూర్తి చేయాలని కోరింది. సెలబ్రిటీ, వీవీఐపీలకు వారి విజ్ఞప్తుల మేరకు షరియత్‌కు లోబడి విందును అనుమతించాలని సదస్సు నిర్ణయించింది.

బరాత్, ఫంక్షన్ హాళ్లపై ఆంక్షలు

పెళ్లి వేడుకల సందర్భంగా జరిగే బరాత్, ఫంక్షన్ హాల్ సమయాలపై ఆంక్షలు విధించాలని సదస్సు నిర్ణయించింది. హంగు, ఆర్భాటాల బరాత్‌ను కట్టడి చేయాలని, ఫంక్షన్ హాళ్లను రాత్రి 12 గంటల్లోపు మూసేసే విధంగా పోలీసులు చర్యలు చేపట్టాలని సదస్సు సూచించింది. వివాహ వేడుకల్లో డ్యాన్స్‌లను బహిష్కరించాలని సదస్సు నిర్ణయించింది.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు పాఠశాలలకు మళ్లీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం రెండోసారి హెచ్చరించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు 2017–18 విద్యా సంవత్సరం ఫీజులనే ఈ ఏడాది కూడా కొనసాగించాలని స్పష్టం చేసింది. వాటికి మించి అధికంగా వసూలు చేస్తే గుర్తింపు కూడా రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు అందలేదని పేర్కొన్నాయి. దీంతో పాఠశాల విద్యా డైరెక్టర్ కిషన్ ఈనెల 11న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి పాత ఫీజుల కొనసాగింపు ఉత్తర్వులను అందజేశారు. మరోవైపు ప్రభుత్వం కూడా రెండోసారి హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను పాఠశాలల యాజమాన్యాలు ధిక్కరిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆర్జేడీలకు, డీఈవోలకు ఆదేశాలిచ్చింది.

ఆక్టోపస్ ఆపరేషన్‌లో అపశ్రుతి

ఐదుగురు కమాండోలకు గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆక్టోపస్ పోలీసుల మాక్‌డ్రిల్‌లో అపశ్రుతి చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఛేదించే క్రమంలో ప్రమాదం జరిగింది. కమాండోలు ప్రయాణిస్తున్న కారు ముందుగా వెళ్తున్న బస్సును ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. బొంగ్లూర్ నుంచి తుక్కుగూడ వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డు బైపాస్ టీసీఎస్ వెనుక మంగళవారం ఉదయం ఆక్టోపస్ కమాండోలు బస్సు, కారుతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. డ్రిల్‌లో అతివేగంగా వెళ్తున్న బస్సును కారులో ప్రయాణిస్తున్న వారు వెళ్లి పట్టుకునే సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగా ముందు కమాండోల బస్సు వెళ్తుంటే వెనుక నుంచి టాటా ఇండికా కమాండోల కారు వెళ్లి వారిని ఆపాలి. అయితే ప్రమాదవశాత్తు వెనుక కారు ముందుగా వెళ్తున్న కమాండోల బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సురేశ్, లక్పతి, రాహుల్ భవానీసింగ్, చెన్నకేశవరెడ్డి, శేఖర్‌లకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని బస్సులో నగరంలోని కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. కారు నడిపిన లక్పతి అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మిగతా నలుగురికీ స్వల్ప గాయాలయ్యాయని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఆక్టోపస్ ఐజీలతో పాటు సివిల్ పోలీసులు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

కౌంటర్ల దాఖలుకు గడువు పెంపు

- పీఆర్‌ఎల్‌ఐఎస్‌పై మరో మూడు వారాల గడువు కావాలన్న సర్కార్, బీహెచ్ఈఎల్
- సానుకూలంగా స్పందించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్‌ఎల్‌ఐఎస్) ఎలక్ట్రో మెకానికల్ (ఈఅండ్ఎం) పరికరాల ధరల పెంపు విషయంలో కౌంటర్లు దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, బీహెచ్ఈఎల్‌కు హైకోర్టు మూడు వారాల గడువునిచ్చింది. మూడు వారాలలోపు కౌంటర్ దాఖలు చేసి, కాపీని పిటిషనర్ నాగం జనార్దన్‌రెడ్డికి అందచేయాలని ప్రభుత్వానికి, బీహెచ్ఈఎల్‌కు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారావులతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ) ఇచ్చిన ధరలను పక్కనపెట్టి డిపార్ట్‌మెంటల్ కమిటీ సలహాదారు చెప్పిన ప్రకారం ఈఅండ్ఎం పరికరాల ధరను మోసపూరితంగా పెంచారని, దీనివల్ల ఖజానాకు కోట్లల్లో నష్టం వాటిల్లుతోందని, దీనిపై దర్యాప్తు జరిపేలా సీబీఐని ఆదేశించాలని నాగం జనార్దన్‌రెడ్డి ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం, పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని, బీహెచ్ఇఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. తాజాగా మంగళవారం ఈ వ్యాజ్యం గురించి నాగం జనార్దన్‌రెడ్డి ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కౌంటర్ల దాఖలు విషయంలో తమకు మరో మూడు వారాల గడువు కావాలని ప్రభుత్వం, బీహెచ్ఇఎల్ తరఫు న్యాయవాదులు కోరారు. ఇందుకు ధర్మాసనం సానుకూలంగా స్పందించింది.

ఏఎస్పీ, సీఐలపై సస్పెన్షన్ వేటు

- వివాహేతర సంబంధం నేపథ్యంలో ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నతాధికారులు
- నా కుటుంబాన్ని నాశనం చేయవద్దని అభ్యర్థించినా సీఐ వినిపించుకోలేదు
- చంపుతానంటూ బెదిరించాడు, దీంతోనే బట్టబయలు చేయాల్సి వచ్చింది
- పోలీసుల విచారణలో ఏఎస్పీ భర్త సురేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వివాహేతర సంబంధం కేసులో అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ సునీతారెడ్డి, కల్వకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఆదేశాలు వెలువడ్డాయి. సీఐ మల్లికార్జున్ రెడ్డిని వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర సస్పెండ్ చేయగా, ఏఎస్పీ సునీతారెడ్డిని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారని పోలీస్ శాఖ తెలిపింది. వీరిద్దరి వ్యవహారంపై సునీతారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి మంగళవారం డీజీపీని కలసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఆయన తెలిపారు.

విచారణ ముమ్మరం చేసిన పోలీసులు

మరోవైపు ఇరువురి అక్రమ సంబంధం విషయంలో కేపీహెచ్‌బీ పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఏఎస్పీ భర్త సురేందర్‌రెడ్డి, తల్లి ప్రమీలమ్మ, పెద్దమ్మ సునంద, సురేందర్‌రెడ్డి స్నేహితుడు సురేష్ కుమార్‌లను పోలీసులు విచారించి ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలు నమోదు చేసుకున్నారు. సీసీ టీవీ ఫుటేజిలు, ఇరువురి ఫోన్ కాల్ డేటాను పోలీసులు సేకరిస్తున్నారు. మల్లికార్జున్‌రెడ్డి తమ కుటుంబంలో నిప్పులు పోశాడని, ఏవేవో ఆశలు చూపి పచ్చని కాపురంలో చిచ్చుపెట్టాడని ఏఎస్పీ తల్లి, పెద్దమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువురి కుటుంబాలు రోడ్డున పడొద్దని తాము ఎంతగానో ఓపికపట్టి వివాదం లేకుండా సర్దిచెప్పినా వినిపించుకోలేదని పోలీసులకు తెలిపారు. నా కుటుంబాన్ని నాశనం చేయవద్దని అభ్యర్థించినా సీఐ తీరు మార్చుకోకపోగా తమనే చంపుతానంటూ హెచ్చరించడంతో బట్టబయలు చేయాల్సి వచ్చిందని భర్త సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

2016లోనే దొరికినా తీరు మారలేదు

ఏఎస్పీకి, సీఐకి నడుమ సాగుతున్న అక్రమ సంబంధం విషయాన్ని 2016 జూలైలోనే భర్త సురేందర్‌రెడ్డి, కుటుంబసభ్యులు కనిపెట్టి వారిని ప్రశ్నించారు. తమ మధ్య ఎలాంటి సంబంధాల్లేవని బుకాయించడంతో పాటు అనుమానించవద్దని ఇరువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్తతో పాటు కుటుంబసభ్యులు గట్టిగా నిలదీయడంతో మరోమారు ఇలా జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చి ఇరువురు క్షమాపణ చెప్పారు. ఇకపై ఎలాంటి సంబంధాలను కలిగి ఉండనని చెప్పడంతో భార్య మాటలను నమ్మిన సురేందర్‌రెడ్డి కాపురం సాగించాడు.

ఇటువంటి చర్యలను ఉపేక్షించబోం: నాయిని

పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించిన ఏఎస్పీ, సీఐలపై చర్యలు తీసుకున్నామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో పోలీస్ శాఖలో ఇటువంటి చర్యలకు పాల్పడితే ఎంతటి స్థాయి అధికారులనైనా ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు.

మెసేజ్‌లో పెళ్లి ప్రపోజల్..

కొన్ని రోజుల తర్వాత మల్లికార్జున్‌రెడ్డి నుంచి సునీత ఫోన్‌కు మెసేజ్‌లు రావడం, తనకంటే ఉన్నతస్థాయిలో ఉన్న అధికారిణి పట్ల గౌరవం లేకుండా ఏక వాక్యంగా మెసేజ్‌లు పంపడం చూసిన సురేందర్‌రెడ్డికి అనుమానం మొదలైంది. మల్లికార్జున్‌రెడ్డి ఏఎస్పీ సెల్‌కు పంపిన మెసేజ్‌లో వివాహం చేసుకుందామని ప్రతిపాదించడం చూసిన ఆయన ఇరువురు అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్నారని నిర్ధారణకు వచ్చాడు. ఈ క్రమంలో మల్లికార్జున్‌రెడ్డి తనను చంపేస్తానని బెదిరించడంతో మనోవేదనకు గురైన ఆయన భార్య తరఫు కుటుంబీకుల మద్దతు తీసుకుని ఇరువురి బండారం బట్టబయలు చేయాలని నిర్ణయించు కున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం అర్ధరాత్రి ఇరువురు తన నివాసానికి 11.30 సమయంలో వచ్చి సుమారు రెండున్నర గంటల పాటు కలసి ఉన్న విషయాన్ని బట్టబయలు చేశాడు.

మంటలు ఆర్పేందుకు ఆస్ట్రేలియా టెక్నాలజీ

మంత్రి జోగు రామన్న వెల్లడి



సాక్షి, హైదరాబాద్: అడవుల్లో మంటలను ఆర్పేందుకు ఆస్ట్రేలియా టెక్నాలజీని వినియోగిస్తామని అటవీ, పర్యావరణ మంత్రి జోగు రామన్న తెలిపారు. మంగళవారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో ఎఫ్‌డీసీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డితో కలిసి అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) కార్యక్రమాలను సమీక్షించారు. ఎకో టూరిజంలో ప్రోత్సహించే చర్యల్లో భాగంగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌తో నేరెడిగొమ్ము మండలం పెద్ద మునగాల గ్రామంలో రూ. రెండు కోట్లతో, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామంలో రూ. రెండు కోట్ల వ్యయంతో కొత్త ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. ఎకో టూరిజం అభివృద్ధికి అనువైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీసీకి యూకలిప్టస్ అమ్మకాల ద్వారా రూ.123 కోట్లు, వెదురు ద్వారా రూ.13 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్ కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌లో పాలపిట్ట సైక్లింగ్ పార్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎఫ్‌డీసీ పూర్తిగా నిరాదరణకు గురైందని, రానున్న రోజుల్లో ఎఫ్‌డీసీని మరింత బలోపేతం చేస్తామని బండ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమీక్షలో ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ చందన్ మిత్రా సంస్థ పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రసాద్ మల్టీప్లెక్స్‌కు హైకోర్టు నోటీసులు

కౌంటర్లు దాఖలు చేయాలని సర్కారుకు కూడా..



సాక్షి, హైదరాబాద్: ప్రసాద్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్‌లో ముఖ్యంగా లార్జ్‌స్క్రీన్ థియేటర్‌లో సీట్ల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా ఉందంటూ అందిన లేఖపై హైకోర్టు స్పందించింది. ఈ లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు.. చట్ట నిబంధనల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం, పురపాలక, రెవెన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీజీపీ, జిల్లా కలెక్టర్, జిల్లా అగ్నిమాపక అధికారితో పాటు ప్రసాద్ మల్టీప్లెక్స్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసాద్ ఐమాక్స్ థియేటర్‌లోని లార్జ్‌స్క్రీన్ థియేటర్‌లో 14 వరుసల్లో 630 సీట్లు ఉన్నాయని, సీట్ల మధ్య నుంచి బయటకొచ్చే వెసులుబాటు ఎక్కడా లేదని, ఇది అత్యవసర సమయాల్లో అనేక ప్రమాదాలకు దారి తీస్తుందంటూ సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌గోపాల్ హైకోర్టుకు లేఖ రాశారు.

ఎంసెట్ కేసులో కొత్త బాధితులు

సీఐడీ కార్యాలయానికి వచ్చి ఆరా తీస్తున్న బాధితులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని పట్టి కుదిపేసిన ఎంసెట్–2015 ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కొత్త బాధితులు పుట్టుకొస్తున్నారు. తమ పిల్లల పేర్లు కేసులో వస్తాయన్న భయంతో ఇప్పటివరకూ బయటకురాని తల్లిదండ్రులు ఇప్పుడు సీఐడీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ కేసులో సీఐడీ రూ. 7 కోట్లకు పైగా రికవరీ చేసినట్లు తెలియడంతో తాజాగా 30 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ డబ్బుల గురించి అధికారుల్ని ఆరా తీస్తున్నారు. 160 మంది విద్యార్థులకు ప్రశ్నాపత్రం వెల్లడించినట్లుగా దర్యాప్తులో వెలుగు చూడగా సీఐడీ ఇప్పటివరకూ 126 మంది బాధితుల్ని గుర్తించింది. బాధితుల సంఖ్య మరో 30కి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. దర్యాప్తులో నిందితులు వెల్లడించిన అంశాల్లో తమ పేర్లేమైనా వెల్లడించారా? అంటూ బాధితులు ఆరా తీస్తున్నారు. ఈ 30 మంది ఒక్కొక్కరు రూ.50 లక్షల చొప్పున నిందితులకు ముట్టచెప్పినట్టు సీఐడీ అధికారులు తెలిపారు. ఈ కేసులో 74 మంది నిందితులను అరెస్టు చేసిన సీఐడీ మరో 14 మంది నిందితుల అరెస్టుకు ప్రయత్నాలు చేస్తోంది.

ఆ గురుకులాల ప్రిన్సిపాళ్లకు ఇంక్రిమెంట్ కట్

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి 2017 ఫలితాల్లో వెనుకబడిన గురుకులాల ప్రిన్సిపాళ్ల వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను విద్యాశాఖ నిలిపివేసింది. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఉత్తర్వులు జారీ చేసింది. నిలుపుదలపై ఏమైనా విజ్ఞప్తులు ఉంటే 15 రోజుల్లో తెలపాలని పేర్కొంది. పదో తరగతి ఫలితాల్లో బెల్లంపల్లి గురుకుల పాఠశాల ఫలితాలు 15 శాతం తగ్గిపోయాయని తెలిపింది. అలాగే బోరబండ బాలికల గురుకుల పాఠశాలలో 16 శాతం, వైరా బాలికల గురుకుల పాఠశాలలో 18 శాతం, తుంగతుర్తి బాలుర గురుకుల పాఠశాలలో 11 శాతం, బోరబండ బాలుర గురుకుల పాఠశాలలో 20 శాతం, నెక్కొండ బాలిక గురుకుల పాఠశాలలో 11 శాతం, బూర్గంపహాడ్ గురుకుల పాఠశాలలో 22 శాతం ఫలితాలు తగ్గిపోయాయని పేర్కొంది. వాటిపై వివరణ ఇవ్వాలని గత అక్టోబర్‌లో ఆయా ప్రిన్సిపాళ్లకు నోటీసులు జారీ చేసింది. అయితే వారి వివరణపై సంతృప్తి చెందని విద్యా శాఖ వారి వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్‌పై కోత విధించింది.

ముగిసిన కానిస్టేబుళ్ల శిక్షణ

29 నుంచి పాసింగ్ ఔట్ పరేడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీస్ శాఖకు ఎంపికైన కానిస్టేబుళ్ల తొమ్మిది నెలల ఇండక్షన్ ట్రెనింగ్ పూర్తయింది. గతేడాది మే మొదటి వారంలో ప్రారంభమైన శిక్షణను 9,281 మంది కానిస్టేబుళ్లు పూర్తి చేసుకున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. శిక్షణ పూర్తయిన ట్రైనీ సిబ్బందికి ఈ నెల 29, 30, 31 తేదీల్లో పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించనున్నారు. 29న జరిగే 2, 3వ బెటాలియన్ల పీటీసీలో డీజీపీ మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. అలాగే 30న ఒకటో బెటాలియన్‌కు శాంతి భద్రతల అదనపు డీజీపీ అంజనీకుమార్, 4వ బెటాలియన్‌కు నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి, 10వ బెటాలియన్‌కు గ్రేహౌండ్స్ ఐజీ శ్రీనివాస్‌రెడ్డి, 13వ బెటాలియన్‌కు ఎస్ఐబీ ఐజీ సజ్జనార్, 15వ బెటాలియన్‌కు వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర ముఖ్య అతిథిలుగా హాజరవ్వనున్నారు. 31న జరిగే పాసింగ్ పరేడ్‌లో 8వ బెటాలియన్‌కు రైల్వే డీజీపీ కృష్ణప్రసాద్, 12వ బెటాలియన్‌కు బెటాలియన్స్ ఐజీ అభిలాష బిస్త్ ముఖ్య అతిథిలుగా పాల్గొననున్నారు.

మార్చి 15 నాటికి చివరి గ్రామానికీ నీరు

మిషన్ భగీరథ సదస్సులో సీఎస్ ఎస్పీ సింగ్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యాధునిక నీటి సరఫరా వ్యవస్థను మిషన్ భగీరథలో ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ చెప్పారు. రాష్ట్రంలోని 24,225 గ్రామాలకు దశలవారీగా బల్క్‌గా నీటిని అందిస్తామని, మార్చ్ 15 నాటికి రాష్ట్రంలోని చివరి గ్రామానికి నీళ్లు అందుతాయన్నారు. మిషన్ భగీరథలో ప్రజల భాగస్వామ్యంపై ఎర్రమంజిల్‌లో మంగళవారం ఒకరోజు వర్క్‌షాపు జరిగింది. సర్పంచులు, జిల్లా పంచాయతీ అధికారులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సింగ్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో మిషన్ భగీరథతో విప్లవాత్మక మార్పు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు ఫలాలు ముందుగా ఎస్సీ, ఎస్టీలకే అందుతాయన్నారు. యునిసెఫ్ హైదరాబాద్ చీఫ్ రస్దియా మాట్లాడుతూ మిషన్ భగీరథ ప్రభావంపై సెస్‌తో కలసి సర్వే చేస్తున్నామని, త్వరలోనే ఫలితాలను చెపుతామన్నారు. ఈ సదస్సులో సెస్ డైరెక్టర్ గాలెబ్, ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి, ప్రపంచబ్యాంక్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్ జేవీఆర్ మూర్తి, యునిసెఫ్ ప్రతినిధి రాజు నల్లి, ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ ప్రతినిధి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు ఈసీ షెడ్యూల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు షెడ్యూల్ ప్రకటించింది. 83 గ్రామీణ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టనుంది. ఈ మేరకు ఈసీ ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. ఓటర్ల జాబితాపై ఫిబ్రవరి 14 వరకు అభ్యంతరాలు, వినతులు స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 4, 12వ తేదీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మార్చి 5 నాటికి అభ్యంతరాల పరిష్కరణ, 15 నాటికి డేటా నమోదు ప్రక్రియ పూర్తి, 22 నాటికి తుది జాబితా ముద్రణ, మార్చి 24న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనుంది.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గద్దర్

మంద కృష్ణపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్
- అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎప్పుడు తీసుకెళ్తారు: గద్దర్

హైదరాబాద్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, మాదిగ మేధావుల వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, టీపీసీసీ నేత మల్లు రవి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. గద్దర్ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న నాయకుడిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరైంది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎప్పుడు తీసుకెళ్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అత్యంత అరాచకంగా, అప్రజాస్వామికంగా మంద కృష్ణమాదిగను అరెస్ట్ చేశారని డాక్టర్ చెరుకు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయబద్ధమైన హక్కుల కోసం పోరాడుతున్న మంద కృష్ణను అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని మల్లురవి అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మాదిగలు ఉన్నారని, ఈ మాదిగలు తలుచుకుంటే ప్రభుత్వాన్ని కూల్చివేస్తారని గాలి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణలో జరుగుతున్న నిర్బంధాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 4న ఓయూలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కాశీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉ. సాంబశివరావు, అద్దంకి దయాకర్, నల్లా రాధాకృష్ణ, ప్రొఫెసర్లు మధు, జి. లక్ష్మణ్, ముత్తయ్య, ఇటుకాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు కర్మచారుల సంఘాల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో సఫాయి కర్మచారుల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని, కార్మికులకు పక్కా ఇళ్లు, భూ పంపిణీ, పిల్లల చదువులకయ్యే ఖర్చు మొత్తాన్ని భరించాలని అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం జాతీయ కార్యవర్గ సమావేశాలు హరిద్వార్‌లో జరిగాయి. పారిశుద్ధ్య కార్మికుల నియామకంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను ప్రభుత్వాలు రద్దు చేయాలని, కాంట్రాక్టు సిబ్బందిని క్రమబద్ధీకరించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

ఐదు లక్షల మందితో భారీ సభ: ఆర్.కృష్ణయ్య

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లో ఐదు లక్షల మంది నిరుద్యోగులతో త్వరలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, శాసన సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం నల్లగొండలో బీసీ యువజన సంఘం, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ గర్జన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేసేంత వరకు ఉద్యమాలను నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వివిధ శాఖలలో సుమారు రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు.

'పెట్టుబడి'కి చెక్కుల చిక్కులు!

రైతులకు ఇచ్చే చెక్కులను ప్రత్యేకంగా ముద్రించుకోవాల్సిందే

- ఒకేసారి 70 లక్షల చెక్కులు ఇవ్వలేమంటున్న బ్యాంకులు
- కేంద్రం నుంచి ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని స్పష్టం
- త్వరలోనే కేంద్రానికి లేఖ రాయనున్న సర్కారు
- ముద్రణకు అయ్యే ఖర్చు ప్రభుత్వంపైనే..



సాక్షి, హైదరాబాద్: వినియోగదారులకు చెక్కులు కావాలంటే బ్యాంకులో కొన్నింటిని ఉచితంగా ఇస్తారు. అదనంగా కావాలంటే కొంత డబ్బు చెల్లిస్తే ఇస్తారు. అంతేగానీ వాటిని మనమే ముద్రించుకోలేం కదా. రాష్ట్ర ప్రభుత్వానికి సరిగ్గా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. రైతు పెట్టుబడి పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఒకేసారి 70 లక్షల చెక్కులు అవసరమయ్యాయి. అయితే ఒకేసారి అన్ని చెక్కులు సమకూర్చడం తమవల్ల కాదని చేతులెత్తేసిన బ్యాంకులు.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుకుని ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని స్పష్టం చేస్తున్నాయి. దీంతో చెక్కులు కావాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. కేంద్రం అనుమతిస్తే చెక్కులను ప్రత్యేకంగా ముద్రిస్తారు. అలా ముద్రించి ఇచ్చిన చెక్కులను రాష్ట్రంలో బ్యాంకులకు వ్యవసాయ శాఖ అందజేస్తుంది. ఆ తర్వాత వాటిపై రైతుల వివరాలను, పెట్టుబడి సాయం సొమ్ము నమోదు చేసి రైతులకు అందజేస్తారు.

చెక్కులకు డబ్బు చెల్లించాల్సిందే..

రాష్ట్రంలో రైతు పెట్టుబడి పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం చెక్కులను ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఖరీఫ్ నుంచి అమలు చేసే ఈ పథకం కింద రైతులకు చెక్కులు ఇస్తారు. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో రైతు ఖాతాలు 71.75 లక్షలున్నాయి. ఆ ప్రకారం రైతుల సంఖ్య అటుఇటుగా 70 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. అందువల్ల అంతమంది రైతులకు చెక్కులు ఇవ్వాలంటే మాటలు కాదు. ఈ నేపథ్యంలో చెక్కులను ముద్రించి ఇచ్చేందుకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని అంటున్నారు. వినియోగదారులకు 30 చెక్కులు ఉచితంగా ఇస్తారు. అంతకంటే ఎక్కువ కావాలంటే ఒక్కో చెక్కుకు రూ.2.50 నుంచి రూ.5 వరకు వసూలు చేస్తారు. ఆ ప్రకారం 70 లక్షల చెక్కులకు రూ.2 కోట్లకు పైనే ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే చెక్కులు ముద్రించే ప్రదేశం నుంచి తెప్పించుకునేందుకు రవాణా చార్జీలు అదనంగా ఉంటాయని అంటున్నారు. రబీ సీజన్‌కు కూడా అప్పటి అవసరాన్ని బట్టి మళ్లీ చెక్కులను ముద్రించుకోవాల్సి ఉంటుంది. ఒకేసారి 70 లక్షల ముద్రణ సాధ్యమయ్యే పనికాదు. వినియోగదారులు తమకు చెక్కులు కావాలంటే బ్యాంకులు ఇండెంట్ పెట్టి సమయం ఇస్తాయి. ఈ మేరకు ఇన్ని లక్షల చెక్కుల ముద్రణకు కనీసం రెండు నెలల సమయం తీసుకుంటుందని చెబుతున్నారు. అంటే ప్రభుత్వం కేంద్రం నుంచి అనుమతి తీసుకొని ముద్రణకు ఆర్డర్ ఇస్తే మార్చి వరకు సమయం పడుతుంది. కాబట్టి చెక్కుల ప్రక్రియను వేగవంతం చేయాలని భావిస్తున్నారు.

దొరలకో చట్టం.. దళితులకో చట్టం

బెయిల్‌పై విడుదలైన మంద కృష్ణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దళితులకు ఒక చట్టం.. దొరలకు మరో చట్టం నడుస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. 21 రోజులుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంటున్న మంద కష్ణకు మంగళవారం సికింద్రాబాద్ సివిల్ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాత్రి 9 గంటలకు విడుదలయ్యారు. దీక్ష చేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద మంద కృష్ణ రెచ్చగొట్టే ప్రసంగం చేశారని పోలీసులు ఆయనను ఈనెల 2న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి చంచల్‌గూడ జైల్లో ఉన్న ఆయనకు బెయిల్ లభించడంతో బయటకు వచ్చారు. ఆయన జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ నెల 25న అన్ని పార్టీలతో అఖిల పక్షం సమావేశం నిర్వహించి వారి సూచనలు, సలహాల మేరకు భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు.

బదిలీకి దారితీసిన పోస్టర్ ఆవిష్కరణ

జయశంకర్ అగ్రి వర్సిటీలో ఘటన

హైదరాబాద్: వర్సిటీలో పోస్టర్ ఆవిష్కరణ సభకు అనుమతినిచ్చినందుకు జయశంకర్ వ్యవసాయవర్సిటీ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ (ఈఈఐ) డైరెక్టర్ ఆనంద్‌సింగ్ బదిలీకి గురయ్యారు. ఫిబ్రవరి 4న ఆలంపూర్‌లో నిర్వహిస్తున్న స్వేరో జ్ఞాన మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించేందుకు ఆయన అనుమతించారు. మంగళవారం నిర్వాహకులు సభ ఏర్పాట్లలో ఉండగా వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్ కుమార్‌తో కలిసి వీసీ ప్రవీణ్‌రావు అటుగా వచ్చారు. ఇక్కడ వర్సిటీకి సంబంధించిన సమావేశాలు మాత్రమే నిర్వహించాలని, ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతి లేదని నిర్వాహకులకు చెప్పడంతో వీరి మధ్య వాగ్వివాదం జరిగింది. వీసీ, రిజిస్ట్రార్‌లకు వ్యతిరేకంగా స్వేరోస్ నాయకులు నినాదాలు చేస్తూ బైఠాయించారు. వారిని సముదాయించిన ప్రవీణ్‌రావే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఖమ్మం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రానికి ఆనంద్ సింగ్‌ను బదిలీ చేస్తున్నట్లు వీసీ ఆదేశాలిచ్చారు.

విత్తన కంపెనీల మాయాజాలం

- సొంతసాగు పేరుతో రూ.కోట్లల్లో పన్నులు ఎగవేత
- పంట భూములు లీజుకు తీసుకున్నట్లు రికార్డులు
- ఐటీ శాఖ దాడులతో బయటపడుతున్న నిజాలు



సాక్షి, హైదరాబాద్: ఆదాయపు పన్ను ఎగవేసేందుకు విత్తన కంపెనీలు అడ్డదారులు తొక్కుతున్నాయి. రైతుల పేరుతో కోట్ల రూపాయలు పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నాయి. తామే సొంతంగా రైతుల అవతారమెత్తినట్లు బడా కంపెనీలు నాటకమాడుతున్న తీరు ఆదాయపు పన్ను శాఖను విస్మయానికి గురి చేస్తోంది. రాష్ట్రంలో కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో వందలాది విత్తన ఉత్పత్తి కంపెనీలున్నాయి. అనుకూలమైన వాతావరణం ఉండటంతో పాటు అనువైన పంట భూములు, రవాణా సదుపాయాలుండటంతో ఈ ప్రాంతంలో విత్తన ఉత్పత్తి కంపెనీల వ్యాపారం వర్ధిల్లుతోంది. విత్తన కంపెనీలు తమకు అవసరమయ్యే పంట ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసి.. నాణ్యమైన విత్తనాలను తయారు చేస్తాయి. ప్రయోగ దశలో కొన్ని ప్రాంతాల్లో కంపెనీలే రైతుల పొలాల్లో అవసరమైన పంట వేయించి విత్తనాలను ఉత్పత్తి చేస్తాయి.


రైతుల పేరిట నాటకం..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో రైతులు, వ్యాపారుల నుంచి ఓ బడా కంపెనీ రూ.500 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేస్తోంది. రైతులు తమ భూముల్లో పండించే పంట ద్వారా వచ్చిన ఆదాయానికి ఐటీ మినహాయింపు ఉంది. కంపెనీల పెట్టుబడులు, రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారం ఐటీ పరిధిలోకి వస్తాయి. అందుకే సదరు కంపెనీ సొంతంగా 2 వేల ఎకరాల వ్యవసాయ భూమి లీజుకు తీసుకున్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించినట్లు తెలిసింది. కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో ఈ భూములున్నాయని, అక్కడ పండించిన పంట నుంచే తాము విత్తనాలను ఉత్పత్తి చేసినట్లు వ్యాపారం చేస్తోంది. విత్తనాల తయారీకి తాము పెట్టిన పెట్టుబడి ఐటీ పరిధిలోకి రాదంటూ నాటకానికి తెర తీసింది. ఇటీవల ఈ కంపెనీ టర్నోవర్‌కు, పన్ను చెల్లింపునకు భారీ వ్యత్యాసం ఉండటంతో ఆదాయపు పన్ను శాఖ నిర్వహించిన సోదాల్లో ఈ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. విత్తన ప్రయోగ క్షేత్రాలు 50 ఎకరాల్లో లేకున్నా.. వేలాది ఎకరాలు లీజుకు తీసుకున్నట్లు విత్తన కంపెనీలు ఎగవేసిన సొమ్ము గడిచిన ఐదేళ్లలో దాదాపు రూ.1,000 కోట్లకు పైగా ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

నగదు పేరిట మరో మోసం..

నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకుని దానికి లెక్క చూపించకుండా పన్ను ఎగవేతలోనూ విత్తన కంపెనీలు పోటీ పడుతున్నాయి. తెలంగాణ, ఏపీ, కర్ణాటకతో పాటు గుజరాత్‌లో ఇటీవల ఆదాయ పన్ను శాఖ దాడులు నిర్వహించింది. రైతులు నగదు చెల్లించి డీలర్లు, వ్యాపారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయటం సర్వసాధారణం. కానీ డీలర్లు, వ్యాపారులు సంబంధిత కంపెనీలకు నగదు చెల్లించటం కుదరదు. తమ వ్యాపార లావాదేవీలు రూ.2 లక్షలు దాటితే చెక్కు లేదా డీడీ రూపంలో చెల్లించాలి. కానీ కంపెనీలు నగదు రూపంలోనే తమకు డబ్బు చెల్లించాలని డీలర్లను ప్రోత్సహిస్తున్నాయి. నగదు చెల్లిస్తే ప్రోత్సాహకాలు, పారితోషికం కూడా ఇస్తామంటూ ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో తెలంగాణలోని విత్తన వ్యాపారులు, ఆథరైజ్డ్ డీలర్లు దాదాపు 70 నుంచి 80 శాతం లావాదేవీలను నగదు రూపంలోనే నిర్వహిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఓ టాప్ కంపెనీ దాదాపు రూ.300 కోట్లకు పైగా నగదు స్వీకరించినట్లు తెలిసింది.

ఆంధ్రప్రదేశ్



69వ రోజు

23-01-2018, మంగళవారం
చెన్నప్పనాయుడుపేట,
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

పాదయాత్ర డైరీ

న్యాయం చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరడం కూడా అత్యాశే

గత 68 రోజులుగా వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో జరిగిన ప్రజా సంకల్ప యాత్ర నేటితో సింహపురికి చేరింది. దశాబ్దాలుగా కరువుకాటకాలతో సతమతమవుతున్న ఈ 4 జిల్లాల్లోని ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కరువుకాటకాల సమస్యలు ప్రకృతిపరమైనవైతే, తీర్చగలిగే అవకాశం ఉండీ.. పాలకులు పట్టించుకోని సమస్యలు చాలా ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, పాలకులే సృష్టించిన సమస్యలు మరెన్నో. పేదరికంతో, సమస్యలతో నిత్యం జీవన పోరాటం చేస్తున్న ఈ ప్రజలకు అండగా ఉండి, రక్షించాల్సిన ప్రభుత్వమే సమస్యగా మారితే.. పాలించే వారే సమస్యలు సృష్టించి పీడిస్తూ ఉంటే.. ప్రజలెలా బతకాలి? ఎవరితో చెప్పుకోవాలి? ఉదయం 10.05 గంటలకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అడుగుపెట్టాను. ఈ జిల్లాలో మహిళా చైతన్యం బాగా ఎక్కువంటారు. మొట్టమొదటిగా మద్య నిషేధ ఉద్యమాన్ని ప్రారంభించింది ఈ జిల్లా అక్కచెల్లెమ్మలే. అటువంటి ఈ జిల్లాలో అపూర్వ స్వాగతం లభించింది.

చెంబేడు గ్రామంలో హైస్కూలు విద్యార్థినులు.. వారు చదువుతున్న ప్రభుత్వ పాఠశాల స్థితిగతుల గురించి ఏకరువు పెట్టారు. తొమ్మిదో తరగతి చదువుతున్న పూర్ణిమ అనే అమ్మాయి 'అన్నా.. మా ఊరికి బస్సు సౌకర్యం సరిగా లేదు. మాతో పాటు బడికి రావడానికి టీచర్లు కూడా ఇబ్బందిపడుతున్నారు. రాత్రి పూట స్పెషల్ క్లాసెస్‌కు వెళ్లాలంటే భయమేస్తోంది. వీధి దీపాల్లేవు, దారి కూడా సరిగా లేదు. తాగుబోతు యువకులు అమ్మాయిలను వేధిస్తున్నారు. స్కూల్లో టాయిలెట్ల నిర్వహణ ఘోరంగా ఉంది. మధ్యాహ్న భోజనం చాలా అధ్వానం. మాకు చదువుకోవాలని ఎంతగా ఉన్నా.. ఈ సమస్యలతో బడి మానేసే పరిస్థితులు వస్తున్నాయి. అలా కొంతమంది అమ్మాయిలు బడి మానేశారు కూడా. మేమంతా పేద పిల్లలం. మా అమ్మానాన్నలు మమ్మల్ని ప్రయివేటు పాఠశాలల్లో చేర్పించలేరు' అంటూ ఆ బంగారు తల్లి చెబుతుంటే.. మనసులో ఓ వైపు బాధేసింది. మరో వైపు ఆ చిట్టితల్లి చైతన్యానికి ముచ్చటేసింది. విద్యార్థినులలోని ఇలాంటి ధైర్యం, చైతన్యం స్ఫూర్తిదాయకం. అదే గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆశా వర్కర్లు కలిశారు. 'సార్.. తల్లీబిడ్డల సంరక్షణ నుంచి, ప్రజారోగ్యానికి చెందిన ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ విధులు నిర్వర్తిస్తున్నాం. ఇంత చాకిరీ చేస్తున్నా.. నెలకు రూ.500 నుంచి 700 కూడా రావడం లేదు. అది కూడా మూడు, నాలుగు నెలలకోసారి ఇస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో నెలకు రూ.6000 దాకా ఇస్తున్నారు. మాకన్నా రోజు కూలీలే నయం' అంటూ ఆవేదన చెందారు. ఈ రోజు కలిసిన 108, 104 ఉద్యోగులదీ ఇదే సమస్య. వారి సమస్యలను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదట. ప్రభుత్వ విద్యను, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి, ప్రయివేటు సంస్థలకు కొమ్ముకాస్తున్న ఈ ప్రభుత్వాన్ని న్యాయం చేయాలని కోరడం కూడా అత్యాశే అవుతుంది. రాబోయే రోజుల్లో వారి జీతాలు, జీవితాలను మెరుగుపర్చడమే కాకుండా, నాన్నగారు ఏ మహదాశయంతో 104, 108 వ్యవస్థలను ఏర్పాటుచేశారో.. దాన్ని మరింత మెరుగ్గా కొనసాగిస్తానని భరోసా ఇస్తూ ముందుకు కదిలాను. అంతర్జాతీయంగా పేరొందిన షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల విడిది కేంద్రాలున్న సూళ్లూరుపేట నియోజకవర్గంలో మొదటి రోజు పాదయాత్ర అలా సాగింది. సీఎంగారికి నాదో ప్రశ్న.. మీ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఈ నాలుగు సంవత్సరాలు చాలా సంతృప్తినిచ్చాయని చెప్పుకొంటున్నారు. ప్రజలేమో.. ఈ నాలుగేళ్ల నుంచి అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నామంటున్నారు. ప్రజలు ఇంత తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తుంటే.. మీకు సంతృప్తి ఎలా వచ్చింది?

దోచుకున్నది దాచుకోడానికే...

సీఎం విదేశీ పర్యటనలపై ధ్వజమెత్తిన బత్తుల బ్రహ్మానందరెడ్డి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దోచుకున్న అవినీతి సొమ్మును దాచుకోవటానికే చంద్రబాబు విదేశీ పర్యటనలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు గద్దె నెక్కినప్పటి నుంచీ ఏటా నాలుగుసార్లు విదేశీ పర్యటనలు చేస్తున్నారని, ఇప్పటికి 17సార్లకు పైగా ఇలాంటి పర్యటనలు చేశారని చెప్పారు. ఎన్ని పర్యటనలు చేసినా ఈ నాలుగేళ్లలో సీఎం సాధించింది ఏమీ లేదన్నారు. ఆయన మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దావోస్‌కు చంద్రబాబుతో పాటు సీఎం రమేష్, లోకేష్ వెళ్లటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రమేష్ అనుభవం అంతా కాంట్రాక్టుల్లో సంపాదించటమేనని విమర్శించారు. ఇక లోకేశ్‌కు ఉన్న అనుభవం ఏమిటో అందరికీ తెలుసునన్నారు. చంద్రబాబు విదేశీయాత్రల వివరాలను పొందుపరుస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. విదేశీ పర్యటనల్లో రూ.వేల కోట్లలో పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగాలు వస్తున్నట్లు ప్రచారం చేశారే తప్ప ఒక్క శాతం నిధులూ తేలేకపోయారన్నారు.

29న 'వాక్ విత్ జగనన్న'

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర జనవరి 29 నాటికి 1,000 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుం టున్న సందర్భంగా ఆరోజు 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. 28న ఈ కార్యక్రమం ఉంటుందని అంతకు ముందు ప్రకటించినా 1,000 కిలోమీటర్లు 29 నాటికి పూర్తికా నుండటంతో ఈ మేరకు మార్పు చేశారు. ఆ రోజు అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులతో రెండు కిలోమీటర్ల పాదయాత్రలు చేపట్టనున్నట్లు పార్టీ పేర్కొంది.

కృష్ణపట్నంలో ఆయిల్ రిఫైనరీ పెట్టండి

ముఖ్యమంత్రి చంద్రబాబు



సాక్షి, అమరావతి: కృష్ణపట్నంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సౌదీ ఆర్మ్‌కో సంస్థ ప్రెసిడెంట్‌ను సైద్ అల్ హద్రమీని కోరగా ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. దావోస్ పర్యటనలో రెండోరోజు మంగళవారం సీఎం సౌదీ ఆర్మ్‌కో ప్రెసిడెంట్‌తో సమావేశమయ్యారు. తమ రాష్ట్రాన్ని తాకుతూ రెండు పారిశ్రామిక కారిడార్లున్నాయని, కృష్ణపట్నాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు వాణిజ్య పరంగా ఎంతో లాభసాటి అవుతుందని చంద్రబాబు చెప్పారు. కృష్ణపట్నంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు ప్రతిపాదనపై గతంలోనే చర్చించిన నేపథ్యంలో ఈ నెలాఖరులో ముంబైలో తమ ప్రతినిధులతో సంప్రదించాలని హద్రమీ సూచించారు. ఫిబ్రవరిలో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ సదస్సుకు హాజరవాలని హద్రమీని సీఎం ఆహ్వానించారు.

పలువురితో సీఎం భేటీ..

కాగా మిడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రతినిధులతో సీఎం సమావేశమై గతేడాది కుదుర్చుకున్న ఒప్పందంపై చర్చించారు. ఏజిల్ లాజిస్టిక్స్ సీఈవో తరక్ సుల్తా అల్ ఎస్సా, డైరెక్టర్ ఉగెన్ మెన్‌తో, హిటాచీ ప్రెసిడెంట్ తొషైకీ హిగషిహరతో సీఎం భేటీ అయ్యారు.

దుష్టపాలనతో యుద్ధం చేస్తున్నాం

- మీరందరూ సహకరిస్తే వచ్చేది మన ప్రభుత్వమే
- అప్పుడు అన్ని వర్గాల సమస్యలనూ పరిష్కరిస్తాం
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ
- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి యాదవులకు అండగా ఉంటాం



నెల్లూరు జిల్లా చెంబేడు వద్ద యాదవ సంఘం సమావేశంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు గొర్రెపిల్లను బహూకరిస్తున్న యాదవ సంఘం నాయకులు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి


'రాష్ట్రంలో ప్రస్తుతం దుష్టపాలన సాగుతోంది. దీన్ని అంతం చేసేందుకు యుద్ధం చేస్తున్నాం. ఇందుకు అందరూ సహకరించాలి. ఏడాది ఓపిక పడితే ఈ పాలన అంతమవుతుంది. వచ్చే మనందరి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరిస్తుంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో గణనీయమైన సంఖ్యలో ఉన్న యాదవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజాసంకల్ప యాత్ర 69వ రోజు మంగళవారం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రవేశించిన సందర్భంగా ఘన స్వాగతం పలికిన ప్రజలను ఉద్దేశించి ఆయన పలు చోట్ల ప్రసంగించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేసే నవరత్నాల పథకాలను వివరించారు. ఆర్లపాడు క్రాస్ వద్ద పార్టీ సీనియర్ నేత కె.పార్థసారథి నాయకత్వంలో తనను కలిసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది యాదవ సోదరులను ఉద్దేశించి జగన్ మాట్లాడారు. వారితో జగన్ ఇంకా ఏమన్నారంటే..

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

"మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం. కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న యాదవుల చిరకాల కోర్కెను కచ్చితంగా తీర్చుతాం. చంద్రబాబుకు ఎన్నికలప్పుడే బీసీలు గుర్తుకువస్తారు. నాలుగు కత్తెర్లు, నాలుగు ఇస్త్రీ పెట్టెలు ఇచ్చి ఇదే బీసీలపై ప్రేమ అంటారు. చంద్రబాబు తన ఎన్నికల ప్రణాళికలో పెట్టిన యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయమని కోరేందుకు ర్యాలీగా వెళ్లిన యువకులపై దారుణంగా లాఠీ చార్జీ చేయించి అరెస్ట్ చేసినట్టు మన సోదరులు చెప్పారు. చంద్రబాబును అడగడానికి వెళ్లిన వారిలో ఇంజినీర్లు, ఐఐటీలో చదివిన విద్యార్థులున్నట్టు కూడా పార్థసారథి చెప్పారు. ఎంత అన్యాయమైన ప్రభుత్వమో ఇది. దారిపొడవునా మన వాళ్లు విజ్ఞాపనలు, వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. యాదవులు అడిగిన ఒక్క హామీని నెరవేర్చమని అడిగితే లాఠీలు ఝుళిపిస్తారా? ఇంతకు ముందు మీరు ఎందరెందరో ముఖ్యమంత్రులను చూసి ఉంటారు. కానీ ఏ ఒక్కరికీ యాదవులకు ఒక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాలేదు. నాన్నగారి మంత్రివర్గంలో పార్థసారథి మంత్రిగా ఉన్నప్పుడు ఆయన కోరిన వెంటనే ఫెడరేషన్ ఏర్పాటు చేస్తానని ఆ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేశారు. అదీ నాన్నగారి ఘనత అని నేను గర్వంగా చెప్పగలను. ఈ రోజుకూ నాకు ఒక విషయం బాగా గుర్తుంది. ఎక్కడైనా గొర్రెపిల్ల చనిపోతే దాని చెవుకు ఒక ట్యాగ్ ఉండేది. అది ఉంటే చనిపోయిన గొర్రె పిల్లకు బీమా వచ్చేది. గొర్రె పిల్లల్ని పెంచేందుకు ఎలాంటి భయం ఉండేది కాదు. మా అన్న (డాక్టర్ వైఎస్సార్) సీఎంగా ఉన్నప్పుడు అంతటి భరోసా ఉండేదని పలువురు యాదవ సోదరులు ఇప్పటికీ చెబుతుంటారు. అందుకే చెబుతున్నా.. ఎవ్వరూ అధైర్యపడొద్దు. దేవుడి దయ, మీ అందరి ఆశీర్వాదాలతో ఏడాదిలో మన ప్రభుత్వం వస్తుంది. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత యాదవ సోదరులకు మళ్లీ అటువంటి భరోసా కల్పిస్తా. అంతేకాదు.. తిరుపతి సన్నిధి గొల్లలకు దేవుడి గుడి తలుపులు తెరిచి తొలిదర్శనం చేసుకుంటున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తా. ఎవ్వర్నీ మీరు దేహీ అని అడిగే పరిస్థితి రాకుండా చూస్తా. మనవాళ్లు ఇంకా చాలా సమస్యలు చెప్పారు. బలహీన వర్గాల సమస్యల అధ్యయనానికి నియమించిన కమిటీ త్వరలో రాష్ట్రం అంతటా పర్యటించి సమగ్ర నివేదికను రూపొందిస్తుంది. పాదయాత్ర తర్వాత బీసీ గర్జన నిర్వహించి అందులో డిక్లరేషన్ ప్రకటిస్తాం. బీసీల సమస్యలన్నింటికీ పూర్తి పరిష్కారం అయ్యేలా చూస్తాం. మీరు కూడా ఆ కమిటీకి చెప్పాల్సినవి ఏమైనా ఉంటే చెప్పండి. చర్చించండి'' అని జగన్ అన్నారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

'మా పరిధిలో లేని విషయం'



సాక్షి, హైదరాబాద్: అత్యంత వివాదాస్పదమైన సదావర్తి భూముల వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. ఈ వివాదాన్ని తమిళనాడు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ వద్ద తేల్చుకోవాలని సూచించింది. సదావర్తి భూములపై తమ ముందున్న వ్యాజ్యాలపై విచారణను ముగిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సదావర్తి సత్రానికి చెన్నైలో ఉన్న 83 ఎకరాల భూమిని ప్రభుత్వం నామమాత్రపు ధరకే కట్టబెట్టిందని, దీని వల్ల ఖజానాకు రూ.వందల కోట్ల మేర నష్టం వాటిల్లిందని.. దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో గతేడాది పిల్ దాఖలు చేశారు. అనంతరం ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ హైకోర్టు విచారణ మొదలుపెట్టింది. ఇదిలా ఉండగానే వేలం వేసిన సదావర్తి సత్రం భూముల్లో తమ భూములున్నాయంటూ కొందరు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే తమిళనాడు ప్రభుత్వం సైతం సదావర్తి భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలపై ఇప్పటికే పలుమార్లు విచారణ చేపట్టిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం.. మంగళవారం మరోసారి విచారించింది.

జూలై 8న కొత్త విధానంలో యూజీసీ నెట్

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత సాధించేందుకు వీలుకల్పించే యూజీసీ-నెట్.. కొత్త విధానంలో 2018, జూలై 8న జరగనుంది. **పరీక్ష విధానం:** పేపర్ -1 (టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్): 50 ప్రశ్నలుంటాయి. ఒక్కో దానికి రెండు మార్కులు. గంట సమయం అందుబాటులో ఉంటుంది. పేపర్-2 (ఎంపిక చేసుకున్న సబ్జెక్టు): 100 ప్రశ్నలుంటాయి. ఒక్కో దానికి రెండు మార్కులు. 2 గంటల సమయం అందుబాటులో ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ టైప్ (కంపల్సరీ)లో ఉంటాయి. అదే విధంగా జేఆర్ఎఫ్‌కు గరిష్ట వయసును 28 ఏళ్ల నుంచి 30 ఏళ్లకు పెంచారు. **ముఖ్య తేదీలు:** పూర్తి నోటిఫికేషన్ విడుదల: ఫిబ్రవరి 1, 2018. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 2018, మార్చి 6-ఏప్రిల్ 5. పరీక్ష తేదీ: జూలై 8, 2018. వెబ్‌సైట్: cbsenet.nic.in

తెలుగు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 24-1-2018

జాబ్ పాయింట్



టీఎస్ఎస్‌పీడీసీఎల్ — 267 పోస్టులు

తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)... 153 అసిస్టెంట్ ఇంజనీర్, 114 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

- **పోస్టు-ఖాళీలు:** అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)-153 (ఎలక్ట్రికల్-133+సివిల్-20); జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో)-114.
- **వేతన శ్రేణి:** ఏఈ-రూ.41,155-రూ.63,600; జేఏవో-రూ.34,630-రూ.56,760.
- **అర్హతలు:** ఏఈ పోస్టులకు ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సివిల్‌లో బ్యాచిలర్స్ ఇంజనీరింగ్ డిగ్రీ/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఏఎంఐఈ ఎగ్జామినేషన్‌లో సెక్షన్ ఏ, బీ ఉత్తీర్ణత/తత్సమాన అర్హత; జేఏవో పోస్టులకు బీకామ్/ఎంకామ్‌లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత లేదా సీఏ/ఐసీడబ్ల్యూఏ-ఇంటర్‌లో ఉత్తీర్ణత. ❖ **వయసు:** 2018, జనవరి 1 నాటికి 18-44 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.220 (అప్లికేషన్ ఫీ-రూ.100+ఎగ్జామినేషన్ ఫీ-రూ.120); ఎస్సీ/ఎస్టీ/బీసీ/దివ్యాంగ కేటగిరీలకు ఎగ్జామినేషన్ ఫీ నుంచి మినహాయింపు ఉంది. ❖ **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా ఎంపిక నిర్వహిస్తారు.
- **రాతపరీక్ష విధానం:** ఇది 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్నపత్రంలో రెండు విభాగాలు సెక్షన్ ఏ, సెక్షన్ బీ ఉంటాయి. సెక్షన్ ఏలో సంబంధిత విభాగం నుంచి 80 ప్రశ్నలు, సెక్షన్ బీలో జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2గంటలు. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **ముఖ్య తేదీలు:**
- **దరఖాస్తుల ప్రారంభం:** ఫిబ్రవరి 2, 2018.
- **దరఖాస్తుల ముగింపు:** ఫిబ్రవరి 19, 2018.
- **పరీక్ష తేదీ:** మార్చి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.tssouthernpower.com, tssouthernpower. cgg.gov.in

ఎన్ఎండీసీ — 256 పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) లిమిటెడ్.. వివిధ విభాగాల్లోని 256 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

- **పోస్టు-ఖాళీలు:** జూనియర్ మేనేజర్ (జేఎం)-32 (మైనింగ్-8+సర్వే-3+జీ అండ్ క్యూసీ-13+సీ అండ్ ఐటీ-7+ఇన్‌స్ట్రుమెంటేషన్-1), డిప్యూటీ జూనియర్ మేనేజర్ (డీవైజేఎం)-1 (జియో ఫిజిసిస్ట్); జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (జేవోటీ)-54 (మెకానికల్-13+ ఎలక్ట్రికల్-8+మైనింగ్-29+జీ అండ్ క్యూసీ-4); మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రైనీ (ఎంఏటీ)-154 (మెకానికల్-114+ఎలక్ట్రికల్-40), హెచ్ఈఎం(మెకానికల్) గ్రేడ్ (3) ట్రైనీ-4, ఎలక్ట్రీషియన్ గ్రేడ్ (3) ట్రైనీ-4, హెచ్ఈఎం ఆపరేటర్ గ్రేడ్ (3) ట్రైనీ-2, క్యూసీఏ గ్రేడ్ (3) ట్రైనీ-5.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఐటీఐ/డిప్లొమా/బీఈ/బీటెక్/ఎంఎస్సీ/ఎంఎస్సీ (టెక్)/ఎంటెక్/ఎంసీఏ/బీఎస్సీ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత రంగంలోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** డీవైజేఎం, జేఎం పోస్టులకు 45 ఏళ్లు; జేవోటీకి 35 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** పోస్టులను బట్టి రాతపరీక్ష+ గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ/ట్రేడ్ టెస్ట్/జాబ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్. ❖ **దరఖాస్తు రుసుం:** జేఎం, డీవైజేఎం పోస్టులకు రూ.500; జేవోటీకి రూ. 300; మిగిలిన పోస్టులకు రూ.150. రిజర్వేషన్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** డీవైజేఎం, జేఎం, జేవోటీ పోస్టులకు ఆన్‌లైన్, మిగిలిన పోస్టులకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జేఎం, డీవైజేఎం, జేవోటీ పోస్టులకు ఫిబ్రవరి 12, 2018; మిగిలిన పోస్టులకు ఫిబ్రవరి 17, 2018.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018. ❖ **వెబ్‌సైట్:** www.nmdc.co.in

ఎన్‌టీపీసీ — 150 పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) లిమిటెడ్.. 150 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎన్‌టీపీసీ.. భారత ప్రభుత్వ అతిపెద్ద విద్యుత్ రంగ సంస్థ.

- **పోస్టు:** ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (ఈఈటీ).
- **వేతనశ్రేణి:** రూ.24,900-రూ.50,500. ఏడాది శిక్షణలో నెలకు రూ.24,900.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-35, మెకానికల్-55, ఎలక్ట్రానిక్స్-20, ఇన్‌స్ట్రుమెంటేషన్-20, మైనింగ్-20.
- **అర్హతలు:** కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ/ఏ ఎంఐఈ. అలాగే గేట్-2018 స్కోర్.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ (బిహేవియరల్/ఆప్టిట్యూడ్), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.150; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 31, 2018.
- **వెబ్‌సైట్:** www.ntpccareers.net

ఐవోసీఎల్ — 98 పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కు చెందిన సదరన్ రీజియన్ మార్కెటింగ్ డివిజన్ .. 98 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** జూనియర్ ఆపరేటర్ గ్రేడ్ (1)-51 , జూనియర్ ఆపరేటర్ (ఏవియే షన్) గ్రేడ్ (1)-46, జూనియర్ చార్జ్‌మ్యాన్ గ్రేడ్ (3)-1.
- **రాష్ట్రాలు/రీజియన్ల వారీ ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-12 (జూనియర్ ఆపరేటర్-10, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-1, చార్జ్‌మ్యాన్-1), తెలంగాణ-(జూనియర్ ఆపరేటర్-6, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-5), కర్ణాటక-(జూనియర్ ఆపరేటర్-21, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-7), కేరళ-(జూనియర్ ఆపరేటర్-2, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-1), తమిళనాడు అండ్ పుదుచ్చేరి- (జూనియర్ ఆపరేటర్-12, జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)-32). ❖ **అర్హతలు:** జూనియర్ ఆపరేటర్‌కు పదోతరగతితోపాటు ఐటీఐ (ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/ఎలక్ట్రీషియన్/మెషినిస్ట్/ఫిట్టర్); జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)కు కనీసం 45 శాతం (ఎస్సీ/ఎస్టీ 40 శాతం) మార్కులతో ఇంటర్మీడియట్. అలాగే హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్; చార్జ్‌మ్యాన్ పోస్టులకు కనీసం 50 శాతం (ఎస్సీ/ఎస్టీ-45 శాతం) మార్కులతో ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్). అన్ని పోస్టులకూ సంబంధిత రంగాల్లో కనీసం ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి. ❖ **వయసు:** 2018, జనవరి 31 నాటికి 18-26 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్ (ఎస్‌పీపీటీ). ❖ **రాతపరీక్ష విధానం:** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెక్నికల్ నాలెడ్జ్ (సంబంధిత సబ్జెక్టు), జనరిక్ ఆప్టిట్యూడ్ ఇన్‌క్లూడింగ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీస్, బేసిక్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్ అనే నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్) పోస్టులకు మాత్రం టెక్నికల్ నాలెడ్జ్ విభాగం ఉండదు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైె వారి మెరిట్ జాబితా నుంచి 1:2 నిష్పత్తిలో ఎస్‌పీపీటీకి ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ ఓబీసీ-రూ. 150. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'పోస్ట్ బాక్స్ నెం.3321, నుంగంబాక్కం ఎండీవో, చెన్నై-600034, తమిళనాడు' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 10, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 16, 2018.
- **వెబ్‌సైట్:** www.iocl.com

ఏఎల్ఐఎంసీవో — 64 పోస్టులు

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా పనిచేసే ఆర్టిఫీషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో).. ప్రధాన కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న తనశాఖల్లోని 64 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్)-1, మేనేజర్-2 (ఫైనాన్స్-1+ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ (సివిల్)-1), డిప్యూటీ మేనేజర్-2 (మార్కెటింగ్-1+మెటీరియల్ మేనేజ్‌మెంట్-1), అసిస్టెంట్ మేనేజర్-2 (ప్రొడక్షన్-1+డిజైన్ అండ్ డెవలప్‌మెంట్-1), మార్కెటింగ్ ఆఫీసర్-1, ఆర్ అండ్ డీ ఇంజనీర్-1, స్టోర్ ఆఫీసర్-1, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-2, క్యాషియర్ అసిస్టెంట్ (మెకానికల్/ఎలక్ట్రికల్)-3, స్టెనోగ్రాఫర్-1, జూనియర్ క్లర్క్/అసిస్టెంట్-8, జూనియర్ స్టోర్ కీపర్-1, అసెంబ్లర్-3, ఫిట్టర్-9, మెషినిస్ట్-2, ఎలక్ట్రీషియన్-3, టర్నర్-3, మిల్‌రైట్-2, ప్లాంట్ ఆపరేటర్-6 (బాయిలర్-5+డీజీ సెట్-1), ప్రెస్ ఆపరేటర్-1, ఎలక్ట్రోప్లేటర్-2తటట్ను ఉడ్ వర్కర్/కార్పెంటర్-4, వెల్డర్-1, పైప్ ఫిట్టర్ (ప్లంబర్)-1, పాలిషర్-2.
- **వేతనశ్రేణి:** సీనియర్ మేనేజర్-రూ.32,900-58,000; మేనేజర్-రూ.29,100-రూ.54,500; డిప్యూటీ మేనేజర్-రూ.24,900-రూ.50,500; అసిస్టెంట్ మేనేజర్-రూ.20,600-రూ.46,500; మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్), -రూ.12,600-రూ.32,500; క్యాషియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ క్లర్క్/అసిస్టెంట్, జూనియర్ స్టోర్ కీపర్-రూ.7,300-రూ.16,300; పాలిషర్-రూ.6,720-రూ.14,950; మిగిలిన పోస్టులకు రూ.7,010-రూ.15,600.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ/సీఏ/ఐసీఏ/ఇంజనీరింగ్ డిప్లొమా/డిగ్రీ/ఐటీఐ/పదోతరగతి. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** సీనియర్ మేనేజర్‌కు 49 ఏళ్లు; మేనేజర్-46 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్-43 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్-40 ఏళ్లు; మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-34 ఏళ్లు; క్యాషియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ క్లర్క్/అసిస్టెంట్, జూనియర్ స్టోర్ కీపర్-32 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** పోస్టులను బట్టి రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** 'మేనేజర్', మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-రూ.500; మిగిలిన పోస్టులకు రూ.250; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 28, 2018.
- **వెబ్‌సైట్:** www.alimco.in

ఇండియన్ ఆర్మీ — 191 పోస్టులు

ఇండియన్ ఆర్మీలోని 191 ఖాళీలను చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో అక్టోబర్ 2018లో ప్రారంభమయ్యే పురుషుల 51వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్), మహిళల 22వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) కోర్సుల ద్వారా భర్తీ చేసేందుకు అవివాహ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. మొత్తం పోస్టుల్లో 190 టెక్నికల్‌వి, ఒకటి నాన్ టెక్నికల్. వీటిలో డిఫెన్స్ పర్సన్స్ విడోస్‌కు టెక్నికల్, నాన్ టెక్నికల్ నుంచి ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు.

- **కోర్సులు:** షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) టెక్నికల్/నాన్‌టెక్నికల్.
- **విభాగాల వారీ ఖాళీలు:** సివిల్-53 (పురుషులు-49, మహిళలు-4), మెకానికల్-19 (పురుషులు-16, మహిళలు-3), ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్-24 (పురుషులు-22, మహిళలు-2), ఏరోనాటికల్/ఏవియేషన్/బాలిస్టిక్స్/ఏవియానిక్స్-12 (పురుషులు), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్)- 34 (పురుషులు-31, మహిళలు-3), ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికాం/టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/శాటిలైట్ కమ్యూనికేషన్-30 (పురుషులు-28, మహిళలు-2), ఎలక్ట్రానిక్స్/ఆప్టో ఎలక్ట్రానిక్స్/ఫైబర్ ఆప్టిక్స్/మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ మైక్రోవేవ్-11 (పురుషులు), ప్రొడక్షన్ ఇంజనీరింగ్-3 (పురుషులు), ఆర్కిటెక్చర్/బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ-3 (పురుషులు). విడోస్ ఆఫ్ డిఫెన్స్ పర్సనల్‌కు ఎస్ఎస్‌సీ (నాన్ టెక్నికల్) (నాన్ యూపీఎస్సీ)-1, ఎస్ఎస్‌సీ (టెక్నికల్)-1.
- **అర్హతలు:** ఎస్ఎస్‌సీ (టెక్నికల్)కు సంబంధిత విభాగాలను బట్టి బీఈ/బీటెక్; ఎస్ఎస్‌సీ (నాన్ టెక్నికల్) (నాన్ యూపీఎస్సీ)కి డిగ్రీ.
- **వయసు:** ఎస్ఎస్‌సీ (టెక్నికల్)కు 20-27 ఏళ్ల లోపు ఉండాలి; ఎస్ఎస్‌సీ (నాన్ టెక్నికల్)కు 35 ఏళ్లు మించకూడదు.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు-పురుషులకు 157.5 సెం.మీ.; ఎత్తుకు అనుగుణంగా బరువు ఉండాలి. అలాగే తగిన శారీరక, మానసిక ఆరోగ్యం తప్పనిసరి. టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు.
- **దేహ దారుఢ్య పరీక్ష:** ఇందులో 2.4 కి.మీ.ల దూరాన్ని 15 నిమిషాల్లో పరిగెత్తగలగాలి. అలాగే నిర్దేశిత సమయానికి 13 పుషప్స్, 25 సిటప్స్, 6 చిన్ అప్స్ చేయగలగాలి. 3-4 మీ. రోప్ క్లైంబింగ్ పూర్తిచేయగలగాలి. ❖ **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ (రెండు దశల్లో ఉంటుంది), మెడికల్ ఎగ్జామినేషన్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ (విడోస్ ఆఫ్ డిఫెన్స్ పర్సన్స్ పోస్టులకు ఆఫ్‌లైన్). ❖ **చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018 (విడోస్ ఆఫ్ డిఫెన్స్ పర్సన్స్‌కు చివరి తేదీ- మార్చి 31, 2018).
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ఇండియన్ నేవీ — 38 పోస్టులు

ఇండియన్ నేవీలోని ఎడ్యుకేషన్ బ్రాంచ్‌లో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (లాజిస్టిక్ కేడర్)లో పర్మనెంట్ కమిషన్ (పీసీ) ద్వారా 38 ఖాళీల భర్తీకి అవివాహ యువత నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. ఎంపికైన అభ్యర్థులకు కేరళలోని ఎజిమలలో ఉన్న ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)లో ప్రారంభమయ్యే '2019 జనవరి' కోర్సు ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. పీసీ ఖాళీలకు కేవలం అవివాహ పురుషులు మాత్రమే అర్హులు. ఎస్ఎస్‌సీ పోస్టులకు పెళ్లికాని పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **పోస్టులు:** షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్లు, పర్మనెంట్ కమిషన్ (పీసీ) ఆఫీసర్లు.
- **వేతనశ్రేణి:** ప్రారంభ హోదా (సబ్ లెఫ్టినెంట్)లో రూ.56,100-రూ.1,10,700.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎస్ఎస్‌సీ (ఎడ్యుకేషన్)-18, పీసీ (లాజిస్టిక్స్)-20. ❖ **అర్హతలు:** ఎస్ఎస్‌సీ (ఎడ్యుకేషన్) పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ (మ్యాథ్స్)+ఎంఎస్సీ (ఫిజిక్స్/న్యూక్లియర్ ఫిజిక్స్)/ బీఎస్సీ (ఫిజిక్స్)+ఎంఎస్సీ (మ్యాథ్స్/ఆపరేషనల్ రీసెర్చ్)/ఎంఏ (ఇంగ్లిష్)/బీఈ/బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్/మెకానికల్); పీసీ (లాజిస్టిక్స్) పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎంబీఏ/బీఎస్సీ/బీకామ్/బీఎస్సీ (ఐటీ)+పీజీ డిప్లొమా (ఫైనాన్స్/లాజిస్టిక్స్/సప్లై చైన్ మేనేజ్‌మెంట్/మెటీరియల్ మేనేజ్‌మెంట్/ఎంసీఏ/ఎంఎస్సీ (ఐటీ). అలాగే పదోతరగతి, ఇంటర్ కనీసం 60 శాతం (ఇంగ్లిష్‌లోనూ) మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఎస్ఎస్‌సీ (ఎడ్యుకేషన్)కు 1994, జనవరి 2-1 జనవరి 1998 మధ్య ; పీసీ (లాజిస్టిక్స్)కు 1994, జనవరి 2-1 జూలై 1999 మధ్య జన్మించి ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** కనీస ఎత్తు-పురుషులకు 157 సెం.మీ., మహిళలకు కనీసం 152 సెం.మీ. అలాగే ఎత్తుకు తగిన బరువు ఉండాలి. దీంతోపాటు నేవీ నిబంధనల మేర తగిన దృష్టి సామర్థ్యం, ఆరోగ్యం తప్పనిసరి. టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు. ❖ **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. ఇందులో రెండు దశలు ఉంటాయి. మొదటి దశలో ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్కషన్ టెస్ట్, రెండో దశలో సైకలాజికల్ టెస్టింగ్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ ఉంటాయి. ఈ రెండింటిలో ఉత్తీర్ణులైతే మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి అనంతరం శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు బెంగళూరు, భోపాల్, కోయంబత్తూరు, విశాఖపట్నంలో నిర్వహిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 10, 2018.
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎన్ఆర్ఎల్ — 21 పోస్టులు

నుమాలిగఢ్ రిఫైనరీ లిమిటెడ్ (ఎన్ఆర్ఎల్).. 21 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎన్ఆర్ఎల్.. నుమాలిగఢ్‌తోపాటు గువాహటి, సిలిగురి, కోల్‌కతా, ఢిల్లీ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇది మినీరత్న కేటగిరీ-1 పీఎస్‌యూ.

- **పోస్టు-ఖాళీలు:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ (జీఈటీ)-19 (కెమికల్-7+ఎలక్ట్రికల్-4+ఇన్‌స్ట్రుమెంటేషన్-2+మెకానికల్-3+సివిల్-1+ఐఐఎస్-2); మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ)-1 (ఫైనాన్స్); ఆఫీసర్ (ఫైనాన్స్)-1.
- **వేతనశ్రేణి:** రూ.60,000-రూ.1,80,000; జీఈటీ, ఎంటీ పోస్టులకు ఏడాది శిక్షణలో స్టైపెండ్ నెలకు రూ.24,900 ఉంటుంది.
- **అర్హతలు:** జీఈటీ పోస్టులకు సంబంధిత విభాగాలను (కెమికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/మెకానికల్/సివిల్/ఐఐఎస్)బట్టి కనీసం 65 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ; ఎంటీ పోస్టుకు ఫైనాన్స్ స్పెషలైజేషన్‌గా కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ/పీజీడీఎం; ఆఫీసర్ (ఫైనాన్స్) పోస్టుకు సీఏతోపాటు ఐసీఏఐలో అసోసియేట్ మెంబర్‌షిప్.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి ఆఫీసర్ (ఫైనాన్స్)కు 32 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ/జీడీ, మెడికల్ ఎగ్జామినేషన్. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 23, 2018.
- **వెబ్‌సైట్:** www.nrl.co.in

సాక్షి బిజినెస్
బుధవారం 24-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
342 ▲	118 ▲
36,140	11,084

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,449	▲	40
డోజోన్స్	26,199	▽	16
ఎఫ్‌టీఎస్ఈ 100	7,732	▲	16
డాక్స్	13,560	▲	96
షాంఘై	3,547	▲	46
నికాయ్	24,124	▲	308

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.60	64.73
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.60	90.78
€	యూరో	ఎస్‌బీఐ	79.46	79.62
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.59	58.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.00	52.11
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.13	49.22
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.46	18.30
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.80	18.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.05	11.44



నిఫ్టీ @11,000

36 వేల పాయింట్ల పైకి సెన్సెక్స్

- ఐదో రోజూ పరుగే... మార్కెట్‌కు ఐఎంఎఫ్ జోష్..
- అంచనాలు మించుతున్న క్యూ3 ఫలితాలు
- సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- ఇంట్రాడే, ముగింపులో కొనసాగిన రికార్డులు
- 342 పాయింట్ల లాభంతో 36,140కు సెన్సెక్స్
- 118 పాయింట్లు పెరిగి 11,084కు నిఫ్టీ

దలాల్ స్ట్రీట్ రికార్డులతో దద్దరిల్లిపోతోంది. వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ స్టాక్ సూచీలు కొత్త శిఖరాలకు చేరాయి. రికార్డులు సృష్టించడం స్టాక్ సూచీలకు ఇటీవల రివాజుగా మారినప్పటికీ, మంగళవారం మాత్రం స్టాక్ సూచీలు కొత్త మైలురాళ్లను అధిగమించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారిగా 36,000 పాయింట్లు, నిఫ్టీ 11,000 పాయింట్లపైకి ఎగబాకాయి. భారత వృద్ధి బహు బాగు అని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) కితాబివ్వడం, కంపెనీల క్యూ3 ఫలితాలు అంచనాలను మించుతుండడం, అమెరికా సెనేట్‌లో ప్రతిష్టంభన తొలగటం... అన్నీ కలిసొచ్చాయని చెప్పాలి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు తోడురాగా స్టాక్ సూచీలు కదం తొక్కాయి. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల సునామీ కొనసాగింది. సెన్సెక్స్ 342 పాయింట్ల లాభంతో 36,140 పాయింట్ల వద్ద, నిఫ్టీ 118 పాయింట్ల లాభంతో 11,084 పాయింట్ల వద్ద ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ కూడా ఆల్ టైమ్ హై, 27,379 పాయింట్ల వద్ద ముగిసింది.

లాభాల పరుగుకు కారణాలేమిటంటే..

- **ఐఎమ్ఎఫ్ వ్యాఖ్యల కిక్:** ఈ ఏడాది భారత్ 7.4 శాతం వృద్ధి సాధించగలదని అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎమ్ఎఫ్) పేర్కొంది. అంతేకాకుండా ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందని పేర్కొంది. ఈ వ్యాఖ్యలు కొనుగోళ్లకు కిక్‌నిచ్చాయి.
- **అంచనాలను మించుతున్న క్యూ3 ఫలితాలు:** లో బేస్ ఎఫెక్ట్ ఉన్నప్పటికీ, అన్ని రంగాల కంపెనీల క్యూ3 ఫలితాలు అంచనాలను మించుతున్నాయి. ఇప్పటివరకూ వెల్లడైన క్యూ3 ఫలితాలు మార్కెట్‌ను నిరాశపరచలేదు. పైగా దాదాపు ఐదు ఫ్లాట్ సంవత్సరాల తర్వాత క్యూ3 ఫలితాలు రికవరీ అవుతున్నాయి. అంతేకాకుండా ఆయా కంపెనీల భవిష్యత్ అంచనాలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిస్తున్నాయి.
- **విదేశీ పెట్టుబడుల జోరు:** స్టాక్ మార్కెట్లో విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల జోరు అంతకంతకూ పెరిగిపోతోంది. ఈ నెలలో ఇప్పటికే విదేశీ ఇన్వెస్టర్లు మన స్టాక్ మార్కెట్లో రూ.8,566 కోట్ల మేర నికర పెట్టుబడులు పెట్టారు.
- **ప్రపంచ మార్కెట్ల పరుగు:** అమెరికా షట్‌డౌన్ సమస్య సమసిపోవడంతో సోమవారం అమెరికా మార్కెట్ లాభపడింది. ప్రపంచ వృద్ధి అంచనాలను ఐఎమ్ఎఫ్ సవరించడం కూడా తోడవడంతో మంగళవారం ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ఆరంభం కావడం మన మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపించింది.
- **బడ్జెట్ ఆశావహ అంచనాలు:** మధ్య తరగతిపై ఐటీ భారం తప్పనున్నదని, వినియోగం పెంచేలా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండగలవన్న ఆశావహ అంచనాలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి.
- **వేల్యూ బయింగ్:** వివిధ సానుకూలాంశాల నేపథ్యంలో పలు బ్లూ చిప్ షేర్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఓఎన్‌జీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్ అండ్ టీ, మారుతీ సుజుకీ, కోల్ ఇండియా వంటి ఇండెక్స్ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తుతున్నాయి.
- **బ్యాంక్ షేర్ల ర్యాలీ:** చివరి గంటలో బ్యాంక్ షేర్లు ర్యాలీ జరిపాయి. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీ, సిండికేట్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు 3–6% రేంజ్‌లో ఎగిశాయి.

జర జాగ్రత్త..!

స్టాక్ సూచీలు రికార్డ్‌ల స్థాయిలకు చేరిన కారణంగా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని జెరోధ ట్రేడింగ్ హెడ్ నిఖిల్ కామత్ సూచిస్తున్నారు. ఇప్పటి నుంచి మార్కెట్ పెరుగుదల పరిమితంగానే ఉండొచ్చని కొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)ల ద్వారా ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్న ఇన్వెస్టర్లు తమ సిప్‌లను కొనసాగించవచ్చని కొందరు నిపుణులు పేర్కొన్నారు. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లలో కూడా కొనుగోళ్లు జరపవచ్చని వారంటున్నారు.

అప్పుడు 814 రోజులు.. ఇప్పుడైతే ఐదు రోజులే!!

సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల ప్రస్థానమిదీ...

సెన్సెక్స్ 30 వేల పాయింట్ల నుంచి వెయ్యి పాయింట్లు పెరిగి 31వేల పాయింట్లకు చేరడానికి 814 రోజులు పట్టింది. ఆ తర్వాత ఒక్కో వెయ్యి పాయింట్లు పెరగడానికి చాలా తక్కువ రోజులు పట్టింది. తాజాగా 35 వేల పాయింట్ల నుంచి 36 వేల పాయింట్లకు ఎగియడానికి కేవలం ఐదు రోజులు మాత్రమే పట్టడం విశేషం

ఎక్కడి నుంచి ఎక్కడికి	ఎన్ని రోజులు	ఎక్కడి నుంచి ఎక్కడికి	ఎన్ని రోజులు
30,000 – 31,000	814	33,000 – 34,000	62
31,000 – 32,000	48	34,000 – 35,000	22
32,000 – 33,000	104	35,000 – 36,000	5

ఆరంభంలోనే 11,000కు నిఫ్టీ..

ట్రేడింగ్ ఆరంభంలోనే నిఫ్టీ కీలకమైన 11,000 పాయింట్లపైకి ఎగసింది. ఈ జోష్‌తో సెన్సెక్స్ కూడా ముఖ్యమైన 36,000 పాయింట్లను తాకింది. కొనుగోళ్ల జోరుతో నిఫ్టీ 11,100 పాయింట్లకు చేరువ అయింది. ఆ తర్వాత ఒకింత ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. చివరి గంటలో ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు జోరందుకోవడంతో స్టాక్ సూచీలు జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. సెన్సెక్స్ 373 పాయింట్ల లాభంతో 36,171 పాయింట్లు, నిఫ్టీ 127 పాయింట్ల లాభంతో 11,093 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి.

ఐదు రోజుల్లోనే వెయ్యి పాయింట్లు..

సెన్సెక్స్ 35,000 పాయింట్ల నుంచి 36,000 పాయింట్లు–వెయ్యి పాయింట్లను కేవలం ఐదు ట్రేడింగ్ సెషన్లలోనే(జనవరి 17–23) సాధించింది. ఈ ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,369 పాయింట్లు లాభపడింది. ఇక నిఫ్టీ పదివేల పాయింట్ల నుంచి పదకొండు వేల పాయింట్లకు చేరడానికి ఆరు నెలల కాలమే పట్టింది. గత ఏడాది జూలై 15న నిఫ్టీ పదివేల పాయింట్లను తాకింది. బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, లోహ, క్యాపిటల్ గూడ్స్ షేర్ల దన్నుతో ఆరు నెలల్లోనే నిఫ్టీ వెయ్యి పాయింట్లు పెరిగింది. తాజా జోరు చూస్తుంటే...నిఫ్టీ పదకొండువేల పాయింట్ల నుంచి 12,000 పాయింట్లకు కొన్ని వారాల్లోనే చేరగలదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రూ. లక్ష కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

స్టాక్ సూచీలు కొత్త మైలురాళ్లకు చేరిన మంగళవారం నాడు ఇన్వెస్టర్ల సంపద కూడా కొత్త శిఖరాలకు చేరింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,08,020 కోట్లు పెరిగి రూ.1,56,56,592 కోట్లకు చేరింది.

ప్రపంచ ప్రతికూలతలు పట్టని మన మార్కెట్...

ఈ బుల్‌రన్ ఏడాదిగా జోరుగా కొనసాగుతోందని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ పేర్కొన్నారు. ముడి చమురు ధరలు పెరుగుతుండడం, అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు చెలరేగడం వంటి ప్రతికూల అంశాలను మన మార్కెట్ పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. దేశీయ సానుకూలతలపైననే మార్కెట్ దృష్టి పెడుతోందని, ఈ పరిస్థితి 2000 సంవత్సరంలో ఉందని వివరించారు.

- క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలతో లోహ, బ్యాంక్, ఐటీ, ఇన్‌ఫ్రా షేర్లు జోరుగా పెరిగాయి.
- ప్రపంచ వృద్ధిపై ఐఎమ్ఎఫ్ ఆశావహ అంచనాల కారణంగా లోహ షేర్లు వెలిగిపోయాయి. జిందాల్ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో, వేదాంత, టాటా స్టీల్, సెయిల్, నాల్కో, తదితర షేర్లు 1–11 శాతం రేంజ్‌లో ఎగిశాయి.
- ఈ నెల 30న జరిగే బోర్డ్ సమావేశంలో బోనస్ ఇష్యూపై చర్చ జరగనున్నదన్న వార్తల కారణంగా ఇంట్రాడేలో 4 శాతం వరకూ ఎగసిన ఇండియన్ ఆయిల్ కార్పొ చివరకు 2 శాతం లాభంతో రూ.389 వద్ద ముగిసింది.
- ఓఎన్‌జీసీ లాభాలు రెండో రోజు కూడా కొనసాగాయి. హెచ్‌పీసీఎల్ కొనుగోలుకు అవసరమైన రూ.36,915 కోట్ల నిధుల సమీకరణకు ఐఓసీ, గెయిల్‌లో వాటా విక్రయించడానికి ఓఎన్‌జీసీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో ఈ షేర్ 3.6 శాతం లాభంతో రూ.207కు పెరిగింది.
- ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో యాక్సిస్ బ్యాంక్ 1.2 శాతం లాభపడింది. ఇంట్రాడేలో ఏడాది గరిష్ట స్థాయి, రూ.588ని తాకిన హావెల్స్ ఇండియా చివరకు 6 శాతం లాభంతో రూ.583 వద్ద ముగిసింది.
- గత ఏడాది ఎయిర్ ట్రాఫిక్ పది కోట్ల మార్క్‌ను దాటిందన్న నివేదిక వెలువడడంతో విమానయాన రంగ షేర్లు–జెట్ ఎయిర్‌వేస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), స్పైస్‌జెట్‌లు ఇంట్రాడేలో 5 శాతం వరకూ పెరిగాయి.

మార్చి 8 నుంచి ఏవియేషన్ షో

- కొలువుదీరనున్న ప్రైవేట్ జెట్‌లు
- 150 దేశ, విదేశీ కంపెనీలతో ప్రదర్శన
- వింగ్స్ ఇండియా థీమ్‌తో ఈవెంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో... హైదరాబాద్‌లో రెండేళ్లకోసారి జరిగే 'ఇండియా ఏవియేషన్ షో' తేదీలు ఖరారయ్యాయి. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం వేదికగా 'వింగ్స్ ఇండియా 2018' థీమ్‌తో మార్చి 8 నుంచి 11 వరకు ఇది జరగనుంది. 150కి పైగా కంపెనీలు స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. 5,000 చదరపు మీటర్ల వైశాల్యంలో ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పౌర విమానయాన రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలకు వింగ్స్ ఇండియా వేదిక కానుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారు. విధానపర అంశాలు, వ్యాపార అవకాశాలపై సదస్సులు నిర్వహిస్తారు. పౌర విమానయాన శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిక్కీ, ఎయిర్ ఇండియా, పవన్ హాన్స్ సహకారం అందిస్తున్నాయి.

చిన్న విమానాలతోనే..

దిగ్గజ సంస్థలు రూపొందించిన నూతన తరం ప్రైవేట్ జెట్లు ఈ ప్రదర్శనలో తళుక్కుమననున్నాయి. ఎనిమిది కొత్త జెట్స్ తొలిసారిగా దర్శనమివ్వనున్నాయి. వీటిలో 14 సీట్లతో కూడిన ఫాల్కన్ ఒకటి. గతంలో జరిగిన ఏవియేషన్ షోలలో భారీ విమానాలు కనువిందు చేశాయి. భారీ విహంగమైన ఎయిర్‌బస్ ఏ380ని చూసేందుకు వీక్షకులు ఎగబడ్డారు. ఈసారి ఇలాంటివి ఉండవని, పూర్తిగా బిజినెస్ టు బిజినెస్ ఈవెంట్‌గానే ఇది ఉంటుందని విమానయాన రంగంలో సేవలందిస్తున్న ప్రముఖ కంపెనీ వ్యవస్థాపకుడొకరు 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ప్రైవేట్ జెట్స్ మాత్రమే కొలువుదీరతాయన్నారు. ఇక ఎప్పటిలాగే ఏరోబాటిక్ ప్రదర్శన హైలైట్‌గా నిలవనుంది. తొలి రెండు రోజులు బిజినెస్ విజిటర్లకు, చివరి రెండు రోజులు సాధారణ ప్రజానీకానికి కేటాయించారు. బిజినెస్ టికెట్ రూ.1,500, జనరల్ టికెట్ రూ.300 ఉంది.

'రిపబ్లిక్ డే' ఆఫర్లే ఆఫర్లు!

- స్పైస్‌జెట్ రూట్లోనే ఇండిగో, గోఎయిర్..
- రూ.797కే ఇండిగో; 1,326కి గోఎయిర్



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ విమానయాన సంస్థ 'ఇండిగో', త్వరితగతి వృద్ధి పథంలో దూసుకెళ్తోన్న మరో ఎయిర్‌లైన్స్ 'గోఎయిర్' రెండూ కూడా రిపబ్లిక్ డే ఆఫర్ల జాబితాలోకి చేరాయి. సోమవారమే స్పైస్‌జెట్ ఈ ఆఫర్లు ప్రకటించగా... మంగళవారం ఇవి కూడా తమ డిస్కౌంట్ ఆఫర్ల వివరాలు వెల్లడించాయి.

ఇండిగో..: ఈ విమానయాన సంస్థ రిపబ్లిక్ డే సందర్భంగా రూ.797 ప్రారంభ ధరతో ప్రయాణికులకు విమాన టికెట్లను ఆఫర్ చేస్తోంది. జనవరి 25 వరకు అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌లో భాగంగా టికెట్లు బుక్ చేసుకున్నవారు ఏప్రిల్ 15 వరకు ఎప్పుడైనా ప్రయాణించొచ్చు. ఎంపిక చేసిన ఫ్లైట్స్‌కు, పరిమిత సంఖ్యలో సీట్లకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. అంటే ఆఫర్‌లోని సీట్లు భర్తీ అయితే అప్పుడు టికెట్ బుకింగ్‌కు సాధారణ చార్జీలే వర్తిస్తాయి. ఇక గ్రూప్ బుకింగ్స్‌కు ఆఫర్ వర్తించదు.

గోఎయిర్..: ఈ ఎయిర్‌లైన్స్ సంస్థ రూ.1,326 ప్రారంభ ధరతో టికెట్లను ఆఫర్ చేస్తోంది. జనవరి 28 వరకు అందుబాటులో ఉండనున్న ఈ డిస్కౌంట్ ఆఫర్‌లో భాగంగా టికెట్లను బుక్ చేసుకున్నవారు ఈ ఏడాది మార్చి 1 నుంచి డిసెంబర్ 31 వరకు మధ్యకాలంలో ఎప్పుడైనా ప్రయాణించొచ్చు. కాగా డిస్కౌంట్ ఆఫర్ పరిమిత సంఖ్యలో సీట్లకు మాత్రమే వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. ఇక అదనంగా ప్రతి టికెట్ బుకింగ్‌పై రూ.2,500 విలువైన ప్రయోజనాలు పొందొచ్చని పేర్కొంది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- 11,200 పాయింట్ల వరకూ ర్యాలీకి ఛాన్స్
- బ్యాంక్ నిఫ్టీ స్పీడు
- తుది అంకానికి బుల్ పరుగుల్
- మోత మోగించిన మెటల్ షేర్లు
- టాప్ ఇన్వెస్టర్లు వీటినే కొన్నారు...!
- 4 రంగాలు.. 20 షేర్లు.. బడ్జెట్ బొనంజాలు
- పుత్తడి పరుగుకు విరామం
- ఐఓసీకి బోనస్ బొనంజా
- రికార్డ్ గరిష్టానికి బయోకాన్
- ఆర్‌ఐఎల్ టార్గెట్ పెంచిన బ్రోకరేజీలు

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

WWW.SAKSHIBUSINESS.COM

SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

Google Play | App Store

గెయిల్, ఐవోసీ నుంచి ఓఎన్‌జీసీ ఔట్!

- వాటా విక్రయించుకోవటానికి కేంద్రం ఓకే
- వచ్చే నిధులన్నీ హెచ్‌పీసీఎల్ కొనుగోలుకు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీ, గెయిల్‌లో తనకున్న వాటాలను విక్రయించడానికి ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సిద్ధమయింది. ఇందుకోసం కేంద్రం నుంచి అనుమతి పొందింది. ''మా ప్రతిపాదనకు కేంద్రం ఇటీవలే ఆమోదముద్ర వేసింది. అయితే షేర్ల విక్రయానికి సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం'' అని ఓఎన్‌జీసీ వర్గాలు తెలియజేశాయి. ఈ వాటాల విక్రయం ద్వారా వచ్చిన నిధులను హెచ్‌పీసీఎల్ కొనుగోలు కోసం ఓఎన్‌జీసీ ఉపయోగించుకోనుంది. దేశీయంగా అతి పెద్ద రిఫైనరీ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఓఎన్‌జీసీకి 13.77 శాతం వాటాలున్నాయి. మంగళవారం నాటి షేరు ధర ప్రకారం వీటి విలువ సుమారు రూ. 26,200 కోట్లు.



ఇక గెయిల్ ఇండియాలో ఓఎన్‌జీసీకి రూ.3,847 కోట్ల విలువ చేసే 4.86 శాతం వాటాలున్నాయి. చమురు రిఫైనింగ్, మార్కెటింగ్ సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్లో (హెచ్‌పీసీఎల్) కేంద్ర ప్రభుత్వానికి చెందిన 51.11 శాతం వాటాలను ఓఎన్‌జీసీ కొనుగోలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం రూ.36,915 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఓఎన్‌జీసీ దగ్గర ఇప్పటికే రూ.12,000 కోట్ల పైగా నగదు నిల్వలున్నాయి. హెచ్‌పీసీఎల్ కొనుగోలుకు సంబంధించి రూ. 18,060 కోట్ల రుణ సమీకరణ కోసం మూడు బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఓఎన్‌జీసీ తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్‌లు ఇందులో ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వివరించింది. పీఎన్‌బీ నుంచి రూ. 10,600 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ. 4,460 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ నుంచి రూ. 3,000 కోట్లు సమీకరిస్తున్నట్లు తెలిపింది.

'భారత్ అంటే బిజినెస్'

పుష్కలంగా వ్యాపార అవకాశాలు • టాప్ సీఈవోలతో భేటీలో మోదీ




దావోస్‌లో భారత కార్పొరేట్ దిగ్గజాలతో మోదీ

దావోస్: వృద్ధిపథంలో పురోగమిస్తున్న భారత్... వ్యాపారాల నిర్వహణకు అత్యంత ఆకర్షణీయ దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్ అంటేనే బిజినెస్ అంటూ... పుష్కలమైన వ్యాపార అవకాశాలకు కేంద్రమని పేర్కొన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో భాగంగా... దిగ్గజ కంపెనీల సీఈవోలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రగతిని, అంతర్జాతీయ సంస్థలకు భారత్‌లో ఉన్న వ్యాపార అవకాశాలను ఆయన వివరించారు. 'దావోస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ టాప్ సీఈవోలతో భేటీ అయ్యారు. భారత ఆర్థిక వృద్ధి, పెట్టుబడి అవకాశాల గురించి వారికి వివరించారు' అని మైక్రో బ్లాగింగ్ సైటు ట్విటర్‌లో ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది. 'భారత్ అంటే బిజినెస్' శీర్షికతో జరిగిన ఈ సమావేశంలో.. విదేశాంగ శాఖ కార్యదర్శి జై శంకర్, పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) కార్యదర్శి రమేష్ అభిషేక్, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు చెందిన 40 మంది సీఈవోలు, భారత్ నుంచి 20 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలేన్ బెర్సెట్‌తో కూడా సమావేశమైన మోదీ.. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. భారత్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా బెర్సెట్ తెలిపారు.

పెట్టుబడులకు బెస్ట్..

- అత్యంత ఆకర్షణీయ మార్కెట్లలో భారత్‌కు 5వ ర్యాంకు
- గత ఏడాదితో పోలిస్తే ఒక స్థానం పైకి...
- పీడబ్ల్యూసీ సీఈవోల సర్వేలో వెల్లడి



దావోస్: పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన మార్కెట్ల జాబితాలో భారత్ 5వ ర్యాంకు దక్కించుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఒక స్థానం ఎగబాకింది. అంతర్జాతీయ సంస్థల సీఈవోలతో కన్సల్టెన్సీ దిగ్గజం 'పీడబ్ల్యూసీ' నిర్వహించిన ఒక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం... 2018లో అత్యంత ఆకర్షణీయ మార్కెట్‌గా జపాన్‌ను అధిగమించి భారత్ అయిదో స్థానానికి చేరింది. 2017లో భారత్ ఆరో స్థానంలో ఉంది. మరోవైపు, ఈ లిస్టులో అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. 46 శాతం మంది సీఈవోలు అమెరికాకు ఓటేశారు. చైనా (33 శాతం), జర్మనీ (20 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. 15 శాతం ఓట్లతో బ్రిటన్ నాలుగో స్థానంలో, తొమ్మిది శాతం ఓట్లతో భారత్ అయిదో స్థానంలో నిలిచాయి. పటిష్ఠమైన వ్యవస్థాగతమైన సంస్కరణల ఊతంతో భారత మార్కెట్ గత ఏడాది కాలంగా ఆకర్షణీయంగా మారిందని పీడబ్ల్యూసీ ఇండియా చైర్మన్ శ్యామల్ ముఖర్జీ పేర్కొన్నారు. 'మా క్లయింట్లలో చాలా మంది.. భారతదేశ వృద్ధిపై ఆశావహంగా ఉన్నారు. సైబర్ సెక్యూరిటీ, వాతావరణ మార్పులు మొదలైన కొంగొత్త సవాళ్లు క్లయింట్లను కలవరపరుస్తున్నప్పటికీ... ఇన్‌ఫ్రా, తయారీ, నైపుణ్యాల్లో శిక్షణ తదితర అంశాల్లో వారి ఆందోళనలను తొలగించేందుకు ప్రభుత్వం గణనీయంగా కృషి చేసింది' అని ఆయన తెలిపారు.

అనిశ్చితిపై సీఈవోల ఆందోళన..

పీడబ్ల్యూసీ నివేదిక ప్రకారం.. సీఈవోలు వృద్ధిపై ఆశావహంగానే ఉన్నప్పటికీ వ్యాపారం, సామాజిక, ఆర్థికపరమైన పలు సమస్యలపై కాస్తంత ఆందోళనతోనే ఉన్నారు. భౌగోళిక, రాజకీయపరమైన అనిశ్చితి, సైబర్ దాడులు మొదలైన సమస్యల గురించి 40 శాతం మంది, ఉగ్రవాదంపై 41 శాతం మంది సీఈవోలు అత్యంత ఆందోళన వ్యక్తపరిచారు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	--	రూ.3,500	3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	--					

2020 నాటికి 50,000 మందికి శిక్షణ

కాంప్‌టియా డైరెక్టర్ ప్రదీప్తో చక్రవర్తి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ రంగంలో వివిధ సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్ ద్వారా వచ్చే మూడేళ్లలో 50,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కాంప్‌టియా టెక్నాలజీ తెలిపింది. భాగస్వామ్య కేంద్రాల ద్వారా ఐదేళ్లలో 30,000 మందికిపైగా శిక్షణ పొందారని కంపెనీ ప్రాంతీయ డైరెక్టర్ ప్రదీప్తో చక్రవర్తి మంగళవారమిక్కడ మీడియాకు చెప్పారు. ప్రముఖ ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలు, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ల భాగస్వామ్యంతో సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రాయితీపై గ్రామీణ గృహ రుణాలు: ఐఓబీ

ఎన్‌హెచ్‌బీతో ఒప్పందం



చెన్నై: గ్రామీణ గృహ నిర్మాణానికి సంబంధించి వడ్డీ సబ్సిడీ పథకం (ఆర్‌హెచ్ఐఎస్ఎస్) అమలు విషయంలో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ)తో అవగాహన కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ) ఒక ప్రకటనలో తెలిపింది. . గ్రామీణ ప్రాంతంలో గృహ నిర్మాణం, మరమ్మతులు చేపట్టడానికి సంబంధించిన వ్యయాలకు సబ్సిడీపై రుణాన్నివ్వటం ఈ పథకం ఉద్దేశం. తాజా ఒప్పందంతో ఐఓబీ దేశవ్యాప్తంగా తన 923 గ్రామీణ బ్రాంచీల ద్వారా కస్టమర్లకు ఈ పథకం కింద రుణ సాయం అందజేస్తుంది.

జీల్‌లో ప్రమోటర్ వాటాల విక్రయం

న్యూఢిల్లీ: మీడియా సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్)లో ప్రమోటర్ సంస్థ ఎస్సెల్ హోల్డింగ్స్ 1.44 శాతం వాటాలను విక్రయించింది. ఈ డీల్ విలువ రూ. 825 కోట్లు. ఓపెన్ మార్కెట్ లావాదేవీలో మొత్తం 1.39 కోట్ల షేర్లు (1.44 శాతం వాటా) విక్రయించినట్లు ఎస్సెల్ తెలిపింది. సగటున షేరు ఒక్కింటికి రూ. 595.13 రేటుకి అమ్మినట్లు పేర్కొంది. డిసెంబర్ ఆఖరు నాటికి జీల్‌లో ఎస్సెల్ హోల్డింగ్స్‌కి 4.64 కోట్ల షేర్లు ఉన్నాయి. మంగళవారం బీఎస్ఈలో జీల్ షేరు ధర 2.52 శాతం క్షీణించి రూ. 593.80 వద్ద క్లోజయ్యింది.

రండి... పెట్టుబడులు పెట్టండి!

ఆసియాన్ దేశాలకు జైట్లీ ఆహ్వానం



న్యూఢిల్లీ: భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆసియాన్ దేశాలను ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం అభ్యర్థించారు. ముఖ్యంగా మౌలిక, సేవల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి భారత్ అంతర్జాతీయ ప్రమాణాలను సాధించిందని పేర్కొన్న జైట్లీ... దేశంలో పెట్టుబడుల ద్వారా పరస్పర ప్రయోజనాలను పొందవచ్చని ఆసియాన్ దేశాలకు వివరించారు. ఆసియాన్–భారత్ వ్యాపార పెట్టుబడుల వీడ్కోలు సమావేశంలో జైట్లీ ప్రసంగం

ముఖ్యాంశాలు ఇవీ...: భారత్ వృద్ధి రేటు గడచిన 25 సంవత్సరాల్లో ఊపందుకుంది. వచ్చే రెండు, మూడు దశాబ్దాల్లో భారత్‌లో ఆర్థికాభివృద్ధి అవకాశాలను పెట్టుబడిదారులు పరిశీలిస్తున్నారు.

- మౌలిక రంగంలో పెట్టుబడులకు భారత్ మంచి అవకాశాలను ఆఫర్ చేస్తోంది. మౌలిక రంగం వృద్ధి భారత్ వృద్ధికి ఎంతో కీలకం. తయారీ, సేవల రంగాల్లో పెట్టుబడుల పెంపునకూ భారత్ అధిక ప్రాధాన్యత ఇస్తోంది.
- ఆసియాన్ గ్రూప్‌లో దాదాపు 200 కోట్ల ప్రజలు ఉన్నారు. ఈ దేశాల మధ్య వాణిజ్యాభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలూ మెరుగుపడతాయి. పరస్పర పెట్టుబడుల పెంపుతో ఆర్థిక క్రియాశీలత, ఉపాధి కల్పన వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి జరుగుతుంది. అందువల్ల భారత్–ఆసియాన్ బ్లాక్‌లు కలిసి మెలసి ముందుకుసాగి తగిన వృద్ధి బాటను చేరుకోవడానికి ఇది తగిన సమయం.

ఆసియాన్‌లో 10 దేశాలివీ...: బ్రునై, కాంబోడియా, ఇండోనేసియా, మలేసియా, మయన్మార్, సింగపూర్, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్, లావోస్, వియత్నాంలు ఆసియాన్ బ్లాక్‌లో ఉన్నాయి. 2009లో భారత్–10 దేశాల ఆసియాన్ బ్లాక్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై (ఎఫ్‌టీఏ)పై ఇవి సంతకాలు చేశాయి.

వర్ధమాన దేశాల్ని విస్మరించొద్దు!: రాజన్



దావోస్: వర్ధమాన దేశాల తోడ్పాటు లేకుండా తాము పురోగమించలేమన్న సంగతి పాశ్చాత్య దేశాలు గుర్తించాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వ్యాఖ్యానించారు. పరిస్థితులను సత్వరం చక్కదిద్దకపోతే.. ముక్కలైన ప్రపంచం ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేమన్న సంగతి గుర్తెరగాలన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా నిర్వహించిన ఒక చర్చాగోష్టిలో రాజన్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాశ్చాత్య దేశాల్లో వయో వృద్ధుల జనాభా గణనీయంగా పెరిగిపోతున్న నేపథ్యంలో.. ఆయా దేశాలు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వర్ధమాన దేశాల మీదే ఆధారపడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

డాట్సన్ 'రెడి–గో'లో ఏఎంటీ వెర్షన్

ప్రారంభ ధర రూ.3.8 లక్షలు



న్యూఢిల్లీ: నిస్సాన్ మోటార్ ఇండియా తాజాగా తన డాట్సన్ బ్రాండ్‌లోని ఎంట్రీ లెవెల్ మోడల్ 'రెడి–గో'లో ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) వెర్షన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.3.8 లక్షలు (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ). రెడి–గో స్టాండర్డ్ వెర్షన్‌తో పోలిస్తే ప్రస్తుత వెర్షన్ ధర దాదాపు రూ.22,000 ఎక్కువగా ఉంది. రెడి–గో ఏఎంటీ వెర్షన్‌లో డ్యూయెల్ డ్రైవింగ్ మోడ్, రష్ అవర్ మోడ్ సహా పలు ప్రత్యేకతలున్నాయని కంపెనీ పేర్కొంది. కాగా కంపెనీ ఈ కొత్త కారులో 1 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చింది. ఇది మారుతీ ఆల్టో కే10 ఏజీఎస్, రెనో క్విడ్ ఏఎంటీ మోడళ్లకు గట్టి పోటీనిస్తుందని విశ్లేషకుల అభిప్రాయం.

ఇండియాబుల్స్ హౌసింగ్ లాభం 1,168 కోట్లు

24% పెరిగిన నికర వడ్డీ ఆదాయం

ముంబై: గృహరుణ సంస్థ, ఇండియాబుల్స్ హౌసింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.1,168 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ3లో వచ్చిన నికర లాభం(రూ.752 కోట్లు)తో పోల్చితే 55 శాతం వృద్ధి సాధించామని కంపెనీ తెలిపింది. ఓక్‌నార్త్ బ్యాంక్‌లో మూడో వంతు వాటాను రూ.768 కోట్లకు విక్రయించడం, నికర వడ్డీ ఆదాయం ఆరోగ్యకరంగా ఉండటం వంటి కారణాల వల్ల నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని కంపెనీ వైస్ చైర్మన్, ఎమ్‌డీ, గగన్ బంగ చెప్పారు. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ.1,410 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. గత క్యూ3లో 13.8 శాతంగా ఉన్న ఆదాయానికి, వ్యయానికి గల నిష్పత్తి ఈ క్యూ3లో 12.5 శాతానికి తగ్గిందని వివరించారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఇండియాబుల్స్ హౌసింగ్ కంపెనీ షేర్ 2 శాతం లాభంతో రూ.1,379 వద్ద ముగిసింది.

ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం 28 శాతం అప్



ముంబై: ప్రైవేట్ రంగంలోని ఆర్‌బీఎల్ బ్యాంక్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 28 శాతం పెరిగింది. ఈ క్యూ3లో రూ.165 కోట్ల నికర లాభం సాధించామని ఆర్‌బీఎల్ బ్యాంక్ తెలిపింది. మొండి బకాయిలు, కేటాయింపులు పెరిగినా, మార్జిన్‌లు అధికంగా ఉండటంతో ఈ స్థాయిలో నికర లాభం సాధించామని బ్యాంక్ ఎమ్‌డీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ విశ్వవీర్ అహుజా తెలిపారు. రుణాలు 38 శాతం పెరగడంతో నికర వడ్డీ మార్జిన్‌లు 51 బేసిస్ పాయింట్లు పెరిగి 3.89 శాతానికి పెరిగాయని పేర్కొన్నారు. నికర వడ్డీ ఆదాయం 45 శాతం వృద్ధితో రూ.467 కోట్లకు, ఇతర ఆదాయం 42 శాతం పెరిగి రూ.258 కోట్లకు చేరాయని వివరించారు. స్థూల మొండి బకాయిలు 1.06 శాతం నుంచి 1.56 శాతానికి, నికర మొండి బకాయిలు 0.52 శాతం నుంచి 0.97 శాతానికి పెరిగాయని పేర్కొన్నారు. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఆర్‌బీఎల్ బ్యాంక్ షేర్ 1.4 శాతం లాభంతో రూ.535.50ను తాకింది.

చెక్క సొగసుతో స్టీల్ తలుపులు

టాటా స్టీల్‌కు చెందిన స్టీల్ డోర్స్ బ్రాండ్ 'ప్రవేశ్' స్టీల్ తలుపులను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇవి చూడటానికి అచ్చం చెక్కతో చేసిన వాటికి మల్లే ఉంటాయని, అందం లో చెక్క తలుపులను మించి ఉంటాయని కంపెనీ తెలిపింది. వీటిల్లో అధిక నాణ్యతా ప్రమాణాలతో కూడిన లాకింగ్ సిస్టమ్, ఐహోల్, డోర్ క్లోజర్, సెకండరీ లాక్ వంటి పలు ప్రత్యేకతలున్నాయి.



ఐపీఓకు బీడీఎల్!



న్యూఢిల్లీ: ప్రభుత్వానికి చెందిన రక్షణ రంగ కంపెనీ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌కు వస్తోంది. ఐపీఓ సంబంధిత పత్రాలను ఈ కంపెనీ మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీకి సమర్పించింది. ఈ ఐపీఓలో భాగంగా 12–13 శాతం వాటాకు సమానమైన 2.2 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ప్రభుత్వం జారీ చేయనుంది. ఇష్యూ సైజు రూ.1,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా. 1970లో ప్రారంభమైన భారత్ డైనమిక్స్ లిమిటెడ్.. లక్షిత క్షిపణులను, ఇతర రక్షణ ఆయుధాలను తయారు చేస్తోంది.

నాలుగో కంపెనీ..: ఒక నెలలో ఐపీఓ పత్రాలను సమర్పించిన నాలుగో ప్రభుత్వ రంగ కంపెని ఇది. ఇప్పటికే మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్, రైట్స్, ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ– ఈ మూడు కంపెనీలూ ఐపీఓ అనుమతుల కోసం సెబీకి దరఖాస్తు చేసుకున్నాయి.

బోర్డ్ మీటింగ్స్

ఐడియా సెల్యులర్, కెనరా బ్యాంక్, ఎల్ అండ్ టీ, మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్, విజయ బ్యాంక్, టీటీకే ప్రెస్టీజ్, బయోకాన్, ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్(ఇండిగో), ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, రేమండ్, ఫైజర్, ర్యాడికో ఖైతాన్, ఆదిత్య బిర్లా మనీ, క్యాపిటల్ ఫస్ట్

అక్టోబర్ - డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017–18	2016–17	వృ/క్షీ(%)	2017–18	2016–17	వృ/క్షీ(%)
* ఎడిల్‌వీజ్ ఫైనా. సర్వీ.	236	155	52	2,081	1,612	29
* సింఫనీ	66	55	21	226	190	19
ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్	126	109	16	969	810	20
యునైటెడ్ స్పిరిట్స్	135	148	-9	7,161	7,078	1
క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూ. ఎలక్ట్రికల్స్	70	54	28	945	910	4
ఫోర్స్ మోటార్స్	15	23	-37	750	716	5

* ఒక్కో షేర్‌కు రూ. 1 డివిడెండ్‌ను ప్రకటించాయి.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,240	▲	50
బంగారం (99.5, 10గ్రా)	30,090	▲	50
వెండి (కిలో)	38,760	▼	125
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)			
బంగారం (22 క్యారెట్లు)	28,820	▲	40
వెండి (కిలో)			
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,870	▲	90
బంగారం (22 క్యారెట్లు)	28,860	▲	80
వెండి(కిలో)	39,265		0
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,750	▲	100
బంగారం (22 క్యారెట్లు)	28,480	▲	70
వెండి(కిలో)	39,900		0
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,390		0
బంగారం (22 క్యారెట్లు)	28,780		0
వెండి(కిలో)	38,500		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,000	▼	100
బంగారం (22 క్యారెట్లు)	28,800	▲	50
వెండి(కిలో)	40,000		0
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,160	▲	40
బంగారం (22 క్యారెట్లు)	28,820	▲	40
వెండి(కిలో)	40,000		0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.45 (రాత్రి 11.30కు)	$63.57 (సోమవారం ముగింపు)
బ్రెంట్	69.94 (రాత్రి 11.30కు)	$69.03 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 24-1-2018

విశాఖ	412-00
చిత్తూరు	398-00
వరంగల్	404-00
ముంబై	435-00
చెన్నై	405-00
విజయవాడ	412-00
గోదావరి	412-00
నమక్కల్	380-00
23-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.50
బెంగళూరు	400-00
ఢిల్లీ	425-00
కోల్‌కతా	464-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	438.4	438.05
AMBUJA C	262.7	268.45
ASIAN PA	1169.9	1176
AXIS BAN	620.1	611.55
BAJAJ AU	3295.95	3274.5
BAJAJ FI	1708.7	1706.35
BHARTI A	492.1	490.7
[illegible]		

A B C D

20 MICRO	60.55	55.85
3M INDIA	18721.85	18806.2
5PAISA C	317.15	323.65
63 MOONS	104.75	105
8K MILES	797.2	781.05
AARTI DR	699.25	715.6
AARTI IN	1121.35	1135.4
AARVEE D	51.9	53.4
AARVI EN	99.05	99
ABAN OFF	227.5	231.25
BAYER CR	4542.95	4650.15
BEARDSEL	67.15	68.8
BEML LIM	1518.75	1515.9
BERGER P	251.4	249.6
BETA DRU	179.85	175
BF INVES	343.5	344.8
BF UTILI	512.35	525.2
BGR ENER	140.75	139.75
BHAGERIA	291.6	293.15
BHANSALI	190.1	191.35
BHARAT B	1400.35	1404.3
BHARAT F	748.5	739.7
BHARAT F	1033.8	1005.05
DISH TV	73.15	71
DISHMAN	390.05	384.75
DIXON TE	3790.7	3824.85
DOLLAR I	458.8	455.8
DOLPHIN	126.25	128.2
DR. LAL	909.9	913.05
DYNAMATI	1936.6	1948.05
[illegible]		

E F G H

ECE INDU	335.15	340.5
ECLERX S	1559.55	1552.65
EDELWEIS	295.05	289.55
GUJARAT	873.3	882.35
GUJARAT	872.35	890.6
GULF OIL	893.25	899.15
GULSHAN	89.05	89
HARITA S	1014.5	1021.15
HATSUN A	809.8	810.35
HCL INFO	57.75	59.2
HDFC STA	458.55	470.2
HEALTHCA	308.1	300.9
HEG LTD	2979.85	2913.55
HEIDELBE	164.7	161.2
HERCULES	148.7	148.5
HESTER B	1690.9	1622.65
[illegible]		

I J K L

JK CEMEN	1153.15	1153.05
JK LAKSH	428.2	430.7
JK PAPER	145.2	148
JK TYRE	178.1	177.85
JKUMAR I	334.35	336.05
JM FINAN	161.7	163.85
JMC PROJ	589	592.5
JOCIL LI	190.4	193.75
JOHNSON	2657.45	2685
JSW ENER	90.6	88.7
JSW HOLD	1745.2	1747.1
JUBILANT	242.1	246.8
JUBILANT	891.65	887.45
[illegible]		

M N O P

MAX FINA	540.9	544.35
MAX INDI	119.65	118.25
MAX VENT	84.85	86.65
MAYUR UN	550.5	527.2
MAZDA LI	479.85	486.35
MCLEOD R	182.5	181.25
MEGHMANI	115.55	117.95
MENON BE	114.8	121.2
MEP INFR	93.9	94.95
MERCK LI	1445.8	1457.15
MINDA CO	212.35	208.5
MINDA IN	1289.6	1295.75
MINDTECK	80.95	83.5
POLY MED	260.05	259.75
POLYPLEX	537.4	551.25
PONNIE S	178.1	177.85
POWER ME	872.55	876.9
PPAP AUT	647	657.55
PRABHAT	219.25	220.4
PRAJ IND	113.65	114.2
PRAKASH	240.5	241.7
PRATAAP	1149.7	1155.2
PRECISIO	124.25	125.85
PRECISIO	273.45	271.15
PRECOT M	85.75	85.9
PREMIER	469.3	444.35
[illegible]		

R S T U

SHIVAM A	89.55	90.15
SHOPPERS	517.05	530.1
SHRADHA	70	68.5
SHRE PUS	296.45	295.55
SHREE TI	60.5	63.8
SHRENIK	655.45	654.75
SHREYANS	195	201
SHREYAS	591.8	591.05
SHRIRAM	2041.35	2052.4
SICAGEN	53.55	53.05
SICAL LO	240.05	240.25
SILLY MO	175.35	165.45
SILVER T	125.5	124
THIRU AR	53.1	53.45
THIRUMAL	2226.35	2251.95
THOMAS C	252.6	250.2
THYROCAR	687.65	700
TI FINAN	706.05	724.1
TIDE WAT	7235.2	7174.15
TIL LTD	603.5	604.1
TIME TEC	209.5	209.8
TIMES GU	71.25	69.55
TIMKEN I	916.25	918.25
TIRUPATI	64.8	64.6
TITAGARH	164.75	169.6
[illegible]		

V W Y Z

[illegible]		

బీఎస్ఈ ఎస్ఎంఈ

[illegible]		

Dwaraka

2న మేడారం జాతరకు సీఎం కేసీఆర్

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి




అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు

ములుగు: సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకునేందుకు ఫిబ్రవరి 2న సీఎం కె.చంద్రశేఖర్‌రావు మేడారం రానున్నారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడారంలో మంగళవారం మంత్రులు అజ్మీరా చందూలాల్,ఇంద్రకరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాజాతరకు వచ్చే భక్తులకు సింగరేణి, జెన్‌కో, ఆర్టీసీ తరపున 25లక్షల మంచినీటి బాటిళ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖ అందజేశామని, జాతరకు రావాలని ఆయనను ఆహ్వానించినట్లు తెలిపారు. మహాజాతరకు సీఎంతోపాటు గవర్నర్ నరసింహన్ రానున్నట్లు తెలిపారు. జాతర జరిగే 4 రోజులు ఇక్కడే ఉండి సౌకర్యాలను పర్యవేక్షిస్తానని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. పర్యాటక శాఖ తరపున 38 లగ్జరీ టెంట్లు, వీవీఐపీ టెంట్లు ఏర్పాటు చేశామని మంత్రి చందూలాల్ తెలిపారు. భక్తుల కోసం 4,200 బస్సులు, 11,000 మంది సిబ్బందిని కేటాయించినట్లు మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం మేడారంలో పలు అభివృద్ధి పనులను మంత్రులు ప్రారంభించారు.

సాగునీటిదే మళ్లీ అగ్రస్థానం

బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.29 వేల కోట్ల కేటాయింపునకు ప్రతిపాదనలు

- గతంతో పోలిస్తే 10 శాతం అదనం
- కాళేశ్వరానికి రూ.9 వేల కోట్లు.. పాలమూరుకు రూ.4 వేల కోట్లు



సాక్షి, హైదరాబాద్: రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఈ మారు బడ్జెట్‌లో సాగునీటికే మళ్లీ అగ్రస్థానం దక్కే అవకాశం ఉంది. రెండేళ్లుగా నీటి పారుదల శాఖకు కేటాయిస్తున్న రూ.25 వేల కోట్ల బడ్జెట్‌కు అదనంగా మరో పది శాతాన్ని పెంచి కేటాయింపులు చేసే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ అందింది. దీంతో ఇప్పటికే నీటిపారుదల శాఖ తయారు చేసిన రూ.50 వేల కోట్ల ప్రతిపాదనలను మార్చి కొత్తగా రూ.29,091 కోట్లతో తుది ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్థిక శాఖకు పంపింది.

మరో 10 శాతం అదనపు కేటాయింపు..

గత(2016-17, 2017-18) బడ్జెట్లలో సాగునీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం రూ.25 వేల కోట్ల మేర కేటాయింపులు చేస్తూ వచ్చింది. 2016-17 బడ్జెట్‌లో కేవలం రూ.14,918 కోట్ల మేర మాత్రమే ఖర్చు జరిగింది. జరగని భూసేకరణ కారణంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.7,860 కోట్లు కేటాయించినా చివరికి రూ.2,851.88 కోట్లకు సవరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.6,280 కోట్లు కేటాయించినా రూ.2,280 కోట్లే ఖర్చయింది. 2017-18 బడ్జెట్‌లోనూ రూ.25 వేల కోట్ల కేటాయింపులు జరిగినా, ఈ నెల 20 నాటికి రూ.15,273.15కోట్లు మేర ఖర్చయింది. ఇందులో రూ.6,532.68 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. మార్చికి కనిష్టంగా ఆర్థిక శాఖ మరో రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల వరకు ఇస్తానని అంటోంది. ఈ లెక్కన చూసినా ఈ ఏడాది ఖర్చు రూ.18 వేల కోట్లను దాటడం కష్టమే.

ఈసారి ఎన్నికల బడ్జెట్

ప్రస్తుతం మెజార్టీ ప్రాజెక్టులకు సంబంధించి కోర్టు కేసులు, పర్యావరణ, అటవీ సమస్యలు పరిష్కారం కావడం, అదీగాక వచ్చే ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో సాగునీటికి మళ్లీ అగ్రపీఠం వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొనే నీటి పారుదల శాఖ వారం రోజుల కిందట మొత్తంగా రూ.49,539.13 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసింది. ఇందులో పాలమూరుకు ఏకంగా రూ.13,350 కోట్లు, కాళేశ్వరానికి రూ.11,851 కోట్లు కావాలన్న ప్రతిపాదనలు తయారు చేశారు. అయితే నీటి పారుదల శాఖ, ఆర్థిక శాఖల మధ్య జరిగిన చర్చల అనంతరం గత ఏడాది కన్నా 10 శాతం అదనపు కేటాయింపులతో ఈ ప్రతిపాదనలను రూ.30 వేల కోట్లకు కుదించాలన్న సూచనలు వచ్చాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మంగళవారం రూ.29,091 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.27,747 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.1,344 కోట్లు ప్రతిపాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.9 వేల కోట్లు, పాలమూరు-రంగారెడ్డికి రూ..4 వేల కోట్లకు ప్రతిపాదించారు. ఇక మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్డీఎస్, జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమాలకు కలిపి మొత్తంగా రూ.1,793 కోట్లు కోరగా, ఎస్ఎల్‌బీసీ, డిండి, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింది అవసరాలకు రూ.1,853 కోట్లు ప్రతిపాదించారు. ఖమ్మం జిల్లాలోని సీతారామ, భక్తరామదాస, వైరా, కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులకు రూ.1,596 కోట్లు కోరగా, ఆదిలాబాద్ జిల్లాలోని లోయర్ పెనుగంగ, ప్రాణహిత, కుమురం భీం ప్రాజెక్టులకు రూ.1,118 కోట్ల మేర ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలపై ప్రస్తుతంఆర్థిక శాఖ పరిశీలన చేస్తోంది.

హలో.. నేను మీ ప్రియమైన హరీశ్‌ను..!

- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై మంత్రి వినూత్న ప్రచారం
- మొబైల్ ద్వారా ప్రజలకు సందేశం
- చైతన్యం, అవగాహన కోసం కొత్త ఒరవడి



సిద్దిపేటజోన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వినూత్న పంథాను ఎంచుకున్నారు. తన వాయిస్‌తో కూడిన సందేశాన్ని పట్టణ ప్రజలకు ఫోన్ ద్వారా వినిపించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. 'నమస్కారం.. నేను మీ ప్రియమైన హరీశ్‌రావును మాట్లాడుతున్నాను. ఈ ఏడాది జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మన సిద్దిపేట పట్టణం పోటీలో ఉంది. మన పట్టణాన్ని మీ సహకారంతో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణం (ఓడీఎఫ్)గా చేసుకుని ఇప్పటికే ఆదర్శంగా నిలిచాం. ఇక, మీ భాగస్వామ్యంతో ఇంటింటికి చెత్త సేకరణ, దాని నిర్వహణ సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. హరితహారంలో ముందున్నాం. వీటిని మరింత విజయవంతం చేయడంలో మీ సహకారం ఎంతో అవసరం. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొని మన సిద్దిపేట పట్టణాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను'అని సందేశం వినిపిస్తున్నారు. హైదరాబాద్ నుంచి '040'కోడ్‌తో వచ్చే ఈ కాల్ పట్టణంలోని అందరికీ చేరుతోంది. ఫోన్ ఎత్తగానే మంత్రి గొంతుతో కూడిన సందేశం వినిపిస్తుంది. 'ఈ మహా యజ్ఞంలో మీరు భాగస్వామ్యం కావడానికి 1969 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వండి. లేదా స్వచ్ఛ సర్వేక్షణ్ 2018 వెబ్‌కు లాగిన్ అయ్యి మీ అభిప్రాయాన్ని తెలియజేయండి'అంటూ మంత్రి సందేశం ముగుస్తుంది. అయితే.. ఇప్పుడు పట్టణంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. సిద్దిపేటకు ర్యాంకు ఇవ్వడానికి బుధవారం నుంచి మూడు రోజుల పాటు కేంద్ర బృందం పర్యటించనుంది. ఈ బృందం ప్రజలను కూడా కలుస్తుందని, చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై బృందం సభ్యులు వివిధ ప్రశ్నలు వేస్తారని, వాటికి తదనుగుణంగా సమాధానాలు ఇవ్వాలని మంత్రి ఆ సందేశంలో వినిపిస్తున్నారు.

నేటి నుంచి పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు



యాదగిరికొండ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలోని పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విష్వక్సేన ఆరాధనతో ప్రారంభమై.. అష్టోత్తర శత ఘటాభిషేకంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24న విష్వక్సేన ఆరాధన, స్వస్తి వచనం, రక్షాబంధనం, రాత్రి 8 గంటలకు అంకురార్పణం, మృత్సంగ్రహణం కొనసాగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

యాదాద్రి హుండీ లెక్కింపులో చేతివాటం

రూ.27,280తో పట్టుబడిన ఉద్యోగిని



యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగిని చేతివాటం ప్రదర్శించి పట్టుబడింది. దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సరోజ మంగళవారం హుండీ లెక్కింపులో పాల్గొంది. కొంతసేపు తర్వాత సరోజ మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లబోగా ద్వారం బయట ఉన్న మహిళా హోంగార్డులు తనిఖీ చేశారు. ఆమె దగ్గర రూ.27,280 నగదు దొరికింది. నిందితురాలిపై కేసు నమోదు చేశారు.

కవి మచ్చ ప్రభాకర్ ఆత్మహత్య

భార్య మరణాన్ని జీర్ణించుకోలేక..




సిరిసిల్ల: అభ్యుదయ కవి, తెలంగాణ రచయితల వేదిక జాతీయ కార్యదర్శి మచ్చ ప్రభాకర్(63) ముంబైలో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్‌కి చెందిన మచ్చ ప్రభాకర్ 1977లో ముంబై వెళ్లి అక్కడే ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 33 ఏళ్లు పని చేసి ఇటీవల రిటైర్ అయ్యారు. ప్రభాకర్ భార్య పుష్ప(57) 20 రోజుల కిందట జనవరి 2న గుండె పోటుతో మరణించారు. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక ప్రభాకర్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. ప్రభాకర్‌కు కుమారుడు, కూతురు ఉన్నారు. ప్రభాకర్ మృతదేహాన్ని సిరిసిల్లకు బుధవారం తీసుకువస్తున్నట్లు సోదరుడు ఆనంద్ తెలిపారు.

ఖమ్మంలో మిర్చి ధర రూ.10,800

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మిర్చికి రికార్డుస్థాయిలో క్వింటాకు రూ.10,800 ధర పలికింది. సోమవారం మార్కెట్‌లో క్వింటా మిర్చి రూ. 10,025 పలకగా, ఒక్కరోజు వ్యవధిలోనే క్వింటాల్‌కు రూ.775 పెరిగింది. మిర్చి ధర రూ.10వేల మార్కు దాటడంతో పంట పండించిన రైతులు విక్రయానికి మొగ్గుచూపుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, పొరుగున ఉన్న ఏపీలోని కృష్ణా జిల్లాలో తేజా రకం మిర్చిని అధికంగా పండిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పండిన మిర్చికి డిమాండ్ పలుకుతుండటంతో ఉత్తరాదికి చెందిన వ్యాపారులు ఇక్కడే పంట ఉత్పత్తిని కొనుగోలు చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ

టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే: కె.లక్ష్మణ్



జహీరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మంగళవారం ఓబీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని అన్నారు. ఇక్కడి నుంచే ప్రజా సదస్సులకు శ్రీకారం చుడుతున్నామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలతో వచ్చిన రాష్ట్రంలో తమ సమస్యలు తీరుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. 1.12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి మూడేళ్లలో కేవలం 16 వేలు మాత్రమే భర్తీ చేశారన్నారు.

భూమి డేటానుబట్టే రైతులకు పాస్‌బుక్

వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి



సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖ ఇచ్చే భూమి డేటానుబట్టే రైతులకు పాస్‌బుక్‌లు అందజేయడం జరుగుతుందని వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి అన్నారు. రైతు పంటకు పెట్టుబడి పథకం అమలు నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాగుకు పెట్టుబడి అమలు, భవిష్యత్తులో రైతులకు అందజేయనున్న కార్యక్రమాలకైనా, పథకాల అమలుకైనా భూములకు సంబంధించిన డేటా చాలా కీలకమని పార్థసారథి అన్నారు. రైతులకు అందించనున్న పెట్టుబడిని చెక్కు రూపంలో అందించనున్నట్లు చెప్పారు. పాస్‌బుక్‌లలో సమాచారం, రైతులకు చెక్కులు అందజేసినప్పుడు చెక్కుల్లో పేర్కొనే సమాచారం మధ్య ఎక్కడా అంతరాలు లేకుండా డేటా పక్కాగా పొందుపర్చాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, విధానకర్తలు ఆసక్తితో గమనిస్తున్నారన్నారు. రెవెన్యూశాఖ అందజేసే భూమి డేటా అన్నింటికీ కీలకం కానుందన్నారు. గ్రామ సభలు త్వరగా పూర్తి చేసి నూటికి నూరుశాతం డేటా కరెక్టుగా పొందుపర్చాలని, ఈ డేటా ఆధారంగానే బడ్జెట్ కూడా రూపొందనుందన్నారు. భూసమగ్ర సర్వే డేటా సేకరణలో సిబ్బంది అంతా చాలా కృషి చేశారని భూపరిపాలన డైరెక్టర్ వి.కరుణ అభినందించారు.

29 నాటికి బీమా చెక్కులు ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: 2016-17 ఏడాదికి సంబంధించి ఖరీఫ్, రబీ సీజన్ల బీమా పరిహారపు చెక్కులను ఈ నెల 29 నాటికి రైతులకు అందజేయాలని వ్యవసాయశాఖ బీమా కంపెనీలను ఆదేశించింది. మంగళవారం వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి ఆయా కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కొన్ని కారణాలతో రూ. 40 లక్షల విలువైన పరిహారపు చెక్కులు వెనక్కు వచ్చాయని, లోపాలను సరిదిద్ది వాటిని రైతులకు ఇవ్వాలని కోరారు.

కూతురును కడతేర్చిన తండ్రి

మద్యం మత్తులో దాడి

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకీపురంలో సోమవారం మద్యం మత్తులో ఓ తండ్రి కుటుంబ సభ్యులపై దాడి చేయడంతో ప్రమాదవశాత్తు కూతురు తలకు బలమైన గాయమై మృతిచెందింది. గ్రామానికి చెందిన పుట్టా కృష్ణయ్య, నాగమణిలకు కొడుకు, కూతురు ఉన్నారు. కూలీ పనుల కోసం గతేడాది ఏపీలోని విశాఖపట్నం వెళ్లారు. కృష్ణయ్య అమ్మమ్మ కర్మకాండల కోసం రెండ్రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. ఇంట్లో వాటా గురించి చర్చ జరిగింది. తాగిన మత్తులో కృష్ణయ్య కర్రతో సోదరి నాగమణిని కొట్టడంతో ఆమె తల పగిలింది. పిల్లలపై దాడి చేస్తాడేమోననే భయంతో భార్య నాలుగేళ్ల సుప్రియను ఎత్తుకొని బయటకు వస్తుండగా, భార్యను కొట్టే క్రమంలో చిన్నారి తలకు గాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిను ఆమెను వైరాలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది.

తెలంగాణ వ్యతిరేక శక్తులకు సర్కార్ ఊతం

టీజేఏసీ చైర్మన్ కోదండరాం



మంచిర్యాల క్రైం: తెలంగాణ వ్యతిరేక శక్తులకు ప్రభుత్వం ఊతమిస్తోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంచిర్యాల, కుమురం భీం జిల్లాల రైతు, నిరుద్యోగ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటనపై పరోక్షంగా విమర్శలు చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను పక్కనపెట్టి వ్యతిరేక శక్తులను రంగంలోకి దింపడం టీఆర్ఎస్ తీరుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రైతాంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కల్తీ విత్తనాలు, ఎరువులతో దిగుబడి రాక, మద్దతుధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగం అభివృద్ధే లక్ష్యంగా టీజేఏసీ ముందుకు సాగుతుందన్నారు.

ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువతీయువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దిశలో రైతు, నిరుద్యోగ సమస్యలపై పూర్వపు 10 జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తుండగా, మొదటి సదస్సు మంచిర్యాలలో నిర్వహించినట్లు చెప్పారు. ఈనెలాఖరు వరకు సదస్సులు పూర్తి చేసి, ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజాసంఘాల పాత్ర కీలకం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రతి ఉద్యమంలో ప్రజాసంఘాల, పౌర సంఘాల పాత్ర కీలకమేనని కోదండరాం అన్నారు. మంగళవారం సిద్దిపేటలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పౌర వేదికలను ప్రభుత్వం అడ్డుకొని ఆంక్షలు విధించడం సరికాదన్నారు. జేఏసీలో పార్టీలకు చోటు లేదని, ప్రజా సంఘాలకు మాత్రమే చోటు ఉంటుందన్నారు. బంగారు తెలంగాణ సాధన కోసం జేఏసీ మరో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.

నీళ్లు అడిగితే నిషేధాజ్ఞలా..

పెద్దపల్లి: పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ప్రశ్నిస్తే నిషేధాజ్ఞలు విధించి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కులను కాలరాస్తున్నారని జేఏసీ చైర్మన్ కోదండరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటలకు కావాల్సిన నీటిని అందించాలని రైతులు ఎక్కడ నిలదీస్తారోననే భయంతో జిల్లాలో 144 సెక్షన్, 30 యాక్ట్‌లను అమలు చేస్తున్నారన్నారు. దొమ్మీలు, రక్తపాతం జరిగినపుడు మాత్రమే ఇలాంటి చట్టాలు ప్రయోగిస్తారన్నారు.

ఆ మూడు ప్రమాదకరం!



ఉగ్రవాదం, వాతావరణ మార్పు, రక్షణాత్మక వ్యాపార ధోరణితో మానవాళికి పెనుముప్పు

- వాతావరణ మార్పులపై ధనిక దేశాలది కపట ధోరణి
- పెట్టుబడులకు సంబంధించి రెడ్‌టేప్ స్థానంలో.. రెడ్ కార్పెట్ తీసుకొచ్చాం!
- ప్రస్తుత ప్రపంచానికి భారతీయ తత్త్వమైన 'వసుధైక కుటుంబం' ఉత్తమం
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో మోదీ కీలక ప్రారంభోపన్యాసం

దావోస్

ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, రక్షణాత్మక వ్యాపార ధోరణులు ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటోన్న అతిపెద్ద ముప్పులుగా ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మంచి ఉగ్రవాదులు, చెడు ఉగ్రవాదులంటూ కొందరు చేస్తోన్న తప్పుడు విభజన కూడా ఉగ్రవాదంతో సమానమేనని ఆయన హెచ్చరించారు. వాతావరణ మార్పులపై అభివృద్ధి చెందిన దేశాలవి కేవలం మాటలేనని, అవి చిన్న దేశాలకు సాయపడడం లేదని విమర్శించారు. కొన్ని దేశాలు రక్షణాత్మక వ్యాపార ధోరణి అవలంబించడం ప్రమాదకరమన్న ప్రధాని.. ప్రపంచీకరణ ప్రాభవం రోజురోజుకూ తగ్గుతోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో భారత్‌లో మాత్రం రెడ్‌టేప్(పరిశ్రమలకు అనుమతులివ్వడంలో అలవికాని జాప్యం) స్థానంలో రెడ్ కార్పెట్ తీసుకువచ్చామన్నారు. స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వత శ్రేణుల్లోని విడిది కేంద్రం దావోస్‌లో నిర్వహిస్తోన్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో మోదీ మంగళవారం కీలక ప్రారంభోపన్యాసం చేశారు. ఈ ప్రసంగంతో డబ్ల్యూఈఎఫ్ ప్రారంభ ప్లీనరీని ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా నిలిచిన మోదీ 'విరోధాలు, విభేదాలు లేని.. సహకారంతో కూడిన స్వేచ్ఛాయుత స్వర్గాన్ని కలిసికట్టుగా నిర్మించాలి' అని ప్రపంచ దేశాలకు సూచించారు.

మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

వాతావరణ మార్పులపై...: మన సంస్కృతిలో ప్రకృతిని మనం తల్లిగా భావిస్తాం. పారిస్ ఒప్పందం మేరకు మన అభివృద్ధి ప్రక్రియ పర్యావరణ పరిరక్షణకు లోబడి ఉంటుందని మనం హామీనిచ్చాం. వాతావరణ మార్పుల విషయంలో మన బాధ్యతల్ని గుర్తెరగడమే కాకుండా.. ఆ దుష్పరిణామాల్ని అడ్డుకునేందుకు ముందడుగు వేయాలి. తీవ్రమైన వాతావరణ మార్పులతో మంచు ఖండాలు కరిగిపోతున్నాయి. ప్రతికూల వాతావరణం వల్ల కొన్ని ద్వీపాలు మునిగిపోతుండగా.. కొన్ని మునిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు ఏం చేయాలో ప్రపంచం ఆలోచించాలి. పర్యావరణం పట్ల శ్రద్ధ భారతదేశ సంస్కృతిలో భాగం. దేనినైనా తన దురాశ కోసం వాడుకోవడానికి మహాత్మా గాంధీ వ్యతిరేకం. వాతావరణం విషయంలో చిన్న దేశాలకు సాయం చేసేందుకు ఎన్ని అభివృద్ధి చెందిన దేశాలు సిద్ధంగా ఉన్నాయనేది కూడా ప్రశ్నే. కర్బన ఉద్గారాల్ని తగ్గించాలని ప్రతి ఒక్కరూ మాటలు చెపుతున్నారు. కొత్త సాంకేతికత సాయంతో చిన్న దేశాలకు సాయం చేసేందుకు మాత్రం ధనిక దేశాలు సిద్ధంగా లేవు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు చేద్దాం..

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అది ప్రమాదకరమని నేను గట్టిగా చెప్పగలను. మంచి ఉగ్రవాదులు, చెడు ఉగ్రవాదులంటూ కొందరు చేస్తోన్న తప్పుడు విభజన కూడా ఉగ్రవాదంతో సమానమే. మనమందరం ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు చేయాలి. ఉగ్రవాదంపై పోరాడే శక్తులకు భారత్ అండగా ఉంటుంది.

రిఫామ్.. పెర్‌ఫామ్.. ట్రాన్స్‌ఫామ్!

సంస్కరణలు (రిఫామ్), ఉత్తమ ప్రదర్శన (పెర్‌ఫామ్), సానుకూల మార్పే(ట్రాన్స్‌ఫామ్) మా మంత్రం.. మా మార్గం. పెట్టుబడులకు మా ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచింది. అనుమతుల్లో అలసత్వాన్ని తొలగించాం. విప్లవాత్మక నిర్ణయాలు, అభివృద్ధి కేంద్రంగా సాగే విధానాల్ని మా ప్రభుత్వం ఎంచుకుంది. భారత్‌లో పెట్టుబడుల అనుమతులు, ఉత్పత్తి విధానాల్ని చాలా సులభతరం చేశాం. లైసెన్స్, పర్మిట్ రాజ్‌ను తొలగించాలని నిర్ణయించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వందల కొద్దీ సంస్కరణల్ని చేపడుతున్నాయి. దేశ పురోగతికి అడ్డుగా ఉన్న 1400 పాత చట్టాల్ని తొలగించాం.

సంఘటిత, ఐక్యతా విలువల పట్ల బలమైన నమ్మకముంది

డబ్ల్యూఈఎఫ్ నినాదం 'ముక్కలైన ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్తు నిర్మాణం'. ప్రస్తుతం ప్రపంచంలోని చీలికలు, విభేదాల పరిష్కారానికి భారతదేశ తత్త్వమైన వసుధైక కుటుంబం(ప్రపంచమంతా ఒకే కుటుంబం) చక్కగా సరిపోతుంది. భారతదేశం ఎప్పుడూ ప్రపంచ శాంతి కోసం పాటుపడింది. సంఘటితం, ఐక్యతా విలువల పట్ల భారత్‌కు నమ్మకముంది. మన సమాజంలోని కొన్ని విధ్వంసక శక్తులకు అభివృద్ధి, ప్రపంచ శాంతి, స్థిరత్వాల్ని అడ్డుకునే సామర్థ్యముంది. మనం సంఘటితంగా నిలిస్తే.. ఆ శక్తుల వల్ల వేరుపడ్డ సమాజాన్ని ఏకం చేయవచ్చు. భారత్‌లోని ప్రజాస్వామ్య విధానం కేవలం ఒక రాజకీయ వ్యవస్థ కాదు. అది జీవన విధానం. భారతదేశంలోని ప్రజాస్వామ్యం, భిన్నత్వాల్ని చూసి మేం గర్విస్తున్నాం. భిన్న మతాలు, సంస్కృతులు, భాషలు, వస్త్రధారణలు, వంటలు మా సొంతం.

అందరికీ అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యం

1997లో అప్పటి భారత ప్రధాని దేవెగౌడ దావోస్‌కు వచ్చిన సమయంలో భారత జీడీపీ 400 బిలియన్ డాలర్లు (రూ.26 లక్షల కోట్లు). అయితే ఇప్పుడు అది ఆరు రెట్లు పెరిగింది. 2025 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు(రూ.318 లక్షల కోట్లు) చేరనుంది. అందరికీ అభివృద్ధి ఫలాలు అందే లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేస్తున్నాం. 30 ఏళ్ల అనంతరం 2014లో భారతీయులు ఒక పార్టీకి పూర్తి మెజార్టీ కట్టబెట్టారు. ఏ ఒక్క వర్గానికో కాకుండా అందరి అభివృద్ధి కోసం పాటుపడాలని మేం తీర్మానించుకున్నాం. మా నినాదం 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్'. పథకం ఏదైనా అందరికీ అభివృద్ధి చేరడమే లక్ష్యం.

ప్రస్తుతం సమాచార సాంకేతికతదే పై చేయి

1997 నుంచి ఈ 20 ఏళ్లలో ప్రపంచం ఎంతో మారిపోయింది. అప్పటి సదస్సులో 'అనుసంధాన సమాజ నిర్మాణం' డబ్ల్యూఈఎఫ్ నినాదం. ఇప్పుడు ప్రపంచం సమాచార కేంద్రంగా మారిపోయింది. ఎన్నో కొత్త ఆవిష్కరణలు చోటుచేసుకున్నాయి. నాడు అమెజాన్ అంటే దట్టమైన అడవులనే అందరికీ తెలుసు. అప్పుడు పక్షులు మాత్రమే ట్వీటింగ్ (కిచకిచలు) చేసేవి. ఇప్పుడు అవన్నీ మారిపోయాయి. ప్రస్తుత యుగంలో సమాచారమే నిజమైన సంపద. ఎవరికైతే దానిపై అదుపు ఉంటుందో భవిష్యత్తులో వారే ఆధిపత్యాన్ని చెలాయిస్తారు. ఈ సమాచార వెల్లువ.. భారీ అవకాశాలే కాకుండా సవాళ్లను కూడా సృష్టిస్తోంది. సాంకేతికత ఆధారంగా చోటుచేసుకున్న మార్పులు ప్రజల ఆలోచనలు, పనితీరుతో పాటు అంతర్జాతీయ విభాగాలు, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

ధనిక దేశాల రక్షణాత్మక ధోరణి

చాలా దేశాలు సొంత ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ప్రస్తుత సాంకేతిక అనుసంధాన ప్రపంచంలో ప్రపంచీకరణ ప్రాభవాన్ని కోల్పోతోంది. ప్రపంచీకరణ నుంచి తమను తాము కాపాడుకోవడంతో పాటు.. దానిని నీరుగార్చాలన్నది కొన్ని ధనిక దేశాల ఆకాంక్ష. ఉగ్రవాదం, వాతావరణ మార్పుల కంటే ఈ విధమైన రక్షణాత్మక ధోరణిని తక్కువ ప్రమాదకరంగా భావించలేం. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ ప్రజల ఆకాంక్షల్ని, కలల్ని ప్రతిబింబిస్తున్నాయా? అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. 'నా ఇంటి తలుపులు, కిటికీలు మూసుకోవాలని నేను కోరుకోను. అన్ని దేశాల సంస్కృతులతో కూడిన పవనాలు నా ఇంట్లోకి రావాలని కోరుకుంటా. అదే సమయంలో అవి నా సంస్కృతిని పెకిలించేందుకు అనుమతించను' అని జాతిపిత చెప్పారు.



కెనడా ప్రధానితో మోదీ చర్చలు

వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్యూతో మోదీ చర్చలు జరిపారు. ఇరు దేశాల పరస్పర ప్రయోజనాలపై వీరి మధ్య చర్చలు జరిగాయని భారత విదేశాంగ శాఖ ట్విటర్‌లో వెల్లడించింది. నెదర్లాండ్స్ రాణి మాక్సిమాతో కూడా ఆయన భేటీ అయ్యారు. డబ్ల్యూఈఎఫ్ సదస్సు అనంతరం ప్రధాని మోదీ మంగళవారం రాత్రి భారత్‌కు బయల్దేరారు. మరోవైపు ప్రధాని ఫిబ్రవరి రెండో వారంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, పాలస్తీనా దేశాల్లో పర్యటించనున్నారు.



వరల్డ్ ఎకనమిక్ ఫోరం చైర్మన్ క్లాస్ స్క్వాబ్, స్విస్ సమాఖ్య అధ్యక్షుడు అలేన్‌లతో మోదీ కరచాలనం



గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్‌లో పాల్గొన్న ఆర్మీ యుద్ధ ట్యాంకులు, సైనిక వాహనాలు

'పద్మావత్'పై తీర్పు మారదు: సుప్రీం

న్యూఢిల్లీ: పద్మావత్ సినిమా విడుదలపై గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఎట్టి పరిస్థితుల్లో మార్చబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు తీర్పును గౌరవించాలన్న విషయం ప్రజలకు అర్థం కావాలని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం పేర్కొంది. 'పద్మావత్' విడుదలపై తీర్పును మరోసారి పరిశీలించాలని రాజస్తాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు.. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును రాష్ట్రాలు పాటించాలని ఆదేశించింది. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని స్పష్టం చేసింది. సినిమాను నిలిపేయాలని రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేన, అఖిల భారతీయ క్షత్రియ మహాసభ దాఖలు చేసిన పిటిషన్‌లను కూడా ధర్మాసనం కొట్టేసింది. దీంతో జనవరి 25న పద్మావత్ విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన పద్మావత్‌లో రణవీర్ సింగ్, దీపికా పదుకొణె, షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలు పోషించారు.



అహ్మదాబాద్‌లో నిరసనకారులు బైకులను తగలబెట్టిన దృశ్యం

ఏకకాల ఎన్నికలకు సమయం పడుతుంది!

కొత్త సీఈసీ ఓపీ రావత్



ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఓపీ రావత్

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చట్టం రూపుదిద్దుకోవడానికి చాలా సమయం పడుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓపీ రావత్ అన్నారు. మంగళవారం ఆయన నూతన సీఈసీగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2019లో ఏకకాలంలో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అని చెప్పేందుకు తాను తగిన వ్యక్తిని కాదన్నారు. 'ఎన్నికల ప్రక్రియను తారుమారు చేయలేం. ఎన్నికల నిర్వహణలో తలెత్తే సమస్యలన్నీ సంబంధిత చట్టానికి లోబడి ఉంటాయి. తగిన చట్టం అందుబాటులోకి వచ్చే వరకు ఒకేసారి ఎన్నికల నిర్వహణపై చర్చించాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణ చేసి ఇందుకోసం చట్టం రూపొందించేందుకు చాలా సమయం పడుతుంది' అని అన్నారు. ఒకేసారి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై 2015లోనే ఎన్నికల సంఘాన్ని ప్రభుత్వం అడిగిందని, అందుకోసం రాజ్యాంగం, ఎన్నికల చట్టాల్లో సవరణలు చేయడంతో పాటు అదనంగా ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది, రూ.9 వేల కోట్లు ఖర్చవుతాయని బదులిచ్చామని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలననుసరించి ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ అనుసంధానాన్ని నిలిపేశామని, కానీ నకిలీలను గుర్తించేలా సీడింగ్ పునఃప్రారంభించడానికి అనుమతివ్వాలని మళ్లీ కోర్టును ఆశ్రయించామన్నారు.

సీజేఐ అభిశంసనకు సీపీఎం ప్రయత్నం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తుల తిరుగుబాటు నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దీపక్ మిశ్రాను అభిశంసించే దిశగా సీపీఎం ప్రయత్నాలు ప్రారంభించింది. తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చే పనిని సీపీఎం ప్రారంభించింది. అందులో భాగంగా సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మంగళవారం జేడీయూ తిరుగుబాటు నేత శరద్ యాదవ్‌ను, ఎన్సీపీ నేత తారీఖ్ అన్వర్‌ను కలసి చర్చించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు జనవరి 12న మీడియా ముందుకు వచ్చి సీజేఐపై తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. అభిశంసన తీర్మానంపై ప్రస్తుతం ఇతర ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతున్నామనీ, బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే జనవరి 29 నాటికి ఈ అంశంపై స్పష్టత వస్తుందని ఏచూరి చెప్పారు.

'పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ పన్ను తగ్గించండి'



న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగిపోతుండటంతో వాటిపై ఎక్సైజ్ పన్నును తగ్గించాల్సిందిగా ఆర్థిక శాఖను పెట్రోలియం శాఖ కోరింది. లీటర్ పెట్రోల్ ధర మంగళవారం ఢిల్లీలో రూ.72.38గా ఉంది. ముంబైలో ఇటీవల రూ.80 దాటిపోయింది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇంత ధర ఎప్పుడూ లేదు. ఈ నేపథ్యంలో త్వరలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లోనే ఎక్సైజ్ పన్నును తగ్గించాలంటూ పెట్రోలియం శాఖ ఆర్థిక శాఖను కోరింది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్‌పై కేంద్ర ప్రభుత్వమే రూ.19.48 ఎక్సైజ్ పన్నును వసూలు చేస్తోంది.

జాధవ్ కేసులో వాదనలకు ఐసీజే కాలపరిమితి


ద హేగ్: భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాధవ్ కేసులో లిఖిత పూర్వక వాదనలు సమర్పించేందుకు భారత్‌కు ఏప్రిల్ 17 వరకు, పాకిస్తాన్‌కు జూలై 17 వరకు అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) గడువిచ్చింది. గూఢచర్యం ఆరోపణలపై జాధవ్‌కు పాకిస్తాన్ సైనిక కోర్టు మరణ శిక్ష విధించగా గతేడాది మే లో భారత్ ఐసీజేను ఆశ్రయించడం తెలిసిందే. దీంతో ఐసీజే జాధవ్‌కు మరణ శిక్షను తాత్కాలికంగా నిలుపుదల చేసింది. తాజాగా భారత్, పాకిస్తాన్‌లకు ఈ కేసులో లిఖిత పూర్వక వాదనలు సమర్పించేందుకు ఐసీజే కాలపరిమితి విధించింది.

అవినీతిని పసిగట్టే కృత్రిమ మేధ

లండన్: ప్రభుత్వంలో జరిగే అవినీతిని ముందుగానే అంచనా వేసే సరికొత్త కృత్రిమ మేధస్సు వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వాలడోలిడ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు దేశవ్యాప్తంగా 2000–12 మధ్య నమోదైన అవినీతి కేసుల వివరాలను పరిశోధించారు. పరిశోధన ఆధారంగా న్యూరల్ నెట్‌వర్క్ సాంకేతికతో పనిచేసే కొత్త కంప్యూటర్ మోడల్‌ను రూపొందించారు. దీని ద్వారా ఎటువంటి పరిస్థితుల్లో, వివిధ రాష్ట్రాల్లో ఏఏ రంగాల్లో అవినీతి జరుగు తుందో ముందుగానే అంచనా వేయవచ్చని పరిశోధకులు వెల్లడించారు. ఎక్కువ కాలం అధికారంలో ఉన్న పార్టీల జమానాల్లో అవినీతి ఎక్కువ జరుగుతోందని తాము రూపొందించిన మోడల్ సైతం నిర్ధారించిందని వర్సిటీకి చెందిన ఇవాన్ పాస్టర్ తెలిపారు. రియల్ ఎస్టేట్ ట్యాక్స్, కొత్త బ్యాంక్ బ్రాంచీలు, కొత్త కంపెనీల ఏర్పాటు తదితర సమయాల్లో అవినీతి ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు.

ఒంటరి పోరే..

- బీజేపీతో తెగదెంపులకు శివసేన తీర్మానం
- కేవలం పథకాల ప్రచారానికే ఖర్చుపెడుతున్నారు: ఉద్ధవ్



సాక్షి, ముంబై: 2019లో జరగనున్న లోక్‌సభ, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు లేకుండా ఒంటరిగానే పోటీ చేయాలని శివసేన నిర్ణయించింది. మంగళవారం జరిగిన శివసేన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. బీజేపీతో పొత్తు లేకుండా ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేద్దామంటూ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానికి ఏకగ్రీవ ఆమోదం లభించింది. బీజేపీ ప్రభుత్వం కేవలం పథకాల ప్రచారాలకు, ప్రకటనలకే డబ్బు ఖర్చు పెడుతోంది తప్ప చిత్తశుద్ధితో వాటిని అమలు చేయడం లేదనీ, ఇలాంటి పార్టీని అధికారం నుంచి దింపేయాలని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పిలుపునిచ్చారు. హిందూ ఓట్లను చీల్చకూడదనే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ మహారాష్ట్ర బయట పోటీ చేయలేదనీ, కానీ బీజేపీ వైఖరితో తాము విసిగిపోయామన్నారు. మోదీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'అసలు నెతన్యాహు (ఇజ్రాయెల్ ప్రధాని)ను అహ్మదాబాద్‌కు తీసుకొచ్చి ఆయనతో గాలిపటాలు ఎగిరేయించడం ద్వారా ఏం సాధించారు? బదులుగా ఆయనను శ్రీనగర్‌కు తీసుకెళ్లి త్రివర్ణ పతాకాన్ని ఎగరేయించి ఉంటే దేశం గర్వించేది' అని అన్నారు.

'ఆప్ ఎమ్మెల్యేల అనర్హత'పై నేడు విచారణ

ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు తమపై అనర్హత వేటు వేయడాన్ని సవాలు చేస్తూ మంగళవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. రవీంద్ర భట్, జస్టిస్ ఏకే చావ్లా బెంచ్ ముందు కొచ్చిన ఈ పిటిషన్‌ను బుధవారం విచారణకు చేపడతారు. ఢిల్లీ అసెంబ్లీలోని 20 మంది సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల సంఘం చేసిన సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఈ అంశాన్ని అత్యవసరంగా విచారించాలని ఒక ఎమ్మెల్యే తరఫున హాజరైన న్యాయవాది మనీశ్ వశిష్ట్ కోరారు. తమను రాష్ట్రపతి అనర్హులుగా ప్రకటించారంటూ ప్రభుత్వం వెలువరించిన ప్రకటనను రద్దుచేయాలని ఆ పిటిషన్‌లో ఎమ్మెల్యేలు కోరారు.

అమెరికా 'షట్‌డౌన్'కు తెర

బిల్లుపై ట్రంప్ సంతకం



వాషింగ్టన్: అమెరికాలో మూడు రోజులు కొనసాగిన 'షట్‌డౌన్' ముగిసింది. ప్రభుత్వ వ్యయానికి స్వల్పకాలిక నిధులందించే బిల్లుకు ప్రతిపక్ష డెమొక్రాట్లు మద్దతు తెలపడంతో సంక్షోభం సమసిపోయింది. ఈ బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో మంగళవారం నుంచి రోజువారీ కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. దేశంలోకి చిన్నారులుగా తల్లిదండ్రులతో పాటు అక్రమంగా అడుగుపెట్టిన సుమారు 7 లక్షల మంది యువకుల(డ్రీమర్స్) భవిష్యత్తుపై చర్చకు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సయోధ్య కుదరడంతో సమస్య పరిష్కారమైంది. ఫిబ్రవరి 8న గడువు ముగిసే ఈ తాత్కాలిక ఫండింగ్ బిల్లు సెనేట్‌లో 81–18 ఓట్లు, ప్రతినిధుల సభలో 266–150 ఓట్ల తేడాతో గట్టెక్కింది. దీంతో శనివారం నుంచి వేతనం లేకుండా సెలవులో ఉన్న వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ వ్యయం, అక్రమ వలసలు లాంటి అంశాలపై డెమొక్రాట్లు, రిపబ్లికన్లు ఫిబ్రవరి 8 నాటికి దీర్ఘకాలిక పరిష్కారాన్ని కనుగొనాల్సి ఉంది. ప్రతిపక్ష పార్టీతో ప్రతిష్టంభన తొలగిపోవడంపై అధ్యక్షుడు ట్రంప్ హర్షం వ్యక్తం చేస్తూ... దేశానికి మంచి జరుగుతుందంటే వలసలపై దీర్ఘకాలిక ఒప్పందం కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వానికి నిధులు అందుబాటులో ఉంటేనే ఎలాంటి సమస్య అయినా పరిష్కారమవుతుందని తెలిపారు. డెమొక్రాట్లు తమ తప్పు తెలుసుకుని ప్రభుత్వ వ్యయానికి మద్దతివ్వడం సంతోషకరమని వ్యాఖ్యానించారు.

కువైట్ కార్మికులకు క్షమాభిక్ష

జరిమానా లేకుండానే స్వదేశానికి వెళ్లే అవకాశం


- భారతీయ కార్మికులకు భారీ ఉపశమనం
- ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 22 వరకే అవకాశం



న్యూఢిల్లీ: కువైట్‌లో అక్రమంగా ఉంటున్న వేలాది మంది భారతీయులకు పెద్ద ఊరట నిస్తూ ఆ దేశ ప్రభుత్వం మంగళవారం క్షమాభిక్షను ప్రకటించింది. కువైట్‌లో ఇన్నాళ్లూ అక్రమంగా ఉన్నందుకు వారిపై ఎలాంటి జరిమానాలు విధించబోమని ప్రభుత్వం చెప్పింది. కువైట్‌లోని ఖరాఫీ నేషనల్ అనే కంపెనీలో పనిచేయడానికి వెళ్లిన అనేక మంది భారతీయులకు వేతనాలు అందలేదు. దీంతో వీసా గడువు ముగిసినప్పటికీ తమ వేతనాలు రాబట్టుకునేందుకు అనేక మంది కార్మికులు అక్కడే ఉండిపోయారు. వీరంతా అక్రమంగా కువైట్‌లో నివసిస్తున్నందున రోజుకు రూ.424 జరిమానాగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అసలే జీతం లేక ఇబ్బందులు పడుతున్న వీరికి జరిమానాలు చెల్లించడం తలకు మించిన భారంగా ఉంది. ఈ నేపథ్యంలో కువైట్ ప్రభుత్వం వీరికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. అక్రమంగా కువైట్‌లో ఉంటున్నవారు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 22 మధ్య క్షమాభిక్షను వినియోగించుకుని భారత్‌కు వెళ్లిపోవచ్చంది. వీరిపై ఎలాంటి జరిమానా విధించబోమంది. దీంతో ఎంతో మంది భారతీయ కార్మికులు వేతనాలపై ఆశ వదులుకుని మళ్లీ తమ కుటుంబాలతో కలసి గడిపేందుకు స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరికొందరు మొత్తం వేతనాలు చేతికి అందితేగానీ వెనక్కు రాకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

తెలుగు కార్మికులూ ఎక్కువే..

ఇప్పుడు క్షమాభిక్ష పొందిన వారు మరోసారి కువైట్‌కు చట్టబద్ధంగా వెళ్లి పని చేసుకోవడానికి కూడా అర్హులు. ప్రస్తుతం కువైట్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఖరాఫీ నేషనల్ కంపెనీ కూడా భారత కార్మికులను సంప్రదించి వేతనాల్లో 25 నుంచి 33 శాతం సొమ్మును చెల్లించేందుకు ముందుకొచ్చినట్లు తెలిసింది. అయితే కార్మికులు అందుకు ఒప్పుకోకుండా తమకు పూర్తి వేతనాలు చెల్లించాల్సిందేనని కోరుతున్నారు. వీరి సమస్య పరిష్కారం కోసం పోరాడిన సామాజిక కార్యకర్త షాహీన్ సయ్యద్ మాట్లాడుతూ 'భారత కార్మికులకు ఇది గొప్ప ఉపశమనం' అని అన్నారు. ఇటీవలే విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ కువైట్‌లో పర్యటించిన నేపథ్యంలో కువైట్ తాజాగా క్షమాభిక్షను ప్రకటించడం గమనార్హం. భారతీయ కార్మికుల అవస్థల గురించి వీకే సింగ్ కువైట్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.



మంగళవారం ఫిలిప్పీన్స్‌లోని మేయాన్ అగ్ని పర్వతం భారీగా బూడిదను, లావాను ఎగచిమ్ముతున్న దృశ్యమిదీ.. దీంతో వేలాది మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

రెండోసారి గిన్నిస్ రికార్డు

- అనర్గళంగా గంట 11 నిమిషాల పాటు బోధన
- హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి ఘనత



కీసర: అనర్గళంగా గంట 11 నిమిషాల పాటు బోధనలు చేయడం ద్వారా కీసర మండలం భోగారంలోని హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి అరిమండ విజయశారదా రెడ్డి గిన్నిస్ రికార్డు సాధించారు. గతంలో 250 మంది విద్యార్థులకు బోధన చేసి గిన్నిస్ రికార్డుల్లోకెక్కారు. తాజాగా 400 మంది విద్యార్థులకు మైండ్‌ఫుల్‌నెస్ అనే అంశంపై పాఠాలను బోధించడం ద్వారా రెండోసారి రికార్డు సాధించారు. సోమవారం కళాశాలలో 'లార్జెస్ట్ మైండ్‌ఫుల్‌నెస్ లెసెన్'పేరిట ఆమె ఈ కార్యక్రమం నిర్వహించారు. యువకుల మనసుల్లో సద్భావనలు నింపి వారిని సన్మార్గంలో నడిపేందుకే మైండ్‌ఫుల్‌నెస్ కార్యక్రమం ఏర్పాటుచేశానని విజయ తెలిపారు. మైండ్‌ఫుల్‌నెస్ ధ్రువీకరణకు అవార్డు నిర్వాహకులకు పంపిస్తున్నట్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ ప్రతినిధి జయసింహ ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎ.వరప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ సిద్దార్థారెడ్డి విజయశారదా రెడ్డిని అభినందించారు.

- రైల్వే ట్రాక్‌లు, స్టేషన్లు, డిపోల వద్ద పోగుపడిన వ్యర్థ సామగ్రిని ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోగా తొలగించాలని రైల్వే శాఖ దేశంలోని అన్ని డివిజన్లకు సూచించింది. తుక్కును విక్రయించి, అదనపు రాబడి పెంచుకోవాలని కోరింది. గతేడాది తుక్కు విక్రయాలతో రైల్వే రూ.1,837 కోట్లు ఆర్జించింది.





బీరు ధరకు రెక్కలు

కేసు బీరుపై రూ. 45 నుంచి రూ. 60 వరకు పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: గత నెలలో మద్యం ధరలు పెంచిన ప్రభుత్వం తాజాగా బీరుపై దృష్టి పెట్టింది. బీరు ధరలు పెరగబోతున్నాయి. కేసు బీరు మీద కనిష్టంగా రూ.45 నుంచి రూ.60 వరకు పెంచనున్నట్లు సమాచారం. ఇందుకు సాధ్యాసాధ్యాల అమలుకు ముగ్గురు సభ్యుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీకే ధర నిర్ణయ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. పెంచబోతున్న మొత్తంలో పన్నులు పోనూ మిగిలిన సొమ్మును బీరు కంపెనీలకే ఇచ్చేలా కసరత్తులు చేస్తున్నారు.

ఇందుకేనా?

రాష్ట్రానికి అవసరమైనంత బీరు సరఫరా కోసం



ప్రభుత్వం ప్రతి ఏటా బ్రూవరీ కంపెనీలతో ఒప్పందం చేసుకుంటుంది. ఇటీవల మద్యం ధరలు పెంచిన నేపథ్యంలో బీరు ధరలు కూడా పెంచాలని బ్రూవరీస్ యాజమాన్యం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తోంది. ఈ విజ్ఞప్తి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

ఇక్కడే అధిక వినియోగం

రాష్ట్రంలో ప్రస్తుతం 6 బ్రూవరీ (బీరు ఉత్పత్తి పరిశ్రమలు)ల ద్వారా నెలకు 507.91 లక్షల బల్కు లీటర్ల (బీఎల్ఎస్) చొప్పున ఏడాదికి 6,096 బీఎల్ఎస్‌ల బీరు ఉత్పత్తి అవుతోంది. ఇందులో 5,500 బీఎల్ఎస్‌లు రాష్ట్రంలోనే వినియోగమవుతోంది. రోజుకు 8 లక్షల మంది 13 లక్షల సీసాల చొప్పున బీర్లు తాగుతున్నట్లు టీఎస్‌బీసీఎల్ నివేదికలు చెబుతున్నాయి. ఈ లెక్కన నెలకు 37.5 లక్షల కేసుల బీర్లను మందు బాబులు లాగిస్తున్నారు. ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య 296 లక్షల కేసుల బీర్లు వినియోగమయ్యాయి. గతేడాది విక్రయాలతో పోలిస్తే ఇది 27% అధికం. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ లాంటి పొరుగు రాష్ట్రాల్లో బీర్ల వినియోగం తెలంగాణలో సగం కూడా లేదు.

వరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూ. 34 వేలు

వ్యవసాయశాఖ ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: వరి పంటకు ఎకరాకు రూ. 32 వేల నుంచి 34 వేల మధ్య బ్యాంకులు రుణం ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కోరింది. ఈ మేరకు వచ్చే వ్యవసాయ సీజన్‌కు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ కొలబద్ధ) నిర్ణయించాలని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి ప్రతిపాదనలు పంపింది. 2018–19 వర్షాకాల సీజన్‌కు సంబంధించి బ్యాంకులు ఇవ్వాల్సిన ఏకీకృత రుణ పరిమితి పెంపుపై పంటల సాగు ఖర్చుల ఆధారంగా నివేదించింది. ఎకరా సాగు ఖర్చుల ఆధారంగా లెక్కలు తీసిన అధికారులు అంత మొత్తానికి 10 నుంచి 20 శాతం అధికంగా రుణం ఇవ్వాలని పేర్కొన్నారు. 2017–18 సాగు ఖర్చుల ప్రకారం ఎకరా వరికి రూ. 28,066 వ్యయం అవుతోంది. ఇందుకు అనుగుణంగా రానున్న సీజన్‌లకు వరికి ఎకరాకు రూ. 32 వేల నుంచి రూ. 34 వేల మధ్య రుణం ఇవ్వాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ పరిమితి రూ. 29 వేల నుంచి రూ. 31 వేల మధ్య ఉంది. సాగునీటి వనరులు లేని ప్రాంతాల్లో మొక్కజొన్న పంటకు రూ. 18 వేల నుంచి రూ. 20 వేల మధ్య రుణ పరిమితి నిర్ణయించాలని కోరింది. ప్రస్తుతం ఇది రూ. 16 వేల నుంచి రూ. 18 వేల మధ్య ఉంది. యాసంగిలో మొక్కజొన్న అధికంగా సాగు చేస్తారని, ప్రస్తుతం వచ్చిన నూతన వంగడాలతో దిగుబడి కూడా పెరిగిందని, రుణం కూడా అధికంగా ఇస్తే రైతులు ఎక్కువగా సాగు చేస్తారని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఆహార ధాన్యాలు, ఉద్యాన, నూనె గింజలు తదితర మొత్తం 81 పంటలకు ఎస్ఎల్‌టీసీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేయనుంది.

వాటికి రుణం పెంచాల్సిందే...

పప్పు ధాన్యాల పంటల సాగు ఏటా పడిపోతోందని వ్యవసాయశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకుల్లో పంట రుణం తక్కువగా ఉండటమే ఇందుకు కారణంగా పేర్కొంది. పప్పు దినుసుల పంటలకు రుణ పరిమితి పెంచితే సాగు కూడా పెరుగుతుందని భావిస్తోంది. కందులకు రూ. 15 వేల నుంచి రూ. 18 వేల మధ్య రుణం ఇవ్వాలని నివేదించింది. పెసర, మినుములు ఇతరత్రా పంటలకు రూ. 12 వేల నుంచి రూ. 16 వేల మధ్య ఉండాలని ప్రతిపాదించింది. సాగునీటి వనరులున్న చోట పత్తికి రూ. 34 వేల నుంచి రూ. 35 వేలు ఇవ్వాలని ప్రతిపాదించారు. సోయాబీన్ పంటకు సంబంధించి ప్రయోగాల నివేదికలు రానందున ఇంకా ప్రతిపాదనలు తయారు చేయలేదు. వ్యవసాయశాఖ ప్రతిపాదనలపై ఎస్ఎల్‌టీసీ చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది.

స్వామిగౌడ్‌తో నేపాల్ ప్రతినిధుల భేటీ



సాక్షి, హైదరాబాద్: శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో నేపాల్ ప్రతినిధుల బృందం మంగళవారం భేటీ అయింది. నేపాల్‌కు చెందిన ఆస్మాన్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ రాధా కొయిరాలా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవల్‌కిషోర్ యాదవ్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులు ఈ బృందంలో ఉన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చట్టసభల్లో జరిగే చర్చల తీరును నేపాల్ బృందానికి స్వామిగౌడ్, పాతూరి వివరించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆడపిల్లల వివాహం చేయడానికి పేద తల్లిదండ్రులకు ఆర్థిక సాయమందిస్తున్నట్లు చెప్పారు. బాల కార్మిక వ్యవస్థను నియంత్రించడానికి ప్రభుత్వం అన్ని చర్యలనూ తీసుకుంటోందన్నారు. అనంతరం బృందం ప్రతినిధులు స్వామిగౌడ్, పాతూరిని నేపాల్‌లో పర్యటించాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష వాయిదా

హైదరాబాద్: జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్వీ) ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షను వాయిదా వేశామని రంగారెడ్డి జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు. ప్రవేశ పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గమనించాలని కోరారు.

లింగంపల్లి వరకు రైళ్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: కాకినాడ–సికింద్రాబాద్ మధ్య నడిచే కాకినాడ ఎక్స్‌ప్రెస్ (12775/12776), గౌతమి ఎక్స్‌ప్రెస్ (12737/12738) రైళ్లను లింగంపల్లి వరకు పొడిగించనున్నారు. రైల్వేబోర్డు నుంచి ఈ మేరకు ఆదేశాలు అందినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడలో ఏప్రిల్ 8 నుంచి, సికింద్రాబాద్‌లో ఏప్రిల్ 9 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

సాక్షి, హైదరాబాద్: తప్పుడు పత్రాలతో బ్యాంకు రుణం తీసుకున్న ఇద్దరికి సీబీఐ కోర్టు జైలుశిక్ష విధించింది. హైదరాబాద్‌లో జి.భాస్కరరావు, జి.శ్రీనివాస్ అనే వ్యక్తులు తప్పుడు పత్రాలపై విజయ బ్యాంకు నుంచి రూ.6.4 లక్షల రుణం తీసుకున్నారు. దీనిపై సీబీఐ నమోదు చేసిన కేసులో ఆధారాలు నిరూపణ కావడంతో భాస్కరరావుకు గరిష్టంగా 3, శ్రీనివాస్‌కు గరిష్టంగా 5 ఏళ్ల జైలు శిక్ష, వారికి వరసగా రూ.20 వేలు, రూ1.20 లక్షల చొప్పున జరిమానా విధించింది.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.